


'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 207

శనివారం 18-10-2025


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

# దివ్వెల వేడుక దివ్యమైన కానుక



సన్నిహితులకు, మిత్రులకు, ప్రియమైన వారికి మీ శైలిలో ప్రత్యేకమైన దీపావళి కానుకలు ఇచ్చి వారి ముఖాలలో మతాబాల వెలుగులు చూసి మురిసిపోవాలనుకుంటున్నారా? ఇవి ప్రయత్నించండి మరి!

మీరు ఎంచుకునే దీపావళి బహుమతులకు సాంప్రదాయక స్పర్శను తిరిగి తీసుకురండి. లాంతరు సాంప్రదాయమైనది, చూడటానికి కూడా చాలా బాగుంటుంది. ఈ పండుగ సీజన్‌లో, మీ కుటుంబ సభ్యులకు స్నేహితులకు వేలాడే లాంతరును బహుమతిగా ఇవ్వండి. మీరు దానిని కొన్ని స్వీట్లు లేదా డ్రై ఫ్రూట్స్‌తో జత చేస్తే మీ ప్రియమైన వారిని ఆకట్టుకోవడానికి ఇది బడ్జెట్‌లో ఉత్తమమైన దీపావళి బహుమతి అవుతుంది.



దీపావళి అంటే ఒక ఆసక్తి. ఒక అభిమానం. అంతకు మించి చిన్నా పెద్దా తేడా లేకుండా అందరికీ ఎంతో సరదా. ఆ సరదాల పండగ అతి సమీపంలోకి వచ్చేసింది. ఇంకేం... మెరిసే లైట్లు, రంగురంగుల దీపాలు, రుచికరమైన స్వీట్లు, వివిధ రకాల చాక్లెట్లు, టన్నుల కొద్దీ బహుమతులకు ఒక్కసారిగా కాళ్లొచ్చేశాయి. సాధారణంగా దీపావళికి కుటుంబ సభ్యులు ఒకరికొకరు కానుకలు ఇచ్చుకుంటూ ఉంటారు. తమ వద్ద పని చేసే వారికి యజమానులు స్వీట్లతోపాటు కానుకలూ ఇస్తుంటారు. రెగ్యులర్ ఖాతాదారులకు దుకాణాల వారు కాంప్లిమెంటరీ కానుకలు ఇస్తారు. ఈ సంతోష సమయంలో ఎప్పుడూ ఇచ్చే స్వీట్లు, డ్రై ఫ్రూట్స్ కన్నా కాస్త విభిన్నమైన బహుమతి ఇస్తే బాగుంటుంది కదా... మీకేదైనా ఆలోచన వస్తే సరే.. లేదంటే మేం చెబుతున్న విధంగా బహుమతులు ఇస్తే ఎలా ఉంటుందో కాస్త ఆలోచించండి.

### దేవుని ప్రతిమలు

సంప్రదాయం ప్రకారం, దీపావళి పండుగ లక్ష్మీదేవి, గణేశ విగ్రహ పూజతో ప్రారంభమవుతుంది. మీరు మీ సన్నిహితులకు పవిత్రమైన, సంప్రదాయకరమైన బహుమతి ఇవ్వాలని చూస్తున్నట్లయితే అందంగా ప్యాక్ చేసిన దేవుని విగ్రహాలు, డాలర్లు, ప్రతిమలను ప్రయత్నించవచ్చు.

### మీ చేతితో మీరే స్వయంగా...

మంచి మనసున్న మీకు ప్రియమైన వారు కానిదెవరు? అందరికీ బహుమతులు కొనడం మీ జేబులకు భారంగా అనిపించవచ్చు. కాబట్టి, మీరే తయారు చేసుకోగలిగినప్పుడు దాని గురించి ఎందుకు చింతించాలి? అవును, మీ ప్రియమైనవారిపై శాశ్వత ముద్ర వేయడానికి చేతితో తయారు చేసిన బహుమతులు ఎల్లప్పుడూ ఉత్తమ ఎంపిక. మీరు ప్రియుడు, స్నేహితురాలు, భర్త లేదా ప్రత్యేకమైన వాటి కోసం నిజమైన, హృదయాన్ని హత్తుకునే దీపావళి బహుమతి కోసం చూస్తున్నట్లయితే, మీరు చేతితో తయారు చేసిన పర్యావరణ అనుకూల దీపావళి బహుమతులైన దియాలు, టీలైట్ కొవ్వొత్తులు మొదలైన వాటిని లెక్కలోకి తీసుకోవచ్చు.



### బహుమతి వోచర్లు

వారి అభిరుచి, ప్రాధాన్యతల ప్రకారం బహుమతిని ఎంచుకోవడం ఎల్లప్పుడూ కఠినమైనదే. ఏమి బహుమతిగా ఇవ్వాలో సందేహం ఉన్నప్పుడు, గిఫ్ట్ వోచర్ల కోసం వెళ్ళండి. మీ ప్రియమైన వారిని ప్రత్యేకంగా భావించేలా చేయడానికి ఉత్తమమైన, ఉపయోగకరమైన దీపావళి బహుమతులలో ఇది ఒకటి.

### టీలైట్ కొవ్వొత్తులు

దీపావళి అంటే దివ్వెలే కదా...దివ్వెలు, కొవ్వొత్తులు కాకుండా ఉత్తమ బహుమతి ఏమిటి? మార్కెట్లో వివిధ డిజైన్లు, ఆకారాలలో అనేక టీలైట్ కొవ్వొత్తులను అందించే అనేక ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. టీలైట్ కొవ్వొత్తులను బహుమతిగా ఇవ్వడం ద్వారా మీ ప్రియమైనవారి జీవితంలో ఆశల వెలుగును నింపవచ్చు.

### దీపావళి పూజా థాలీ

మీ సన్నిహిత కుటుంబ సభ్యులకు, స్నేహితులకు దీపావళి పండుగను మరింత పవిత్రంగా, దివ్యంగా చేయండి మీ ప్రేమకు చిహ్నంగా వారికి వెండి లేదా బంగారు పూత పూసిన పూజా థాలీని బహుమతిగా ఇవ్వండి. చక్కగా అలంకరించబడిన థాలీ వేడుకకు ఉత్సాహాన్ని ఇస్తుంది.

### కార్పొరేట్ బహుమతులు

మీ ఉద్యోగులు, సహోద్యోగులు, క్లయింట్ల కృషికి వారికిచ్చే కానుకలతోపాటు ఒక మంచి ప్రశంస, వారి మనోధైర్యాన్ని పెంచడానికి, కార్యాలయ వాతావరణాన్ని మెరుగుపరచడానికీ సహాయపడుతుంది.

### వెండి లేదా బంగారు నాణేలు

దీపావళి సమయంలో వెండి, బంగారం వంటి విలువైన లోహాలను శుభప్రదంగా భావిస్తారు. ధన్‌తేరస్ రోజున, లోహంతో తయారు చేసిన వస్తువును కొనడం శ్రేయస్సు, అదృష్టానికి సంపదకు సంకేతంగా భావిస్తారు. దీపావళి, ధన్‌తేరస్ రెండింటిలోనూ మీరు ఉపయోగించగల ఉత్తమ దీపావళి బహుమతి ఆలోచనలలో ఇది ఒకటి.

### వివిధ రకాల చాక్లెట్లు

ఈ దీపావళికి, మీ ప్రియమైన వారికి వివిధ రకాల చాక్లెట్ల ప్యాక్ పంపడం ద్వారా వారి నోరు తీపి చేయండి. చాక్లెట్లు ఎవరినీ ఆకట్టుకోవడంలో ఎప్పుడూ విఫలం కావు. కాబట్టి, బహుమతిగా చాక్లెట్లను అందమైన రేపర్‌తో చుట్టి వారికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేయండి.

### సుమగంధం

సహజసిద్ధమైన పూలతో తయారు చేసిన సెంటు, స్ప్రే లేదా అగరుబత్తుల ప్యాకెట్లను కూడా బహూకరిస్తే ఆ సుమగంధంలాగే మీ స్నేహ బంధమూ పరిమళిస్తుంది.

# వేప వరాలు



వేపను మానవాళికి ఒక వరంలా భావిస్తారు. ఆయుర్వేదం అయితే అనేక రకాల వ్యాధులకు వేప వాడకాన్ని సిఫార్సు చేసింది. వేపపై జరిపిన శాస్త్రీయ పరిశోధనలు దీనిని ఒక సర్వరోగ నివారిణిగా నిరూపిస్తాయి. ఇది యాంటీ బాక్టీరియల్, యాంటీహెల్మింటిక్, యాంటీవైరల్, క్యాన్సర్ నిరోధకతలోనూ, ముఖ్యంగా వ్యాధి నిరోధకత పెంపులోనూ వేపను ప్రముఖంగా పరిగణిస్తారు.

వేపలో మొటిమలను, చర్మంపై పడే మచ్చలను తగ్గించడంలో సహాయపడే లక్షణాలుంటాయి.

### చర్మ సంరక్షకి

వేపలో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది, ఇది దెబ్బతిన్న చర్మ కణాలను మరమ్మతు చేయడంలో సహాయపడుతుంది. అందుకే చికెన్ పాక్స్ వంటి వ్యాధులకు వాడే మందుల తయారీలో వేపను ఉపయోగిస్తారు. పెద్దవాళ్లు అమ్మవారు పోసిన వారికి వేపాకులను నూరి ముద్దగా చేసి అందులో పసుపు వేసి వళ్లంతా పట్టిస్తారు.



### ఫంగల్ ఇన్ఫెక్షన్ల చికిత్సలో...

వేప శాస్త్రీయంగా నిరూపించబడిన యాంటీ ఫంగల్ గుణం,ఇది ఫంగల్ ఇన్ఫెక్షన్లకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది.

### విషాలకు విరుగుడు

వేప ఆకులు లేదా పొడిని తీసుకోవడం వల్ల మూత్రపిండాలు, కాలేయం ఉత్తేజితమవుతాయి, జీవక్రియల వేగం అంటే మెటబాలిజం పెరుగుతుంది. శరీరంలో పేరుకుపోయిన విషాలు తొలగుతాయి. బాహ్యంగా, వేప స్క్రబ్‌లు లేదా పేస్ట్‌ను మీ చర్మం నుండి క్రిములు, బ్యాక్టీరియా, ధూళి మొదలైన వాటిని తొలగించడానికి ఉపయోగించవచ్చు,

### రోగనిరోధక శక్తిని పెంచుతుంది

వేప దాని యాంటీమైక్రోబియల్, యాంటీ బాక్టీరియల్ ప్రభావాలకు ప్రసిద్ధి చెందింది. ఈ లక్షణాలు రోగనిరోధక శక్తిని పెంచడంలో భారీ పాత్ర పోషిస్తాయి.

### కీటకాలు, దోమల వినాశిని..

కీటకాలను నివారించడానికి మీరు కొన్ని వేప ఆకులను కాల్చవచ్చు. వేపాకుల పొగ వివిధ రకాల దోమలను తరిమికొట్టడంలో ప్రభావవంతంగా పని చేస్తుంది. మలేరియా నివారణకు వాడే ఔషధాల తయారీలో కూడా వేపను విరివిగా ఉపయోగిస్తారు.

### రకరకాల వ్యాధుల నివారణలో...

వేపలోని శోథ నిరోధక లక్షణాలు జీర్ణశయంలోని ప్రేగు వాపును తగ్గించడంలో సహాయపడతాయి, ఇది మలబద్ధకం, కడుపులో పుండ్లు, గ్యాస్, మొదలైన వ్యాధులని తగ్గించడంలో సహాయపడుతుంది.వేప ఆకులు క్రిమినాశక లక్షణాలను కలిగి ఉంటాయి, అందుకే దీనిని గాయాలను నయం చేయడానికి ఉపయోగిస్తారు.

### చుండ్రును తగ్గిస్తుంది

వేపను షాంపూలు, కండిషనర్లలో విస్తృతంగా ఉపయోగిస్తారు. అజాడిరక్తా ఇండికాలో యాంటీ ఫంగల్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయి, ఇవి చుండ్రును తొలగించడంలో సహాయపడతాయి. మీ జుట్టు కుదుళ్లను దృఢపరుస్తాయి.

# హోమ్ వర్క్‌కు ఏఐ

80% మంది విద్యార్థులు పాఠశాల పని కోసం ఏఐని ఉపయోగిస్తున్నారని, అయితే వారు తమ చదువుపై దీని ప్రభావం గురించి ఆందోళన చెందుతున్నారని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ అధ్యయనంలో తేలింది.

ఈ పరిశోధన కోసం 13 నుంచి 18 సంవత్సరాల వయసులోపు ఉన్న 2,0000 మంది విద్యార్థులను సర్వే చేశారు. ఇందులో 80 శాతం మంది తమ హోమ్‌వర్క్ కోసం ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు చెప్పారు. 52 శాతం మంది ఇది తమకు చాలా ఉపయోగపడుతోందని, దీనివల్ల కొత్త నైపుణ్యాలను సాధించగలుగుతున్నామని నమ్ముతుండగా 62 శాతం మంది ఇది తమ నైపుణ్యాలు, అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతోందని భావిస్తున్నట్లు తేలింది.



సర్వేలో నాలుగింట ఒక వంతు మంది తమ బుర్రకు అట్టే శ్రమ లేకుండా సమాధానాలు సాధించడం వల్ల తమ పని చాలా సులభమవుతోందని అంగీకరించారు. కానీ 12 శాతం మందిమాత్రం ఇది తమ ఆలోచనా శక్తిని పరిమితం చేస్తోందని, దానివల్ల తాము ఆందోళనకు గురవుతున్నామని ఒప్పుకున్నారు. తమ ఫ్రెండ్స్‌కు, టీచర్లకు తెలీకుండా రహస్యంగా ఏఐని వినియోగించి హోమ్‌వర్క్ చేస్తున్నామని చెప్పారు. సమస్యలను అర్థం చేసుకోవడానికి ఇది సహాయపడిందని 18% మంది,'కొత్త , మెరుగైన' ఆలోచనలతో ముందుకు సాగేందుకు ఉపకరించిందని 15% మంది చెప్పారు. ఏఐతో గణిత సమస్యలను చక్కగా అర్థం చేసుకోగలిగామని, చిక్కు లెక్కలను చకచకా చేయగలిగామని చెప్పారు. అయితే అందులోని ఇన్ఫర్మేషన్ సరైనదో కాదో తెలుసుకునేందుకు టీచర్లు తమకు సహాయం చేస్తే బావుంటుందని అభిప్రాయపడటం కొసమెరుపు.

# సాక్షి సినిమా


## ధమ్ బిర్యానీలా ఉంటుంది - సుధీర్‌బాబు



• సోనాక్షీ సిన్హా, సుధీర్‌బాబు, ప్రేరణ, శిల్పా శిరోద్కర్

''చిన్నప్పుడు 'ఓ స్త్రీ రేపు రా, లంకె బిందెలు' వంటి కథలు విన్నప్పుడు చాలా థ్రిల్ ఫీల్ అవుతాం. వెంకట్ 'జటాధర' కథ చెప్పినప్పుడు అంతే థ్రిల్‌గా అనిపించింది. మా సినిమా చూసినప్పుడు ఆడియన్స్ థియేటర్స్‌లో అదే థ్రిల్ ఫీల్ అవుతారు'' అని సుధీర్ బాబు తెలిపారు. ఆయన హీరోగా నటించిన పాన్ ఇండియన్ మూవీ 'జటాధర'. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో సోనాక్షీ సిన్హా, శిల్పా శిరోద్కర్, 'శుభలేఖ' సుధాకర్, రాజీవ్ కనకాల, అవసరాల శ్రీనివాస్, ఝాన్సీ కీలక పాత్రలు పోషించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పణలో ఉమేశ్ కుమార్ బన్సాల్, శివన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింఘాల్, నిఖిల్ నంద నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో నవంబరు 7న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ని హీరో మహేశ్ బాబు రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఈవెంట్‌లో సుధీర్‌బాబు మాట్లాడుతూ–''జటాధర'లో అద్భుతమైన కథ, భావోద్వేగాలు ఉంటాయి. ధన పిశాచి అనే పవర్‌ఫుల్ రోల్‌లో సోనాక్షి నటనను ఇంకెవరూ మ్యాచ్ చేయలేరు. మా సినిమా ఒక ధమ్ బిర్యానీలా తయారైంది'' అని చెప్పారు. ''జటాధర' నా తొలి తెలుగు సినిమా. ధన పిశాచిలాంటి పాత్ర నేనిప్పటివరకూ చేయలేదు'' అని తెలిపారు సోనాక్షీ సిన్హా. ''బ్రహ్మ' నా తొలి తెలుగు చిత్రం. మళ్లీ 'జటాధర'తో తెలుగుకి రావడం హ్యాపీగా ఉంది'' అని శిల్పా శిరోద్కర్ పేర్కొన్నారు. ''మా 'జటాధర' పెద్ద సక్సెస్ అవుతుందని నమ్మకంగా ఉన్నాం'' అని ఉమేశ్ కుమార్ బన్సల్, ప్రేరణ అరోరా, శివిన్ నారంగ్ తెలిపారు. ''కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకొస్తున్నాం. ఈ సినిమాని గట్టిగా ఎంజాయ్ చేస్తారు. ఇందుకు 100 శాతం మాది గ్యారంటీ'' అని వెంకట్ కల్యాణ్ – అభిషేక్ జైస్వాల్ అన్నారు.

## ఫిబ్రవరిలో ప్రారంభం



• రామ్‌చరణ్

'రంగస్థలం' (2018) వంటి బ్లాక్‌బస్టర్ చిత్రం తర్వాత హీరో రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్నారు. ఈ సినిమా స్క్రిప్ట్ పనులు దుబాయ్‌లో జోరుగా జరుగుతున్నాయని తెలిసింది. గతంలో రామ్‌చరణ్, సుకుమార్ కలిసి ఈ సినిమా కథా చర్చల కోసం దుబాయ్‌లో సమావేశమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం దర్శకుడు సుకుమార్ దుబాయ్‌లో ఉంటూ, ఈ సినిమా స్క్రిప్ట్‌కు మరింత మెరుగులు దిద్దుతున్నారని సమాచారం. రామ్‌చరణ్ కెరీర్‌లోని ఈ 17వ సినిమా రెగ్యులర్ షూట్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభం కానుందట. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు కృతీ సనన్, సమంత వంటి పేర్లు తెరపైకి వచ్చాయి. మరో వైపు ప్రస్తుతం 'పెద్ది' చిత్రంతో రామ్‌చరణ్ బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలోని ఈ సినిమా వచ్చే మార్చి 27న రిలీజ్ కానుంది.

## జోడీ రిపీట్?



• నాగార్జున



• అనుష్క

నాగార్జున కెరీర్‌లోని వందో సినిమా 'కింగ్ 100' (వర్కింగ్ టైటిల్). తమిళ దర్శకుడు ఆర్ఏ కార్తీక్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో నాగార్జున ద్విపాత్రాభినయం చేస్తున్నారని, కథలో ముగ్గురు హీరోయిన్లకు చాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఈ సినిమాలో ఓ హీరోయిన్‌గా టబు ఖరారయ్యారనే వార్తలు తెరపైకి వచ్చాయి. తాజాగా మరో హీరోయిన్ పాత్ర కోసం మేకర్స్ అనుష్కా శెట్టిని సంప్రదించారని టాక్. ఇక 2005లో వచ్చిన 'సూపర్' సినిమాలో నాగార్జున, అనుష్కా శెట్టి హీరో హీరోయిన్లుగా నటించారు. ఆ తర్వాత 'డాన్' (2007), 'రగడ' (2010), 'ఢమరుకం' (2012) చిత్రాల్లో నాగార్జున, అనుష్క నటించారు. అలాగే నాగార్జున నటించిన 'సోగ్గాడే చిన్ని నాయనా' (2016)లో అతిథి పాత్ర చేశారు అనుష్క. ఇంకా నాగార్జున భక్తుడిగా నటించిన 'ఓం నమో వేంకటేశాయ' (2017)లో భక్తురాలిగా ఆమె నటించారు. ఇంకో విషయం ఏంటంటే... నాగార్జున హీరోగా నటించిన 'కింగ్' (2008)లో ఓ పాటలో నటించిన అనుష్క ఇప్పుడు 'కింగ్ 100'లో హీరోయిన్‌గా కనిపిస్తారా? నాగ్–అనుష్కల జోడీ రిపీట్ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.

## శింబు సామ్రాజ్యం



శింబు హీరోగా నటిస్తున్న తాజా తమిళ చిత్రం 'అరసన్'. వెట్రిమారన్ దర్శకత్వంలో కలైపులి ఎస్. థాను నిర్మిస్తున్న పీరియాడికల్ క్రైమ్ థ్రిల్లర్ సినిమా ఇది. ఈ చిత్రానికి తెలుగులో 'సామ్రాజ్యం' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం 'సామ్రాజ్యం' సినిమా ప్రోమోను 'ఎక్స్' వేదికగా ఎన్టీఆర్ షేర్ చేశారు. ''ఒకే రాత్రి ముగ్గుర్ని హత్య చేశావని పోలీసులు నీ మీద కేసు ఫైల్ చేశారు. నువ్వు ఆ నేరాన్ని ఒప్పుకుంటున్నావా?', 'ఆళ్లు చెప్పే మర్డర్‌కి, నాకు ఏ సంబంధం లేదు. ఆ రోజు రాత్రి నేను ఫ్రెండ్స్‌తో గ్యాంగ్ లీడర్ సినిమాకి వెళ్లానమ్మా..?, ఆ మర్డర్ జరిగినప్పుడు నేను ఊళ్లోనే లేను', 'ఇది హండ్రెండ్ పర్సెంట్ బనాయించింది అమ్మా (జడ్జిని ఉద్దేశిస్తూ..)..., నేను నిరాపరాధిని అమ్మా..!' వంటి డైలాగ్స్ 'సామ్రాజ్యం' ప్రోమోలో ఉన్నాయి. అలాగే 'వడ చెన్నై' సినిమా ప్రపంచం నుంచి రానున్న 'అన్‌టోల్డ్ స్టోరీ' అని 'సామ్రాజ్యం' సినిమాను ఉద్దేశించి మేకర్స్ పేర్కొన్నారు. ఇక నార్త్ చెన్నై నేపథ్యంలో సాగే ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్రకు సాయి పల్లవిని సంప్రదించారని కోలీవుడ్ సమాచారం. ''ఈ సినిమా తొలి షెడ్యూల్ పూర్తయింది. త్వరలో రెండో షెడ్యూల్ మొదలవుతుంది. సురేశ్ ప్రొడక్షన్స్‌తో కలిసి తెలుగులో ఈ చిత్రాన్ని కలైపులి ఎస్. థాను విడుదల చేస్తారు'' అని యూనిట్ పేర్కొంది. ఇక ధనుష్ హీరోగా వెట్రిమారన్ దర్శకత్వంలో వచ్చిన 'వడ చెన్నై' 2018లో విడుదలై హిట్‌గా నిలిచింది. ఈ మూవీకి సీక్వెల్ తీసే ఆలోచనలో ఉన్నట్లు ధనుష్ ఇటీవల తెలిపారు. ఈ సీక్వెల్‌లోనూ ధనుష్ హీరోగా నటించనున్నారు.

## ఆ భయం పోయింది - సిద్ధు జొన్నలగడ్డ



• నీరజ, సిద్ధు జొన్నలగడ్డ, వైవా హర్ష

''తెలుసు కదా' సినిమాని నేను చేయాలని నిర్ణయించుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. అయితే అది యాక్టర్‌గా కాదు... రచయితగా. ప్రతి సన్నివేశంలో పంచ్‌లు లేకపోతే ప్రేక్షకుల్ని హోల్డ్ చేయగలమా? లేదా అనే భయం ఉండేది. అయితే థియేటర్లో ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూసి, ఈరోజు నాకు ఆ భయం పోయింది'' అని సిద్ధు జొన్నలగడ్డ చెప్పారు. ఆయన హీరోగా, శ్రీనిధీ శెట్టి, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటించిన చిత్రం 'తెలుసు కదా'. నీరజ కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, టీజీ కృతీప్రసాద్ నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ– ''తెలుసు కదా' లాంటి సినిమాకి ప్రేక్షకులు వస్తారా? లేదా అని భయం ఉండేది. ఈరోజు హౌస్‌ఫుల్ షోస్ చూస్తుంటే మేము సక్సెస్ అయ్యామనే ఆనందం కలిగింది. మా సినిమాకి అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది'' అని తెలిపారు. నీరజ కోన మాట్లాడుతూ–''దర్శకురాలిగా 'తెలుసు కదా' నా తొలి చిత్రం. సినిమాకు వస్తున్న స్పందన చూస్తుంటే చాలా భావోద్వేగంగా ఉంది. మేము కనెక్ట్ అయిన పాయింట్‌కి ఆడియన్స్ కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ కావడం ఆనందాన్నిచ్చింది. మా నిర్మాతలు విశ్వప్రసాద్‌గారు, కృతీ ప్రసాద్, హీరో హీరోయిన్లు సిద్ధు, రాశి, శ్రీనిధిలతో పాటు సాంకేతిక నిపుణులకు ధన్యవాదాలు'' అని చెప్పారు. ''మా సినిమా థియేటర్లలో 99 శాతం ఆక్యుపెన్సీతో నడుస్తోంది'' అని వైవా హర్ష అన్నారు.

## నువ్వు నాదానివే..!



• రష్మికా మందన్నా



• జిమ్‌లో...


నచ్చిన డిజర్ట్ కళ్ల ముందు ఊరిస్తుంటే ఎవరికైనా నోరారా ఆరగించాలని అనిపిస్తుంది. రష్మికా మందన్నాకూ అలానే అనిపించింది. కానీ రష్మిక తినలేని పరిస్థితి. ఎందుకంటే... ప్రస్తుతం రష్మికా మందన్నా ఓ స్పెషల్ డైట్‌ను ఫాలో అవుతున్నారట. ఇందులో భాగంగా జిమ్‌లో స్పెషల్ వర్కౌట్స్ చేస్తున్నారు. అలాగే ఈ డైట్ మెనూలో రోజూ స్వీట్ తినకూడదు. దీంతో తన కళ్ల ముందు ఉన్న డిజర్ట్‌ను తినలేకపోతున్నానన్న బాధను ఎక్స్‌ప్రెస్ చేస్తూ, 'డియర్ డిజర్ట్... నువ్వు ఎప్పటికీ నా దానివే. కానీ ఈ రోజు కాదు' అనే క్యాప్షన్‌తో ఇన్‌స్టాలో రష్మిక ఓ వీడియోను షేర్ చేయగా, వైరల్ అవుతోంది. ''ఫిట్‌నెస్ కారణంగా సినిమా స్టార్స్ తమకు ఇష్టమైన ఆహారానికి దూరం కావాల్సిందే. ముఖ్యంగా హీరోయిన్స్ మెరుపు తీగలా ఉండటం కోసం నచ్చిన ఆహారాన్ని త్యాగం చేస్తారు... ఇలాంటి త్యాగాలు తప్పవు'' అని నెటిజన్లు స్పందిస్తున్నారు. ఇక రష్మికా మందన్నా నటించిన హిందీ చిత్రం 'థామా' ఈ నెల 24న విడుదల కానుంది. అలాగే రష్మిక లీడ్ రోల్ చేసిన 'ది గర్ల్ ఫ్రెండ్' నవంబరు 7న రిలీజ్ కానుంది. అలాగే 'మైసా' అనే ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్, హిందీలో 'కాక్‌టైల్ 2'తో పాటు మరో రెండు సినిమాలతో రష్మిక ఎప్పటిలానే బిజీ బిజీ.

## కె-ర్యాంప్‌ని ఎంజాయ్ చేస్తారు - కిరణ్ అబ్బవరం



• వీకే నరేశ్, కిరణ్, యుక్తీ తరేజా, జైన్స్ నాని

''నేను సక్సెస్ చూశాను. ఫెయిల్యూర్స్ కూడా చూశాను. సో... వీటి విషయంలో పరిణతి చెందాను. కానీ విజయం వచ్చిన ప్రతిసారీ చాలా పాజిటివ్‌గా ఉంటుంది. నా సినిమా వస్తే బాగుంటుందనే ఇమేజ్‌ను ప్రేక్షకుల నుంచి తెచ్చుకోవాలన్నదే నా ప్రయత్నం. 'కె-ర్యాంప్' చిత్రాన్ని ఎంజాయ్ చేస్తారు'' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన హీరోగా, యుక్తి తరేజా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కె-ర్యాంప్'. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ– ''కె-ర్యాంప్'లాంటి సినిమా వచ్చి చాలా రోజులైంది. క్యారెక్టర్ బేస్డ్ ఫిల్మ్ ఇది. ఇందులో కుమార్ అనే పాత్ర చేశాను. ఈ సినిమా ఫస్టాఫ్ యూత్‌ఫుల్ ఎలిమెంట్స్‌తో ఆకట్టుకుంటుంది. సెకండాఫ్ ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఎంగేజ్ చేస్తుంది'' అని అన్నారు. ''పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా ఇది. ప్రస్తుతం సమాజంలో ఉన్న పరిస్థితులను ఈ సినిమా రిఫ్లెక్ట్ చేస్తుంది'' అని తెలిపారు వీకే నరేశ్. ''ఎక్కడా బోర్ కొట్టకుండా ఉండేలా స్క్రిప్ట్‌ను రెడీ చేసుకుని, సినిమా చేశాను'' అన్నారు జైన్స్ నాని. ''ఈ చిత్రంలో డిఫరెంట్ క్యారెక్టర్ చేశాను'' అని పేర్కొన్నారు యుక్తీ తరేజా.


'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 207

శనివారం 18-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




**యువ హవా**

'వెల్త్–హురున్' జాబితాలో 150 మంది యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్లు -15లో



**తన్వీ తడాఖా**

ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పతకం ఖాయం -16లో



**రివాబా జడేజాకు మంత్రి పదవి**

గుజరాత్‌లో సీఎం సహా 26 మందితో కొత్త కేబినెట్ ఏర్పాటైంది. క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివాబాను మంత్రి పదవి వరించింది.

- వివరాలు 6లో▶



**ఇన్ఫోసిస్ అంటే బృహస్పతినా?**

కర్ణాటక ప్రభుత్వ సర్వేపై నారాయణమూర్తి దంపతులు చేసిన విమర్శలను ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య తిప్పికొట్టారు.


- వివరాలు 6లో▶



**సుప్రీం పేరుతో డిజిటల్ స్కాం**

నకిలీ కోర్టు ఉత్తర్వులు చూపించి వృద్ధ దంపతుల నుంచి రూ.కోటికి పైగా డబ్బు కాజేసిన ఘటనపై సుప్రీంకోర్టు మండిపడింది.

- వివరాలు 6లో▶



**కార్టిసాల్‌ను తిట్టకండి..**

కార్టిసాల్ హార్మోన్ శరీరాన్ని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

- వివరాలు 8లో▶

## న్యూస్‌రీల్

### ఇదీ నా గ్యారంటీ



మావోయిస్టుల బెడదను పూర్తిగా అంతం చేసే రోజు ఇక ఎంతో దూరంలో లేదని తాను గ్యారంటీ ఇస్తున్నానని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు నక్సలైట్లు విచ్చలవిడిగా హింసకు పాల్పడుతున్నా పట్టించుకోలేదన్నారు.

- వివరాలు 6లో▶

### రేపు లైసెన్స్‌డ్ సర్వేయర్లకు నియామక పత్రాలు



19న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌లు పంపిణీ చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. రెండో విడతలో మరో 3 వేల మందికి అర్హత పరీక్ష నిర్వహిస్తామన్నారు.

- వివరాలు 8లో▶

### దళారులను నమ్మొద్దు..



పత్తి అమ్మకాల సమయంలో రైతులు దళారులను నమ్మొద్దని, చివరి పత్తిగింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత తీసుకుంటామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఈసారి తేమ శాతాన్ని 12 వరకు పెంచామని చెప్పారు.

- వివరాలు 14లో▶

### 'నిషేధిత' ఉత్తర్వులు ఎత్తివేయలేం




రంగారెడ్డి జిల్లా నాగారంలోని భూముల వ్యవహారంలో ఏప్రిల్ 24న ఇచ్చిన ఉత్తర్వులను ఎత్తివేయలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలన్న ఉత్తర్వుల ఎత్తివేతకు నిరాకరించింది.

- వివరాలు 14లో▶



# కార్పొరేట్ 'చదివింపులు'

**ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి దాతలు, కార్పొరేట్ల తోడ్పాటు తీసుకోవాలి**



విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి తదితరులు

**విద్యాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

- మౌలిక వసతుల కల్పనలో ఇదే సరైన మార్గమని వెల్లడి
- విదేశాల్లోని మెరుగైన విధానాలను అనుసరించాలని సూచన
- 'ఔటర్' పరిధిలో సౌకర్యాలు లేని స్కూళ్లన్నీ ప్రభుత్వ స్థలాల్లోకి మార్చాలని ఆదేశం
- నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు పైలట్ ప్రాజెక్టుగా కొత్త స్కూళ్ల నిర్మాణం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో పేదలకు మెరుగైన విద్య అందించాలన్న లక్ష్యంతో ప్రజాప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు వీలుగా సరికొత్త మార్గాలను అన్వేషించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల పనితీరు మెరుగుపడాలని.. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వాటిని తీర్చిదిద్దాలని సూచించారు. ఇందులో భాగంగా స్కూళ్ల అభివృద్ధికి నిధులిచ్చే దాతలు, పూర్వ విద్యార్థుల తోడ్పాటు తీసుకోవాలని కోరారు. మౌలిక వసతుల కల్పనలో ఇది సరైన మార్గమని పేర్కొన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో విద్యాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు తొలి దశలో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్) పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఆయా స్కూళ్లలో ఆట స్థలాలు, అవసరమైనన్ని తరగతి గదులతోపాటు ఆహ్లాదకర వాతావరణం ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. స్థలం సమస్య వల్ల సౌకర్యాలలేమి ఎదుర్కొంటున్న పాఠశాలలను దగ్గరలో ఉన్న ప్రభుత్వ స్థలాల్లోకి తరలించాలని ఆదేశించారు. విదేశాల్లో విద్యా వ్యవస్థల పరిశీలనకు టీచర్లను పంపే ప్రక్రియను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఇతర దేశాల్లోని మెరుగైన విధానాలను అనుసరించాలని సూచించారు.

**నిధుల కొరత వల్ల..**

విద్యాశాఖలో తీసుకొస్తున్న సంస్కరణలు, జరుగుతున్న కృషిని అధికారులు సీఎంకు వివరించారు. అయితే నిధుల కొరత అభివృద్ధికి ఆటంకంగా మారుతోందని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా విశ్వవిద్యాలయాలకు బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించినప్పటికీ ఇంతవరకు నిధులు మంజూరు కాలేదని.. ముఖ్యంగా చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, ఉస్మానియా యూనివర్సిటీకి రూ. 100 కోట్ల చొప్పున, మిగతా వర్సిటీలకు రూ. 35 కోట్ల చొప్పున బడ్జెట్ కేటాయింపులు చేసినా ఇప్పటికీ నిధులివ్వలేదని పేర్కొన్నారు. దీనివల్ల వర్సిటీల్లో కొత్త కార్యక్రమాలు చేపట్టే అవకాశం మిగతా 8వ పేజీలో ▶




# హైదరాబాద్ టు శ్రీశైలం నాన్ స్టాప్

**147 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం**

- రావిర్యాల నుంచి ఆమన్‌గల్ రోడ్డు దీనితో అనుసంధానం
- ఫ్యూచర్ సిటీలో భాగంగా 42 కి.మీ. రోడ్డు నిర్మించనున్న ప్రభుత్వం
- ఆమన్‌గల్ నుంచి మన్ననూరు వరకు 51 కి.మీ. ఎక్స్‌ప్రెస్ వే
- మన్ననూరు నుంచి శ్రీశైలానికి 54 కి.మీ. మేర ఎలివేటెడ్ కారిడార్
- కేంద్రం అనుమతి కోసం త్వరలోనే డీపీఆర్ సమర్పణ

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ నుంచి శ్రీశైలం వరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా నాన్‌స్టాప్ ప్రయాణం వీలుకానుంది. 147 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ ఆమోదం తెలిపింది. రావిర్యాల నుంచి ఆమన్‌గల్, ఆమన్‌గల్ నుంచి మన్ననూరు వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించి అక్కడి నుంచి శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేపట్టనున్నారు. ఫ్యూచర్ సిటీలో భాగంగా ఇప్పటికే హెచ్ఎండీఏ నిర్మిస్తున్న రావిర్యాల (ఓఆర్ఆర్) నుంచి ఆమన్‌గల్ వరకు కొత్త రహదారిని ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారితో అనుసంధానించనున్నారు. ఆమన్‌గల్ నుంచి మన్ననూరు వరకు 52.2 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే... మన్ననూరు నుంచి శ్రీశైలం 54 కి.మీ. మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం జరగనుంది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు రూ. 7,500 కోట్ల వ్యయ ప్రతిపాదనకు ఆమోదం తెలపడం తెలిసిందే. ఈ ఎలివేటెడ్ మిగతా 7వ పేజీలో ▶

# స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి




- అధికారులు, ఉద్యోగులకు పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలు
- ఎన్నికలపై 2–3 రోజుల్లో స్పష్టత
- ప్రభుత్వ ఆదేశాలు అందిన వెంటనే మళ్లీ రిజర్వేషన్లు ఖరారు
- జిల్లా ఉన్నతాధికారులతో పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ భేటీ

**సాక్షి, హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని అధికారులు, ఉద్యోగులకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు జారీచేసింది. ఈ ఎన్నికలు ఎప్పుడు జరగొచ్చు అనే దానిపై రెండుమూడు రోజుల్లోనే స్పష్టత వస్తుందని సంకేతాలిచ్చినట్టు సమాచారం. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల ఖరారుతోపాటు ఎన్నికల తేదీలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న వెంటనే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. ఎన్నికలపై ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకున్నా రంగంలోకి దిగేందుకు సిద్ధంగా ఉండాలని సూచించినట్టు తెలిసింది.

**లోపాలు లేకుండా పకడ్బందీ చర్యలు..:** ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమస్యలు, చట్టపరమైన మిగతా 2వ పేజీలో ▶

## స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు?



- నిర్వహణ షెడ్యూల్ తెలియజేయాలన్న హైకోర్టు
- తదుపరి విచారణ 2 వారాలకు వాయిదా

2 లో

# మావోయిస్టు విప్లవ చరిత్రలో అతిపెద్ద లొంగుబాటు

**ఛత్తీస్‌గఢ్‌లో ఆశన్నతో సహా 210 మంది మావోయిస్టుల లొంగుబాటు**

- వారిలో 111 మంది మహిళలు..
- 19 ఏకే–47లు సహా 153 ఆయుధాల అప్పగింత
- జనజీవనంలోకి ఆహ్వానం... రాజ్యాంగ ప్రతుల అందజేత
- బస్తర్ జిల్లాలోని జగ్‌దల్‌పూర్‌లో పోలీసుల సమక్షంలో కార్యక్రమం
- వర్చువల్‌గా పాల్గొన్న ఆ రాష్ట్ర సీఎం విష్ణుదేవ్‌సాయి, హోంమంత్రి
- లొంగిపోవాలనుకొనే మావోయిస్టులు తనను సంప్రదించాలన్న ఆశన్న



పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్న తదితరులు

**సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:** దేశ సాయుధ విప్లవ చరిత్రలోకెల్లా మావోయిస్టుల అతిపెద్ద లొంగుబాటు ఛత్తీస్‌గఢ్‌లో నమోదైంది. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న సహా 210 మంది మావోయిస్టులు శుక్రవారం లాంఛనంగా పోలీసుల ఎదుట లొంగిపోయారు. వారిలో 111 మంది మహిళలు, 99 మంది పురుషులు ఉన్నారు. వారందరిపై కలిపి రూ. 9.18 కోట్ల రివార్డు ఉంది. హోదా పరంగా చూస్తే లొంగిపోయిన మావోయిస్టుల్లో ఒక కేంద్ర కమిటీ సభ్యుడు, నలుగురు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, ఒక రీజనల్ కమిటీ సభ్యుడు, 21 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 61 మంది ఏరియా కమిటీ సభ్యులు, 22 మంది పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ సభ్యులతోపాటు 98 మంది పార్టీ సభ్యులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా 19 ఏకే–47లు, 17 ఎస్ఎల్ఆర్‌లు, 23 ఇన్సాస్ రైఫిళ్లు, ఒక ఇన్సాస్ లైట్ మెషీన్ గన్, 36 (.303 రకం) రైఫిళ్లు, 11 బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు, నాలుగు కార్బైన్లు తదితర ఆయుధాలను అప్పగించారు. బస్తర్ జిల్లా కేంద్రమైన జగ్‌దల్‌పూర్‌లోని పోలీస్ లైన్‌లో ఉన్నతాధికారుల మిగతా 7వ పేజీలో ▶

# నేడు బీసీ జేఏసీ రాష్ట్ర బంద్

**మద్దతు ప్రకటించిన అన్ని రాజకీయ పార్టీలు**

**బంద్‌లో పాల్గొననున్న కుల సంఘాలు, ప్రజాసంఘాలు**

**సాక్షి, హైదరాబాద్:** బీసీ రిజర్వేషన్ల సాధనలో భాగంగా శనివారం తెలంగాణ బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్రబంద్‌కు అన్ని రాజకీయపార్టీలు మద్దతు ప్రకటించాయి. రాష్ట్ర బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలంటూ పార్టీలు... వారి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇవ్వడం, ఆ దిశగా అసెంబ్లీలో చట్టాలు చేసి కేంద్రానికి పంపడం... మరోవైపు ఆర్డినెన్స్ జారీ చేసినా, గవర్నర్ ఆమోదించకపోవడం...చివరకు బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయగా... వాటిపై హైకోర్టు స్టే ఇవ్వడంతో బీసీ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. బీసీలకు కేవలం స్థానిక సంస్థల్లోనే కాకుండా విద్య, ఉద్యోగాలు, రాజకీయ రిజర్వేషన్లు కావాలనే మిగతా 2వ పేజీలో ▶


## బీజేపీకి వ్యతిరేకంగా చేస్తున్న బంద్ ఇది



- కాంగ్రెస్ కేడర్ పెద్దఎత్తున పాల్గొనాలి
- బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నది బీజేపీనే..
- బీసీ రిజర్వేషన్లపై 23న కేబినెట్‌లో చర్చిస్తాం
- సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ రూ.400 కోట్లు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

2 లో

## ఇదం జగత్




... ఆన్‌లైన్ గేమ్‌లోనా! ఐతే ఓకే!!



మహిళా ఐపీఎస్‌ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న బీఎస్ఎఫ్ డీజీ దల్జీత్ సింగ్ చౌదరి

## 'స్మార్ట్' పోలీసింగ్‌తోనే సవాళ్లకు పరిష్కారం

- బీఎస్ఎఫ్ డీజీ దల్జీత్ సింగ్ చౌదరి
- నేషనల్ పోలీస్ అకాడమీలో పాసింగ్ అవుట్ పరేడ్

8 లో

## రన్‌వేకు అటు పౌర విమానాలు ఇటు ఐఏఎఫ్ జెట్లు!



- ఆదిలాబాద్ విమానాశ్రయ మాస్టర్‌ప్లాన్ సిద్ధం
- సుమారు 3 కిలోమీటర్ల పొడవైన రన్‌వే.. నైట్ ల్యాండింగ్ సదుపాయం
- ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య కుదిరిన అంగీకారం
- అన్ని సర్వేలు పూర్తి.. త్వరలో టెండర్ల ప్రక్రియ

2 లో

## పెళ్లికి ముందే కౌన్సెలింగ్!

- ప్రతి జిల్లాలో వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ప్రతి కేంద్రంలో ఒక లీగల్ కౌన్సెలర్, సైకాలజిస్టు, సోషల్ వర్కర్, హెల్పర్
- ఫైల్‌పై మంత్రి సీతక్క సంతకం ఆర్థికశాఖకు ఫైల్ బదిలీ
- త్వరలో ఆమోదం.. ఆ తర్వాత కేంద్రాల ఏర్పాటు

14 లో



# అది నకిలీ మద్యమే!

**ల్యాబ్ పరీక్షల సాక్షిగా బట్టబయలు**

గుంటూరులోని ప్రయోగశాల నిర్ధారణ

నీళ్లు, స్పిరిట్, రంగు, రుచి రసాయనాలతో నకిలీ మద్యం

45 మద్యం శాంపిల్స్ పంపిన ఎక్సైజ్ అధికారులు

అన్ని శాంపిల్స్‌లోనూ నకిలీ మద్యమేనని స్పష్టీకరణ

అండర్ ప్రూఫ్, ఓవర్ ప్రూఫ్‌లో భారీ వ్యత్యాసం

ఏ విధమైన నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని వెల్లడి

ల్యాబ్ రిపోర్ట్ తీవ్రత తగ్గించి చూపేందుకు మల్లగుల్లాలు

ఆ మద్యం ప్రమాదం కాదంటూ ఎల్లో మీడియా వత్తాసు

14 లో



# ఇది పత్రికా స్వేచ్ఛపై దాడే

తెలంగాణ, ఏపీలో కదం తొక్కిన జర్నలిస్టులు

'సాక్షి'పై కక్ష సాధింపు తగదని నినాదాలు

14 లో

## క్లుప్తంగా...

### శాంతియుతంగా బంద్ జరగాలి

**డీజీపీ శివధర్ రెడ్డి**



హైదరాబాద్: ఈనెల 18వ తేదీన వివిధ పార్టీలు తలపెట్టిన బంద్ కార్యక్రమాన్ని శాంతియుతంగా నిర్వహించాలని డీజీపీ బి.శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. బంద్ పేరుతో అవాంఛనీయ సంఘటనలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినట్లయితే కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది, నిఘా బృందాలు ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తాయని తెలిపారు. బంద్ సందర్భంగా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని డీజీపీ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు.

### బీసీ జేఏసీ బంద్‌కు సంపూర్ణ మద్దతు

**టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్**



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విస్తృత కోణంలో ఆలోచించి బంద్‌లో పాల్గొనాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ బంద్‌లో కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొంటారని, కాంగ్రెస్ కార్యకర్తలు కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. తాను కూడా బంద్‌లో పాల్గొంటానన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే అంశానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మహేశ్‌గౌడ్ తెలిపారు. బీసీ బిల్లును అడ్డుకునే వాళ్లు కూడా బంద్‌లో పాల్గొంటున్నారని విమర్శించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు కాంగ్రెస్ పేటెంట్ హక్కు అని, అధికారంలో ఉన్నప్పటికీ ఉన్నతంగా ఆలోచించి బంద్‌లో పాల్గొనేందుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. బీజేపీ ఎన్ని మాటలు చెప్పినా బీసీల హృదయాల్లో చోటు సంపాదించుకోలేదన్నారు.

### బంద్‌కు మద్దతు

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం బీసీ జేఏసీ తలపెట్టిన బంద్‌కు మద్దతు తెలుపుతున్నామని '42 శాతం రిజర్వేషన్ సాధన సమితి' నేతలు జస్టిస్ ఈశ్వరయ్య, చిరంజీవులు, విశారదన్, బాలరాజుగౌడ్ అన్నారు. బీసీ హక్కుల పరిరక్షణకు అందరూ కలిసి రావాలని కోరారు.

### నవంబర్ 23న మాలల రణభేరి

**మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య**



పంజగుట్ట (హైదరాబాద్): నవంబర్ 2వ తేదీన జరగనున్న మాలల రణభేరిని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని నవంబర్ 23కు వాయిదా వేస్తున్నట్లు మాల మహా నాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ప్రకటించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో రణభేరి కరపత్రాన్ని ఆయన మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబర్ 23న సరూర్‌నగర్ స్టేడియంలో జరగనున్న మాలల రణభేరి సభకు లక్షలాది మంది మాలలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ రిజర్వేషన్ చేసి మాలలకు ఎంతో అన్యాయం చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణను దళితులు స్థాపించిన ఆర్పీఐ, బీఎస్పీ, లోక్ జనశక్తి, దళిత పాంథరస్ లాంటి పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని కేవలం మనువాద పార్టీలు మాత్రమే దళితులను చీల్చేందుకు వర్గీకరణ చేసేలా ప్రోత్సహించాయని చెన్నయ్య మండిపడ్డారు. బీసీలబంద్‌కు మాల సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మాల మహానాడు ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ మహిళా నాయకురాలు నాగమల్లేశ్వరి, తెలంగాణ మహిళా అధ్యక్షురాలు సరళాదేవి, మధుబాబు, బేగరి మహేశ్, సుమలత, లలిత తదితరులు పాల్గొన్నారు.



# రన్‌వేకు అటు పౌర విమానాలు ఇటు ఐఏఎఫ్ జెట్లు!

**ఆదిలాబాద్ విమానాశ్రయ మాస్టర్‌ప్లాన్ సిద్ధం**

- సుమారు 3 కిలోమీటర్ల పొడవైన రన్‌వే.. నైట్ ల్యాండింగ్ సదుపాయం
- ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య కుదిరిన అంగీకారం
- ప్రస్తుతమున్న 369 ఎకరాలకు మరో 300 ఎకరాల సేకరణకు నిర్ణయం
- అన్ని సర్వేలు పూర్తి.. త్వరలో టెండర్ల ప్రక్రియ

సాక్షి, హైదరాబాద్: సుమారు 3 కిలోమీటర్ల పొడవైన రన్‌వే.. దానికి ఓవైపు విమానాశ్రయం.. మరోవైపు భారతీయ వాయుసేన (ఐఏఎఫ్) స్టేషన్. అంటే పౌర విమానాలు, ఎయిర్‌ఫోర్స్ విమానాలకు కామన్ రన్‌వే అన్నమాట. ఇదీ సమీప భవిష్యత్తులో రూపుదిద్దుకోనున్న ఆదిలాబాద్ విమానాశ్రయ ముఖచిత్రం. ఈ మేరకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసింది. తొలుత చిన్న విమానాశ్రయాన్నే నిర్మించాలని భావించినా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆదిలాబాద్‌లోనూ భారీ విమానాశ్రయాన్నే నిర్మించాలని తాజాగా ఏఏఐ నిర్ణయించింది. ఎయిర్‌బస్ ఏ-320, బోయింగ్-737 రకం విమానాల రాకపోకలకు వీలుగా ఈ విమానాశ్రయాన్ని నిర్మించాలన్న రాష్ట్ర ప్రభుత్వ విన్నపానికి ఆమోదం తెలిపింది. అలాగే రాత్రివేళల్లోనూ విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లు జరిగేలా వసతుల కల్పనకు కూడా సమ్మతించింది. దీంతో రాష్ట్రంలో ఆరు కొత్త విమానాశ్రయాల నిర్మాణ ప్రాజెక్టులో వరంగల్ విమానాశ్రయ ప్రతిపాదన తర్వాత గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన రెండో విమానాశ్రయం ఇదే కానుంది. వరంగల్ విమానాశ్రయంతోపాటే దీన్ని కూడా నిర్మించనున్నారు. ఇప్పటికే అన్ని రకాల సర్వేలు ముగిసి టెండర్లు పిలిచేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో తాజాగా తుది సందేహాలను నివృత్తి చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏఏఐ కోరింది. దానికి ఇక్కడి నుంచి సమాధానాలు ఢిల్లీకి చేరాయి. వాటి ఆధారంగా మాస్టర్‌ప్లాన్ సిద్ధమైంది.

**దాదాపు 650 ఎకరాల్లో నిర్మాణం..**

ఆదిలాబాద్ పట్టణ శివారులోని శాంతినగర్‌లో నిజాంకాలం నాటి ఎయిర్‌స్ట్రిప్ ఉంది. అక్కడకు కేవలం ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన హెలికాప్టర్‌లు మాత్రమే అడపాదడపా వస్తుంటాయి. వీఐపీలు వచ్చినప్పుడు అక్కడి హెలిపాడ్‌ను వాడుతుంటారు. ఈ హెలిపోర్టును ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌గా మార్చుకోవాలని చాలాకాలంగా ఐఏఎఫ్ ప్రయత్నిస్తోంది. తొలి నుంచీ హెలిపోర్టుకు చెందిన 369 ఎకరాల స్థలం దాని అధీనంలోనే ఉంది. అక్కడ రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయం కోసం ప్రతిపాదించగా అందుకు ఐఏఎఫ్ సమ్మతించి ఉమ్మడి అవసరాలకు వాడుకునేలా దాన్ని నిర్మించేందుకు అంగీకరిస్తూ నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) జారీ చేయడంతో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి మార్గం సుగమమైంది. ప్రస్తుతం ఉన్న 369 ఎకరాలకు అదనంగా మరో 250-300 ఎకరాల స్థలాన్ని సేకరించాలని నిర్ణయించారు. తాజాగా అన్ని అడ్డంకులు తీరిపోవడంతో భూసేకరణ ప్రక్రియ ప్రారంభించారు. వచ్చే 30 ఏళ్ల అవసరాలు తీర్చేలా ఇక్కడ నైట్ ల్యాండింగ్‌తో కూడిన పెద్ద విమానాశ్రయాన్నే నిర్మించనున్నారు. కన్సల్టెన్సీ సేవలు అందిస్తున్న ఏఏఐ తాజాగా ప్రభుత్వానికి రాసిన లేఖలో ఆదిలాబాద్‌లో ఎయిర్‌బస్-380, బోయింగ్-777 విమానాలు (అతిపెద్ద విమానాలు) దిగే సామర్థ్యంతో కూడిన రన్‌వే అవసరమా లేక ఎయిర్‌బస్-ఏ320, బోయింగ్-737 రకం విమానాలు దిగే సామర్థ్యంతో కూడిన రన్‌వే కావాలా అని ప్రశ్నించింది. ఎయిర్‌బస్-ఏ320, బోయింగ్-737 స్థాయి విమానాలు దిగే రన్‌వే సరిపోతుందని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో



2.8 కి.మీ. నుంచి 3 కి.మీ. పొడవైన రన్‌వే నిర్మాణానికి నిర్ణయించారు. దానికి ఓవైపు ప్రయాణికుల విమానాలు నిలిచే స్థలం, ప్రయాణికుల ప్రాంగణం మరోవైపు ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నిర్మించనున్నారు. సాధారణ ప్రయాణికులు, పౌర విమానాలు రెండో వైపు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు ఏర్పాటు చేయనున్నారు. వాయుసేనకు దాదాపు 50-80 ఎకరాల స్థలం కేటాయించి మిగతా మొత్తాన్ని ప్రయాణికుల విమానాశ్రయానికి వినియోగించనున్నారు.

# బీజేపీకి వ్యతిరేకంగా చేస్తున్న బంద్ ఇది

**ఇందులో కాంగ్రెస్ కేడర్ పెద్ద ఎత్తున పాల్గొనాలి**

- బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నది బీజేపీనే..
- బీసీ రిజర్వేషన్లపై 23న కేబినెట్‌లో చర్చిస్తాం
- సింగరేణి దీపావళి బోనస్ రూ.400 కోట్లు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క




ఖమ్మంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా అడ్డుకుందని.. ఆ పార్టీ నైజం రాష్ట్ర ప్రజలకే కాకుండా దేశం మొత్తం తెలిసిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై తమ ప్రభుత్వం, పార్టీకి చిత్తశుద్ధి ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు కాపీ రాగానే రిజర్వేషన్ అంశంపై చర్చించి ఈ నెల 23న జరిగే కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా శనివారం నిర్వహించే బీసీల బంద్‌లో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై సీఎం రేవంత్‌రెడ్డితోపాటు రాష్ట్రం నుంచి అఖిలపక్ష పార్టీలు బీజేపీ నాయకత్వంలోనే ఢిల్లీకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని భట్టి తెలిపారు. రాష్ట్రపతి, ప్రధానిని కలుస్తామని పదేపదే లిఖితపూర్వకంగా విజ్ఞప్తి చేసినా అనుమతి రాలేదన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు ఈ విషయంలో చొరవ చూపి ప్రధాని, రాష్ట్రపతి వద్ద బీసీ బిల్లు ఆమోదం కోసం నాయకత్వం వహించాలని సూచించారు. సింగరేణి కార్మికులకు దీపావళి కానుకగా రూ.400 కోట్ల బోనస్ ప్రకటించామని భట్టి తెలిపారు. సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ ప్రకటనపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంతోషం వ్యక్తం చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు పోట్ల నాగేశ్వరరావు, కొత్త సీతారాములు, కొండబాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు?

**నిర్వహణ షెడ్యూల్ తెలియజేయాలన్న హైకోర్టు**



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎప్పుడు నిర్వహిస్తారో తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు వివరాలను తమ ముందు ఉంచాలని జీపీ, ఈసీ తరఫు న్యాయవాదికి స్పష్టం చేసింది. దీనికి రెండు వారాలు సమయమిస్తూ, విచారణను వాయిదా వేసింది. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ మంచిర్యాల మండలం లక్సెట్టిపేట్‌కు చెందిన రేంక సురేందర్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. 'రిజర్వేషన్లపై పిటిషన్ నేపథ్యంలో గతంలో ఇచ్చిన నోటిఫికేషన్‌ను ఎన్నికల కమిషన్ నిలిపివేస్తూ ఈ నెల 9న ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు, సుప్రీంకోర్టులో స్పష్టత వచ్చినా ఎన్నికల నిర్వహణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. వెంటనే మరో నోటిఫికేషన్ జారీ చేసి, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల కమిషన్‌ను ఆదేశించాలి' అని కోరారు. ఎన్నికల కమిషన్ తరఫున సీనియర్ న్యాయవాది విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ.. రిజర్వేషన్లు, షెడ్యూల్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉందన్నారు. ఎన్నికల నిర్వహణకు ఈసీ సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రభుత్వం తరఫున షాజియా పర్వీన్ వాదనలు వినిపిస్తూ.. కౌంటర్ దాఖలు చేసేందుకు 3 వారాలు సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం కౌంటర్ అవసరం లేదని, ఎన్నికల తేదీలు తెలియజేస్తే చాలని స్పష్టం చేస్తూ, విచారణను వాయిదా వేసింది.

# స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

▶ మొదటి పేజీ తరువాయి

అంశాలపై ప్రభుత్వం కోరిన వివరణకు కూడా పీఆర్‌శాఖ సమాధానం పంపించినట్టు తెలుస్తోంది. ఇదివరకు జరిగిన కసరత్తులో నాలుగైదు జిల్లాల వరకు మండల, జిల్లా పరిషత్, గ్రామపంచాయతీ స్థానాల రిజర్వేషన్ల ఖరారులో తప్పులు దొర్లినందున ఈసారి అలాంటివి జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్టు సమాచారం. గురువారం రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్‌ఎల్‌పీ)ను సుప్రీంకోర్టు కొట్టేయడంతో పాటు 50 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేసిన విషయం తెలిసిందే. రెండువారాల్లోగా స్థానిక ఎన్నికల నిర్వహణ తేదీలను తెలియజేయాలంటూ ప్రభుత్వాన్ని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)లను తాజాగా శుక్రవారం హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలు ఎప్పుడు ఉంటాయో ఇంకా స్పష్టత రాలేదనే ఉద్దేశంతో అధికారులు అలసత్వం చూపొద్దని పీఆర్‌ఆర్‌డీ శాఖ సూచించింది. శుక్రవారం జెడ్పీ సీఈవోలు, డీఆర్‌డీవోలు, డీపీవోలు తదితరులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై పీఆర్‌ఆర్‌డీ డైరెక్టర్ స్పష్టతనిచ్చినట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే మళ్లీ రిజర్వేషన్లు (50 శాతం మించకుండా) ఖరారు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించినట్టు తెలిసింది. హైకోర్టు ఆదేశాలతో ఎస్ఈసీ కూడా ఏర్పాట్లు చేసుకోవడంలో నిమగ్నమైనట్టు సమాచారం. ఫలానా తేదీలోగా ఎన్నికలు జరపాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు అందగానే ఎన్నికల నిర్వహణ పనులు వేగవంతం చేయనుంది. గతంలోనే ఐదు దశల్లో ఎన్నికలకు షెడ్యూల్ జారీచేసినందున, రిజర్వేషన్లు ఖరారై, తేదీలపై స్పష్టత వచ్చిన వెంటనే ఎన్నికల ప్రక్రియకు సిద్ధంగా ఉన్నట్టు ఎస్ఈసీ వర్గాల సమాచారం.

# మంత్రులు వర్గాలుగా విడిపోయి తన్నుకుంటున్నారు

**కాంట్రాక్టులు, వాటాలు, వసూళ్లు, కబ్జాలు, పోస్టింగుల కోసం పోటీ**

- అక్రమాలపై జ్యుడీషియల్ విచారణ జరగాలి: మాజీమంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి గంగుల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గం.. దండుపాళ్యం ముఠా కంటే అధ్వానంగా తయారైందని..కేబినెట్ మీటింగ్‌లో మంత్రులు అరడజను వర్గాలుగా విడిపోయి తన్నుకుంటున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కమీషన్లు, కాంట్రాక్టులు, వసూళ్లు, వాటాలు, కబ్జాలు, పోస్టింగుల కోసం పోటీలు పడుతూ పాలన గాలికి వదిలి వ్యక్తిగత పంచాయితీలు పెట్టుకుంటున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి, మంత్రులు పరస్పరం తిట్లతో గడుపుతున్నారని, అతుకుల బొంత ప్రభుత్వ మనుగడపై అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేల్లోనే అనుమానాలు ఉన్నాయని చెప్పారు. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే భావనతో మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధికారంలో ఉన్నప్పుడే అందినకాడికి దండుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. మాజీమంత్రి గంగుల కమలాకర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మాణిక్‌రావు, పార్టీ నేతలు చిరుమర్తి లింగయ్య, పల్లె రవికుమార్‌తో కలిసి శుక్రవారం తెలంగాణభవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. దీపావళి పండుగ నేపథ్యంలో గురువారం జరిగిన కేబినెట్ సమావేశం ద్వారా తీపి కబురు చెప్తారని ఆశించిన అన్ని వర్గాల ప్రజలు నిరాశకు గురయ్యారన్నారు.

**రేవంత్ 'గన్ కల్చర్' తెచ్చారు**

'పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో వ్యాపార వేత్తలకు రెడ్ కార్పెట్ స్వాగతం పలికి పెట్టుబడులతోపాటు ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేశాం. కానీ రేవంత్‌రెడ్డి రాష్ట్రంలోకి గన్ కల్చర్ తెచ్చి వ్యాపారవేత్తలను తుపాకులతో బెదిరించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ముఖ్యమంత్రి సన్నిహితులు తుపాకులు పెడుతున్నారని, సీఎం జపాన్ నుంచి ఫైళ్లు ఆపించారని ఓ మంత్రి కుమార్తె స్పష్టంగా చెప్తోంది. కాంట్రాక్టుల కోసం.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సినిమా హీరోలు, కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న అరాచకాలపై కేంద్ర ప్రభుత్వ సంస్థలతో లేదా స్వతంత్ర జ్యుడీషియల్ కమిషన్‌తో విచారణ జరిపించాలి. సీఎం తుపాకీ పంపారు అని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో డీజీపీ స్పందించాలి' అని హరీశ్‌రావు అన్నారు.

**దేని కోసం విజయోత్సవాలు..?**

'ప్రభుత్వ సంస్థలను అప్పుల కుప్ప చేసి ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని మించి అప్పులు తెచ్చారు. కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చి కమీషన్లు దండుకునేందుకు హ్యామ్ మోడల్ పేరిట రూ.10,547 కోట్లతో రోడ్లకు టెండర్లు పిలిచారు. బ్యాంకుల్లో అప్పులు పుట్టకపోవడంతో కొత్త వాహనాలపై లైఫ్ ట్యాక్స్ పెంచి పేద, మధ్య తరగతి ప్రజలను రేవంత్ ప్రభుత్వం దొంగ దెబ్బతీసింది. 23 నెలల పాలనలో అన్ని పథకాలు, హామీలను అమలు చేయకుండా డిసెంబర్ 1 నుంచి 9 వరకు విజయోత్సవాలు జరపాలని నిర్ణయించడం సిగ్గుచేటు. రాష్ట్రంలో పెరిగిన అరాచకాలపై విచారణ ఏజెన్సీలకు ఫిర్యాదు చేస్తాం' అని హరీశ్‌రావు చెప్పారు.

# గన్‌కల్చర్ తెచ్చిందే బీఆర్‌ఎస్

**అబద్ధానికి ఆరడుగుల సాక్ష్యం హరీశ్‌రావు: మంత్రి సీతక్క**



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో గన్ కల్చర్ తెచ్చిందే బీఆర్‌ఎస్ అని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. 'అబద్ధానికి ఆరడుగుల సాక్ష్యం హరీశ్‌రావు. దండుపాళ్యం.. దండుకున్న పాళ్యం బీఆర్‌ఎస్ పార్టీనే. రోడ్లపై అడ్వొకేట్లు హత్యకు గురయ్యారు' అన్నారు. 'గతంలో ఇబ్రహీంపట్నంలో రియల్ ఎస్టేట్ గొడవల్లో తుపాకులతో కాలిస్తే ఇద్దరు చనిపోయారు. హరీశ్‌రావు నియోజకవర్గమైన సిద్దిపేటలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో తుపాకీతో కాల్పులు జరిపి రూ.42 లక్షలు ఎత్తుకుపోయారు' అని గుర్తు చేశారు. 'గత ప్రభుత్వంలో మంత్రులకు మాట్లాడే స్వేచ్ఛ లేదు. అంతా పంజరంలో చిలుకలే. కానీ తమది ప్రజాప్రభుత్వం.. ప్రజలు స్వేచ్ఛగా మాట్లాడుకుంటున్నారు. అలాంటి మీరు అవినీతి గురించి మాట్లాడితే జనాలు నవ్వుకుంటున్నారు' అని చెప్పారు. 'గతంలో కేబినెట్ భేటీలను కేసీఆర్ నామమాత్రంగా మార్చారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులను స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం కల్పిస్తున్నారు' అని పేర్కొన్నారు. శుక్రవారం సీతక్క మీడియాతో మాట్లాడుతూ తాజాగా కేబినెట్ భేటీలో రాద్ధాంతం జరిగిందంటూ మాజీమంత్రి హరీశ్‌రావు చేసిన విమర్శలపై స్పందిస్తూ వాటిని ఆయన నిరూపించగలరా అని సవాల్ విసిరారు. కేబినెట్‌లో ఎజెండా, ప్రజల సమస్యలు తప్ప ఇంకేమీ చర్చ జరగలేదన్నారు. తన తల్లిదండ్రుల సాక్షిగా ప్రమాణం చేసి హరీశ్‌రావుకు చాలెంజ్ విసిరారు. జరగని విషయాలను జరిగిందని మాట్లాడి హరీశ్ దిగజారిపోయారన్నారు. ఆయన మాటల్లో ఒక్కశాతం కూడా నిజం లేదన్నారు. 'సీఎంగా కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితమైతే, ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రజాపాలన అందిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో తూతూ మంత్రంగా కేబినెట్ సమావేశాలు జరిగేవి' అని విమర్శించారు. హరీశ్‌రావుపై ఎమ్మెల్సీ కవిత అనేక విషయాలను బయట పెట్టింది..ఆమె చేసిన అవినీతి ఆరోపణలపై హరీశ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'బీఆర్‌ఎస్‌లో నాలుగు స్తంభాలాట నడుస్తోంది. అది చూడలేకే కేసీఆర్ ఫాంహౌస్ నుంచి బయటకు రావడం లేదు' అని సీతక్క చెప్పారు.

# నేడు బీసీ జేఏసీ రాష్ట్ర బంద్

▶ మొదటి పేజీ తరువాయి

డిమాండ్ పెరిగింది. ఈ మేరకు రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమిస్తున్న బీసీ సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయి. ఈనెల 12న బీసీ జేఏసీ ఏర్పాటైంది. ప్రజాజీవనాన్ని స్తంభింపజేసి బీసీల డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసేందుకే రాష్ట్రబంద్ నిర్వహిస్తున్నట్టు జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. ఈ బంద్‌కు అన్ని వర్గాల మద్దతును కోరారు. బీసీ జేఏసీ నిర్ణయం మేరకు ఈనెల 18వ తేదీన రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన వెంటనే ప్రధాన రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా మద్దతు ప్రకటించాయి. తాజాగా అధికార కాంగ్రెస్ పార్టీ సైతం మద్దతు ప్రకటించడంతోపాటు రాష్ట్ర బంద్‌లో పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను పాల్గొనాలని టీపీసీసీ చీఫ్ బి.మహేశ్‌కుమార్ గౌడ్ ఆదేశించారు. మరోవైపు ప్రధాన ప్రతిపక్ష పార్టీలు బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు సైతం క్షేత్రస్థాయిలోని నాయకత్వానికి బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చాయి. రాజకీయ పార్టీలతో పాటు రాష్ట్రంలోని ప్రజాసంఘాలన్నీ బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొనాలని నిర్ణయించాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న బంద్‌కు అన్ని పక్షాల మద్దతు లభించడం ఇదే తొలిసారి.

### టెక్నాలజీలో ప్రపంచానికి మన సత్తా చాటాలి

**ఆ లక్ష్య సాధనే ధ్యేయంగా ఢిల్లీలో ఈఎస్‌టీఐసీ-2025 కాంక్లేవ్**
**డీఆర్‌డీఓ చైర్మన్ డా.సమీర్ వి కామత్**

సాక్షి, హైదరాబాద్: వికసిత్ భారత్ 2047 లక్ష్యసాధనలో భాగంగా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రపంచానికి భారత్ సత్తా చాటడంతోపాటు, ఈ రంగాల్లో భారత దేశాన్ని గ్లోబల్ లీడర్‌గా నిలిపే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు డీఆర్‌డీఓ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) చైర్మన్ డా.సమీర్ వీ కామత్ తెలిపారు. నవంబర్ 3 నుంచి 5 వరకు ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో భారత్ మండపంలో ఈఎస్‌టీఐసీ-2025 (ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ, అండ్ ఇన్నోవేషన్ కాంక్లేవ్) నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కాంక్లేవ్ వివరాల వెల్లడి కోసం శుక్రవారం కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఎల్‌లో నిర్వహించిన సమావేశంలో ఢిల్లీ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రధాన శాస్త్రసాంకేతిక సలహాదారు ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నిర్వహిస్తున్న ఈ కాంక్లేవ్‌లో మొత్తం 14 కేంద్ర ప్రభుత్వ శాఖలు పాల్గొంటున్నట్టు వెల్లడించారు.

# రాజ్‌భవన్ వద్ద ఉద్రిక్తత

**బీసీ రిజర్వేషన్లపై గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు సీపీఎం నేతల యత్నం**

- సెక్యూరిటీ సిబ్బంది రాజ్‌భవన్‌లోనికి వెళ్లనివ్వలేదని బైఠాయింపు



చలో రాజ్‌భవన్‌కు వస్తున్న సీపీఎం నేతలను అడ్డుకుంటున్న పోలీసులు

పంజగుట్ట (హైదరాబాద్): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై సీపీఎం నాయకులు గవర్నర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు రాజ్‌భవన్‌కురాగా అది తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. అనుమతి ఉన్నా తమను లోనికి వెళ్లనివ్వడంలేదని కమ్యూనిస్టు నాయకులు రోడ్డుపై బైఠాయించగా వారిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు యత్నించారు. దీంతో ఇరువర్గాలమధ్య తోపులాట చోటుచేసుకుంది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ నేతృత్వంలో నాయకులు రాజ్‌భవన్ రోడ్డులోని నర్సింగ్ కాలేజీ వద్దకు రాగానే పోలీసులు వారిని అడ్డుకుని 8 మంది ప్రతినిధుల బృందాన్ని రాజ్‌భవన్ వెళ్లేందుకు అనుమతించారు. అయితే ఇదే అంశంపై గవర్నర్ ఇప్పటికే పలువురి నుంచి వినతిపత్రాలు తీసుకున్నారని, ఇకపై ఎలాంటి వినతి పత్రాలు తీసుకోరని సెక్యూరిటీ సిబ్బంది వారిని లోనికి అనుమతించలేదు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన సీపీఎం నాయకులు మూడు రోజులక్రితమే తాము అనుమతి కోసం మెయిల్ పంపించామని, ఇప్పుడు లోనికి అనుమతించకపోవడం దారుణమని రాజ్‌భవన్ గేటు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు వచ్చి నిరసనకారులను అరెస్టు చెయ్యడంతో, నర్సింగ్ కాలేజీ వద్ద వేచిఉన్న వారు కూడా ఆందోళనకు దిగారు. ఈ సమయంలో పోలీసు లకు, సీపీఎం నాయకులకు మధ్య తోపులాట జరిగింది. తర్వాత వారిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీలు ఒక పక్క రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇస్తూనే, మరో పక్క బిల్లుకు అడ్డుపడుతోందని ఆగ్రహంవ్యక్తం చేశారు. బీసీ జేఏసీ నాయకులు, ఇతర పార్టీలు బీజేపీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా బంద్ నిర్వహించాలని పిలుపునిచ్చారు. బీజేపీతో కలసి బంద్ నిర్వహిస్తే బీసీల ఉద్యమం పక్కదారి పడుతుందని ఆయన అన్నారు. 18వ తేదీన తమ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కేంద్రానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తామని తెలిపారు.

# బీసీ జేఏసీ మహార్యాలీ



మహార్యాలీలో కృష్ణయ్య, మంద కృష్ణ, జాజుల, కోదండరాం తదితరులు

కవాడిగూడ: తెలంగాణ ఉద్యమ తరహాలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని చేపడతామని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రావు విగ్రహం నుంచి లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు మహార్యాలీ నిర్వహించారు. బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ దాసు సురేశ్, రాజారాంయాదవ్‌లు ఈ ర్యాలీకి నేతృత్వం వహించగా, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడు సంజీవనాయక్, ఆమ్‌ఆద్మీ పార్టీ నేత సుధాకర్ తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ శనివారం జరిగే తెలంగాణ బంద్‌లో అందరూ పాల్గొనాలన్నారు. ప్రజాస్వామికమైన డిమాండ్ కోసం బీసీలు చేపట్టే రాష్ట్ర బంద్‌కు తెలంగాణ సమాజం సహకరించాలని ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ బీసీ సమాజానికి అండగా యావత్ దళిత ఆదివాసీ, గిరిజన, మైనార్టీ ప్రజలు అండగా ఉండాలన్నారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ బంద్‌లో సబ్బండ కులాలు స్వచ్ఛందంగా పాల్గొని చరిత్ర సృష్టించాలని చెప్పారు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ దక్కాలంటే ఇప్పుడు కాకపోతే మళ్లీ ఎప్పుడు అవకాశం రాదన్నారు. ఈ ర్యాలీలో బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ గుజ్జకృష్ణ, కుల్కచర్ల శ్రీనివాస్, మల్లేశ్వర్, కుందారం గణేశ్‌చారి తదితరులు పాల్గొన్నారు.


SMART BAZAAR
Reliance
వండుగ
సంబరాలు సహస్రం
స్మార్ట్ బజార్
వారి
స్మార్ట్ కుటుంబం
SCAN QR CODE
TO VIEW
GIFTING RANGE
1000+ పండుగ ఫ్యాషన్ స్టైల్. ₹999* లోపు
ధన త్రయోదశి శుభాకాంక్షలు
స్టెయిన్ లెస్ డిన్నర్ సెట్ శ్రేణి (రెగ్యులర్ / పివిడి కోటెడ్ - గోల్డ్ / రోజ్ గోల్డ్)
ఎమ్ఆర్‌పి ₹49 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹25 మొదలుకుని
ఫ్లాట్ 50% +GST Benefit
స్మార్ట్ ప్రైస్ ₹149 మొదలుకుని
స్టీల్ డిన్నర్ సెట్ శ్రేణి
(5, 10, 24, 32 పిసెస్)
ఎమ్ఆర్‌పి ₹399 మొదలుకుని
BERGNER
స్టెయిన్ లెస్ స్టీల్ ట్రిప్లీ కుక్‌వేర్ శ్రేణి
స్మార్ట్ ప్రైస్ ₹199 మొదలుకుని
ఎమ్ఆర్‌పి ₹699 మొదలుకుని
Butterfly
BERGNER
ప్రెషర్ కుకర్ శ్రేణి
(స్టీల్ / అల్యూమినియం / హార్డ్ అనోడైజ్డ్ / ట్రిప్లీ)
50% వరకు తగ్గింపు +GST Benefit
ఎమ్ఆర్‌పి ₹1100 మొదలుకుని
ప్రీమియమ్ / రెగ్యులర్ గిఫ్ట్ ప్యాక్ (సెలెక్ట్ వేరియంట్స్)
BUY 1 GET 1 FREE +GST Benefit
ఎమ్ఆర్‌పి ₹549 మొదలుకుని
లూజ్ చక్కెర స్మాల్ 1 kg / గోల్డ్ డ్రాప్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 1 L
స్మార్ట్ ప్రైస్ ₹43.50/ ₹146
మార్కెట్ ధర ₹50
ఎమ్ఆర్‌పి ₹185 ఆదా చేసుకోండి ₹39
గుడ్ లైఫ్ బాదం 500 g + జీడిపప్పు (W320) 500 g
కాంబో @ ₹799
కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹1345 ఆదా చేసుకోండి ₹546
బేసన్ / మైదా / సుజీ 500 g / 1 kg
BUY 1 GET 1 FREE
ఎమ్ఆర్‌పి ₹50 మొదలుకుని
విజయా ఘీ 1 L
GHEE
స్మార్ట్ ప్రైస్ ₹545
ఎమ్ఆర్‌పి ₹690 ఆదా చేసుకోండి ₹145
హల్దీరామ్స్ / లాల్ గిఫ్ట్ ప్యాక్ 400 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY 1 GET ANY 1 FREE
ఎమ్ఆర్‌పి ₹369 మొదలుకుని
లాల్ / GRB (కాజు కత్రి) 200 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹359 మొదలుకుని
BUY ANY 1 GET ANY 1 FREE
BUY ANY 1 GET ANY 1 FREE
బికాజి / లాల్ / కరాచి / స్నాక్టాక్ (మైసూర్ పాక్ / గులాబ్ జామున్ / రసగుల్లా / సోన్ పాప్డి / లడ్డూ) 200 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹130 మొదలుకుని
పెర్ఫ్యూమ్ గిఫ్ట్ ప్యాక్స్ 76 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
ఎమ్ఆర్‌పి ₹649 మొదలుకుని
స్మార్ట్ ప్రైస్ ₹325 మొదలుకుని
ఫ్లాట్ 50%
పండుగ వేడుకలు అందంగా చేసుకోండి
Gala
బ్రూమ్ శ్రేణి
స్మార్ట్ ప్రైస్ ₹69 మొదలుకుని
ఎమ్ఆర్‌పి ₹115 మొదలుకుని
₹1295 విలువ గల ₹149
₹1500 - ₹2999 మరియు విలువ గల ఫ్యాషన్ కొనుగోలుపై
₹2895 విలువగల ₹499
₹3000 - ₹4999 విలువ గల ఫ్యాషన్ కొనుగోలుపై
₹10000 ₹799
₹5000 అంతకు మించిన విలువ గల ఫ్యాషన్ కొనుగోలుపై
ఇప్పుడు తెరవబడింది
మాదాపూర్: ఇనార్బిట్ మాల్, ఎల్1.
SMART BAZAAR
వద్ద కూడా లభ్యం
fresh Signature
SMART SUPERSTORE
Jio Mart
10% INSTANT DISCOUNT*
SBI card
#Min. Trxn.: ₹3,000; Max. Discount: ₹500 per Trxn. per credit card; Validity: 18 Oct - 24 Oct 2025. T&C Apply.
BAJAJ FINSERV
Get ₹1500 GV on shopping of ₹5000 or more with Bajaj Easy EMI.

పాలలో దాగి ఉన్న వెన్నలా, ప్రతి జీవిలోనూ చైతన్యం ఉంటుంది. దానిని మనస్సు అనే కవ్వంతో నిరంతరం చిలుకుతూనే ఉండాలి.
– అమృతబిందోపనిషత్తు



సాక్షి
శనివారం, 18 అక్టోబర్ 2025

# ట్రంప్ అయోమయావస్థ!

తన పదవీకాలం చివరి దశలో అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ తడబాటుకు లోనయి ఏదేదో మాట్లాడి దేశాన్ని ఇరకాటంలో పెట్టేవారు. అయినా తమ అధ్యక్ష అభ్యర్థిగా డెమాక్రటిక్ పార్టీ ఆయన్నే ఎంచుకోవటం, చివరికి ఆయన పోటీ నుంచి తప్పుకోవటం వంటి పరిణామాలు ఆ పార్టీ ఓటమికి గల పలు కారణాల్లో ఒకటని అంటారు. ప్రస్తుత అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధికారం దక్కి ఏడాది కాకుండానే ఆ కోవలో చేరిపోయారు. ఏం మాట్లాడుతున్నారో, ఎందుకు మాట్లాడుతున్నారో అవగాహన లేకుండా తనకు తోచినట్టు మాట్లాడుతున్నారు. రష్యా వద్ద ముడిచమురు కొనుగోలు ఆపేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్టు ఆయన గురువారం ప్రకటించారు. దీన్ని నేరుగా ఖండించటానికి మన దేశం మొహమాట పడినట్టుంది. అందుకే ఆ వెంటనే మీడియా సమావేశంలో మాట్లాడిన మన విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ట్రంప్ వ్యాఖ్యల్ని ఖండించకుండా అధినేతలిద్దరి మధ్యా ఫోన్ సంభాషణలు జరిగినట్టు సమాచారం లేదని తెలిపి ఊరుకున్నారు. ముడి చమురు విషయంలో మాత్రమే కాదు, వేరే అంశాల్లోనూ ట్రంప్ అయోమయంగా మాట్లాడారు. ఇరాన్, పాకిస్తాన్‌లు రెండూ ఘర్షణలకు దిగినప్పుడు 200 శాతం సుంకాలు విధిస్తానని ఇద్దరినీ హెచ్చరించానని, దాంతో వారు దారికొచ్చి తన ఆదేశాన్ని శిరసావహించారని ఆయన చెప్పుకున్నారు. ఆయన భారత్ బదులు ఇరాన్ అన్నారని అందరికీ అర్థమైంది. అలాంటి వారందరికీ ట్రంప్ ఇప్పటికే పలుమార్లు చేసిన ఈ మాదిరి ప్రకటనల్ని భారత్ ఖండించిందని కూడా తెలుసు. కానీ తెలియనిది లేదా మరిచిపోతున్నది ట్రంప్ మాత్రమే.

అమలులో ఉన్న అంతర్జాతీయ నియమాల ప్రకారం ఒక దేశం నుంచి దిగుమతులు ఆపేయాలని, దానితో సంబంధ బాంధవ్యాలు నెరపరాదని ఆదేశించగల అధికారం భద్రతా మండలికి మాత్రమే ఉంటుంది. కానీ దురదృష్టమేమంటే కొన్ని దశాబ్దాలుగా అమెరికా ఆ అధికారాన్ని కబ్జా చేసి తాను గీసిన బరి దాటకూడదని దబాయిస్తోంది. రష్యా మన దేశానికి చిరకాల మిత్ర దేశం. సైనిక, వాణిజ్య, ఆర్థిక రంగాల్లో ఆ దేశంతో మన అనుబంధం దశాబ్దాల నాటిది. ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక ఆ దేశం నుంచి చమురు కొనుగోలు నిలిపేయాలంటూ బైడెన్ హయాం నుంచే అమెరికా ఒత్తిళ్లు తీసుకురావటం మొదలెట్టింది. తన ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలకు ఎంతో అవసరమైన ఇంధన అవసరాలకు అనుగుణంగా మాత్రమే నిర్ణయం తీసుకుంటామని మన దేశం పలుమార్లు చెప్పింది. అందుకు ఆగ్రహించి గత ఆగస్టులో అప్పటికే విధించిన 25 శాతం సుంకాలకు తోడు ట్రంప్ మరో 25 అదనంగా వడ్డించారు.

ఈ ఏడాది తొమ్మిది నెలల్లో మన దేశం రష్యా నుంచి సగటున రోజుకు 17 లక్షల బ్యారెళ్ల ముడి చమురు దిగుమతి చేసుకుంది. ఈ నెల మొదటినుంచి అది మరో లక్ష బ్యారెళ్ల మేర పెరిగింది. నిజానికి ఇందులో ప్రైవేటు సంస్థల వాటా అధికం. అమెరికా ఒత్తిళ్లను మన ప్రభుత్వం వ్యతిరేకిస్తున్నా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు మొన్న జనవరితో పోలిస్తే చమురు దిగుమతుల్ని తగ్గించాయి. జనవరిలో కోటి బ్యారెళ్లకు పైగా దిగుమతి చేసుకున్న ఆ సంస్థ గత నెల 46 లక్షల బ్యారెళ్లకు కుదించింది. పోనీ రష్యా బదులు వెనిజులా లేదా ఇరాన్ నుంచి అదనపు చమురు కొనుగోలుకు మన దేశం ప్రతిపాదించింది. కానీ దానికి సైతం జవాబు లేదు. కనీసం అమెరికాతో ఉన్న 4,270 కోట్ల డాలర్ల వాణిజ్య లోటు భర్తీ కోసం వంటగ్యాస్ దిగుమతికి ప్రతిపాదించింది. అందుకు కూడా సానుకూల స్పందన లేదు. ప్రస్తుతం అమెరికా నుంచి మన వార్షిక చమురు కొనుగోళ్ల విలువ 1,300 కోట్ల డాలర్లు.

భారత్–అమెరికాల మధ్య వాణిజ్య చర్చలు ప్రారంభం కావటానికి ముందు కొన్ని అంశాలను చక్కదిద్దాలని, ఆ దిశగా కృషి చేస్తున్నామని గత నెలలో విదేశాంగ మంత్రి జైశంకర్ చెప్పారు. కేంద్ర వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ప్రస్తుతం ఆ పని మీదే అమెరికాలో ఉన్నారు. ఆ విషయంలో ఒక అవగాహన ఏర్పడేందుకు అమెరికా తన వంతు ప్రయత్నించాల్సి ఉండగా ట్రంప్ తన అర్థరహిత ప్రకటనలతో సమస్యను మరింత జటిలం చేస్తున్నారు. ఇది సరికాదు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.ద్వాదశి ప.1.07 వరకు తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** పుబ్బ సా.5.21 వరకు తదుపరి ఉత్తర, **వర్జ్యం:** రా.12.55నుండి 2.36 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.48 నుండి 7.29 వరకు, **అమృత ఘడియలు:** ఉ.10.44 నుండి 12.31 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.34
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

## సోషల్ టాక్

### వదులుకోవద్దు!



మీరు ఒకదాని కోసం మరొకటి వదులుకుంటే, దీర్ఘకాలంలో చాలా చింతిస్తారు. కెరీర్, కుటుంబం... ఈ రెండూ జీవితంలో ముఖ్యమైన భాగాలు. కెరీర్ విషయానికొస్తే, బిడ్డను కనడం ఎల్లప్పుడూ అసౌకర్యంగానే ఉంటుంది. కానీ బిడ్డ ఆలనా పాలనా కూడా మీ కెరీర్‌కు శక్తిని ఇస్తుంది.

– మాన్సి కస్లివాల్, ఖగోళ భౌతిక శాస్త్రవేత్త

### అనుకున్న పని



మీరు చేయగలిగిన పనిని సక్రమంగా పూర్తి చేసి, దాని వల్ల మీరు సంతోషంగా ఉన్నట్లయితే జీవితంలో మీరు చాలామంది కంటే మెరుగ్గా ఉన్నారని గుర్తించండి. అనుకున్న పని అనుకున్నట్లుగా చేయగలగటం కూడా ఒక గొప్ప విజయాన్ని సాధించటమే!

– లియొనార్డో డికాప్రియో, హాలీవుడ్ నటుడు

### పనే పెద్ద హోదా



ఒక అత్యుత్తమ స్థానంలో అత్యున్నత హోదాలో ఉండటం అన్నది గొప్ప గౌరవం. అదే సమయంలో అది ఒక పెద్ద బాధ్యత కూడా! అంకిత భావంతో పని చెయ్యండి. కిందివారితో ఆదరణగా ఉండండి. మీ పని తీరు మీ హోదా కన్నా అత్యుత్తమైనదిగా ఉండాలి.

– మిథున్ మన్హాస్, బీసీసీఐ అధ్యక్షుడు


### మారి చూడండి!



'మార్పు' ఎవరికీ ఇష్టంగా ఉండదు. జీవితంలో ఎదురయ్యే మార్పులను తప్పించుకోవాలనే అందరూ చూస్తారు. ఎందుకంటే, ఒకేలా ఉండిపోవటంలోని సౌఖ్యానికి మన మనసు అలవాటు పడి ఉంటుంది. కానీ మారిన జీవితం ఇంతకన్నా మెరుగ్గా ఉండొచ్చేమో కదా!

– రాణీ ముఖర్జీ, నటి

### విజేత మాట



విజేత సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించాలి. అవినీతి, వివక్షపై ప్రజల్లో చైతన్యం తేవాలి. అజ్ఞానాలను తొలగించాలి. రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక కుట్రలను ప్రజలకు అర్థం చేయించాలి. విశ్వం విజేత మాటే వింటుంది.

– అయతుల్లా ఖొమేనీ, ఇరాన్ సుప్రీం లీడర్

### శక్తిని నింపేవాళ్లు



విదేశాలలో భారతీయ మహిళగా కనిపించటం నన్ను ఆహ్లాదపరిచే విషయం. లండన్‌లో నన్ను చూసి గుర్తుపట్టి, దగ్గరకు వచ్చి, ఆత్మీయంగా పలకరించే వారిలో 90 శాతం మంది భారతీయులే! నన్ను చూడగానే వాళ్లు ఉత్తేజంగా నవ్వటం నాలో శక్తిని నింపుతుంది.

– సిమోన్ ఆష్లే (అశ్వినీ పిళ్లై), బ్రిటిష్ నటి

# ఎట్లున్న ఎవుసం ఎట్లయిపాయె!

అభిప్రాయం



తన్నీరు హరీశ్ రావు

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ వ్యవసాయానికి తీరని తెగులు సోకింది. రైతాంగం సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నది. మళ్ళా కరెంటు కష్టాలు, ఎరువుల కోసం లైన్లు మొదలైనాయి. రైతుబంధు పైసలకు 'నాగా' పెడుతున్నారని, కొనుగోలు సరిగా చెయ్యక కష్టపెడుతున్నారని కన్నీరు పెడుతున్నారు. కైలాసంలో పెద్దపాము మింగినట్టు తెలంగాణ వ్యవసాయం పరిస్థితి మళ్ళా మొదటి కొచ్చిందనీ, ఎన్నికల సభల్లో ఆనాడు కేసీఆర్ చేసిన హెచ్చరికలన్నీ నిజమౌతున్నాయనీ రైతులు విచారపడుతున్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం, ప్రతి ముఖంపై సంతోషం అనే ఉదాత్త ఆశయంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్ల పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలనూ ఆదుకున్నారు. సమైక్య రాష్ట్రంలో దండుగ అని ఈసడించుకున్న వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. బతుకు దెరువుగా పనికి రాదనుకున్న వ్యవసాయంలో బతుకు మాత్రమే కాదు, భవిష్యత్తు కూడా ఉందనే భరోసాని కేసీఆర్ కలిగించారు. సమైక్య రాష్ట్రంలో మొదలైన అన్నదాతల ఆత్మహత్యల పరంపరకు కేసీఆర్ మానవీయమైన పరిపాలన అడ్డుకట్ట వేసింది. ఇటీవల జాతీయ నేర గణాంక శాఖ విడుదల చేసిన నివేదికే దానికి సాక్ష్యం.

2014వ సంవత్సరం తెలంగాణలో ఆత్మహత్య చేసుకున్న రైతుల సంఖ్య 1,347. ఈ సంఖ్య 2023వ సంవత్సరం నాటికి 56కు పడిపోయింది. అంటే అన్నదాతల ఆత్మహత్యలు 95.84% మేరకు తగ్గి పోయినాయి. జీవనేచ్ఛనే వదులుకున్న రైతులలో ఆశలను పునరుజ్జీవింప చేసిన మానవీయ పరిపాలన పదేళ్ల బీఆర్ఎస్ పరిపాలన. 22 నెలల కాంగ్రెస్ పాలనలో ఆత్మహత్యల శాతం మళ్లా పెరుగుతూ ఉండటం ఆందోళన కలిగిస్తున్నది.

### యూరియా కొరత... రైతన్నల ఎత!

ఆనాటి రోజులు తిరిగి తెస్తామని చెప్పిన తన వాగ్దానాన్ని నిలబెట్టుకోవడంలో సీఎం రేవంత్ రెడ్డి కృతకృత్యుడయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలోలాగా రైతులు యూరియా కోసం బారులు తీరాల్సిన పరిస్థితిని తేగలిగారు. రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు లేక మందుబస్తాలకు కరువొచ్చింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సీజన్ మొదలవక ముందే అవసరమయ్యే దానికన్నా ఎక్కువగా యూరియా నిల్వలు ఉండేలా జాగ్రత్త పడేది. దీంతో రైతులకు సకాలంలో యూరియా సరఫరా జరిగిపోయేది.

బఫర్ స్టాక్ అటుంచి, కనీస నిల్వలు ఉండేలా కూడా చూసుకోలేదు ఈ కాంగ్రెస్ సర్కార్. సీజన్ దగ్గర పడుతున్నా యూరియా నిల్వలపై అంచనా లేదు, అవసరాలపై సమీక్ష లేదు. రేవంత్ సర్కారు నిర్లక్ష్యం వల్ల రైతులు పొలం పనులు మానుకొని యూరియా కేంద్రాల దగ్గర రోజుల తరబడి క్యూ లైన్లలో నిలుచున్నారు. చంటి బిడ్డలను ఎత్తుకొని మహిళలు, బడి మానుకొని చిన్న పిల్లలు సైతం గంటలు గంటలు లైన్లో నిలబడి అలమటించారు. ఆధార్ కార్డులు, పాస్ బుక్కులు, చెప్పులు లైన్లో పెట్టి రాత్రింబవళ్లు యూరియా కేంద్రాల దగ్గర కాపలా కాస్తే లక్కీ లాటరీ తగిలినట్టు తమ వంతు వచ్చింది. అయినా అరకొరగానే తప్ప అవసరానికి తగినంత యూరియా దొరకలేదు.



◆ నూటికి 80 శాతం మంది రైతులు పండించేవి దొడ్డు రకం వడ్లే అయినప్పుడు బోనస్ సన్నాలకే ఇస్తామనడం కాంగ్రెస్ మార్కు క్రూర పరిహాసం. పోనీ ఆ సన్న వడ్లకైనా సక్రమంగా చెల్లిస్తున్నారా అంటే దానికీ దిక్కు లేదు. యాసంగి సీజన్‌లో కొన్న వడ్లకు చెల్లించాల్సిన బకాయిలు రూ. 1,300 కోట్లు ఇప్పటికీ చెల్లించలేదు.

### భరోసా లేని రైతు భరోసా!

'రైతు బంధు'తో కేసీఆర్ ఎకరానికి పది వేలే పెట్టుబడి సాయంగా ఇస్తున్నారు, మేము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రైతు భరోసా పేరిట ఎకరానికి ఏటా రూ. 15,000 ఇస్తామని కాంగ్రెస్ నాయకులు ఎన్నికలకు ముందు డంబాలు పలికారు. ఇది ఆచరణ సాధ్యమా అని ఎవరైనా ప్రశ్నిస్తే 'మాది వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ, మాకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మీద కచ్చితమైన అంచనా ఉంది. ఆదాయం పెంచే సమర్థత ఉంది. సంపద పెంచుతాం ప్రజలకు పంచుతా'మని డైలాగులు దంచారు. గద్దెనెక్కిన తర్వాత మాత్రం పంచడం మాట అటుంచి, హామీల గురించి అడిగిన వాళ్ళను దంచే కార్యక్రమం పెట్టుకున్నారు. 'రైతు భరోసా' కింద రైతులకు ఇవ్వవలసిన డబ్బును ఒక సీజన్‌లో పూర్తిగా ఎగ్గొట్టారు, మరొక సీజన్‌లో పాక్షికంగా చెల్లించారు. నాట్ల సమయంలో ఇవ్వాల్సిన 'రైతు భరోసా'ను ఓట్ల సమయంలో ఇచ్చారు. పైకం పెంపుదల 15 వేలు కాకుండా, 12 వేలకు పరిమితం చేశారు. 'రైతు భరోసా' ప్రయోజనాన్ని కౌలు రైతులకు కూడా వర్తింపజేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడా ఊసే ఎత్తడం లేదు.

### అందని ద్రాక్షగా బోనస్...

కాంగ్రెస్ న్యాయంగానైతే అన్ని రకాల పంటలకూ మద్దతు ధరతో పాటు అదనంగా రూ. 500 బోనస్ చెల్లించాలి. అధికారం చేజిక్కిన తర్వాత, కేవలం సన్న వడ్లకే బోనస్ ఇస్తామని చెప్పి పచ్చి దగా చేసింది. నూటికి 80 శాతం మంది రైతులు పండించేవి దొడ్డు రకం వడ్లే అయినప్పుడు బోనస్ సన్నాలకే ఇస్తామనడం కాంగ్రెస్ మార్కు క్రూర పరిహాసం. పోనీ ఆ సన్న వడ్లకైనా సక్రమంగా చెల్లిస్తున్నారా అంటే దానికీ దిక్కు లేదు. యాసంగి సీజన్‌లో కొన్న వడ్లకు చెల్లించాల్సిన బకాయిలు రూ. 1,300 కోట్లు ఇప్పటికీ చెల్లించలేదు. ఇప్పుడు వానాకాలం పంట వడ్లు వచ్చేస్తున్నాయి. పాత బకాయిలకు దిక్కు లేకపోతే కొత్త వాటికి బోనస్ చెల్లిస్తారో లేదో తెలియదు.

### అరకొరగా రుణమాఫీ...

రెండు లక్షల రూపాయల రుణమాఫీ వంద రోజుల్లో చేస్తామని ఊదరగొట్టిన సీఎం చివరకు ఉసూరుమనిపించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు ప్రతి దేవుడి మీద ఒట్టు పెట్టి రుణమాఫీ చేసి తీరుతామని జబ్బలు చరిచారు. తీరా 40 శాతం రైతులకు మాత్రమే చేసి చేతులు దులుపుకున్నారు.బ్యాంకు అప్పు తీరని రైతుల బాధలు వినండీ అన్నందుకు ముఖ్యమంత్రి నా పైన అసభ్యమైన భాషలో విరుచుకుపడ్డారు. నా ఎత్తు, పొడుగు మీద సైతం వెకిలి వ్యాఖ్యలు చేసి వికృతానందం పొందారు.

పార్లమెంటు ఎన్నికలకు ముందు ప్రతీ దేవుడిపై ఒట్టు పెట్టి మాట తప్పిన రేవంతు పాపం, రాష్ట్రానికి శాపం కావొద్దని యాదగిరి నరసింహ స్వామిని వేడుకున్నందుకు నా మీద, నా వెంట వచ్చిన వారి మీద నానా రకాల కేసులు బనాయించారు.

రాష్ట్రంలో లక్షలాది మంది రైతులకు ఇప్పటికీ రుణమాఫీ జరగలేదన్నది దాచేస్తే దాగని సత్యం. రెండు లక్షలకు పైబడి రుణం ఉన్న వాళ్లకైతే ఆ పై మొత్తం చెల్లిస్తే మిగతా రుణం మాఫీ చేస్తామని ఆశ చూపారు. వారది నమ్మి పాపం అప్పో సప్పో చేసి, ఆ పై మొత్తం చెల్లిస్తే చేదు అనుభవమే మిగిలింది. 'అన్నవస్త్రాలకు పోతే ఉన్న వస్త్రాలు ఊడిపోయిన' చందంగా ఉన్న రుణం అట్లే ఉండగా, కొత్త రుణం వచ్చి మీద పడింది. దానిపైన పెరిగిన వడ్డీ నడ్డి విరుస్తున్నది.

కాంగ్రెస్ ఇంటింటికీ పంచిన గ్యారంటీ కార్డులలో పేర్కొన్న హామీలను నెరవేర్చక పోవడం వల్ల ఈ 22 నెలల కాలంలో బాకీ పడ్డ డబ్బు మొత్తాన్ని ప్రజలకు గుర్తు చేస్తూ, బీఆర్ఎస్ ఇంటింటికీ 'కాంగ్రెస్ బాకీ కార్డుల'ను పంచుతున్నది. దీనిపై రాష్ట్రంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. ప్రభుత్వం హామీలు అమలు చేయక పోతే, తెలంగాణ గడ్డ మీద మరో రైతాంగ పోరాటం పురుడు పోసుకుంటుంది. ఇది చరిత్ర చెబుతున్న సత్యం.

వ్యాసకర్త మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే

# యుద్ధ దుర్మార్గానికి ప్రతీక

టైమ్ మిషన్

రెండో ప్రపంచ యుద్ధం సమయంలో దక్షిణాసియా దేశాలను జపాన్ ఆక్రమించిన తరువాత, బర్మాలోని తమ సైన్యాలకు కావలసిన ఆహార, ఆయుధ, వస్తు సరఫరాలకు సముద్ర మార్గంలో అంతరాయం కలిగింది. సముద్ర మార్గాలు మిత్ర దేశాల (అమెరికా, ఫ్రాన్స్, ఇంగ్లండ్ తదితర దేశాల) దాడులకు గురవుతూ ఉండటమే ఇందుకు కారణం. దీంతో థాయిలాండ్, బర్మాను కలుపుతూ ఒక రైల్వే మార్గాన్ని నిర్మించాలని జపాన్ నిర్ణయించింది. ఫలితంగా ప్రపంచ చరిత్రలో 'డెత్ రైల్వే లైన్'గా పేరుగాంచిన దాదాపు 420 కి.మీ. పొడవైన రైలు మార్గానికి తెరలేచింది.

జపాన్ సైన్య పర్యవేక్షణలో 60,000 మంది మిత్రదేశాల యుద్ధ ఖైదీలు, 2,50,000 మంది ఆసియా కార్మికులు ఈ నిర్మాణంలో పాల్గొన్నారు. 1942 జూన్‌లో 'థాయ్–బర్మా రైల్వే' లైన్ నిర్మాణం ప్రారంభమైంది. కాంచనబురి (థాయ్‌లాండ్) వైపు నుంచి కొందరూ, థాన్బ్యూజాయత్ (బర్మా) వైపు నుంచి కొందరూ రైలు మార్గాన్ని ఎదురెదురుగా నిర్మించుకుంటూ వచ్చారు. రోజుకు 16–18 గంటలు కఠినమైన అడవుల్లో వారితో పని చేయించారు. ఆహారం తక్కువగా ఉండేది. అన్నం, ఉప్పు మాత్రమే తినడానికి ఉండేది. 'పని చేయకుంటే చావాల్సిందే' అన్న స్లోగన్‌తో జపాన్ సైనికులు క్రూరంగా వ్యవహరించారు. 1943 అక్టోబర్ 17న రెండు వైపుల నుంచి నిర్మితమవుతూ వస్తున్న రైల్వే లైన్ కలుసుకుంది. 25వ తేదీ నాటికి అన్ని పనులూ పూర్తయ్యి ఉపయోగానికి సిద్ధమయ్యింది.



రైల్వే లైన్ పనుల్లో మిత్ర దేశాల యుద్ధ ఖైదీలు



### బాధలు వర్ణనాతీతం

రైల్వే లైన్ నిర్మాణ సమయంలో మలేరియా, కలరా, డయేరియా, బెరిబెరి వంటి వ్యాధులు వ్యాపించాయి. వైద్య సహాయం లేకపోవడం వల్ల అనేక మంది మరణించారు. సుమారు 13,000 యుద్ధ ఖైదీలు, లక్ష మంది ఆసియా కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రాంతంలో రాతి కొండను చేతి పరికరాలతోనే తొలిచి రైల్వే మార్గం నిర్మించారు. రాత్రి వేళల్లో దీపాల వెలుతురులో కృశించిన శరీరాలతో కార్మికులు పనిచేసే దృశ్యం నరకాగ్నిని తలపించేది. జపాన్ అధికారులు, కొరియన్ గార్డులు చిన్న తప్పుకే తీవ్రంగా హింసించేవారు.

యుద్ధానంతరం యుద్ధ ఖైదీల బాధలను గుర్తించి చరిత్రలో రికార్డు చేశారు కానీ, స్థానిక ఆసియా కార్మికుల దుఃస్థితిని మాత్రం పట్టించుకోలేదు. వీరిలో చాలా మందిని మోసం చేసి పనికి తీసుకెళ్లారు. కుటుంబాలు విడిపోయాయి. మహిళలు, పిల్లలు కూడా ప్రాణాలు కోల్పోయారు.

1945లో మిత్రదేశాల బాంబు దాడులతో రైల్వే లైన్ చాలా వరకు నాశనం అయింది. కానీ కొన్ని భాగాలు నేటికీ థాయిలాండ్‌లో ఉన్నాయి. హింసకు పాల్పడిన కొందరు జపాన్ అధికారులు యుద్ధ నేరాలకుగాను శిక్ష అనుభవించారు. కాంచనబురి, థాన్బ్యూజాయత్‌లలో ఉన్న ఆ కాలపు యుద్ధ శ్మశానాలు, 'హెల్‌ఫైర్ పాస్' మ్యూజియం నేటికీ ఆ బాధలకు సాక్ష్యాలుగా నిలిచి ఉన్నాయి. ఫ్రెంచ్ రచయిత పియెర్ బూల్ 1952లో 'క్వాయి నదిపై వంతెన' పేరుతో రాసిన నవల, దాని ఆధారంగా 1957లో వచ్చిన సినిమా ప్రపంచ ప్రఖ్యాతి పొందాయి. ◆

# యుగకవి శేషేంద్ర

ఇన్ బాక్స్

సర్వ జన హితమే సాహిత్య అభిమతమనీ, దానికి సరళత్వం, సంక్షిప్తత ఎంతో ప్రధానమనీ స్పష్టంగా గుర్తించి ఆ దిశలోనే మహోన్నత రచనలందించి, జనాదరణ పొందిన మహాకవి డా॥ గుంటూరు శేషేంద్ర శర్మ. సాహిత్యం జన సామాన్యానికి అత్యంత చేరువ కావాలని భావించిన ఈ యుగపు కవి ఆయన. వచన కవితా మహోద్యమంలో చైతన్యవంతంగా సాగిన కవిగా తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి పొందారు. 'కవిసేన మేనిఫెస్టో'ను అందించి కవి నాయకుడై కవితాలోకాన్ని నడిపించారు.

1927 అక్టోబర్ 20న నెల్లూరు జిల్లాలోని నాగరాజుపాడులో శేషేంద్ర జన్మించారు. మొదట్లో కవిత్వంపై దృష్టి పెట్టిన శేషేంద్ర క్రమంగా ప్రామాణికమైన సాహిత్య విమర్శలను రాశారు. పర్షియన్ ఇతిహాసం 'షాహనామా' ఆధారంగా మాథ్యూ ఆర్నాల్డ్ రాసిన 'సొహ్రాబ్ అండ్ రుస్తుం'కు శేషేంద్ర చేసిన అనువాదం 1952లో మొదటి ముద్రణగా వెలువడి ఆయనకు గొప్ప పేరు తెచ్చింది. 1972లో శేషేంద్ర తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో మొదటి గద్య పద్యాల సంకలనం 'శేషజ్యోత్స్న'ను వెలువరించగా ఆ గ్రంథం తరువాత హిందీ, ఉర్దూ భాషలలోకి కూడా అనువదితమైంది.



డా॥ గుంటూరు శేషేంద్ర శర్మ

శేషేంద్ర మరొక గొప్ప రచన 'నా దేశం–నా ప్రజలు' ఆయనను జాతీయ అత్యుత్తమ కవిగా నిలిపింది. సాహిత్యంలో నోబెల్ బహుమతికి రవీంద్రనాథ్ టాగూర్ తరువాత 2004లో శేషేంద్ర పేరును ప్రతిపాదించడానికి ఈ గ్రంథం ఎంతో తోడ్పడింది. రామాయణంపై రాసిన వ్యాఖ్యానాల 'షోడశి' వంటి గ్రంథాలు సాహిత్య విమర్శలో శేషేంద్రను ఉన్నతంగా నిలిపాయి. 'కాలరేఖ' ఆయన కవితా పటిమకు నిదర్శనంగా నిలిచిన మహోన్నత కావ్యం.


1994లో 'కాలరేఖ' రచనకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. అదే ఏడాది తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డి.లిట్‌ను ప్రదానం చేసింది. ఏపీ అందించిన 'హంస', మధ్యప్రదేశ్ వారి 'కాళిదాస్ సమ్మాన్'తో సహా అనేక అవార్డులను శేషేంద్ర అందుకున్నారు. 'నిదురించే తోటలోకి పాట ఒకటి వచ్చింది' పల్లవితో 'ముత్యాల ముగ్గు' సినిమా కోసం ఆయన రాసిన పాట ఎంతగానో ప్రేక్షకాదరణ పొందింది. 2007 మే 30న హైద్రాబాద్‌లో కన్ను మూసిన శేషేంద్ర కాలజ్ఞుడైన కవి.

– డా॥ తిరునగరి శ్రీనివాస్ I సాహిత్య విశ్లేషకులు
(అక్టోబర్ 20న గుంటూరు శేషేంద్ర శర్మ జయంతి)

## 5జీ హ్యాండ్‌సెట్ల దూకుడు

డేటా పాయింట్

ప్రపంచ వ్యాప్తంగా మొత్తం స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో 5జీ హ్యాండ్‌సెట్ల వాటా ఏటా పెరుగుతోంది. మన దేశంలో 2024 మొదటి 6 నెలలతో పోలిస్తే... ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో వీటి ఎగుమతులు 13 శాతం పెరిగాయి.




# వర్తమానమే వాస్తవం

జ్యోతిర్మయం

జరిగిపోయిన సమయాన్ని మనం తిరిగి పొందలేము. భవిష్యత్తు ఎలా ఉంటుందో ఊహించలేము. అంటే మన దగ్గర ఉన్నదంతా వర్తమానమే. దానిని మనం సద్వినియోగం చేసుకోవాలి.

ఒక రోజు గౌతమ బుద్ధుడు తన శిష్యులను 'మానవుని జీవిత కాలం ఎంత?' అని అడిగాడు. ఒక శిష్యుడు వెంటనే లేచి, 'వంద సంవత్సరాలు' అన్నాడు. బుద్ధుడు చిరునవ్వుతో 'తప్పు' అన్నాడు.

శిష్యులందరూ ఆశ్చర్యపోయారు. 'మానవుని జీవితం వంద సంవత్సరాలు కాదా? మరి ఎంతకాలం' అని గుసగుసలాడారు. కాసేపటికి, మరొక శిష్యుడు లేచి 'డెబ్బై సంవత్సరాలు' అన్నాడు. ఇలా అనేక సమాధానాలు వచ్చాయి.

అప్పుడు బుద్ధుడు 'మానవుని జీవితం ఒక 'శ్వాస సమయం..!' అన్నాడు. శిష్యులందరూ ఆశ్చర్యపోయారు. తమ ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ, 'శ్వాస సమయం ఒక క్షణమా మనిషి జీవించేది' అని అన్నారు.

'ఇది నిజం. శ్వాస సమయం ఒక క్షణం. కానీ, జీవితం అంతా శ్వాస గురించే. అందుకే మనం ప్రతి క్షణం జీవించాలి. చాలా మంది గతంలోని ఆనందంలోనో, విచారంలోనో జీవిస్తారు. చాలా మందికి భవిష్యత్తు అంటే భయం లేదా ఆశ. నిన్న ముగిసిపోయింది. ఇది గతించిన సమయం. అదే విధంగా, రేపు అనేది ఎవరికీ తెలియనిది. కాబట్టి, దాని కోసం సమయాన్ని వృథా చేయడం అవివేకం. కనుక వర్తమానం మాత్రమే మన నియంత్రణలో ఉంది. మనం ప్రతి క్షణం దానిని పూర్తిగా జీవించాలి' అని బుద్ధుడు వివరించాడు.

అవును, మనందరికీ ఉన్నది వర్తమానం మాత్రమే! గతాన్ని విచారంతో చూడటం, భవిష్యత్తును భయంతో చూడటం మన నుంచి వర్తమానాన్ని దోచుకుంటాయి. కాబట్టి, మన చేతుల్లో ఉన్న వర్తమానాన్ని మన జీవితానికి అనుగుణంగా ఉపయోగించుకోవడమే ప్రధానం.

– యామిజాల జగదీశ్


ధనత్రయోదశి డీల్స్
చూసి మానుషీ ఆనందంతో గంతులు వేసింది
కుర్తా 3 పీస్ సెట్ ₹1399
మానుషీ ఛిల్లర్
నటి, మిస్ వరల్డ్
ధన్‌తేరస్ స్పెషల్
స్టీల్ ₹42+ బౌల్ ₹14+ టంబ్లర్ ₹46+
కంటైనర్ ₹46+ సాస్ ప్యాన్ & పతీలా ₹93+ చెంచా & ఫోర్క్ సెట్ ₹49+
tandem ఎలక్ట్రిక్ కెటిల్ 1.5ℓ MRP ₹1299 ₹458
Prestige ఎలక్ట్రిక్ కెటిల్ 1.5ℓ MRP ₹1445 ₹629
ఆదా చేయండి ₹816
స్టీల్ డిన్నర్ సెట్ 16 యూనిట్ MRP ₹1125 ₹562 ఆదా చేయండి ₹563
tandem కుక్‌వేర్ సెట్ స్టెయిన్‌లెస్ స్టీల్ 3 యూనిట్స్ గ్లాస్ లిడ్ తో MRP ₹3999 ₹1599 ఆదా చేయండి ₹2400
tandem ప్రెషర్ కుక్కర్ 3ℓ MRP ₹1124 ₹579 ఆదా చేయండి ₹545
Prestige ప్రెషర్ కుక్కర్ 3ℓ MRP ₹1335+ ₹979 ఆదా చేయండి ₹356
స్టీల్ లంచ్ బాక్స్ MRP ₹295 ₹140 ఆదా చేయండి ₹155
స్టీల్ వాటర్ బాటిల్ MRP ₹187/ ₹234
స్టీల్ హాట్ & కోల్డ్ ఫ్లాస్క్ 500ml, MRP ₹599 ₹399 1ℓ, MRP ₹899 ₹599
tandem మల్టీకుక్ కెటిల్ 1.2ℓ MRP ₹1799 ₹899 ఆదా చేయండి ₹900
BAJAJ స్టెయిన్‌లెస్ స్టీల్ 2 బర్నర్ గ్యాస్ స్టవ్ MRP ₹2959+ ₹1749 ఆదా చేయండి ₹1210
tandem 3 బర్నర్ గ్లాస్ టాప్ స్టవ్ MRP ₹5499 ₹1999 ఆదా చేయండి ₹3500
ఫుడ్ గిఫ్ట్ ప్యాక్
అదనపు డిస్కౌంట్:
20-39 పీసెస్ మీద 2% తగ్గింపు
40-99 పీసెస్ మీద 4% తగ్గింపు
100+ పీసెస్ మీద 6% తగ్గింపు
సోన్ పాపడీ 200g+ MRP ₹90+
లడ్డూ, రసగుల్లా, గులాబ్ జామూన్, పేఠా స్వీట్స్ 200g+ MRP ₹150+
కుకీస్/ గిఫ్ట్ ప్యాక్ 200g+ MRP ₹150+
కుకీస్/ గిఫ్ట్ ప్యాక్ 168g+ MRP ₹90+
గిఫ్ట్ ప్యాక్ 120g+ MRP ₹131+ 14% తగ్గింపు+GST ప్రయోజనాలు
చాకొలెట్ MRP ₹99+
బాదం 1kg ₹759
జీడిపప్పు 500g ₹449
గృహ అవసరాలు & ఉపకరణాలు
ల్యాప్‌టాప్ బ్యాక్‌ప్యాక్ ₹499+
గ్లాస్ టంబ్లర్ 6 యూనిట్ సెట్ MRP ₹350 ₹199
మెలమైన్ డిన్నర్ సెట్ 28 యూనిట్ MRP ₹999 ₹499 ఆదా చేయండి ₹500
మెలమైన్ డిన్నర్ సెట్ 40 యూనిట్ MRP ₹1299 ₹699 ఆదా చేయండి ₹600
100% కాటన్ బాత్ టవల్ MRP ₹349+
డోర్ మ్యాట్స్ MRP ₹169/ ₹199/ ₹299
ప్రీమియం జాక్వార్డ్ కర్టెన్స్, MRP ₹269+
డబుల్ బెడ్ షీట్ + 2 పిల్లో కవర్ MRP ₹649/ ₹749
ఫోల్డింగ్ మ్యాట్రెస్ MRP ₹999
సింగిల్ 1.4kg/ డబల్ 2.4kg బెడ్ మింక్ బ్లాంకెట్ MRP ₹1099 ₹799 MRP ₹1599 ₹1030
tandem ఎగ్ బాయిలర్ MRP ₹599 ₹299 ఆదా చేయండి ₹300
BAJAJ మిక్సర్ గ్రైండర్ 3 జార్ 750W MRP ₹5990 ₹3099 ఆదా చేయండి ₹2891
tandem 3 బర్నర్ గ్లాస్ టాప్ గ్యాస్ స్టవ్ + మిక్సర్ గ్రైండర్ 3 జార్ + ప్రెషర్ కుక్కర్ 3ℓ+ కుక్‌వేర్ సెట్ MRP ₹11965 ₹4999 ఆదా చేయండి ₹6966
tandem డ్రై ఐరన్ 1000W MRP ₹599 ₹329 ఆదా చేయండి ₹270
USHA డ్రై ఐరన్ 1000W MRP ₹900+ ₹579 ఆదా చేయండి ₹321
tandem శాండ్‌విచ్ మేకర్ MRP ₹1599 ₹749 ఆదా చేయండి ₹850
tandem మిక్సర్ గ్రైండర్ 2 జార్ 500W MRP ₹2499 ₹1099 ఆదా చేయండి ₹1400
BAJAJ మిక్సర్ గ్రైండర్ 3 జార్ 500W MRP ₹4150 ₹2099 ఆదా చేయండి ₹2051
tandem ఇన్‌ఫ్రారెడ్ కుక్‌టాప్ 2200W, MRP ₹4799 ₹1999 ఆదా చేయండి ₹2800
Prestige BAJAJ ఇన్‌ఫ్రారెడ్ కుక్‌టాప్ 2200W, MRP ₹4275 ₹2699 ఆదా చేయండి ₹1576
tandem 2 బర్నర్ గ్లాస్ టాప్ స్టవ్ MRP ₹3599 ₹1699 ఆదా చేయండి ₹1900
Prestige 3 బర్నర్ గ్లాస్ టాప్ స్టవ్ MRP ₹5395 ₹3649 ఆదా చేయండి ₹1746
safari VIP స్మాల్ డఫిల్ MRP ₹1750 ₹679 ఆదా చేయండి ₹1171
VIP safari అప్‌రైట్ ట్రాలీ బ్యాగ్ మీడియం సైజ్ MRP ₹8699+ ₹1999 ఆదా చేయండి ₹6700
safari అప్‌రైట్ ట్రాలీ బ్యాగ్ 2 యొక్క సెట్ (కేబిన్ + మీడియం సైజ్) MRP ₹12200+ ₹3499 ఆదా చేయండి ₹8701
అప్‌రైట్ ట్రాలీ బ్యాగ్ 3 యొక్క సెట్ (కేబిన్ + మీడియం + లార్జ్ సైజ్) MRP ₹20000+ ₹4999 ఆదా చేయండి ₹15011
PhonePe ₹300 వరకు క్యాష్‌బ్యాక్* పొందండి
2 పీసెస్ మెమరీ ఫోమ్ దిండు సెట్ ₹1999 విలువైనది ₹10000 షాపింగ్ పై
3 పీసెస్ యుటెన్సిల్స్ సెట్ ₹3999 విలువైనది ₹15000 షాపింగ్ పై
VISHAL MEGA MART

# ఇన్ఫోసిస్ అంటే బృహస్పతినా?

- సోషియో సర్వే వాళ్లకు అర్థంకాకుంటే నేనేం చేయాలి?
- ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులపై కర్ణాటక సీఎం ఫైర్
- ఆ సర్వే ప్రజలందరికీ సంబంధించిందని సిద్ధరామయ్య వివరణ

**బెంగళూరు:** కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య సర్వేపై ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు ఎన్ఆర్ నారాయణమూర్తి, ఆయన సతీమణి సుధామూర్తి చేసిన విమర్శలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తిప్పికొట్టారు. ఈ సర్వే వెనుకబడిన తరగతులకు సంబంధించినది కాదని పదేపదే చెప్పినా నారాయణమూర్తి దంపతులకు అర్థంకాలేదని ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఇది (సర్వే) వెనుకబడిన కులాలకు సంబంధించినదనే అపోహ కొందరిలో ఉంది. ఇది వెనుకబడిన కులాల సర్వే కాదు. దీని గురించి రాసేవాళ్లు ఏమైనా రాసుకోనీయండి. ఈ సర్వే ఎందుకోసమనే విషయాన్ని ప్రజలు అర్థం చేసుకుంటే చాలు. వాళ్లకు (నారాయణమూర్తి దంపతులకు) దీనిగురించి అర్థంకాకపోతే నేనేం చేయాలి?'అని ప్రశ్నించారు.

### వాళ్లు సర్వజ్ఞులా?

ప్రభుత్వ సర్వేపై నారాయణమూర్తి దంపతులు గురువారం విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. వారి ఇంటికి సర్వే కోసం వెళ్లిన ఎన్యూమరేటర్లకు వారు సహకరించలేదని తెలిసింది. తాము వెనుకబడిన వర్గానికి చెందినవారము కాదని, అందువల్ల సర్వేలో పాల్గొనబోమని చెప్పినట్లు వార్తలు వచ్చాయి. నారాయణమూర్తి దంపతుల తీరుపై సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు. 'ఇన్ఫోసిస్ అంటే ఏమైనా బృహస్పతినా (మేధావి)? ఇది వెనుకబడిన వర్గాల సర్వే కాదని, అందరి సర్వే అని మేం 20 సార్లు చెప్పాం. మా ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణానికి శక్తి పథకాన్ని ప్రారంభించింది. గృహలక్ష్మి కింద మహిళలకు నెలకు రూ.2,000 ఇస్తున్నాం. శక్తిపథకాన్ని వినియోగించుకుంటున్నవారిలో అగ్రకుల మహిళలు, దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నవారు లేరా? గృహలక్ష్మి పథకంలో అగ్రకుల మహిళలు లేరా? కేంద్ర ప్రభుత్వం కూడా కులగణన చేపడుతోంది. మూర్తి దంపతులు ఆ సర్వేలో ఏం చెప్తారు? బహుశా తప్పుడు సమాచారం ఇస్తారేమో! నేను మళ్లీమళ్లీ చెప్తున్న ఇది వెనుకబడిన వర్గాల సర్వే కాదు. ఏడు కోట్లమంది కన్నడిగులకు సంబంధించిన సర్వే'అని స్పష్టంచేశారు.


సిద్ధరామయ్య

### మార్పు అనేది విప్లవం కాదు

రాష్ట్రంలో సీఎం మార్పుపై కూడా ఆయన స్పందించారు. 'కొందరు నవంబర్ క్రాంతి అంటున్నారు. అది క్రాంతి కాదు. క్రాంతి అంటే విప్లవం. మార్పు అనేది విప్లవం కాదు'అని పేర్కొన్నారు. నాయకత్వ మార్పు అంశం సమయం సందర్భం లేకుండా చర్చకు వస్తోందని, దీనిని పెద్దగా పట్టించుకోవా ల్సిన అవసరం లేదని అన్నారు. ప్రభుత్వ భూములు, స్కూళ్లు, కాలేజీల్లో ఆరెస్సెస్ కార్యకలాపాలపై నిషేధం విధిస్తూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై సిద్ధరామయ్య వివరణ ఇచ్చారు. 'ఇది ఒక్క ఆర్ఎస్ఎస్‌కు సంబంధించిన నిర్ణయం కాదు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ సంస్థ కూడా కార్యకలాపాలు నిర్వహించటం కుదరదు. నిజానికి ఈ నిర్ణయం గతంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పుడు జగదీశ్ షెట్టర్ సర్కారు తీసుకుంది'అని పేర్కొన్నారు.

# సుప్రీం పేరుతో డిజిటల్ స్కాం

- రూ.కోటికి పైగా నష్టపోయిన వృద్ధ దంపతులు
- ఆందోళన వ్యక్తం చేసిన అత్యున్నత న్యాయస్థానం
- కేంద్ర ప్రభుత్వం, సీబీఐలకు నోటీసులు

**సాక్షి, న్యూఢిల్లీ:** అత్యున్నత న్యాయస్థానం పేరుతో ఉత్తుత్తి ఉత్తర్వులు చూపించి వృద్ధ దంపతుల నుంచి రూ.కోటికి పైగా డబ్బు కాజేసిన ఘటనపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇలా న్యాయస్థానాల పేర్లతో జరిగే డిజిటల్ నేరాలతో ప్రజల్లో నమ్మకాన్ని కోల్పోతామని పేర్కొంది. వ్యవస్థ గౌరవం దెబ్బతింటుందని తెలిపింది. ఇవి పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. డిజిటల్ స్కాంలపై తక్షణ ప్రతిస్పందన తెలపాలంటూ కేంద్ర ప్రభుత్వం, సీబీఐలకు శుక్రవారం జస్టిస్ సూర్యకాంత్, జాయ్‌మాల్య భాగ్చీల ధర్మాసనం నోటీసులు పంపింది. తమను డిజిటల్ అరెస్టు చేయాలంటూ సుప్రీంకోర్టు, హైకోర్టులు జారీ చేసిన ఆదేశాల ఫోర్జరీ పత్రాలను బాధిత పిటిషనర్లు చూపించారు. కేటుగాళ్లు సెప్టెంబర్ 3 నుంచి 16వ తేదీ మధ్యలో సీబీఐ, ఈడీ అధికారులుగా, జడ్జీలుగా నటిస్తూ ఆడియో, వీడియో కాల్స్ ద్వారా కోర్టు నకిలీ ఉత్తర్వులను చూపించి, అరెస్టు, నిఘా అంటూ బెదిరించారని బాధితులు కొన్ని పత్రాలను చూపారు. వీటితో పలు దఫాలుగా రూ.1.05 కోట్లు కాజేశారన్నారు. హరియాణాలోని అంబాలాకు చెందిన వృద్ధ దంపతులు ఇటీవల ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌కి ఈ మోసంపై సెప్టెంబర్ 21న లేఖ రాశారు. వృద్ధ దంపతులకు జరిగిన అన్యాయంపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. బాధితుల ఫిర్యాదుపై సుమోటోగా విచారణ చేపట్టింది.

### విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నమిది..

న్యాయస్థానాలు, దర్యాప్తు సంస్థల పేరిట సృష్టించిన ఫోర్జరీ పత్రాలతో న్యాయస్థానంపై ప్రజలకు గల విశ్వాసం దెబ్బతింటుందని ధర్మాసనం ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేసింది. జడ్జీల సంతకాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారి సంతకాలు, కోర్టు స్టాంప్ కూడా వేయడం తీవ్రమైన అంశమని పేర్కొంది. 'జడ్జీల సంతకాలతో సృష్టించిన ఫోర్జరీ పత్రాలు న్యాయస్థానంపై ప్రజల విశ్వాసంతోపాటు, వ్యవస్థ మూలాలు దెబ్బతింటాయి. ఇటువంటి క్రిమినల్ చర్యలను సాధారణ మోసం, సైబర్ క్రైమ్‌గా పరిగణించకూడదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. భవిష్యత్‌లో న్యాయస్థానాల పేర్లతో ప్రజలను మోసం చేసే ఘటనలను ఉపేక్షించరాదని పేర్కొంది. త్వరగా ప్రతిస్పందన తెలపాలంటూ కేంద్ర ప్రభుత్వం, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. ఈవ్యవహారంలో తాము భారత అటార్నీ జనరల్ సహాయం కోరుతున్నట్లు ధర్మాసనం పేర్కొంది. ఇది ఈ వృద్ధ దంపతుల సమస్య మాత్రమే కాదని, యావత్ దేశ ప్రజానీకం సమస్య అంటూ ఆందోళన వ్యక్తం చేసింది. కేవలం పోలీసులను దర్యాప్తు వేగవంతం చేయమని చెప్పి వదిలేయడానికి వీలు లేదని పేర్కొంది. కేవలం ఇదొక్క కేసు మాత్రమే కాదు. ఇటువంటి నేరాలు దేశంలోని వివిధ ప్రాంతాలలో చాలా జరిగినట్లు మీడియా కథనాలు చెబుతున్నాయి. ఇటువంటి విస్తృత ప్రభావం కలిగిన నేరపూరిత చర్యలను పూర్తిగా దర్యాప్తు జరిపి అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర, రాష్ట్ర అధికారులు సమన్వయంగా కృషి చేయాల్సిన అవసరముందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ కేసులో సాయం అందించాలని అటార్నీ జనరల్‌ను కోరిన ధర్మాసనం, వృద్ధ దంపతుల కేసు దర్యాప్తు పురోగతిని తెలియజేయాలంటూ హరియాణా ప్రభుత్వం, అంబాలా సైబర్ క్రైమ్ విభాగాలను ఆదేశించింది.

# ఇదీ నా గ్యారంటీ

## అతి త్వరలోనే నక్సలిజం నుంచి దేశానికి విముక్తి

### గత 75 గంటల్లో 303 మంది నక్సలైట్లు లొంగిపోయారు

ఇప్పుడు 3 జిల్లాల్లోనే బలంగా వామపక్ష తీవ్రవాదం ● ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో మోదీ

**న్యూఢిల్లీ:** మావోయిస్టుల బెడదను పూర్తిగా అంతం చేసే రోజు ఇక ఎంతోదూరంలో లేదని తాను గ్యారంటీ ఇస్తున్నానని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు అర్బన్ నక్సలైట్లను ప్రోత్సహించాయని ఆరోపించారు. నక్సలైట్లు విచ్చలవిడిగా హింసకు పాల్పడుతున్నా పట్టించుకోకుండా కళ్లు మూసుకున్నాయని ఆరోపించారు. గత 75 గంటల్లో 303 మంది నక్సలైట్లు ఆయుధాలు అప్పగించి లొంగిపోయారని తెలిపారు. వీరు సాధారణ నక్సలైట్లు కాదని, వారిపై లక్షలాది రూపాయల రివార్డు ఉందని చెప్పారు. నేడు దేశంలో కేవలం మూడు జిల్లాల్లోనే వామపక్ష తీవ్రవాద ప్రభావం బలంగా ఉందన్నారు. 11 ఏళ్ల క్రితం దేశవ్యాప్తంగా 125 జిల్లాల్లో మావోయిస్టుల ప్రభావం ఉండేదని వెల్లడించారు. ఆ సంఖ్య ఇప్పుడు 11కు పడిపోయిందన్నారు. వీటిలో మూడు జిల్లాల్లోనే వారి ఉనికి అధికంగా ఉందన్నారు. శుక్రవారం ఢిల్లీలో ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించారు. గత దశాబ్ద కాలంలో వేలాది మంది మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి లొంగిపోయారని పేర్కొన్నారు. గత 50–55 ఏళ్ల కాలంలో నక్సలైట్లు వేలాది మందిని హత్య చేశారని, పాఠశాలలు, ఆసుపత్రులను కూల్చివేశారని వివరించారు. మావోయిస్టు తీవ్రవాదం అనేది యువతకు జరిగిన అన్యాయమేనని అభివర్ణించారు. మొదటిసారిగా తన మనసులోని బాధను బయటకు వ్యక్తం చేస్తున్నానని చెప్పారు. నక్సలిజం, మావోయిస్టుల హింస నుంచి దేశం విముక్తి పొందే రోజు అతి దగ్గరలోనే ఉందని, ఇదీ నా గ్యారంటీ అని తేల్చిచెప్పారు. నక్సలిజం వల్ల నష్టపోయిన ప్రాంతాలు దాదాపు 60 ఏళ్ల తర్వాత మొదటిసారిగా దీపావళి పండుగ నిర్వహించుకోబోతున్నాయని ప్రధాని ఆనందం వ్యక్తం చేశారు.

### అభివృద్ధి, సంక్షేమం కోసం సంస్కరణలు

దేశ ప్రగతే లక్ష్యంగా సంస్కరణల విషయంలో తమ ప్రభుత్వం దృఢచిత్తంతో ముందుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. గత ప్రభుత్వాలు కేవలం కొన్ని అవసరాల రీత్యా సంస్కరణలు తీసుకొచ్చాయని అన్నారు. తమ ప్రభుత్వం మాత్రం పూర్తి అంకితభావం, బలమైన విశ్వాసంతో దేశ అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని సంస్కరణలు అమలు చేస్తోందని ఉద్ఘాటించారు. ప్రతి సంస్కరణను ఒక విప్లవంగా మారుస్తున్నామని స్పష్టం చేశారు. ఉగ్రవాద దాడులు జరిగితే ఇప్పుడు భారత్ నిశ్శబ్దంగా ఉండడం లేదని, ముష్కర మూకలపై భీకరస్థాయిలో ప్రతిదాడులు చేస్తోందని తెలిపారు. సర్జికల్ దాడులు, వైమానిక దాడులతో విరుచుకుపడుతోందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి ప్రస్తావించారు. యుద్ధాలు జరిగినప్పుడు ఆర్థిక ప్రగతి క్షీణిస్తుందని నిపుణులు చెబుతుంటారని, కానీ, అది అబద్ధమని తాము నిరూపించామన్నారు.


ప్రధాని మోదీ


### అవరోధాలు, స్పీడ్‌బ్రేకర్లు ఏమీ చేయలేవు

ప్రపంచవ్యాప్తంగా అస్థిర పరిస్థితులు కొనసాగుతున్నాయని, యుద్ధాలు, సంక్షోభాలు కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ భారతదేశ అభివృద్ధి పరుగులు ఆగడం లేదన్నారు. ప్రపంచ దేశాలు భారత్ గురించి చర్చించుకుంటున్నాయని చెప్పారు. అవరోధాలు, స్పీడ్‌బ్రేకర్లు తమను ఏమీ చేయలేవన్నారు. ఈ ప్రగతి పరుగును ఆపే మూడ్‌లో దేశం లేదన్నారు.

## మెహుల్ చోక్సీ అప్పగింతకు బెల్జియం కోర్టు ఓకే

**న్యూఢిల్లీ:** పరారీలో ఉన్న నేరగాడు, వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీ(66)ని భారత్‌ను పంపించేందుకు బెల్జియం కోర్టు అంగీకరించింది. చోక్సీని అరెస్ట్ చేయాలంటూ భారత్ చేసిన విన్నపం సరైందేనని బెల్జియంలోని ఆంట్‌వెర్ప్ నగర కోర్టు ధ్రువీకరించింది. దీంతో, అతడిని తీసుకు వచ్చేందుకు చేస్తున్న మొదటి ప్రయత్నం విజయవంతమైందని అధికారులు తెలిపారు. కరీబియన్ దేశం ఆంటిగ్వా బార్బుడా పౌరసత్వమున్న చోక్సీని ఏప్రిల్‌లో బెల్జియం అధికారులు అరెస్ట్ చేశారు. అతడిని అప్పగించాలంటూ సీబీఐ, విదేశాంగ శాఖ అధికారులు అక్కడి కోర్టులో కేసు వేశారు. బంధువు నీరజ్ మోదీతో కలిసి పంజాబ్ నేషనల్ బ్యాంకును ఇతడు రూ.13వేల కోట్ల మేర మోసం చేశాడని తెలిపారు. ముంబైలోని ఆర్థర్ రోడ్ జైలు బ్యారక్ నంబర్ 12లో యూరప్ ప్రమాణాలతో కూడిన అన్ని వసతులు ఉన్నాయని, చోక్సీని అప్పగిస్తే అక్కడే ఉంచుతామని తెలిపారు. సెప్టెంబర్‌లో వాదనలు ముగియగా తాజాగా కోర్టు తీర్పు భారత్‌కు అనుకూలంగా వెలువరించింది. దీనిపై చోక్సీ బెల్జియం అత్యున్నత న్యాయస్థానానికి వెళ్లేందుకు అవకాశముంది.

## జపాన్ మాజీ ప్రధాని మురయామ కన్నుమూత



**టోక్యో:** రెండో ప్రపంచ యుద్ధం సమయంలో పలు ఆసియా దేశాలపై దాడులు చేసినందుకు 1995లో ఆయా దేశాలకు క్షమాపణ చెబుతూ.. చరిత్రాత్మక ప్రకటన చేసిన జపాన్ మాజీ ప్రధాని తొమిచి మురయామ (101) శుక్రవారం కన్నుమూశారు. నైరుతి జపాన్‌లోని ఒయిటా పట్టణంలో ఆయన ప్రశాంతంగా తుదిశ్వాస విడిచారని సోషల్ డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్షుడు ముజుహో ఫుకుషిమా ప్రకటించారు. మురయామ సొంత పట్టణం ఒయిటానే. మురయామ 1994 జనవరి నుంచి 1996 వరకు జపాన్‌కు ప్రధానిగా సేవలందించారు. నాడు ఆయన జపాన్ సోషలిస్ట్ పార్టీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ లొంగిపోయి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 1995 ఆగస్టు 15న ఆయన చేసిన క్షమాపణ ప్రకటన చరిత్రలో 'మురయామ స్టేట్‌మెంట్'గా నిలిచిపోయింది.

## మడగాస్కర్ అధ్యక్షుడిగా తిరుగుబాటు నేత


కల్నల్ మైకేల్

**అంటననారివో:** మడగాస్కర్‌లో సైనిక తిరుగుబాటుతో అధికారాన్ని హస్తగతం చేసుకున్న ఆర్మీ కల్నల్ అధ్యక్షుడిగా ప్రమాణం చేశారు. సైన్యంలోని ఎలైట్ యూనిట్ కల్నల్ మైకేల్ రండ్రియానిరినా(51) కేవలం మూడు రోజుల్లోనే అధ్యక్షుడు రజొలినాను గద్దెదించి, దేశం వీడి అజ్ఞాతంలోకి వెళ్లి పోయేలా చేశారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలోని ప్రధాన ఛాంబర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 9 మంది జడ్జీల ఎదుట ప్రమాణ ఆయన స్వీకారం చేశారు. తన సారథ్యంలోని మిలటరీ కౌన్సిల్ పాలనా బాధ్యతలను చూసుకుంటుందని ప్రకటించారు. ఏడాదిన్నర లేదా రెండేళ్లలో దేశంలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

### యువత ఆందోళనలకు మద్దతు పలికి..

దేశంలో పెరిగిపోయిన నిరుద్యోగం, ఆర్థిక సమస్యలపై యువతరం గత నెల నుంచి ఆందోళనలను కొనసాగిస్తోంది. వారం రోజుల క్రితం ఈ ఆందోళనల్లో కల్నల్ మైకేల్ రండ్రియానిరినా సారథ్యంలోని ఎలైట్ యూనిట్ సభ్యులు సైతం పాలుపంచుకున్నారు. ఆ నిరసనలకు రండ్రియానిరినా బహిరంగంగా మద్దతు పలికారు. అనంతరం, పరిణామాలను తనకు అనుకూలంగా మార్చుకున్నారు. రెండేళ్ల క్రితం కూడా ఈయన తిరుగుబాటుకు యత్నించి కొంతకాలం సైనిక ఆస్పత్రిలో నిర్బంధంలో ఉన్నారు.

## రివాబా జడేజాకు మంత్రి పదవి

- మొత్తం 26 మందితో గుజరాత్ నూతన కేబినెట్ ఏర్పాటు
- ఉప ముఖ్యమంత్రిగా హర్ష్ సంఘవి నియామకం


ప్రమాణం చేస్తున్న రివాబా

**గాంధీనగర్:** గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ తన మంత్రివర్గాన్ని పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరించారు. సీఎం సహా మొత్తం 26 మందితో నూతన కేబినెట్ కొలువుదీరింది. కొత్తగా 19 మందికి చోటుదక్కింది. తాజా మాజీ మంత్రుల్లో ఆరుగురికి మరోసారి అవకాశం లభించింది. ప్రముఖ క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివాబా జడేజాను మంత్రి పదవి వరించడం విశేషం. నిన్నటిదాకా హోంశాఖ సహాయ మంత్రిగా పనిచేసిన హర్ష్ సంఘవి ఉప ముఖ్యమంత్రిగా పదోన్నతి పొందారు. మంత్రివర్గ సభ్యులతో గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. గుజరాత్ అసెంబ్లీలో మొత్తం 182 స్థానాలుండగా, 27 మందిని మంత్రిగా నియమించేందుకు వీలుంది. సీఎం భూపేంద్ర పటేల్ 26 మందితో కేబినెట్‌ను ఏర్పాటు చేశారు. 2027లో గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్నాయి. సరిగ్గా రెండేళ్ల ముందు మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించడం గమనార్హం. అలాగే త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను సైతం దృష్టిలో పెట్టుకొని కేబినెట్‌లో మార్పులు చేర్పులు చేసినట్లు తెలుస్తోంది. సీఎం మినహా మొత్తం 25 మందిలో తొమ్మిది మందికి కేబినెట్ ర్యాంకు, ముగ్గురికి స్వతంత్ర హోదా, 13 మందిని సహాయ మంత్రులుగా నియమించారు. గత కేబినెట్‌లో మహిళా మంత్రి ఒక్కరే ఉండగా, ఈసారి ముగ్గురికి స్థానం దక్కింది.

### నాలుగేళ్ల తర్వాత డిప్యూటీ సీఎం

సూరత్ జిల్లాలోని మజూరా ఎమ్మెల్యే హర్ష్ సంఘవి గుజరాత్ కేబినెట్‌లో నంబర్ టూ స్థానానికి చేరుకున్నారు. సహాయ మంత్రిగా వ్యవహరించిన ఆయనకు ఏకంగా ఉప ముఖ్యమంత్రి పదవి దక్కింది. రాష్ట్రంలో ఉప ముఖ్యమంత్రిని నియమించడం గత నాలుగేళ్లలో ఇదే మొదటిసారి. చివరిసారిగా 2021లో విజయ్ రూపానీ ప్రభుత్వంలో నితిన్ పటేల్ ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. భూపేంద్ర పటేల్ కేబినెట్‌లోని మొత్తం 16 మంది మంత్రులు గురువారం రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. వీరిలో ఆరుగురు మళ్లీ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇదిలా ఉండగా, 2024 మార్చిలో కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన పోర్‌బందర్ ఎమ్మెల్యే మోధ్వాడియాకు మంత్రిగా అవకాశం దక్కింది. ఆయన గతంలో గుజరాత్ పీసీసీ అధ్యక్షుడిగా, అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు.

### మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్న రివాబా


క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివాబా జడేజాకు మంత్రి పదవి కట్టబెట్టడం అందరినీ ఆశ్చర్యపర్చింది. ఆమెను కేబినెట్‌లో చేర్చుకుంటారని ఎవరూ ఊహించలేదు. ప్రమాణ స్వీకారానికి రవీంద్ర జడేజాతోపాటు వారి కుమార్తె సైతం హాజరయ్యారు. రివాబా 1990 నవంబర్ 2న జన్మించారు. 2022లో జరిగిన ఎన్నికల్లో జామ్‌నగర్ నార్త్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. శ్రీ మాతృశక్తి చారిటబుల్ ట్రస్టును స్థాపించారు.

## హెచ్1బీ ఫీజు పెంపుపై పిటిషన్

**వాషింగ్టన్:** విదేశీ వృత్తి నిపుణులకు అమెరికాలో ఉద్యోగాలు కల్పించేందుకు ఉద్దేశించిన హెచ్1బీ వీసా దరఖాస్తు ఫీజును లక్ష డాలర్ల (దాదాపు రూ.88 లక్షలు)కు పెంచటాన్ని సవాల్ చేస్తూ యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ కొలంబియాలోని ఒక జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అమెరికా పార్లమెంటు (కాంగ్రెస్) చేసిన చట్టంలో ఏకపక్షంగా మార్పులు చేసే అధికారం దేశాధ్యక్షుడికి లేదని గురువారం దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వంతోపాటు హోమ్‌లాండ్ సెక్యూరిటీ, మంత్రులు క్రిష్టీ ఎల్ నోయెమ్, మార్కో రుబియోలను ప్రతివాదులుగా చేర్చింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం పూర్తిగా అన్యాయం, తప్పుదోవ పట్టించే విధానం అని ఆరోపించింది. ఫీజు పెంపు వల్ల నైపుణ్యగల విదేశీ నిపుణులు అమెరికాలోకి రాలేరని, అప్పుడు దేశంలో పరిశోధనలు, పోటీతత్వం దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తంచేసింది. ట్రంప్ నిర్ణయం అమెరికా ప్రత్యర్థి దేశాలకు మేలు చేసేదిగా ఉందని యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నీల్ బ్రాడ్లీ విమర్శించారు. పార్లమెంటు అధికారాలను కాలరాసి, అధ్యక్షుడు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవటం చెల్లదని స్పష్టంచేశారు. 3,600 ఉన్న హెచ్1బీ వీసా ఫీజును అధ్యక్షుడు ట్రంప్ గత నెల 19న ఒకేసారి లక్ష డాలర్లకు పెంచిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం భారతీయ వృత్తినిపుణులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఏటా దాదాపు 85,000 హెచ్1బీ వీసాలు జారీచేస్తుండగా, అందులో దాదాపు 70 శాతం భారతీయులే దక్కించుకుంటున్నారు.

## కుటుంబానికో ఉద్యోగం ఎలా సాధ్యం?

- ఓట్ల కోసం విచ్చలవిడిగా హామీలిస్తున్నారు
- బిహార్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు
- విపక్షాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆగ్రహం


అమిత్ షా

**పట్నా:** ప్రతి కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడం ఎలా సాధ్యమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రశ్నించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో విపక్ష ఆర్జేడీ ఇస్తున్న హామీ ఆచరణలో సాధ్యం కాదని అన్నారు. ఓట్ల కోసం విచ్చలవిడిగా హామీలు ఇస్తున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విపక్షాలపై మండిపడ్డారు. ప్రతి కుటుంబానికి ఒక ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తే వారికి వేతనాలు చెల్లించడానికి నిధులు ఎక్కడి తీసుకొస్తారని ప్రశ్నించారు. 2.6 కోట్ల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చి వేతనాలు ఇవ్వాలంటే రూ.12 లక్షల కోట్లు కావాలన్నారు. రాష్ట్ర వార్షిక బడ్జెట్‌కు అది నాలుగురెట్లు అని చెప్పారు. శుక్రవారం బిహార్ రాజధాని పట్నాలో మేధావులు, వివిధ రంగాల నిపుణులతో జరిగిన సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. బిహార్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ నిర్వహించిన ఓటర్ అధికార్ యాత్రపై వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అది చొరబాటుదారులను కాపాడే యాత్ర అని విమర్శించారు. దేశంలోకి అక్రమ వసలదారులను అనుమతించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. భారత్ ధర్మశాల కాదని స్పష్టంచేశారు. చొరబాటుదారులను కూడా ఓటర్ల జాబితాలో చేర్చాలని రాహుల్ కోరుకుంటున్నారా? అని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల నుంచి చొరబాటుదారుల పేర్లను కచ్చితంగా తొలగిస్తామన్నారు. కుటుంబ వారసత్వ రాజకీయాలను నమ్ముకుంటున్న కాంగ్రెస్, ఆర్జేడీలకు గట్టిగా బుద్ధి చెప్పాలని అమిత్ షా పిలుపునిచ్చారు. అభివృద్ధికే పెద్దపీట వేస్తున్న బీజేపీని గెలిపించాలని కోరారు. బిహార్‌లో డబుల్ ఇంజన్ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలన్నారు. ఎన్డీయే ప్రభుత్వం సాధించిన ఘనతలను ఆయన ప్రస్తావించారు.

### బిహార్ క్షేమంగా ఉండొద్దా?

కరడుగట్టిన గ్యాంగ్‌స్టర్ మొహమ్మద్ షాబుద్దీన్ కుమారుడు ఒసామాకు బిహార్ ఎన్నికల్లో ఆర్జేడీ టికెట్ ఇవ్వడంపై అమిత్ షా ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాంటి వ్యక్తులు ఎన్నికల్లో పోటీకి దిగితే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. బిహార్ క్షేమంగా ఉండాల్సిన అవసరం లేదా? అని నిలదీశారు. సారణ్ జిల్లాలో శుక్రవారం ఎన్నికల ప్రచార సభలో అమిత్ షా ప్రసంగించారు. నేరగాళ్లకు టికెట్లు ఇచ్చి ప్రోత్సహిస్తున్న ఆర్జేడీ లాంటి పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. లాలూ–రబ్రీ హయాంలో బిహార్ రాష్ట్రం జంగిల్‌రాజ్‌గా మారిందని ఆరోపించారు. జంగిల్ రాజ్ నుంచి సీఎం నితీశ్ కుమార్ విముక్తి కల్పించారని అమిత్ షా ప్రశంసించారు. అభివృద్ధి కొనసాగాలంటే ఎన్డీయేను మళ్లీ గెలిపించాలని పిలుపునిచ్చారు.


తేజస్ టేకాఫ్‌కు జెండా ఊపుతున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్

## అలుపెరగని సహకారం

### హెచ్‌ఏఎల్‌పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ప్రశంసలు

**నాసిక్:** హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్) దేశ రక్షణ రంగానికి వెన్నెముకగా మారిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అభివర్ణించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో దేశంలో వివిధ వైమానిక స్థావరాల్లో ఉన్న యుద్ధ విమానాలకు అవసరమైన తోడ్పాటును నిర్విరామంగా అందించిందని ప్రశంసించారు. ఫలితంగా ఫైటర్ జెట్లు, హెలికాప్టర్ల సమర్థవంతమైన నిర్వహణ, సన్నద్ధత సాధ్యమైందన్నారు. నాసిక్‌లోని హెచ్‌ఏఎల్ కేంద్రంలో మంత్రి రాజ్‌నాథ్ శుక్రవారం తేజస్ తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ)ఎంకే1ఏ తయారీ విభాగాన్ని, శిక్షణ విమానం హెచ్‌టీటీ–40 ప్రత్యేక తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. నాసిక్ విభాగంలో తయారైన తేజస్ ఎల్‌సీఏ ఎంకే1ఏ మొట్టమొదటిసారిగా రివ్వున ఆకాశంలోకి దూసుకెళ్లడాన్ని మంత్రి వీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. సుఖోయ్–30 ఎంకేఐ జెట్ విమానాలకు బ్రహ్మోస్ క్షిపణుల అనుసంధానంలో హెచ్‌ఏఎల్ నాసిక్ విభాగం కృషి మరువలేమన్నారు. తేజస్ ఎంకే1ఏ తయారీ కేంద్రంలో ఇకపై ఏటా కనీసం 24 ఎల్‌సీఏలు తయారవుతాయని వివరించారు. మిగ్–21, మిగ్–27 వంటి ఫైటర్ జెట్ల నుంచి సుఖోయ్–30 ఎంకేల వరకు తయారు చేస్తూ నాసిక్ కేంద్రం ఉత్పత్తి హబ్‌గా మారిందని చెప్పారు.


ప్రధాని మోదీతో శ్రీలంక ప్రధాని హరిణి

## ఉమ్మడిగా సాగుదాం

### భారత్–శ్రీలంక మైత్రి ఈ ప్రాంతానికి ఎంతో కీలకం: మోదీ

**న్యూఢిల్లీ:** భారత్–శ్రీలంక దేశాల ఉమ్మడి అభివృద్ధి ప్రయాణంలో కలిసి పనిచేసేందుకు కట్టుబడి ఉన్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. భారత పర్యటనలో ఉన్న శ్రీలంక ప్రధాని హరిణి అమరసూర్య శుక్రవారం ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. 'విద్య, మహిళా సాధికా రిత, ఆవిష్కరణలు, అభివృద్ధి సహకారం, భారత మత్స్యకారుల సంక్షేమం వంటి అంశాలపై విస్తృత చర్చలు జరిపాం. సన్నిహిత ఇరుగుపొరుగు దేశాలైన భారత్, శ్రీలంకల మధ్య సహకారం ఈ ప్రాంతానికి, రెండు దేశాల ప్రజల వికాసానికి ఎంతో ముఖ్యమైంది'అని ప్రధాని మోదీ అనంతరం ఎక్స్‌లో పేర్కొన్నారు.

### ఈజిప్టు విదేశాంగ మంత్రితో మోదీ భేటీ

ఈజిప్టు విదేశాంగ మంత్రి డాక్టర్ బదర్ అబ్దెలట్టీతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. గాజా శాంతి ఒప్పందం కార్యరూపం దాల్చడంలో ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతాహ్ ఎల్ సిసి చేసిన కృషిని ఆయన ఈ సందర్భంగా కొనియాడారు.

# మావోల జనతన సర్కార్‌కు బీటలు

- 1996లో దండకారణ్యంలో 'సర్కార్'ఏర్పాటు
- తొమ్మిది శాఖలతో కొనసాగిన గ్రామ పాలన
- యాంటీ నక్సల్స్ ఆపరేషన్లతో కుదేలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు అగ్రనేతలతోపాటు వందల సంఖ్యలో కేడర్ అజ్ఞాతం వీడుతున్నారు. గెరిల్లా యుద్ధతంత్రాన్ని అనుసరించే మావోయిస్టులు జనతన సర్కార్ పేరుతో సమాంతర ప్రభుత్వం నిర్వహించేందుకు యత్నించడమే పార్టీకి చేటు తెచ్చిందా అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బెంగాల్ నుంచి ఉత్తర తెలంగాణ వరకు మావోయిస్టు/నక్సలైట్లు ప్రధానంగా గెరిల్లా యుద్ధతంత్రాన్నే నమ్ముకున్నారు. పల్లెలను ఉద్యమానికి కేంద్రంగా చేసుకున్నారు. అక్కడ ప్రజాసంఘాలను నిర్మిస్తూ వాటిని సాయుధ దళాలతో సమన్వయపరిచారు. ఈ క్రమాన ఉత్తర తెలంగాణ మీదుగా బస్తర్ వెళ్లిన మావోయిస్టులు అక్కడ ఫారెస్టు శాఖను నిర్వీర్యం చేసి దండకారణ్యంపై పట్టు సాధించారు. స్థానిక రైతులకు అడవుల్లో లక్షల ఎకరాల భూమి పంపిణీ చేశారు. దీనికి తోడు నాటు వైద్యం బదులు ఆధునిక వైద్యం అందించారు. అప్పటికే



గెరిల్లా జోన్‌గా విముక్తి ప్రాంతంగా మారిన దండకారణ్యంలో జనతన సర్కార్ ఏర్పాటు చేయాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి.

**తొమ్మిది శాఖలతో**

దండకారణ్యంలో కనీసం 500 నుంచి గరిష్ఠంగా 5వేల వరకు జనాభా కలిగిన ప్రాంతాన్ని యూనిట్‌గా తీసుకొని జనతన సర్కార్ శాఖలను ఏర్పాటు చేయడాన్ని 1996లో నక్సలైట్లు ప్రారంభించారు. ఇందులో కృషి (వ్యవసాయం), వ్యాపారం, ఉద్యోగం, ఆర్థికం, న్యాయం, ఆరోగ్యం, ప్రజా సంబంధాలు, విద్య, సాంస్కృతిక విభాగాలతో కూడిన కమిటీలు పాలన బాధ్యతలు చూసేవి. ఆపై ఏరియా కమిటీలు, మూడు ఏరియా కమిటీలు కలిసి ఒక డివిజనల్ కమిటీగా వచ్చాయి. అయితే ఫారెస్టు శాఖ దురాగతాలను అడ్డుకోవడంతో బస్తర్ అడవుల్లోని అన్ని తెగలు, వర్గాల ప్రజలు నక్సలైట్లకు అండగా నిలిచారు. కానీ దున్నే వాడిదే భూమి అన్న నినాదం అమలు, సంపన్న గిరిజన భూస్వాములకు చెందిన భూములను పంపిణీ చేయడంతో విభేదాలు మొదలయ్యాయి. ఇందులో నుంచే సీపీఐలో రాజకీయ ప్రస్థానం మొదలెట్టిన మాసా కర్మా అనే గిరిజన నాయకుడు ఆ తర్వాత కాంగ్రెస్ మీదుగా బీజేపీలో చేరి మహేంద్రకర్మగా రూపాంతరం చెందాడు. ఇదే సమయాన కార్పొరేట్ కంపెనీలు బస్తర్‌లో పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు రావడంతో భద్రత అవసరమైంది. ఈక్రమాన మావోయిస్టులకు వ్యతిరేకంగా మహేంద్రకర్మ నాయకత్వంలో సల్వాజుడుం పేరుతో ప్రభుత్వం తరఫున సాయుధ దళాలు పుట్టుకొచ్చాయి.

**'థ్యాంక్స్ సల్వాజుడుం'**

మావోయిస్టులకు అండగా నిలిచిన జనతన సర్కార్లను విచ్ఛిన్నం చేయడమే లక్ష్యంగా సల్వాజుడుం కార్యాచరణ ప్రారంభించింది. ఈ క్రమంలో గ్రామాల్లో అంతులేని హింస చోటు చేసుకుంది. ఆదివాసీ స్త్రీలపై అకృత్యాలు పెరిగాయి. అడవుల్లో జీవించే ఆదివాసీలు రోడ్‌సైడ్ క్యాంపుల వైపు రాలేక తప్పనిసరి పరిస్థితుల్లో భారీగా మావోయిస్టులను ఆశ్రయించారు. రోజుకు వందల సంఖ్యలో రిక్రూట్‌మెంట్లు జరిగాయి. దీంతో అప్పటి వరకు మావోయిస్టుల ఆర్మీ వింగ్‌గా ఉన్న పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ బలపడింది. 2010 నాటికి సాయుధ దళాలు, పీఎల్‌జీఏలు కలుపుకొని 15,000 మంది సాయుధులు అందుబాటులోకి వచ్చారని అంచనా. పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు పుట్టుకొచ్చి చివరి తమ పార్టీనే బలోపేతం చేసిన సల్వాజుడుం ఉదంతంపై ఇటీవల లొంగిపోయిన మల్లోజుల కోటేశ్వరరావు 'థ్యాంక్స్ టూ సల్వాజుడుం' శీర్షికన పుస్తకం రాశారు.

**చివరకు చిక్కుల్లో**

గ్రీన్‌హంట్ పేరుతో పెద్ద ఎత్తున యాంటీ నక్సల్స్ ఆపరేషన్లు మొదలయ్యాయి. అయితే శ్రీలంకలో 'తమిళ టైగర్స్'ప్రత్యేక సరిహద్దులు నిర్ణయించుకోవడం వల్ల సైన్యం చేతిలో ఓడిపోయిందని.. కానీ తమది ప్రత్యేక సరిహద్దులు లేని గెరిల్లా సైన్యం అయినందున ప్రభుత్వ దళాలు ఓడించలేవనే అభిప్రాయం మావో అగ్రనేతల్లో ఉండేది. కానీ అప్పటికే దండకారణ్యంలో వారు స్థాపించిన జనతన సర్కార్ పూర్తిగా తన కాళ్లపై తాను నిలదొక్కుకోకపోవడం మావోల ముందరి కాళ్లకు బంధమైందనే అభిప్రాయం ఉంది. మెరికల్లాంటి వారిని ప్రజా సంఘాల నిర్మాణం కంటే ఆర్మీ వింగ్‌వైపు ఎక్కువగా పంపడం పార్టీకి చేటు చేసిందనే వాదనలు ఉన్నాయి.

## ఫారెక్స్ ట్రేడర్ల 'ప్రయాణ' కనికట్టు

- ఐదు ఫారెక్స్ ట్రేడర్ సంస్థల్లో ఈడీ సోదాలు

సాక్షి, హైదరాబాద్: రిజర్వ్ బ్యాంక్ నిబంధనలకు విరుద్ధంగా ఫారెక్స్ ట్రేడింగ్ చేయడంతోపాటు నకిలీ విమాన ప్రయాణాలతో మనీలాండరింగ్‌కు పాల్పడుతున్న పలు ఫారెక్స్ ట్రేడర్లు, ఎయిర్ ట్రావెల్ సర్వీసెస్ గుట్టును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బట్టబయలు చేసింది. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్‌ను ఉల్లంఘించి నగదు లావాదేవీలు జరుపుతున్న ఫుల్ ఫ్లెడ్జ్‌డ్ మనీ ఛేంజర్స్ (ఎఫ్ఎఫ్ఎమ్‌సీ) సంస్థల్లో గురువారం సోదాలు నిర్వహించింది. హైదరాబాద్‌లో ప్రిజం ఫారెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, గరుడ ఫారెక్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ విమల్‌నాథ్ ఫారెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, విక్టరీ ఫారెక్స్, ట్రావెల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, డిజిటల్ ఫారెక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఏకకాలంలో తనిఖీలు చేసింది. ఈ సోదాల్లో అక్రమ విదేశీ కరెన్సీ లావాదేవీల రికార్డులు, రూ.26.77 లక్షల విలువ చేసే విదేశీ కరెన్సీ, లెక్కల్లో లేని రూ.11.99 లక్షల నగదు, మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది జూన్, జూలైలో కూడా ఈ సంస్థల్లో అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించి ఆయా సంస్థల లైసెన్సులను స్వాధీనం చేసుకున్నారు. అయినా ఈ సంస్థలు కార్యకలాపాలు కొనసాగిస్తూనే ఉన్నాయి.







## రిలయన్స్ డిజిటల్ 'ఫెస్టివల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్'

Reliance digital
PERSONALISING TECHNOLOGY
www.reliancedigital.in

సాక్షి, హైదరాబాద్: ఆధునిక గాడ్జెట్‌లు మొదలుకొని గృహోపకరణాలు అన్నింటిపై ఆకర్షణీయమైన ఆఫర్లతో రిలయన్స్ డిజిటల్ 'ఫెస్టివల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వర్తించే ఉత్పాదనలపై జీఎస్టీ తగ్గింపు ధరలను సద్వినియోగం చేసుకోవాలని, బ్యాంకు కార్డులపై రూ.20,000 వరకు తక్షణ డిస్కౌంట్ పొందవచ్చని తెలిపింది. ఈ ఆఫర్లు రిలయన్స్ డిజిటల్, మై జియో, జియోమార్ట్ డిజిటల్ స్టోర్స్‌లో, ఆన్‌లైన్‌లో www.reliancedigital.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని పేర్కొంది. ఆఫర్ అక్టోబర్ 26 వరకు వర్తిస్తుందని వెల్లడించింది. కస్టమర్లు పేపర్ ఫైనాన్స్ ద్వారా రూ.30,000 వరకు క్యాష్‌బ్యాక్ బెనిఫిట్ కూడా పొందవచ్చని తెలిపింది.

## కుమారుడికి శిక్షపడుతుందన్న ఆవేదనతో..

- గుండెపోటుతో తండ్రి మృతి



బడేసాబ్

కొమురవెల్లి (సిద్దిపేట)/సిద్దిపేట కమాన్: ఓ కేసులో నిందితుడుగా ఉన్న తన కొడుకుకి శిక్ష పడుతుందేమో ననే ఆవేదనతో తండ్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. మండలంలోని గురువన్నపేట గ్రామానికి చెందిన మహమ్మద్ బడేసాబ్ (55) చిన్న కుమారుడైన శర్ఫుద్దీన్‌పై గతేడాది బాలికపై లైంగికదాడి ఘటనలో పోక్సో కేసు నమోదైంది. కోర్టులో శుక్రవారం కేసు తుది తీర్పు వెలువడే అవకాశం ఉండటంతో బడేసాబ్ తన ఇద్దరు కుమారులు మహ బూబ్, శర్ఫుద్దీన్‌తో కలిసి సిద్దిపేట కోర్టుకు వచ్చారు. ఈ క్రమంలోనే బడేసాబ్ అస్వస్థతకు గురి కావడంతో వెంటనే కుమారులు సీపీఆర్ చేసి వారి కారులోనే పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు.

## విద్యుదాఘాతంతో ట్రాన్స్‌ఫార్మర్‌పైనే రైతు మృతి



పెద్దవూర: ట్రాన్స్‌ఫార్మర్‌పై ఫ్యూజ్ వేయడానికి వెళ్లి విద్యుదాఘాతానికి గురై ట్రాన్స్‌ఫార్మర్‌పైనే రైతు మృతిచెందాడు. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన బొంగరాల వెంకటయ్య (55) శుక్రవారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లగా బోరు నీరు పోయకపోవడాన్ని గమనించాడు. దీంతో సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి చూడగా ఫ్యూజ్ కొట్టివేసి ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేశాడు. అయితే అందులో ఒక ఫేజ్ వైర్ విద్యుత్ తీగ నుంచి విడిపోలేదు. దీన్ని గమనించని వెంకటయ్య ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కి ఫ్యూజ్ వైరును జాయింట్ చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై స్తంభంపైనే ప్రాణాలొదిలాడు. పక్క పొలంలో ఉన్న రైతు గమనించి వెంకటయ్య భార్య నాగమ్మకు, గ్రామస్తులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ స్తంభంపై మృతి చెందిన వెంకటయ్య మృతదేహాన్ని కిందికి దింపి పోస్టు మార్టం నిమిత్తం కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వై.ప్రసాద్ తెలిపారు.



ఆయుధాలతో లొంగిపోయిన మావోయిస్టులు

## మావోయిస్టు విప్లవ చరిత్రలో అతిపెద్ద లొంగుబాటు

▶ మొదటి పేజీ తరువాయి

సమక్షంలో 'పున మార్గ్'పేరిట ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయి, హోంమంత్రి విజయ్‌శర్మ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఆయుధాలు అప్పగించి లొంగిపోయిన మావోయిస్టులకు స్థానికంగా ఉన్న మాంజీ చాల్కీ తెగకు చెందిన నాయకులు గులాబీ పూలు అందించి జనజీవన స్రవంతిలోకి ఆహ్వానించారు. ఆ తర్వాత వారికి దేశ రాజ్యాంగ ప్రతులు అందచేశారు. ఈ సందర్భంగా సీఎం విష్ణుదేవ్ సాయి మాట్లాడుతూ సాయుధ పోరాటాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో తాజా లొంగుబాట్లు కీలక మలుపుగా నిలుస్తాయన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నట్లుగా 2026 మార్చి 31 నాటికి దేశంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని ఉద్ఘాటించారు. అంతకు ముందు అడవిని వీడి గురువారం రాత్రి జగ్‌దల్‌పూర్ చేరుకున్న మావోయిస్టులను ప్రత్యేక బస్సుల్లో పోలీస్‌లైన్ వరకు తీసుకొచ్చారు.

**మారిన పరిస్థితులతోనే..**

అనంతరం ఆశన్న మీడియాతో మాట్లాడుతూ మారిన పరిస్థితుల కారణంగానే లొంగిపోయామని చెప్పారు. ప్రస్తుతం విప్లవకారులకు అడవుల్లో ఆశ్రయం పొందే వీల్లేని పరిస్థితి నెలకొందని.. కానీ తమ సహచరులు ఇంకా అజ్ఞాతంలో ఉంటూ సాయుధ పోరాటం చేయాలనే దృఢ్పథంతో ఉన్నారని తెలిపారు. అందులో ఎవరైనా జనజీవన స్రవంతిలో కలవాలనుకుంటే ఫోన్‌లో తనను సంప్రదించాలని సూచించారు.

**అబూజ్‌మడ్ ఖాళీ**

పోలీసు వర్గాల అంచనా ప్రకారం దేశంలో మావోయిస్టు ఉద్యమానికి దండకారణ్యం ప్రధాన స్థావరంగా ఉంది. ఇందులో ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులోని అబూజ్‌మడ్ అడవులు మావోయిస్టులకు పెట్టని కోటలా ఉండేవి. కానీ మల్లోజుల, ఆశన్న బృందాల లొంగుబాట్లతో అబూజ్‌మడ్‌లో ఆ పార్టీ పట్టు కోల్పోయినట్టయింది. అయితే ఇప్పటికీ దట్టమైన అడవితోపాటు ఇంద్రావతి నేషనల్ పార్క్, తెలంగాణతో సరిహద్దు పంచుకుంటున్న దక్షిణ బస్తర్ డివిజన్లలో మావోయిస్టుల ప్రభావం ఉంది. ఆపరేషన్ కగార్ మొదలయ్యాక 477 మంది మావోయిస్టులు మృతిచెందగా 1,785 మంది అరెస్టయ్యారు. అలాగే 2,110 మంది మావోయిస్టులు లొంగిపోయారు.

**లొంగిపోయిన మావోయిస్టుల్లో ముఖ్యులు**

1) తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న - కేంద్ర కమిటీ సభ్యుడు
2) భాస్కర్ అలియాస్ రాజ్‌మన్ - డీకేఎస్‌జెడ్‌సీ
3) రాణిత - డీకేఎస్‌జెడ్‌సీ
4) రాజు సలాం - డీకేఎస్‌జెడ్‌సీ
5) దన్నువెట్టి అలియాస్ సంతు - డీకేఎస్‌జెడ్‌సీ
6) రతన్ ఎలాం - రీజనల్ కమిటీ సభ్యుడు

## ధాన్యం అమ్మిన మూడు రోజుల్లో డబ్బులు జమ

- రాకుంటే నాకు ఫోన్ చేయండి
- రైతులకు మంత్రి కోమటిరెడ్డి సూచన

తిప్పర్తి: రైతుల కళ్లలో సంతోషం చూడడమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ధాన్యం అమ్ముకున్న 72 గంటల్లోపు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. మంత్రి శుక్రవారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం, అంతయ్యగూడెం, మామిడాల గ్రామాల్లో ధాన్యం కొనగోలు కేంద్రాలను ప్రారంభించారు. తిప్పర్తిలోని కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలిస్తున్న లారీలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కంకణాలపల్లిలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఆయా చోట్ల మంత్రి మాట్లాడుతూ.. ఈ వానాకాలం సీజన్‌లో ధాన్యం అమ్మిన రైతుల చెల్లింపులకు ప్రభుత్వం రూ.25 వేల కోట్లు కేటాయించిందన్నారు. ఒకవేళ డబ్బులు జమ కాకుంటే రైతులు నేరుగా తనకు ఫోన్ చేయాలని సూచించారు. రైతులు సన్నధాన్యం ఎక్కువగా పండించాలని, ధనవంతుల మాదిరిగా ప్రతి పేదవాడు సన్నబియ్యం తినాలనే ఉద్దేశంతో రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని చెప్పారు. ధాన్యం సేకరణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి అధికారులకు చెప్పారు.



తిప్పర్తిలో ధాన్యం లారీలకు జెండా ఊపుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ ఇలాత్రిపాఠి

## ముగ్గురు చిన్నారులపై లైంగిక దాడి

- వారిలో ఇద్దరు అక్కాచెల్లెళ్లు

సైదాబాద్(హైదరాబాద్): ఆ ముగ్గురూ పది సంవత్సరాల లోపు బాలికలు. అందులో ఇద్దరు సొంత అక్కాచెల్లెళ్లు. అభం శుభం తెలియని ఆ చిన్నారులు దసరా సెలవుల్లో ఆరుబయట ఆడుకుంటుంటే, పక్కింట్లో నివసించే మానవ మృగం కన్ను వారిపై పడింది. ముగ్గురినీ తన గదిలోకి తీసుకెళ్లిన అతను వారిని అమానుషంగా పలుమార్లు లైంగికంగా వేధించాడు. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ అమానవీయ ఘటన జరిగింది. భర్తతో విడిపోయిన ఓ మహిళ తన ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకుతో సైదాబాద్ పీఎస్ పరిధిలోని ఒక బస్తీలో తన తల్లి ఇంట్లో ఉంటోంది. వారింటి పక్కనే ఆమెకు సోదరి వరుస అయ్యే మహిళకు ఒక కూతురు ఉంది. ఇటీవల దసరా సెలవులు రావటంతో పిల్లలు అందరూ ఇంటి వద్ద ఆడుకునేవారు. అప్పుడే వారిపై పక్కింటిలో ఉండే ఉల్లిగడ్డలు అమ్ముకునే యువకుడి కన్ను పడింది. ఒక రోజు వారికి చాక్లెట్లు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి ముగ్గురినీ తన గదిలోకి తీసుకెళ్లాడు. తన మొబైల్ ఫోన్‌లో అశ్లీల దృశ్యాలు చూపించి వారిపై లైంగికంగా దాడి చేశాడు. ఇలా పలుమార్లు దాడి చేయటమే కాకుండా ఎవరికైనా చెపితే చంపేస్తానని వారిని బెదిరించాడు. సెలవుల తరువాత పాఠశాలకు వెళ్లిన చిన్నారులు, తమ తోటి వారితో.. పిల్లలు ఎలా పుడతారో తెలుసా.. అంటూ మాట్లాడటం క్లాస్‌లోని టీచర్ విన్నారు. వెంటనే ఆమె వారి తల్లిని పిలిచి విషయం తెలిపింది. తల్లి పిల్లలను విచారిస్తే విషయం బయటపడింది. దీంతో బాధిత బాలికల తల్లి గురువారం సాయంత్రం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధిత బాలికలను భరోసా కేంద్రానికి తరలించారు. నిందితుడిని సైదాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం.

## గ్రామీణ ప్రాంతాల్లో హ్యామ్ రోడ్లకు నోటిఫికేషన్

- జారీచేసిన పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్) రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు కోరుతూ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్రంలో ఎంపిక చేసిన పీఆర్ ఇంజనీరింగ్ విభాగం రోడ్ల నిర్మాణం, స్థాయి పెంపుదల, పటిష్టపరచడం, నిర్వహణకు సంబంధించి గుర్తింపు, అనుమతి పొందిన సంస్థల నుంచి ప్రతిపాదనలు కోరుతూ శుక్రవారం పీఆర్ ఈఎన్సీ (ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్) నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 30 నెలల్లో రోడ్లు నిర్మించి 15 ఏళ్ల పాటు వాటికి నిర్వహణ వ్యవధి విధించినట్టు తెలిపారు. మొత్తం రూ.6,294.81 కోట్ల ఖర్చుతో 17 ప్యాకేజీల్లో 7,449.50 కి.మీ మేర 2,162 రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించిన పూర్తిసెట్ డాక్యుమెంట్లను ఈనెల 27 నుంచి రాష్ట్ర ప్రభుత్వ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ https://tender.telangana.gov.inలో చూసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదనపు నిర్దేశాలు, సహాయం కోసం తమ వెబ్‌సైట్ https://www.pred.telangana.gov.in సందర్శించాలని లేదా 8712867057, 9666232907 ఫోన్ నంబర్లలో పీఆర్ఈడీ కార్యాలయాన్ని, ఈ-మెయిల్ ఐడీ-tgpredham@gmail.com సంప్రదించాలని సూచించారు.

## కత్తిపోటుకు కానిస్టేబుల్ బలి

- బైక్ చోరీ నిందితుడిని తరలిస్తుండగా దాడి

నిజామాబాద్ అర్బన్: బైక్ చోరీ నిందితుడు కత్తితో జరిపిన దాడిలో సీసీఎస్ కానిస్టేబుల్ మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో శుక్రవారం రాత్రి 8.40 గంటల ప్రాంతంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. క్రైం కంట్రోల్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ ప్రమోద్.. నగర శివారులోని నాగారం నుంచి బైక్ చోరీ నిందితుడైన రియాజ్‌ను అరెస్టు చేసి తీసుకొస్తున్నారు. కానిస్టేబుల్ ప్రమోద్ బైక్ నడుపుతుండగా, రియాజ్ మధ్యలో, వెనుక ఎస్ఐ విఠల్ కూర్చున్నారు. వారి బైక్ వినాయక్ నగర్ వద్దకు రాగానే నిందితుడు రియాజ్.. బైక్ నడుపుతున్న కానిస్టేబుల్ గొంతును గట్టిగా పట్టుకున్నాడు. ఊపిరాడక కానిస్టేబుల్ బైక్‌ను నిలిపివేయగానే కత్తి తీసి ఛాతీలో పొడిచాడు. కానిస్టేబుల్ రక్తపు మడుగులో పడిపోగానే, భయపడిన ఎస్ఐ విఠల్ అక్కడి నుంచి దూరంగా వెళ్లడంతో నిందితుడు పారిపోయాడు. తర్వాత ఎస్ఐ విఠల్.. కానిస్టేబుల్ ప్రమోద్‌ను ఆటోలో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి చెందారు. నాలుగో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


## హైదరాబాద్ టు శ్రీశైలం నాన్ స్టాప్

▶ మొదటి పేజీ తరువాయి

కారిడార్ కోసం కేంద్ర ప్రభుత్వ అనుమతి కోసం త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను సమర్పించనుంది.

**నిర్మాణ భారాన్ని తగ్గించుకోవడానికి..**

తుక్కుగూడ నుంచి దిండి వరకు 85.8 కి.మీ. మేర నాలుగు వరుసలుగా రహదారి విస్తరణ.. మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు 54 కి.మీ. వరకు ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ నిర్ణయించింది. ఈ మేరకు దిండి నుంచి మన్ననూరు వరకు ఉన్న ప్రాంతాన్ని ఎన్‌హెచ్ఏఐకు బదిలీ చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. అయితే భూసేకరణ, ప్రస్తుతం రహదారి వెంబడి యుటిలిటీ షిఫ్టింగ్‌కు భారీ వ్యయం అవుతుండటంతో ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇప్పటికే ఫ్యూచర్ సిటీలో భాగంగా రంగారెడ్డి జిల్లాలోని రావిర్యాల (ఓఆర్ఆర్ జంక్షన్) నుంచి ఆమన్‌గల్ వరకు 41.5 కి.మీ. వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మిస్తున్న ప్రభుత్వం.. ఇందుకోసం రోడ్లతోపాటు ఫుట్‌పాత్‌లు, డ్రైనేజీలు, యుటిలిటీల వంటి అన్ని రకాల అవసరాల కోసం 100 మీటర్ల వరకు భూములను సమీకరిస్తోంది. రావిర్యాల నుంచి ఆమన్‌గల్ వరకు నిర్మించనున్న రోడ్డు ముగింపు తర్వాత అక్కడి నుంచే ఆమన్‌గల్-మన్ననూరు వరకు 52.2 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ రహదారిని విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే ఈ రహదారి అలైన్‌మెంట్‌కు కల్వకుర్తి బైపాస్‌లోని ప్రస్తుత ఎన్‌హెచ్-765, ఎన్‌హెచ్-167లను అనుసంధానించనుంది. ఈ కొత్త రహదారి పొడవు 11 కి.మీ. ఉంటుంది. దీని డీపీఆర్‌ను ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ అలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ (ఏఏసీ) ఆమోదం కోసం పంపింది.




# కార్టిసాల్‌ను తిట్టకండి.. ఒత్తిడి తగ్గించుకోండి!

మనకు ఎన్నో విధాల మేలు చేస్తుంది
రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది
డ్యాన్స్, ఆలింగనాలతో ఒత్తిడికి చెక్

కార్టిసాల్ అనగానే చాలామంది.. స్ట్రెస్ హార్మోన్ అంటారు. ఇది చెడ్డదని, శరీరంలో విడుదలైతే మానసిక ఒత్తిడి పోటెత్తి మనల్ని చిత్తు చేసేస్తుందని సోషల్ మీడియాలో ఎన్నో వీడియోల్లో చూసి ఉంటారు. ఇది నిజమేనా అంటే కాదు అంటున్నారు వైద్య నిపుణులు. కార్టిసాల్ హార్మోన్ శరీరాన్ని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, అనేక రకాలుగా మంచి చేస్తుందని అంటున్నారు. అయితే, ఒక్క షరతు! అదేంటంటే.. ఆరోగ్యకరమైన స్థాయిలో అది ఉండేలా నిర్వహించుకోవాలి.

సాక్షి, సాగుబడి

➤ కార్టిసాల్‌ను సాధారణంగా ఒత్తిడి హార్మోన్ అని పిలు స్తారు. తాటాకు మంటలా వచ్చి, వెంటనే తగ్గిపోయే ముప్పులకు అడ్రినల్ విడుదలైతే.. కొంచెం ఎక్కువ కాలం ఎదుర్కోవలసిన పెద్ద ముప్పులు ఎదురైనప్పుడు కార్టిసాల్ విడుదలవు తుంది. మానసిక ఒత్తిడి దీర్ఘకాలం కొనసాగుతున్న ప్పుడు లేదా అదుపు చేయలేనంతగా అనిపిం చినప్పుడు కార్టిసాల్ రంగంలోకి దిగుతుంది.

### సన్నద్ధం చేస్తుంది

➤ మూత్రపిండాలపైన ఉండే అడ్రినల్ గ్రంథుల నుంచి కార్టిసాల్ విడుదలవుతుంది. ప్రారంభమైన 15–20 నిమిషాలకు గరిష్ట స్థాయిలో వస్తుంది. శక్తి అందు బాటులో ఉందని, కండరాలకు రక్తం ప్రవహిస్తున్న దని నిర్ధారించుకొని మెదడును అప్రమత్తంగా ఉంచడం ద్వారా ఆపదకు దీటుగా ప్రతిస్పందించడానికి కార్టిసాల్ మిమ్మల్ని సన్నద్ధం చేస్తుంది. కానీ, మనం భయపడిన లేదా ఒత్తిడికి గురైన ప్రతిసారీ ఇది జరగదు. 'చిన్నపాటి ఒత్తిడి నుంచి కార్టిసాల్ ప్రతిస్పందనను పొందడం నిజానికి చాలా కష్టం. అడ్రినలిన్ ప్రతిస్పందన చాలా సులభం, కార్టిసాల్ విడుదల ఒక సవాలు. మీరు వ్యక్తిగతంగా ఏదైనా పెను ముప్పును గ్రహించినప్పుడే ఇది సాధ్యం' అని బ్రిస్టల్ విశ్వవిద్యాలయ వైద్య పాఠశాలలో ప్రొఫెసర్ స్టాఫోర్డ్ లైట్‌మాన్ అంటారు.

### ఎన్ని పనులు చేస్తుందో!

కార్టిసాల్ అనేక ముఖ్య విధులు నిర్వర్తిస్తుంది. ఉదాహ రణకు.. మీరు ఉదయం నిద్ర లేవడానికి కార్టిసాల్ సహాయపడుతుంది. మీరు మేల్కొనే ముందు మీ కార్టి సాల్ స్థాయిలు పెరుగుతాయి. 'కార్టిసాల్ ఒక సిగ్నలిం గ్ మోలిక్యూల్. మన శరీరంలోని కండరాలు, కాలేయం , మెదడుతో పాటు దాదాపు ప్రతీ కణంలో కార్టిసాల్ గ్రాహకాలు ఉంటాయ'ని లైట్‌మాన్ చెప్పారు. అవయవాలు, కండరాలు శరీరాన్ని స్థిరంగా ఉంచే ముఖ్యమైన విధుల నిర్వహణకు కార్టిసాల్ ప్రేరేపిస్తుం ది. ఉదాహరణకు, రక్తంలో చక్కెర స్థాయిలను, రక్తపోటును స్థిరంగా ఉంచడానికి కాలేయం, క్లోమం వంటి అవయవాలకు కార్టిసాల్ సహాయపడుతుంది. శరీరంలో అంతర్గత వాపు నివారణకు, రోగనిరోధక వ్యవస్థను పెంపొందించడానికి సహాయపడుతుంది.

### బెంబేలెత్తిపోవద్దు

శరీరంలో కార్టిసాల్ స్థాయిలు రోజంతా ఒకేలా ఉం డవు. హెచ్చుతగ్గులు సాధారణమే. ఉదయం పెరుగు తుంది. సాయంత్రం తగ్గుతుంది. ఎడతెగని మానసిక ఒత్తిడికి కారణం కార్టిసాల్ ఎక్కువగా ఉండటమేనను కొని బెంబేలెత్తాల్సిన పనిలేదని లైట్‌మాన్ స్పష్టం చేస్తున్నారు. విడాకులు, ఉద్యోగం కోల్పోవటం వంటి దీర్ఘకాలిక ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న వారికి అర్ధరాత్రో అపరాత్రో నిద్రాభంగం జరిగితే అందుకు కార్టిసాల్‌ను నిందించలేం. అందుకని, ఏవో సప్లిమెంట్లు తీసుకొని కార్టిసాల్‌ను తగ్గించుకోవటం కన్నా ఆ ఒత్తిడికి మూల కారణాలను గుర్తించి వాటిపై దృష్టిసారించటం మేలు.

### నృత్యం, ఆలింగనాలు చాలు!

2019లో జరిగిన ఒక అధ్యయనంలో భాగంగా.. కార్టిసాల్ అధికంగా ఉన్న వృద్ధులకు మూడు నెలలు నృత్యంలో శిక్షణ ఇచ్చారు. ఆశ్చర్యకరంగా వారిలో ఒత్తిడి తగ్గి కార్టిసాల్ స్థాయిలు తగ్గాయి. స్వల్పకాలిక ఒత్తిళ్లను పోగొట్టటంలో ఆలింగనాలు గొప్పగా ఉపయోగపడుతున్నాయని మరో అధ్యయ నంలో తేలింది. దట్టంగా పెరిగిన పచ్చని చెట్ల మధ్యలో నడిస్తే.. 53% మేరకు కార్టిసాల్ స్థాయిలు తగ్గాయని ఇంకో అధ్యయనం చెబుతోంది.

### ఏ ఆహారం ఉపయోగకరం?

కార్టిసాల్ నిర్వహణకు సమతులాహారం దోహదపడు తుందని నిపుణులు చెబుతున్నారు. చిరుధాన్యాలు, పం డ్లు, కూరగాయలు, ఆరోగ్యకరమైన కొవ్వులతో కూడిన ఆహారం తీసుకోవాలి. మెగ్నీషియం అధికంగా ఉండే ఆకుకూరలు, అవకాడో పండ్లు తీసుకోవాలి.సాల్మన్ చేపలు, వాల్‌నట్స్ వంటి ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే ఆహారాలు, పెరుగు, మజ్జిగ, అంబలి వంటి జీర్ణవ్యవస్థకు మేలు చేసే పులియబెట్టిన ఆహా రాలు ఒత్తిడిని తగ్గించటానికి దోహదపడతాయి. ప్రాసె స్డ్ ఫుడ్స్, చక్కెర, కెఫిన్‌ను పరిమితంగా తీసుకోవాలి.

## క్లుప్తంగా...

### సెల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ టాప్

- సీఈఐఆర్ పోర్టల్‌తో లక్షా 20 మొబైల్ ఫోన్ల గుర్తింపు
- రెండో స్థానంలో నిలిచిన కర్ణాటక
- సీఐడీ అడిషనల్ డీజీ చారు సిన్హా



సాక్షి, హైదరాబాద్: పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్ల జాడ కనిపెట్టడంలో తెలంగాణ పోలీసులు జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు సీఐడీ అడిషనల్ డీజీ చారు సిన్హా శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. టెలీకమ్యూనికేషన్స్ విభాగం రూపొందిం చిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్ మెంట్ ఐడెం టిటీ రిజిస్టర్) టెక్నాలజీ 780 పోలీస్ స్టేషన్లలో 2023 ఏప్రిల్ 20 నుంచి వినియోగిస్తున్నట్టు తెలిపారు. సీఈఐఆర్ ద్వారా ఈనెల 16 వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కలిపి.. 1,00,020 మొబైల్ ఫోన్లను గుర్తించిన ట్టు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో 98,189 మొబైల్ ఫోన్ల రికవరీతో కర్ణాటక రెండో స్థానం లో నిలిచినట్టు చారు సిన్హా వెల్లడించారు.

### 'ఇద్దరు పిల్లల'పై ప్రభుత్వానికి ప్రతిపాదనలు

**పంపిన పంచాయతీరాజ్ శాఖ**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని స్థానిక సంస్థల ఎన్ని కల్లో పోటీకి ఉన్న ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేతకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర ప్రభు త్వానికి ప్రతిపాదనలు పంపిం చింది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ నిబ ంధనను గతంలోనే తొల గించారు. తాజాగా గురువారం గ్రామీణ స్థానిక ఎన్నికల్లోనూ ఈ నిబంధనను తొలగిస్తూ కేబినెట్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈ మేరకు పీఆర్ చట్టం, 2018కి సవరణ సూచిస్తూ ప్రభుత్వానికి పీఆర్‌ఆర్‌డీ డైరెక్టర్ డా.జి. సృజన ప్రతిపాదన పంపించారు. త్వరలోనే స్థానిక ఎన్నికలు జరగవచ్చని చర్చ జరుగుతున్న తరుణంలో.. ఇప్పటికిప్పుడు అసెంబ్లీ సమావేశాలు లేనందున ఈ నిబం ధనను ఎత్తేస్తూ ప్రభుత్వపరంగా ఆర్డి నెన్స్ జారీ చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. కాగా, పీఆర్ శాఖ పంపించిన ప్రతిపాదనలపై మళ్లీ కేబినెట్‌లో చర్చించాల్సి ఉన్నందున, ఈ నెల 23న జరగనున్న భేటీలో దీనిని ప్రభుత్వం ఆమోదించనున్నట్టు సమాచారం. స్థానిక ఎన్ని కలు ఎప్పుడు జర పాలన్న తేదీలపై ప్రభుత్వం నిర్ణయించేలోగా, ఇద్దరు పిల్లల నిబంధనను తొలగిస్తూ ఆర్డినెన్స్ జారీ అయ్యే అవకాశాలు న్నాయని అధికారవర్గాల ద్వారా తెలుస్తోంది. దీంతో పంచాయతీరాజ్ ఎన్నికల్లో ఇద్ద రికి మిం చి పిల్లలున్నా పోటీకి అవకాశం లభిస్తుంది.

### కదిలిన అధికారులు.. వీడిన ముంపు



పాఠశాల ముందు ఎత్తుగా చేపడుతున్న గోడ నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్..

మణుగూరు రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం సమితి సింగారం పంచా యతీ పరిధిలోని అరుం ధతి నగర్ ప్రభుత్వ పాఠ శాలను ముంపు బారి నుంచి తప్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల వర్షాలతో పాఠశాల ఆవర ణలో భారీగా వరద నీరు చేరిన అంశంపై 'సాక్షి' ప్రధాన సంచికలో ఈనెల 16వ తేదీన 'కొలను కాదు.. ప్రభుత్వ పాఠశాలే' శీర్షికన కథనం ప్రచు రితమైంది. ఎమ్మెల్యే పాయం వెంకటే శ్వర్లు నివాసానికి సమీపంలోని ఈ పాఠశాల దుస్థితిపై కథనం రావడంతో అధికారులు స్పందించారు. శుక్రవారం ఉదయం స్కూల్ ఆవరణ నుంచి వాన నీటిని తొలగించారు. అంతేగాక సింగరేణి గనుల నుంచి 30 ట్రక్కుల మట్టిని తెప్పించి ఆవరణలో పోసి చదును చేయించారు. మరో మారు స్కూల్ ఆవరణలోకి వాన నీరు రాకుండా ముందు భాగం గోడ ఎత్తు పెంచే పనులను ఎం ఈవో స్వర్ణజ్యోతి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాం త్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

## 3,465 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు నియామక పత్రాలు

- ఈ నెల 19న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందజేసేందుకు ఏర్పాట్లు
- ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది చొప్పున ఎంపిక
- రెవెన్యూ వ్యవస్థ బలోపేతంపై నిర్వహించిన సమీక్షలో మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేం దుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబం ధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గ్రామ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఇప్పటికే గ్రామపాల నాధికారుల (జీపీఓ)ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు సులభంగా భూ సేవలు అందించేందుకు ప్రతి మండలానికి కనీసం 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వే యర్లను నియమిస్తున్నామని చెప్పారు. ఈ నెల 19న శిల్పకళా వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శిక్షణ పొందిన సర్వే యర్లకు లైసెన్స్‌లు పంపిణీ చేస్తామని తెలిపారు. భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో భూమి సర్వే మ్యాప్‌ను జత పర్చడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో సర్వే విభాగపాత్ర మరిం త క్రియాశీలం కానుందన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ప్రస్తుతమున్న 350 మంది సర్వేయర్లు సరిపోరని, దీనిని దృష్టిలో పెట్టుకొని లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకోవడం, మరోవైపు ఖాళీగా ఉన్న సర్వేయర్ పోస్టులు భర్తీ చేయ డం, ఇంకోవైపు భూముల సర్వేకు అవసర మైన అత్యాధునిక పరికరాలను అందు బాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసు కుంటున్నామన్నారు. శుక్రవారం సచివాల యంలోని తన చాంబర్‌లో రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్.లోకేశ్‌కుమార్, సర్వే విభాగ కమిషనర్ రాజీవ్‌గాంధీ హనుమంత్ తదితరులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లా డుతూ సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు అవసరమైన సర్వే యర్లను అందుబాటు లోకి తీసుకొచ్చేందుకు దరఖాస్తు లను ఆహ్వానించగా, పదివేల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. తొలి విడతలో ఏడు వేల మందికి శిక్షణ ఇచ్చామని, ఇందులో 3,465 మంది అర్హత సాధించారన్నారు. భూ విస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తామని చెప్పారు. రెండో విడతలో మరో 3 వేల మందికి ఆగస్టు 18వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభించామని, ఈనెల 26వ తేదీన జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో అర్హత పరీక్ష నిర్వహిస్తా మన్నారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి 40 రోజులపాటు శిక్షణ ఇచ్చి డిసెంబర్ రెండోవారం నాటికి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. భూరికార్డులు స్పష్టంగా ఉండేలా, ప్రజలకు ఇబ్బంది లేకుండా, అవినీతి లేని సేవలు అందించడమే ప్రజాప్రభుత్వ సంకల్పమని తెలిపారు.

## కురుక్షేత్రలో శ్రీకృష్ణుడి విశ్వరూప విగ్రహం

**మైసూరు శిల్పి అరుణ్ యోగిరాజ్ ఏర్పాట్లు**



మైసూరు: హర్యానాలోని కురుక్షేత్రలో శ్రీకృష్ణుడి విశ్వరూపంతో కూడిన భారీ విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ఈ విగ్ర హాన్ని ప్రముఖ శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కను న్నారు. ఈ భారీ విగ్రహం చెక్కడానికి అవసరమైన రాయికి ఇప్పటికే పూజలు చేశామని ఆయన చెప్పారు. ఈ విగ్రహానికి 18 అంతస్తుల గర్భగుడిని నిర్మించారని.. అయితే, అందులో భగవాన్ శ్రీకృష్ణుడి విశ్వరూప విగ్రహం ప్రతిష్ఠించాల్సి ఉందన్నారు. ఈ విగ్రహం లో పది ముఖాల భావం నిండి ఉంటుందని అరుణ్ యోగి రాజ్ చెప్పారు. దానిని చెక్కడం చాలా సవాళ్లతో కూడిన పని అన్నారు. మైసూరులో విగ్రహం చెక్కి ఇక్కడి నుంచి అక్కడకు తీసుకెళ్లడానికి అవకాశం అడిగానని, వారు అనుమతిస్తే ఇక్కడే చెక్కుతానని ఆయన చెప్పారు. ఇక అయోధ్యలో ప్రతిష్ఠించిన రామలల్లా విగ్రహాన్ని చెక్కి దేశం మొత్తం మైసూరు నగరం వైపు చూసేలా చేసింది అరుణ్ యోగిరాజే. అలాగే, బాలీవుడ్ నటి ఆలియా భట్, రణబీర్ కపూర్‌ల ఇంటికి కూడా అం దమైన గణేష్ విగ్రహం చెక్కి ఇచ్చిందీ ఈయనే.

## చేపపిల్లల పంపిణీతో 5 లక్షల కుటుంబాలకు ఉపాధి

**మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి**



మక్తల్ పెద్ద చెరువులో చేపపిల్లలు వదులుతున్న మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి తదితరులు

మక్తల్: కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వాయర్లు, చెరువుల్లో చేపపిల్లలు పంపిణీ చేయడం వల్ల రాష్ట్రంలోని 5 లక్షల మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని వైద్య, ఆరోగ్య శాఖ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, పశుసంవర్ధక, మత్స్య శాఖమంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మక్తల్ పెద్దచెరువు, సం గంబండ రిజర్వాయర్‌లో 2.60 లక్షల చేపపిల్లలను వారు వదిలారు. అనం తరం మంత్రి దామోదర మాట్లాడుతూ వందశాతం రాయితీతో 26 వేల చెరువుల్లో 88 కోట్ల చేపపిల్లలు, 10 కోట్ల రొయ్యలు వదులుతున్నామన్నారు. వాకిటి శ్రీహరి మాట్లాడుతూ జీఓ 69, 14 ద్వారా నారాయణపేట–మక్తల్–కొడంగల్ ఎత్తిపోతల పథకం పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యా మలంగా మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని తెలిపారు. చెరువుల దగ్గర చేప గుర్తు ఉన్న బోర్డు ఏర్పాటు చేసి అందులో ఏ రకం.. ఎన్ని చేపలు వదిలారు.. సంఘం పేరు.. స్థానిక ఎస్సై ఫోన్ నంబర్‌తో కూడిన వివరాలు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ వినీత్, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మత్స్య సహకార చైర్మన్ సాయి, డైరెక్టర్ నిఖిల తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ 'చదివింపులు'

▶ మొదటి పేజీ తరువాయి

లేకుండా పోతోందని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం.. ప్రస్తుతానికి ప్రభుత్వం నిధుల కొరత ఎదుర్కొంటు న్నందున కార్పొరేట్ సంస్థల ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎ స్ఆర్) కింద స్కూళ్లు, ఇతర విద్యా సంస్థ లను అభివృద్ధి చేసుకోవాలని సూచిం చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇం దుకు తగ్గట్లుగా ప్రణాళికలు రూపొందిం చాలని ఆయన పేర్కొన్నట్లు అధికార వర్గాల సమాచారం.



బాలకిష్టారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్

### నర్సరీ స్కూళ్లపై దృష్టి

నర్సరీ స్కూళ్ల ఏర్పాటుపై సీఎం సమీక్షిస్తూ వాటి ఏర్పాటు, ప్రజల్లో అవగాహన గురించి అధికారులను వివరాలు అడిగారు. నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు కొత్త స్కూళ్లను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు సరికొత్త రీతిలో బోధన జరిగేలా చూడాలన్నారు. ప్రైవేటు స్కూళ్లకు వెళ్లకుండా పేద విద్యార్థులను ఆకర్షించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్ అందించేందుకు కూడా ప్రణా ళికలు సిద్ధం చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ఇది అమలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు, వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, పాఠశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, ఇం టర్ బోర్డ్ కార్యదర్శి కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఉన్నత విద్యలో తీసుకొ స్తున్న సంస్కరణలపై బాలకిష్టారెడ్డి రచించిన పుస్తకాన్ని సీఎం రేవంత్ ఆవిష్కరించారు.

## జూబ్లీహిల్స్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రి పొన్నం

**నామినేషన్ వేసిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్**



మంత్రులు పొన్నం, వివేక్‌తో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న నవీన్‌యాదవ్

బంజారాహిల్స్: పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్, పార్లమెంట్ సభ్యు డిగా ఉన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఏమి అభి వృద్ధి చేశారో చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ నిలదీశారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి వి.నవీన్‌యాదవ్ శుక్రవారం షేక్‌పేటలోని రిటర్నింగ్ కార్యా లయంలో నామినేషన్ దాఖలు చేయగా, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. అనంతరం పొన్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు మొత్తం కేబినెట్ కూడా జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలని కంకణం కట్టుకుందన్నారు. జూబ్లీహిల్స్‌లో అభివృద్ధిని కోరుకునే ప్రతిఒక్కరూ చేతి గుర్తును బలపరిచి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని చెప్పారు. తెలంగాణలో ప్రజాస్వామిక కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి, పార్లమెంట్‌లో సున్నా స్థానానికి పరిమితమై, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని కూడా నిలబెట్టలేని బీఆర్‌ఎస్.. కంటోన్మెంట్ ఎన్నికల్లో కూడా ఓడిపోయిందన్నారు. పదేళ్లు మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. తాము రెండు సంవత్సరాల వ్యవధిలో రోడ్లు, డ్రైనేజీ, మం చినీటి సమస్య లేకుండా చేశామని, స్థానిక సమస్యలను పరిష్కరించామని తెలిపారు. జూబ్లీహిల్స్ ప్రజలు నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నవీన్‌యాదవ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ప్రజల ఆశీస్సులు తనకు మెండుగా ఉన్నాయని చెప్పారు.

## రాజ్‌భవన్‌లో ఈశాన్య ప్రాంత సాంస్కృతిక సందడి



తెలంగాణ- ఈశాన్య భారత కనెక్ట్ టెక్నో సాంస్కృతిక కార్యక్రమంలో గవర్నర్, జూపల్లి

సాక్షి, హైదరాబాద్: ఈశాన్య రాష్ట్ర కళాకారుల ప్రదర్శనతో శుక్రవారం సాయంత్రం రాజ్‌భవన్ ప్రాం గణం కళకళలాడింది. తెలంగాణ–ఈశాన్య భారత కనెక్ట్ టెక్నో సాం స్కృతిక ఉత్సవాల్లో భాగంగా శుక్ర వారం సాయంత్రం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు రాజ్‌భవ న్‌లో సంబంధిత వెబ్‌సైట్‌ను ప్రారం భించి ప్రచార సామగ్రిని ఆవిష్కరించా రు. ఈ సందర్భం గా ఇంఫాల్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ డ్యాన్స్ అకాడమీ కళా కారులు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని అసోం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. హైదరాబాద్‌లో స్థిరపడిన ఈశాన్య రాష్ట్రా లకు చెందిన ప్రజలు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఉత్సవం ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్, ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని, తెలంగాణ –ఈశాన్య రాష్ట్రాల మధ్య సాంస్కృతిక ఐక్యతను, సాంస్కృతిక సామర స్యాన్ని పెంపొం దిస్తుందని గవర్నర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రధాన కార్య దర్శి దాన కిశోర్, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టీనా జెడ్ చోంగ్తూ, మహిళా అభివృ ద్ధి శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

## విస్తృతంగా ఈవీ స్టేషన్లు

- 70 నుంచి 100% సబ్సిడీ..
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి
- విద్యుత్ అధికారులకు ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ సూచన



సాక్షి, హైదరాబాద్: విద్యుత్ వాహనాల కోసం చార్జిం గ్ కేంద్రాలను విస్తృతంగా పెంచాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నిర్ణయించింది. ఈ దిశగా ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసేందుకు రెడీ అవుతోంది. డిస్కం పరిధిలోని విద్యుత్ అధికారులతో సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ శుక్రవారం సమావేశమ య్యారు. కేంద్ర ప్రభుత్వ పథకం ప్రధానమంత్రి ఈ–డ్రైవ్ కింద ఈవీ స్టేషన్లకు దేశవ్యాప్తంగా రూ. 2 వేల కోట్లు వెచ్చిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోనూ ఈ–చార్జింగ్ స్టేషన్లు పెట్టుకునే వారికి కేంద్రం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఇప్పటి వరకూ ఈ పథకాన్ని సంప్రదాయేతర ఇంధన వనరుల విభాగం పర్య వేక్షించిందని, ఇక నుంచి దక్షిణ ప్రాంత విద్యుత్ పం పిణీ సంస్థ చేపడుతుందని తెలిపారు. క్షేత్రస్థాయి ఇం జనీర్లు పథక ప్రయోజనాలను ఔత్సాహికులకు వివ రించాలన్నారు.

**కేటగిరీ వారీగా సబ్సిడీ ఇలా...:** వివిధ కేటగిరీలకు పలు రకాలుగా కేంద్రం సబ్సిడీ ఇస్తుందని ముషారఫ్ తెలిపారు. ➤ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ కార్యాల యాలు, ప్రభుత్వ గృహ సముదా యాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభు త్వ విద్యాసంస్థలు, సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ కార్యాలయాలను కేటగిరీ ఏ కిందకు చేర్చారు. ఈ విభాగానికి వంద శాతం సబ్సిడీ ఇస్తారు. ➤ రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టులు, ఆయిల్ మాన్యుఫాక్చరింగ్ సంస్థల ఔట్‌లెట్స్, బస్‌స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, మున్సిపల్ పార్కింగ్, టోల్ ప్లాజాలు, జాతీయ రహదారుల పక్కన ఏర్పాటు చేసే ఈవీ స్టేషన్లను బీ కేటగిరీ కిందకు తెస్తారు. ఈ కేటగిరీకి 70 శాతం సబ్సిడీ ఉంటుంది. ➤ షాపింగ్ మాల్స్, నగర వీధులు, మార్కెట్ కాంప్లెక్స్‌లను సీ కేటగిరీ కిందకు చేర్చారు. వీటికి 80 శాతం సబ్సిడీ వస్తుంది.

➤ బ్యాటరీ మార్పిడి కేంద్రాలు, బ్యాటరీ చార్జింగ్ కేంద్రాలు, రెస్టారెంట్లు, పార్కింగ్ ప్రాంతాలు, జన సంచారం ఎక్కువగా ఉండే రాష్ట్ర పరిధిలోని రహదారులను డీ కేటగిరీ కిందకు చేర్చారు. వీటికి 80 శాతం సబ్సిడీ ఇస్తారు. అన్ని రకాల విద్యుత్ మౌలిక వసతులను డిస్కం కల్పిస్తుంది.

## 'స్మార్ట్' పోలీసింగ్‌తోనే సవాళ్లకు పరిష్కారం

- సైబర్ నేరాలు, టెక్నాలజీ వార్ ఐపీఎస్‌లకు కఠిన సవాళ్లు
- దళాల సమష్టితత్వం దేశ భద్రతను ప్రతిబింబిస్తుంది
- నేషనల్ పోలీస్ అకాడమీలో బీఎస్‌ఎఫ్ డీజీ దల్జీత్ సింగ్ చౌదరి
- 174 మంది ఐపీఎస్‌లు, 16 మంది విదేశీ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్



బీఎస్‌ఎఫ్ డీజీ నుంచి డైరెక్టర్స్ ట్రోఫీ అందుకుంటున్న అంజిత్ నాయర్. చిత్రంలో అమిత్ గార్గ్



బెస్ట్ ఔట్ డోర్ ప్రొబెషనర్‌గా గౌరవ ఖడ్గాన్ని స్వీకరిస్తున్న కీర్తి యాదవ్

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ విజన్ మేరకు స్మార్ట్ (ఎస్‌ఎమ్‌ఏఆర్‌టీ – స్ట్రిక్ట్ అండ్ సెన్సిటివ్, మోడ్రన్ అండ్ మొబైల్, అలర్ట్ అండ్ అకౌంటబుల్, రిలయబుల్ అండ్ రెస్పాన్సివ్, టెక్నోసావి అండ్ ట్రైన్డ్) పోలీసింగ్ నిర్వహణతో భవిష్యత్తు సవాళ్లకు పరిష్కారం వెతకాలని యువ ఐపీఎస్‌లకు సరిహద్దు భద్రతాదళం (బీఎస్‌ఎఫ్) డీజీ దల్జీత్‌సింగ్ చౌదరి సూచించారు. భారతదేశం పరివర్తనాత్మక మార్పులకు గురవుతున్న ఈ సమయంలో ఐపీఎస్ అధికారుల ముందు అనేక సవాళ్లు ఉన్నాయని అన్నారు. రాజేంద్రనగర్ శివరాం పల్లిలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో 77వ ఆర్‌ఆర్ (2024) ఐపీఎస్ బ్యాచ్‌లో మొదటి దశ శిక్షణ పూర్తి చేసుకున్న 174 మంది ఐపీఎస్‌లు సహా నేపాల్, భూటాన్, మాల్దీవులకు చెందిన 16 మంది కలిపి మొత్తం 190 మంది ప్రొబేషనరీ పోలీస్ అధికారుల పాసిం గ్‌అవుట్ పరేడ్ శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమా నికి దల్జీత్‌సింగ్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరై యువ ఐపీఎస్‌ల నుంచి గౌరవ వందనం స్వీకరిం చారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచి టాపర్‌గా నిలిచిన అంజిత్ ఎ నాయర్‌కు డైరెక్టర్స్ ట్రోఫీ సహా మొత్తం 9 మందికి ట్రోఫీలను బహూకరించారు. అనంతరం వారికి దిశానిర్దేశం చేశారు.

### సమన్వయం.. సమష్టితత్వం

ఆపరేషన్ సిందూర్ సమయంలో పోలీసులు, కేంద్ర సాయుధ దళాలు భుజంభుజం కలిపి పనిచేశాయని దల్జీత్‌సింగ్ తెలిపారు. అలాంటి సమ న్వయం మనదేశ భద్రతకు సమష్టి కృ షిని గుర్తు చేస్తుందని అన్నారు. సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు, టెక్నాలజీ వార్, రాడికలైజేషన్ వంటి కొత్త నేరాలతో పాటు ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవాదం దేశ అంతర్గత భద్రతకు ముప్పు కలిగిస్తున్నాయని చెప్పారు. 'మన ప్రజాస్వామ్య సంరక్షకులుగా మీరు (ఐపీఎస్‌లు) ధైర్యంగా ముందుండి నడిపించాలి. మానవ హక్కులను కాపాడుతూ ప్రజల సేవకు కట్టుబడి ఉం డాలి. ప్రజలకు పోలీసులు అందించే సేవలను పోలీస్ స్టేషన్ ప్రతిబింబిస్తుంది. 140 కోట్ల మంది భారతీయుల నమ్మకం ఐపీఎస్‌ల భుజాలపై ఉం ది'అని పేర్కొన్నారు. నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ గురించి ఎన్‌పీఏ డైరెక్టర్ అమిత్‌గార్గ్ వివరిం చారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ ఐపీఎస్‌లు, ప్రొబెషనరీ ఐపీఎస్‌ల కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.



**రూ.100 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా**
ధూల్‌పేట్‌లో రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏళ్లుగా వివాదంలో ఉన్న భూమికి విముక్తి కల్పించారు. -10లో



**వర్కేషన్‌కి సై..**
సిటీలో కార్పొరేట్ ఉద్యోగులు కొత్త కల్చర్‌కు తెరతీస్తున్నారు. టూర్లు, పిక్నిక్‌లతో పాటే పనైనా, ఉద్యోగమైనా అంటూ 'వర్కేషన్'కు జైకొడుతున్నారు. - సిటీప్లస్‌లో..

**గరిష్ఠం/కనిష్ఠం**
**30.0/23.0**

**వాతావరణం**
నగరంలో శనివారం ఉదయం చలిగాలులు వీస్తాయి. పగటిపూట పొడి వాతావరణం ఉంటుంది. గరిష్ఠంగా 30, కనిష్ఠంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

## పోలింగ్ రోజు సెలవు

**జూబ్లీహిల్స్ పరిధిలో మాత్రమే...**

**సాక్షి, సిటీబ్యూరో:** నవంబర్ 11వ తేదీన జూబ్లీహిల్స్ అసెంబ్లీకి ఉప ఎన్నిక పోలింగ్ జరగనున్న నేపథ్యంలో నియోజకవర్గంలో బోనఫైడ్ ఓటర్లుగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేసింది. అలాగే, ఇతర ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో పనిచేస్తున్నప్పటికీ జూబ్లీహిల్స్ నివాసిగా ఉండి ఓటరుగా పేరు నమోదు చేసుకున్న ఉద్యోగులకు కూడా స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేసింది. మరోవైపు జూబ్లీహిల్స్ పరిధిలోని విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు కూడా సెలవు ప్రకటిస్తూ సీఎస్ రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## 79కి చేరిన నామినేషన్లు

**బంజారాహిల్స్:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్ల పర్వం కొనసాగుతూనే ఉంది. శుక్రవారం ఒక్కరోజే 23 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇప్పటివరకు నామినేషన్లు వేసిన వారి సంఖ్య 79కి చేరింది. 63 మంది అభ్యర్థులు ఇప్పటివరకు నామినేషన్లు దాఖలు చేయగా 16 మంది రెండు సెట్ల నామినేషన్లను, మరొకరు మూడు సెట్ల నామినేషన్‌ను దాఖలు చేశారు. మొదటి రోజున 11 నామినేషన్లు దాఖలు కాగా, శుక్రవారం ఒక్కరోజే 23 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్లు వేసేందుకు చాలామంది ముందుకు వస్తుండడంతో శనివారం కూడా భారీగా నామినేషన్లు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. శుక్రవారం కాంగ్రెస అభ్యర్థి నవీన్‌యాదవ్ రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. రెండు రోజుల క్రితం బీఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత కూడా రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రధాన పార్టీల నుంచి బీజేపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు కావాల్సి ఉంది.

## కీసరలో కార్తీక మాసోత్సవాలకు ఏర్పాట్లు



క్యూలైన్ల వద్ద పూజలు..

**కీసర:** తెలంగాణలో ప్రసిద్ధ శైవ క్షేత్రమైన కీసర గుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 22 నుండి నవంబర్ 20వ తేదీ వరకు నిర్వహించనున్న కార్తీక మాసోత్సవాల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం దేవాలయం వద్ద క్యూలైన్ల ఏర్పాట్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరానికి చేరువలో ఉన్న కీసర గుట్టకు కార్తీక మాసం సందర్భంగా పెద్దఎత్తున భక్తులు తరలివస్తారని చెప్పారు. స్వామివారి దర్శనానంతరం ఇక్కడ పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించడం, వనభోజనాలు ఏర్పాటు చేసుకోవడం కుడా జరుగుతుందన్నారు. యాత్రికుల సౌకర్యార్థం క్యూలైన్ల ఏర్పాట్లు, మంచినీరు, శానిటేషన్, వాహనాల పార్కింగ్ తదితర సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు.

## కూకట్‌పల్లి కిటకిట



విపరీతమైన రద్దీ..ఒక్కసారిగా రోడ్డెక్కిన ట్రావెల్స్, సిటీ బస్సులు. ఇళ్లకు బయలుదేరిన ఉద్యోగులు, విద్యార్థులతో కూకట్‌పల్లి ప్రాంతం శుక్రవారం సాయంత్రం కిక్కిరిసింది. శనివారం బంద్, ఆది, సోమవారాలు దీపావళి సెలవు దినాలు కలిసి రావడంతో సిటీ జనులు పెద్ద ఎత్తున సొంతూళ్లకు బయలుదేరారు. దీంతో సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఈ ప్రాంతంలో భారీ రద్దీ కన్పించింది. మరోవైపు గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్‌లతో జనం ఇబ్బంది పడ్డారు.

- సాక్షి, సిటీబ్యూరో



# మజ్లిస్ బేషరతు మద్దతు!

**జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పోటీకి ఎంఐఎం దూరం**

- కాంగ్రెస్‌కు కలిసి రానున్న మజ్లిస్ ఓటు బ్యాంక్
- నవీన్ యాదవ్ గెలుపొందాలని ఆకాంక్షించిన అసదుద్దీన్



**సాక్షి, సిటీబ్యూరో:** అందరూ ఊహించినట్లే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌కు మజ్లిస్ పార్టీ పరోక్షంగా బేషరతు మద్దతు ప్రకటించింది. ఉప ఎన్నికల బరిలో దిగడం లేదని స్పష్టం చేసిన మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ..పదేళ్ల అవకాశం కల్పించినా అభివృద్ధి పనులు చేయడంలో విఫలమైన బీఆర్‌ఎస్‌తో పాటు రాష్ట్రంలో బీజేపీని నిలువరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో మిగిలిన మూడేళ్లలో అభివృద్ధి పనుల కోసం నవీన్ యాదవ్‌ను ఎన్నుకోవాలని ఆయన సూచించడాన్ని బట్టి పరోక్షంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు చెప్పకనే చెప్పినట్లయింది. వాస్తవంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం ఖరారు కాక ముందే... ఉప ఎన్నికల్లో యువ నేత బరిలో దిగుతున్నాడని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ప్రకటించారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ సీనియర్లను కాదని యువనేత నవీన్ యాదవ్ అభ్యర్థిత్వం ఖరారు చేసింది. గత కొన్ని పర్యాయాలుగా నియోజకవర్గంలో పాగా వేసేందుకు ప్రయత్నించిన మజ్లిస్ పార్టీ ఈసారి ఎన్నికల పోరుకు దూరం పాటిస్తోంది.

**దోస్తానా కోసం..**

రాష్ట్రంలోని అధికార పార్టీ దోస్తానా కోసం మజ్లిస్ పార్టీ ఎలాంటి నిర్ణయానికైనా సిద్ధమయ్యే ఆనవాయితీ ఉంది. పార్టీ రాజకీయ వ్యూహంలో భాగంగా తాము ప్రాతినిధ్యం వహించే పాతబస్తీ అసెంబ్లీ సెగ్మెంట్లలోఅభివృద్ధి పనుల కోసం రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో కలిసి నడిచే చరిత్ర మజ్లిస్‌కు ఉంది. అందులో భాగంగానే జూబ్లీహిల్స్‌లో మొత్తం ఓట్లలో మూడో వంతు మైనారిటీ ఓట్లు ఉన్నా..గతంలో ఒకసారి బీఆర్‌ఎస్ దోస్తానా కోసం తాజాగా కాంగ్రెస్ స్నేహం కోసం జూబ్లీహిల్స్ ఎన్నికల పోరుకు దూరం పాటిస్తోంది. మజ్లిస్ పార్టీ గత రెండు పర్యాయాలుగా జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్‌పై పాగా వేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసింది. తెలంగాణ ఆవిర్భావ సమయంలో బరిలో దిగి ఢీ..అంటే ఢీ అనే విధంగా పోటీ పడి స్వల్ప ఓట్ల తేడాతో రెండో స్థానంలో నిలిచిన మజ్లిస్ పార్టీ..ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో అప్పటి అధికార పక్షం బీఆర్‌ఎస్‌తో దోస్తీ కోసం బరిలో దిగలేదు. ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం పోటీ చేసినప్పటికి పరాజయం తప్పలేదు. తాజాగా అధికార కాంగ్రెస్‌తో సత్సంబంధాలు కలిగి ఉండటంతో ఉప ఎన్నికల బరిలో దిగకుండా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు పరోక్షంగా మద్దతు ప్రకటించింది.

### అభివృద్ధి కోసం.. నవీన్ గెలవాలి: అసదుద్దీన్

జూబ్లీహిల్స్ నియోజవర్గంలో అభివృద్ధి పనుల కోసం నవీన్ యాదవ్ గెలువాలని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఆకాంక్షించారు. శుక్రవారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్ వేసినంతరం తహసీల్ ఆఫీస్‌కు దగ్గరలో పర్యటిస్తున్న మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఉప ఎన్నికల్లో గెలిచి అన్ని వర్గాలను కలుపుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు బీఆర్‌ఎస్‌కు పదేళ్లు అవకాశం కల్పించినా..అదే పార్టీ అధికారంలో ఉన్నా అభివృద్ధి పనులు చేపట్టడంలో విఫలమైందని దుయ్యబట్టారు. మరో మూడేళ్లు మిగిలి ఉంది కాబట్టి నవీన్‌కు అవకాశం ఇస్తే అభివృద్ధి జరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ ఓట్లు బీజేపీకి మారుతున్నాయని, బీజేపీని నిలువరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఒవైసీ అభిప్రాయపడ్డారు.



# సంపులో పడి చిన్నారి మృతి

- అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి మృత్యుఒడికి
- నానక్‌రాంగూడలో ఘటన

**గచ్చిబౌలి:** ఉదయం ఆడుతు పాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన ఓ చిన్నారి సమీపంలోని ఓ సంపులో పడి మృత్యువాత పడ్డాడు. ఈ విషాదకర సంఘటన నానక్‌రాంగూడలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెల్పిన వివరాల ప్రకారం..స్థానిక ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. టీఎన్‌జీఓ కాలనీలో డ్రైవర్‌గా పనిచేసే పరమేశ్వర్, సంధ్యారాణి దంపతులు కుమారుడు నిఖిల్ తేజ(4)ను వారు ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించారు. ప్రతి రోజూ నిఖిల్ ఇతర చిన్నారులతోపాటు ఆటోలో వస్తుంటాడు. శుక్రవారం కూడా నిఖిల్ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి..కొద్ది సేపు ఆడుకుంటూ కేంద్రం సమీపంలోని ఓ నీటి సంపు వద్దకు వెళ్లి అందులో పడిపోయాడు. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. సాయంత్రం అందరూ వెళ్లిపోయే సమయంలో ఆటో డ్రైవర్‌కు నిఖిల్ కనిపించలేదు. ఈ విషయాన్ని అతని తండ్రి పరమేశ్వర్‌కు ఫోన్ చేసి మీ బాబు కనిపించలేదని చెప్పాడు. దీంతో తండ్రి పరమేశ్వర్ హడావుడిగా తిరిగి అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి ఎంత వెదికినా ఫలితం లేకుండా పోయింది. చివరగా సంపును గమనించగా దానిపై మూతపెట్టి..దానిపైన పెద్ద రాయి కూడా ఉంది. దాన్ని తొలగించి అందులో చూడగా బాబు కనిపించాడు. దీంతో తల్లిదండ్రులిద్దరు కన్నీరుమున్నీరయ్యారు. స్థానికులు బాబును బయటకు తీసి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు.



నిఖిల్ తేజ్ (ఫైల్)

# ఇక మెట్రో స్వాధీన ప్రక్రియ వేగవంతం..

- వివిధ విభాగాల మధ్య సమన్వయం
- రెండోదశ అనుమతులపై కేంద్రంతో సంప్రదింపులు

**చీఫ్ సెక్రటరీ నేతృత్వంలో కమిటీ**

**సాక్షి, సిటీబ్యూరో:** మెట్రో మొదటి దశ ప్రాజెక్టును స్వాధీనం చేసుకొనే ప్రక్రియపైన ప్రభుత్వం సీరియస్‌గా దృష్టిసారించింది. వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని వేగవంతం చేసి వీలైనంత తక్కువ వ్యవధిలో ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించింది.ఈ క్రమంలోనే చీఫ్‌సెక్రెటరీ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆర్థిక, న్యాయ, మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖలకు చెందిన కార్యదర్శులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ మెట్రో మొదటి దశపైన ఎల్అండ్‌టీతో ఏర్పాటు చేసుకున్న ఒప్పందం మేరకు అన్ని అంశాలపైన సమగ్రమైన అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికను అందజేయనుంది. ఈ నివేదిక ఆధారంగా మెట్రో స్వాధీన ప్రక్రియను వీలైనంత తక్కువ వ్యవధిలో పూర్తిచేయాలని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో ఎల్అండ్‌టీతో కలిసి నిర్మించిన మెట్రో మొదటి దశ ప్రాజెక్టు నిర్వహణలోని అంశాలను పరిగణనలోకి తీసుకొని రెండోదశపైన కేంద్రం పలు సందేహాలను లేవనెత్తిన సంగతి తెలిసిందే. అనంతర పరిణామాల్లో ఈ ప్రాజెక్టు నుంచి వైదొలగనున్నట్లు ఎల్అండ్‌టీ పేర్కొన్నది. ఈ మేరకు ప్రభుత్వానికి, ఎల్అండ్‌టీ సంస్థకు మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఆస్తులు, అప్పులు, మెట్రో నిర్వహణ, తదితర అంశాలపైన సమగ్రమైన అధ్యయనం చేసి నివేదికను రూపొందించనున్నారు.



**కేబినెట్ సబ్‌కమిటీకి నివేదిక....**

సాంకేతిక, న్యాయపరమైన అంశాలపైన ఈ కమిటీ దృష్టి సారించనుంది. అలాగే ఎల్అండ్‌టీకి వివిధ ప్రాంతాల్లో అప్పగించిన భూములను, ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆ సంస్థకు చెల్లించనున్న రూ.2000 కోట్ల చెల్లింపులకు సంబంధించిన విధివిధానాలపైన కూడా సీఎస్ నేతృత్వంలోని ఉన్నతాధికారుల కమిటీ కార్యాచరణ రూపొందించనుందని హెచ్ఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. ఎల్అండ్‌టి వైదొలగనున్న దృష్ట్యా రూ.13000 కోట్ల బ్యాంకు రుణాలను కూడా ప్రభుత్వమే భరించనుంది. అలాగే ఇప్పటికే ఎల్అండ్‌టీ నుంచి వివిధ సంస్థలకు లీజుకు ఇచ్చిన మాల్స్, భూముల యాజమాన్యాన్ని కూడా ప్రభుత్వానికి బదిలీ చేయవలసి ఉన్నది. ఈ మేరకు ఎల్అండ్‌టీతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు కొనసాగిస్తూ ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి స్పష్టత వచ్చేవిధంగా చర్యలు చేపట్టనున్నారు. సీఎస్ నేతృత్వంలోని కమిటీ తన నివేదికను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని కేబినెట్ సబ్‌కమిటీకి అందజేయనుంది.

**రెండోదశకు మార్గం సుగమం...**

మెట్రో రెండోదశ ప్రాజెక్టును ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. కానీ కేంద్రం నుంచి అనుమతి లభించకపోవడం వల్ల ఈ ప్రాజెక్టులో ప్రతిష్టంభన నెలకొంది. పీపీపీ పద్ధతిలో కొనసాగే మొదటి దశకు, ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించనున్న రెండోదశకు మధ్య సరైన సమన్వయం కుదరకపోవడం వల్ల కేంద్రం పలు అంశాలను ప్రస్తావించింది. సీఎస్ నేతృత్వంలోని కమిటీ ఈ అంశాలపైన కూడా దృష్టి సారించనుంది. 'ఎల్ అండ్‌టీ వైదొలగిన అనంతరం రెండో ప్రాజెక్టులు పూర్తిగా ప్రభుత్వ యాజమాన్యంలోకి వస్తాయి.దీంతో ఇప్పుడు స్తబ్దత నెలకొన్న అన్ని అంశాలపైన కూడా స్పష్టత వస్తుంది.' అని హెచ్ఎంఆర్ఎల్ అధికారి ఒకరు తెలిపారు.మొత్తం 8 మార్గాల్లో నిర్మించనున్న రెండోదశ పైన కేంద్రానికి డీపీఆర్‌లను సమర్పించి ఏడాది కావస్తున్నప్పటికీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో సీఎస్ కమిటీ అన్ని విధాలుగా ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు దోహదం చేయగలదని భావిస్తున్నారు.

**ఒక్క లైన్ పట్టాలెక్కినా చాలు..**

నిజానికి రెండో దశలో ప్రతిపాదించిన అన్ని మార్గాలను 2028 నాటికి పూర్తి చేసి ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ కేంద్రం నుంచి ఏ విధమైన సహకారం లభించకపోవడంతో తీవ్ర జాప్యమైంది. ఇప్పుడు ఎల్అండ్‌టీ నుంచి ప్రాజెక్టును స్వాధీనం చేసుకోనున్న దృష్ట్యా మూడేళ్లలో రానున్న ఎన్నికల నాటికి ఏదో ఒక మార్గంలో మెట్రో కారిడార్‌ను నిర్మించాలని భావిస్తున్నారు. పాతబస్తీ రూట్‌లో ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ప్రతిపాదించిన 7.5 కి.మీ.ల మార్గాన్ని చేపట్టి ఎన్నికల నాటికి కొంతమేరకు పురోగతి సాధించినా ఆశించిన ఫలితాలను పొందవచ్చునని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు.

# బైక్స్ అండ్ కార్స్.. సేల్స్ అదుర్స్!

**జీఎస్టీ తగ్గింపుతో నగరంలో పెరిగిన అమ్మకాలు**



**దసరా సేల్స్ ఇలా..**

**2025 సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు...**

| వాహనాలు | సంఖ్య | ఆదాయం (రూ.కోట్లలో) |
|---|---|---|
| ద్విచక్ర వాహనాలు | 41,089 | 55.63 |
| కార్లు | 13,022 | 289.55 |
| క్యాబ్‌లు | 1,224 | 14.90 |
| మొత్తం | 55,332 | 360.08 కోట్లు |

**2024 అక్టోబర్ 1 నుంచి 14 వరకు అమ్మకాలు**

| వాహనాలు | సంఖ్య | ఆదాయం (రూ.కోట్లలో) |
|---|---|---|
| ద్విక్ర వాహనాలు | 38,955 | 48.64 |
| కార్లు | 9768 | 224.71 |
| క్యాబ్‌లు | 856 | 11.65 |
| మొత్తం | 49,579 | 284.99 కోట్లు |

- దసరా సీజన్‌లో 55,332 వాహనాల విక్రయం
- సర్కార్‌కు రూ.360.08 కోట్ల ఆదాయం
- ఈ ఏడాది డిసెంబర్ వరకు ఇదే స్పీడ్



**సాక్షి, సిటీబ్యూరో:** నగరంలో వాహనాల అమ్మకాలు టాప్‌గేర్‌లో పరుగులు తీస్తున్నాయి. గత నెలలో జీఎస్టీ తగ్గించినప్పటి నుంచి అమ్మకాలు ఊపందుకున్నాయి. దసరా సందర్భంగా కేవలం 12 రోజుల వ్యవధిలో 55 వేలకు పైగా వాహనాలు అమ్ముడయ్యాయి. ఈ వాహనాలపైన జీవితకాల పన్ను రూపంలో రవాణాశాఖకు సుమారు రూ.360.08 కోట్ల ఆదాయం లభించింది. గతేడాది కంటే ఇది ఎక్కువ. అలాగే ఈ దీపావళి సందర్భంగా కూడా అమ్మకాల జోరు అదేవిధంగా కొనసాగుతున్నట్లు ఆటోమొబైల్ డీలర్స్ తెలిపారు. ఈ ఏడాది ఆరంభం నుంచి వాహనాల అమ్మకాల్లో కొంత వరకు స్తబ్దత నెలకొంది. జీఎస్టీ తగ్గించనున్నట్లు కేంద్రం ప్రకటించిన అనంతరం జూలై, ఆగస్టు నెలల్లో అమ్మకాలు భారీగా తగ్గాయి. సెప్టెంబర్ 22 నుంచి ఒక్కసారిగా ఊపందుకున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ వరకు కూడా ఈ ఊపు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని ఆటోమొబైల్ వర్గాలు పేర్కొంటున్నాయి. రూ.10 లక్షల నుంచి రూ.13 లక్షల ఖరీదైన కార్లకు డిమాండ్ భారీగా పెరిగింది. ఈ కేటగిరీకి చెందిన వాహనాలకే బుకింగ్ ఆర్డర్‌లు ఎక్కువగా వస్తున్నాయని డీలర్లు చెప్పారు.

**సొంత కారు కల సాకారం...**

అనూహ్యంగా పెరిగిన వాహనాల ధరల దృష్ట్యా వాహనం కొనుగోలు చేయలేని మధ్యతరగతి వేతనజీవుల 'సొంత కారు' కల జీఎస్టీ తగ్గింపుతో సాకారమవుతోంది. తమ చిరకాల వాహనయోగ కోరికను తీర్చుకొనేందుకు కొనుగోలుదారులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నారు. దసరా సందర్భంగా గత నెల 22వ తేదీ నుంచి ఈ నెల 3వ తేదీ వరకు 13,,022 కార్లు, మరో 1221 క్యాబ్‌లు, అలాగే 41,089 ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. మరోవైపు గత సంవత్సరం (దసరా సందర్భంగా) అక్టోబర్ 1వ తేదీ నుంచి 14వ తేదీ వరకు 9,768 కార్లు, 856 క్యాబ్‌లు, 38,955 ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. గతేడాది కంటే వాహనాల విక్రయాలు పెరిగినట్లు ఆర్టీఏ అధికారులు తెలిపారు. ఈ దీపావళి పర్వదినం సందర్భంగా కూడా అదే జోరు కనిపిస్తుందని పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపుతో పాటు వివిధ శ్రేణులకు చెందిన వాహనాలపైన ఆటోమొబైల్ డీలర్‌లు సైతం ప్రత్యేక ఆఫర్‌లు, రాయితీలను ప్రకటించారు. దీంతో ధరల తగ్గింపులో ఆకర్షణీయమైన వ్యత్యాసం కనిపిస్తోంది. ఈ విధంగా కూడా చాలామంది కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నారు.

**మూడు నెలల వరకు బుకింగ్‌లు..**

'కొన్ని కేటగిరీలకు చెందిన వాహనాలు ప్రస్తుతం అందుబాటులో లేవు.దీంతో చాలా మంది వెయిటింగ్‌లో ఉన్నారు. 3 నెలల వరకు కూడా ఇప్పటికే బుక్ అయ్యాయి.' అని సోమాజిగూడ ప్రాంతానికి చెందిన ఒక డీలర్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో రోజుకు 1500 నుంచి 2000 వరకు కొత్త వాహనాలు నమోదవుతాయి. వాటిలో 400 నుంచి 500 వరకు కార్లు ఉంటే మిగతావి ద్విచక్ర వాహనాలే.' ఇప్పుడు హైదరాబాద్‌తో పాటు తెలంగాణ అంతటా వాహనాల అమ్మకాలు పెరిగినట్లు బేగంపేట్‌కు చెందిన ఒక ఆటోమొబైల్ డీలర్ చెప్పారు. జీఎస్టీ తగ్గింపు ప్రభావం హైఎండ్ వాహనాల కంటే చిన్న కార్లపైన ఎక్కువగా ఉంది. రూ.20 లక్షల కంటే తక్కువ ఖరీదైన వాహనాల ధరలు తగ్గాయి. ఈ ధరల్లో వివిధ రకాల బ్రాండ్‌లకు చెందిన వాహనాలపైన సుమారు రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు తగ్గడంతో కొనుగోళ్లు పెరిగాయి. జీఎస్టీ తగ్గింపుతో పాటు ఆటోమొబైల్ డీలర్లు సుమారు రూ.50,000 నుంచి రూ.80,000 వరకు ధరల తగ్గింపుతో ఆఫర్‌లను, రాయితీలను అందజేస్తున్నారు.

## ధూల్‌పేట్‌లో రూ.100 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా

అక్రమ నిర్మాణాల తొలగింపు



**అబిడ్స్:** ధూల్‌పేట్‌లో రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గత కొన్నేళ్లుగా సదరు భూమిపై ఓ రౌడీ షీటర్, రెవెన్యూ శాఖ మధ్య వివాదం కొనసాగుతోంది. కొన్నేళ్ల క్రితం ఈ భూమిలో కొన్ని అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేసినా భూమి తమదేనంటూ సదరు రౌడీషీటర్ షెడ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఇటీవల ఈ భూమిని కాపాడాలని హైడ్రాకు అధికారులు, స్థానికులు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం ధూల్‌పేట శివలాల్‌నగర్ ప్రాంతంలో హైడ్రా కూల్చివేతలను చేపట్టింది. దాదాపు రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. ధూల్‌పేట్ శివలాల్‌నగర్ ప్రాంతంలోని సర్వే నంబర్ 50 లో 2.30 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఓ రౌడీ షీటర్ షెడ్లు నిర్మించి వినాయక విగ్రహాల తయారీదారులకు అద్దెకు ఇస్తున్నాడు దీనిపై స్థానికుడు ప్రజావాణిలో హైడ్రాకు ఫిర్యాదు చేశాడు. అంతేగాక హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కూడా సదరు భూమిని కాపాడాలని హైడ్రాను కోరారు. దీనిపై స్పందించిన హైడ్రా అధికారులు రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ భూమిగా గుర్తించారు. ఈ స్థలం తనదంటూ వాదిస్తున్న వ్యక్తికి న్యాయస్థానంలోనూ చుక్కెదురు కావడంతో హైడ్రా అధికారులు జేసీబీల సహాయంతో ఆక్రమణలను కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి కూల్చివేతలు చేపట్టగా, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మద్యం దరఖాస్తులకు నేడే ఆఖరు

**సాక్షి, సిటీబ్యూరో:** మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ శనివారం ( 18వ తేదీ) ముగియనుంది. ఇప్పటి వరకు సికింద్రాబాద్, హైదరాబాద్ పరిధిలోని 179 మద్యం షాపులకు శుక్రవారం సాయంత్రం వరకు 1809 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. శనివారం మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ కావడంతో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఇప్పటి వరకు 10 వేల దరఖాస్తులు అందాయన్నారు. మరోవైపు తెలంగాణ వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం వరకు సుమారు 20 వేల దరఖాస్తులు అందాయి.



# అప్పులు తీర్చుకునేందుకే...

**ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి వృద్ధ దంపతులపై దాడి**

- బంగారు నగలతో కేర్ టేకర్ పరారీ
- నిందితుడి అరెస్ట్
- 67 తులాల బంగారు నగలు, సెల్‌ఫోన్ స్వాధీనం

**కవాడిగూడ:** ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, జల్సాలకు అలవాటు పడి తాను పనిచేస్తున్న ఇంటి యజమానులపై దాడి చేసి వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన కేసులో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సెంట్రల్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ శిల్పవల్లి వివరాలు వెల్లడించారు. హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్-6 హెరిటేజ్ అపార్ట్‌మెంట్‌లో ఆనందరావు, అనసూయ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు నగరంలోనే వేర్వేరు ప్రాంతాల్లో నివాసం ఉంటుండగా కుమారుడు విదేశాల్లో ఉంటున్నాడు. వృద్ధులైన ఆనందరావు, అనసూయ ఆలనా పాలనా చూసేందుకు ఓ ఏజెన్సీ ద్వారా కృష్ణా జిల్లా, ఉయ్యూరు మండలం, కంకిపాడు గ్రామానికి చెందిన గోవర్ధన్‌ను ఎనిమిది నెలల క్రితం కేర్‌టేకర్‌గా నియమించుకున్నారు. ప్రతి రెండు రోజులకోకసారి వారి కుమార్తెలు తల్లిదండ్రులను చూసి వెళ్లేవారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పుల పాలైన గోవర్ధన్ అప్పులు తీర్చుకునేందుకు వృద్ధుల ఒంటిపై ఉన్న బంగారు నగలు కాజేయాలని పథకం పన్నాడు. ఈ నెల 12న ఆనందరావు బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండటంతో వారిని చూసేందుకు ఇంటికి ఎవరూ రారని తెలుసుకున్న గోవర్ధన్ పథకం ప్రకారం అదే రోజు సాయంత్రం వారిపై దాడి చేసి వారి వద్ద ఉన్న బంగారు నగలు దోచుకొని ఇంటి బయట గడియపెట్టి పారిపోయాడు. మర్నాడు ఉదయం పని చేసేందుకు ఇంటికి వచ్చిన పనిమనిషి బయటి నుంచి గడియపెట్టి ఉండటాన్ని గుర్తించి, అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా ఆనందరావు, అనసూయ రక్తపు మడుగులో పడి ఉన్నారు. దీంతో ఆమె డీడీ కాలనీలో ఉంటున్న వారి బంధువు శ్రీధర్‌రావుకు సమాచారం అందించింది. అతడి సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితులను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారి అల్లుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన దోమలగూడ పోలీసులు కేర్ టేకర్‌గా ఉన్న గోవర్ధన్‌పై అనుమానంతో అతడిపై నిఘా ఉంచారు. శుక్రవారం నిందితుడు గోవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతడి నుంచి 67 తులాల బంగారు నగలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి

## నగరంలో నేడు

- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో చిత్రకారులు మద్దిలేటి, తేజలు వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శివోహం పేరిట కళాకారిణి శిల్పా కాసు వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

## నిమ్స్‌లో వైద్య విద్యార్థి అనుమానాస్పద మృతి

**లక్డీకాపూల్ :** నిమ్స్‌లో వైద్య విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. వివరాల ప్రకారం.. అనస్థీషియా స్టోర్ రూమ్‌ను శుభ్రపర్చేందుకు తలుపు తీసేందుకు వర్కర్ ప్రయత్నింగా.. విద్యార్థి కిందపడిపోయి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గురువారం రాత్రి విధులకు హాజరుకాగా.. శుక్రవారం ఉదయం ట్రామా బ్లాక్ మూడో అంతస్తులోని అనస్థీషియా స్టోర్ రూమ్‌లో విగతజీవిగా వైద్య విద్యార్థి పడిఉండటం చూసి ఆస్పత్రిలో విషాద వాతావరణం నెలకొంది. మెదక్ జిల్లా కొల్చారం మండలం అంసానిపల్లికి చెందిన రమావత్ నితిన్ నిమ్స్‌లో బీఎస్సీ ల్యాబ్ టెక్నికల్ కోర్సు చేస్తున్నాడు. నాలుగేళ్ల కాలపరిమితి కలిగిన కోర్సులో భాగంగా ఒక సంవత్సరం పాటు ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో మరో మూడు నెలల్లో ఇంటర్న్‌షిప్ కానుంది. బోరబండలోని గిరిజన వసతి గృహంలో ఉంటూ ఈ కోర్సును పూర్తి చేస్తున్నాడు. పంజాగుట్ట పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పని ఒత్తిడే దీనికి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. నిమ్స్ ఆస్పత్రి ఓ మంచి విద్యార్థిని కోల్పోయిందని డైరెక్టర్ నగరి బీరప్ప అన్నారు. నితిన్ చనిపోడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు మాకు సెమీ ఫైనల్స్

**రాంగోపాల్‌పేట్:** రాబోయే ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని బలపరచి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావాలని ఆ ఎన్నికలకు ఇప్పటి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు సెమీ ఫైనల్స్ అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని వెస్లీ కళాశాలలో నిర్వహించిన క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ క్రిస్టియన్, దళిత, మైనార్టీ, పేద వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ క్రిస్టియన్ల సమస్యలను ఏ నాడు పట్టించుకోలేదన్నారు. క్రైస్తవులకు రంగారెడ్డి, కీసర, శంషాబాద్‌లో కేటాయించిన భూమి విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో దళిత, క్రిష్టియన్, మైనార్టీ వర్గాలు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

### ప్రాణమున్నంత వరకు కాంగ్రెస్‌లోనే

2023 ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నాయకులు ఫోన్ చేసి చొప్పదండి టికెట్‌తో పాటు రూ.50 కోట్లు ఇస్తామని పోటీ చేయాలని కోరానని అయినా తన ప్రాణమున్నంత వరకు కాంగ్రెస్‌లోనే ఉంటానని చెప్పినట్లు అడ్లూరి అన్నారు. గెలిచాక కూడా బీఆర్ఎస్, బీజేపీ నుంచి పిలుపు వచ్చిందని చెప్పారు. సామాన్య కార్యకర్తనైన తనకు 2023 ఎన్నికల్లో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి టికెట్ ఇవ్వడంతో పాటు కేబినెట్‌లో అవకాశం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో కాంచీపురం ఎంపీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఇన్‌చార్జ్ పీ విశ్వనాథ్, మంత్రి అడ్లూరి సతీమణి, దార కాంతికుమారి, రెవరెండ్ మోహన్‌బాబు, ఫాదర్ రాజు అబ్రహాం, ఫాదర్ అంటయ్య, రెవరెండ్ యేసు రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్

## అప్పులు రూ.75 లక్షలు.. కేసులు 7..

ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్



**బంజారాహిల్స్:** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున పి.నవీన్‌యాదవ్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాల్లో కీలకమైన అఫిడవిట్‌ను ఆయన జతపర్చారు. ఈ మేరకు తనపై ఏడు క్రిమినల్ కేసులు ఉన్నట్లుగా పేర్కొన్నారు. చేతిలో నగదు రూ.4 లక్షలు, భార్య చేతిలో రూ.2 లక్షలు నగదు ఉందని, ఐదు బ్యాంక్ ఖాతాల్లో రూ.37.6 లక్షలు తన పేరు, తన భార్య పేరున రెండు అకౌంట్లలో రూ.10 వేలు నిల్వ ఉన్నట్లు చెప్పారు. రూ. 7 లక్షల విలువైన షేర్లు ఉన్నాయని, తన పేరున స్కోడా కారు, తన భార్య పేరిట హుండాయ్ ఐ10 కారు ఉన్నట్లు తెలిపారు. తన వద్ద 11 తులాల బంగారం, తన భార్య పేరున రెండు కేజీల బంగారం, 15 కిలోల వెండి ఉన్నట్లు పేర్కొన్నారు. తన పేరున 14.39 ఎకరాల వ్యవసాయ భూమి, యూసుఫ్‌గూడలో 860 గజాల ఇంటి స్థలం, భార్య పేరుతో 4.30 ఎకరాల వ్యవసాయ భూమి, 466 గజాల స్థలంలో ఇళ్లు ఉన్నాయన్నారు. మొత్తం స్థిరాస్తుల విలువ రూ.29.66 కోట్లు తన పేరిట, రూ.5.75 కోట్లు భార్య పేరిట ఉన్నాయన్నారు. తనకు అప్పులు రూ.75 లక్షలు ఉన్నట్లుగా అఫిడవిట్‌లో పొందుపర్చారు.

# ప్రతి శుక్రవారం పాతబస్తీలోనే...

**చార్మినార్:** ఇకపై ప్రతి శుక్రవారం పాతబస్తీలోనే ఉంటానని నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ అన్నారు. శుక్రవారం ఆయన పురానీహవేలీ లోని చరిత్రాత్మక కొత్వాల్ హౌస్‌ను సందర్శించి స్థానికుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇకపై ప్రతి శుక్రవారం (జుమాకు జుమ్మా) పాత పోలీస్ కమిషనర్ (కొత్వాల్ హౌస్) కార్యాలయంలో అందుబాటులో ఉంటానని ఆయన వెల్లడించారు. గతంలో ఇక్కడ పోలీస్ కమిషనర్ (కొత్వాల్ హౌస్) కార్యాలయం కొనసాగేది. ఈ కార్యాలయం బషీర్‌బాగ్‌కు మారడంతో పాత పోలీస్ కమిషనర్ కార్యాలయంగా పని చేస్తోంది. సదరు భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అవసరమైన మరమ్మతులు చేపట్టి తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చారు. నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటిసారి పాత బస్తీలోని కొత్వాల్ హౌస్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఫిర్యాదు దారులతో పాటు స్థానిక ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను విని పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, "1920 నుంచి 2002 వరకు హైదరాబాద్ సిటీ పోలీస్ ప్రధాన కార్యాలయంగా పనిచేసిన కొత్వాల్ హౌస్ నగర వారసత్వంలో కీలక భాగంగా మారిందన్నారు మారిందన్నారు. ఈ చారిత్రాత్మక భవనం అద్భుతంగా పునరుద్ధరించడం ఆనందంగా ఉందన్నారు. ఇందులో భాగమైన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.



పాత పోలీస్ కమిషనర్ కార్యాలయం వద్ద ఫిర్యాదులను స్వీకరిస్తున్న సీపీ సజ్జనర్

### ప్రజలకు మరింత చేరువయ్యేందుకే..

ఇక నుంచి ప్రతి శుక్రవారం పాతబస్తీ పురానిహవేలీ లోని కొత్వాల్ హౌస్‌లో తిష్ట వేసి స్థానిక ప్రజలకు కలుసుకునేందుకు అందుబాటులో ఉంటానని సీపీ తెలిపారు. తాము చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు, పోలీసుల మధ్య మరింత దగ్గరి సంబంధం ఏర్పడుతుందన్నారు. బాధితుల సమస్యలు తక్షణమే పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ఎప్పటికప్పుడు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగర ప్రజలు స్వేచ్ఛగా తమను సంప్రదించి, నేరరహిత నగర నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీసీపీ అపూర్వా రావు, దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రాలతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కృత్రిమ మేధస్సుతో మానవ మేధస్సును మిళితం చేయాలి



సదస్సులో పాల్గొన్న అతిథులు

**బంజారాహిల్స్:** కృత్రిమ మేధస్సుతో మానవ మేధస్సును మిళితం చేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే కేశవరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ శాఖ, తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో 'కృత్రిమ మేధస్సు యుగంలో జర్నలిజం భవిష్యత్తు, అవకాశాలు, సవాళ్లు' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేశవరావు మాట్లాడుతూ విలువలతో కూడిన సమాచార వ్యాప్తి అవసరమన్నారు. మనస్సాక్షిని మించిన సాంకేతికత లేదని, వార్తల పునః సమీక్ష, తనిఖీ తప్పనిసరని అన్నారు. వార్తా విలువలను సాంకేతికతతో జతచేసి ఖచ్చితత్వం, ప్రామాణికతతో పాత్రికేయ వృత్తి కొనసాగాలని సూచించారు. వార్తల సేకరణ, ప్రక్రియను సులభతరం చేయడానికి కృత్రి మేధ అధునాతన సాధనమన్నారు. ఆంధ్రకేసరి వర్సిటీ వీసీ డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల క్రితం ఏది వార్త, ఏది వార్త కాదో స్పష్టంగా తెలిసేదన్నారు. ప్రస్తుతం ఎలాంటి తనిఖీ చేయకుండానే ప్రతి ఒక్కటి వార్తగా మారిపోయిందన్నారు. దేశంలో వార్త సంపాదకీయానికి సరైన నియంత్రణ లేదన్నారు. కార్యక్రమంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అదనపు డైరెక్టర్ జనరల్ శృతిపాటిల్, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, విజయకృష్ణారెడ్డి, శ్రీనివాస్ వడ్లాణం, యాదగిరి, సునీల్‌కుమార్, ప్రొఫెసర్లు సుధారాని, పల్లవి కాబ్దే, దయాకర్, వెంకటరమణ, వెంకటయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆటోడ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా ఆటో కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించాలని ఆటోసంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా ఇప్పటి వరకు ఆటో కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ మేరకు ఆటో సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు బి.వెంకటేశ్, టీయూసీఐ అధ్యక్షుడు వి.ప్రవీణ్, టీఎన్టీయూసీ అధ్యక్షుడు యాదగిరి, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు మల్లేశ్ గౌడ్, టీఏడీఎస్ అధ్యక్షుడు ఎ.సత్తిరెడ్డి, సిటీ యూనిటీ ఆటో యూనియన్ అధ్యక్షుడు సలీం తదితరులు శుక్రవారం రవాణా శాఖ కమిషనర్ రఘునందన్‌రావు, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, సీహెచ్ శివలింగయ్యలను కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా ఆటోడ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఏటా రూ.12,000 భృతిని అందజేయాలని కోరారు.



## నోటి చర్మం.. నిలిచిన ప్రాణం..

నేపాల్ యువకుడి మూత్రనాళం పునర్నిర్మాణం

**లక్డీకాపూల్ :** 38 ఏళ్ల నేపాలీ యువకుడికి పాడైన మూత్రనాళాన్ని అతడి నోటి చర్మంతో పునర్నిర్మించి విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. యూరాలజీ సమస్యతో బాధపడుతున్న యువతకు అత్యాధునిక మినిమల్లీ ఇన్వేజివ్, పునర్నిర్మాణ శస్త్రచికిత్సలు చేయడంలో ఏఐఎన్‌యూ ఆస్పత్రి నిబద్ధతను మరోసారి చాటిచెప్పింది. నోట్లో ఉండే చర్మం (బకల్ మ్యుకోసా) పొరను ఉపయోగించి నేపాలీ యువకుడికి మూత్రనాళాన్ని పునర్నిర్మించి ప్రాణదానం చేసినట్టు ఏఐఎన్‌యూ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ సి. మల్లికార్జున తెలిపారు. ఇదంతా సంక్లిష్టమైన ప్రక్రియగా పేర్కొన్నారు. టెక్నాలజీ అందుబాటులో ఉండడంతో ఇప్పుడు నోటి చర్మం పొర ఉపయోగించి దీన్ని అధిగమించగలుగుతున్నామని తెలిపారు.

## పోలీసుల అదుపులో మైనర్

- రూటు మార్చిన గంజాయి స్మగ్లర్లు
- రూ.1.15 కోట్లు విలువ చేసే హాష్ ఆయిల్ స్వాధీనం

**అల్వాల్ :** గంజాయి స్మగ్లర్లు రూటు మార్చారు. పోలీసులు నిఘా పెంచడంతో గంజాయి ముఠాలు మైనర్లతో మత్తు పదార్థాలను సరఫరా చేయించేందుకు ప్లాన్ చేశారు. సమాచారం అందుకున్న రాచకొండ ఎస్ఓటీ పోలీసులు రూ.1.15 కోట్ల విలువ చేసే 5 కేజీల హాష్ ఆయిల్ శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు మైనర్‌ను అరెస్టు చేశారు. నేరేడ్ మెట్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ సుధీర్ బాబు వివరాలు వెల్లడించారు. ఒడిశా చిత్ర కొండకు చెందిన దేబేంద్ర జోధా గంజాయి దందా చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఓ మైనర్(17) చదువుపై ఆసక్తి లేకపోవడంతో కుటుంబ సభ్యులకు వ్యవసాయ పనుల్లో సహకరిస్తున్నాడు. దేబేంద్ర పరిచయంతో భారీ కమీషన్‌కు ఆశపడి గంజాయిని సరఫరా చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో 5 కేజీల హాష్ ఆయిల్‌ను హైదరాబాద్ తరలిస్తుండగా శుక్రవారం ఉదయం ఘట్ కేసర్ రైల్వే స్టేషన్ వద్ద తనిఖీల్లో డ్రగ్స్‌తో సహా అదుపులోకి తీసుకున్నారు. దేబేంద్ర పరారీలో ఉన్నాడని కమిషనర్ తెలిపారు. ఈ మేరకు మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులను సీపీ అభినందించారు.

## బంద్‌కు అన్ని వర్గాలు సహకరించాలి

బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య



**హిమాయత్‌నగర్ :** బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తలపెట్టిన రాష్ట్ర బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా, కుల సంఘాలు మద్దతు తెలిపాయని చెప్పారు. శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ జేఏసీ వైస్‌చైర్మన్ వీజీఆర్.నారగోని, కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. శనివారం తెల్లవారుజామున 4 గంటలకు నుంచి సాయంత్రం 5 గంటల వరకు బంద్ కొనసాగుతుందని తెలిపారు. బంద్‌లో ఆస్పత్రులు, మెడికల్ షాపులకు మినహాయింపు ఉంటుందన్నారు. ఈ శాంతియుత బంద్‌కు పోలీసులు సహకరించాలని కోరారు. నారగోని మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేవరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో రామ్‌కోఠి, ఉదయ్‌నేత, కొండ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బంద్‌కు గౌడ హాస్టల్ కమిటీ మద్దతు

**సాక్షి,మేడ్చల్ జిల్లా:** స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల జేఏసీ ఈ నెల 18 న చేపట్టిన బంద్‌కు పూర్తి మద్దతు ఇస్తున్నట్లు హైదరాబాద్ గౌడ్ హాస్టల్ అధ్యక్షుడు మోతె చక్రవర్తి గౌడ్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో మేనేజింగ్ కమిటీ సభ్యులతో సమావేశమైన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు అన్ని పార్టీలు మద్దతు తెలుపుతూనే అమలులో మాత్రం చిత్తశుద్ధి చూపించడం లేదన్నారు. బీసీలు ఓటు బ్యాంకుగానే మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అన్ని విధాల రిజర్వేషన్లు అందక బీసీలు మోసపోతున్నారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రిజర్వేషన్ల అమలులో రాజకీయ పార్టీల ఆటలను ప్రజలు గమనిస్తున్నారని, రిజర్వేషన్లు అమలు కాకపోతే ప్రజాగ్రహం చవి చూడాల్సి ఉంటుందని హెచ్చరించారు. బంద్‌లో అన్ని బీసీ కులాలు పాల్గొని బీసీల సత్తా చాటాలని కోరారు.

## నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు...

వెంగళరావునగర్‌ : బీ.కె.గూడ 11కెవీ ఫీడర్‌, ఈఎస్‌ఐ సబ్‌స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జయభారతి స్కూల్‌, శ్రీరామ్‌నగర్‌, దాసారం బస్తీ, సీ–టైప్‌ క్వార్టర్స్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపి వేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్‌ సీబీడీ ఏడీఈ (ఇన్‌చార్జి) వంశీకృష్ణ శుక్రవారం తెలియజేశారు. పోస్ట్‌ ఆఫీస్‌ 11కెవీ ఫీడర్‌ హెచ్‌పీఎస్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బేగంపేట పోస్టాఫీస్‌, గీతాంజలి స్కూల్‌, బేగంపేట రైల్వేస్టేషన్‌, ఓల్డ్‌ కస్టమ్స్‌ బస్తీ, పీఎఫ్‌ క్వార్టర్స్‌, బ్రాహ్మణవాడి, వరుణ్‌టవర్స్‌, మాతాజీ నగర్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదన్నారు.

## ఘనంగా శ్రీవారి పవిత్రోత్సవాలు



స్వామివారికి స్నపన తిరుమంజన పూజలు చేస్తున్న దృశ్యం

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ టీటీడీ శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్చకులు స్వామివారికి స్నపన తిరుమంజన పూజలు ఘనంగా నిర్వహించారు. ఏడాది పొడవునా స్వామివారికి చేసే పూజాదికాల్లో తెలిసో తెలియకో తప్పులు జరిగి ఉంటే వాటిని పరిహరించుకోవడానికి ఈ పూజలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు తెలిపారు. పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీసీల బంద్‌కు సంపూర్ణ మద్దతు

శ్రీనగర్‌కాలనీ: బీసీలకు 42శాతం రిజర్వేషన్ల సాధనకు శనివారం చేపట్టనున్న బంద్‌కు రాష్ట్ర మున్నూరు కాపు సంఘం పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, అధికార ప్రతినిధి మంగళారపు లక్ష్మణ్‌ తెలిపారు. శుక్రవారం శ్రీనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాపు సంఘాలన్నీ బంద్‌కు మద్దతుగా ఆందోళనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. బీసీలకు రాజ్యాధికారం రావాలని, మున్నూరుకాపు సంఘం బీసీల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. నేతలు వెంకటేశ్వర్లు, పద్మయ్య, సతీస్‌, తిరుపతి, శివకుమార్‌ పాల్గొన్నారు.

## మార్నింగ్‌ వాక్‌కు వెళ్లివచ్చేసరికి ఇంట్లో చోరీ..

బంజారాహిల్స్‌: మార్నింగ్‌ వాకింగ్‌కు వెళ్లి వచ్చేసరికి ముగ్గురు గుర్తుతెలియని మహిళలు ఇంట్లోకి ప్రవేశించి రూ.60 వేల నగదుతో పాటు 120 గ్రాముల వెండి పట్టీలు ఎత్తుకెళ్లిన సంఘటన జూబ్లీహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌కు చెందిన మోహన్‌రావు ఈ నెల 16న ఉదయం మార్నింగ్‌ వాక్‌కు వెళ్లాడు. ఇంటికి తాళాలు వేసి తాళం చెవులను అక్కడే టూత్‌బ్రష్‌ బాక్స్‌లో ఉంచి వెళ్లాడు. వాకింగ్‌ నుంచి తిరిగి వస్తుండగా తన ఇంట్లో నుంచి బయటికి వస్తున్న ముగ్గురు మహిళలు అతడికి ఎదురుపడ్డారు. దీంతో ఆయన ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన రూ.60 వేల నగదు, 120 గ్రాముల వెండి పట్టీలు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సినీతారల మార్ఫింగ్‌ ఫొటోలతో ఓటు ముద్రించిన వ్యక్తిపై కేసు

వెంగళరావునగర్‌: సినీతారల ఫొటోలను మార్ఫింగ్‌ చేసి ఓటరు ఐడీ కార్డులు తయారు చేసి వైరల్‌ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్‌ అసెంబ్లీ నియోజకవర్గ అసిస్టెంట్‌ ఎలక్టోరల్‌ రిజిస్ట్రేషన్‌ అధికారి, జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–19 ఉప కమిషనర్‌ రజినీకాంత్‌రెడ్డి మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. గత మూడు రోజులుగా సినీతారలు రకుల్‌ ప్రీత్‌సింగ్‌, సమంత రూత్‌ ప్రభు, తమన్నా భాటియాల ఫొటోలను ముద్రించి నియోజకవర్గ ఓటర్లుగా గుర్తు తెలియని వ్యక్తి వైరల్‌ చేయడం జరిగింది. దీనిపై స్పందించిన ఎన్నికల అధికారులు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మధ్య వయస్కులే నిర్ణేతలు

- వయస్సుల వారీగా ఓటర్ల లెక్కలు తీస్తున్న పార్టీలు..
- 30–39 ఏళ్ల ఓటర్లే ఎక్కువ..
- వీరిని ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థుల కసరత్తు



కొత్తగా ఓటు హక్కు పొందిన యువకులు

యవసుల వారీగా ఓటర్లు (సుమారుగా)

| వయస్సు | ఓటర్లు |
|---|---|
| 30-39 | 96,716 |
| 40-49 | 86,146 |
| 50-59 | 67,702 |
| 60-69 | 38,236 |
| 18-19 | 12,396 |
| 20-29 | 72,544 |
| 70-79 | 18,211 |
| 80 ఏళ్లకు పైబడ్డవారు | 6,052 |

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నిక నవంబర్‌ 11న జరగనుండగా ఇప్పటికే ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేయడమే కాకుండా కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ భార్య మాగంటి సునీత, కాంగ్రెస్‌ అభ్యర్థిగా నవీన్‌యాదవ్‌, బీజేపీ అభ్యర్థిగా లంకాల దీపక్‌రెడ్డి బరిలోకి దిగి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. జూబ్లీహిల్స్‌ నియోజకవర్గంలోని మెజార్టీ డివిజన్లలో బస్తీలు ఎక్కువగా ఉండడం, సమస్యలు అదే స్థాయిలో పేరుకు పోవడంతో ఈ ఉప ఎన్నిక అభ్యర్థులకు సవాల్‌గా మారనుంది. కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకుంటున్నాయి. బీఆర్‌ఎస్‌ పాలనలో అభివృద్ధి మరిచిందని ఆరోపిస్తున్న కాంగ్రెస్‌ తాము పెద్ద ఎత్తున పనులు ప్రారంభించామని చెప్పుకుంటోంది. అయితే ఈ ఎన్నికల్లో 30–39 ఏళ్ల మధ్య ఓటర్లు అభ్యర్థుల గెలుపోటముల్లో కీలక పాత్ర పోషించనున్నారు. గత నెల జూబ్లీహిల్స్‌ ఓటరు జాబితా ఫైనల్‌ లిస్టు విడుదల చేయగా, అందులో 30–39 మధ్య వయస్సున్న ఓటర్లే ఎక్కువగా కనిపించారు. ఆ తర్వాత 40–49 ఏళ్ల మధ్య వయస్సున్న ఓటర్లు రెండో స్థానంలో నిలిచారు. ఇప్పుడు వీరిని ప్రసన్నం చేసుకోవడం ఆయా పార్టీలకు ప్రధానంగా మారింది. ఈ వయస్సు ఓటర్లు సాధారణంగా తమ ప్రాంత అభివృద్ధిని కోరుకుంటారు. రోడ్లు విశాలంగా ఉండాలని, ట్రాఫిక్‌జాం ఉండవద్దని, రోడ్లపై గుంతలు తేలవద్దని, డ్రైనేజీ పొంగవద్దని, మంచినీటి సరఫరా మెరుగ్గా ఉండాలని కోరుకుంటారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో చాలావరకు పనులు జరగలేదని గత కొంతకాలంగా ఇక్కడ పర్యటిస్తున్న మంత్రుల ద్వారా తెలుస్తోంది. చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తే కాంగ్రెస్‌కు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అలా కాకుండా అభివృద్ధి గాలికొదిలేస్తే బీఆర్‌ఎస్‌ లాభపడే అవకాశాలు ఉన్నాయి. ఈ సారి కొత్తగా ఓటు హక్కు పొందిన వారు 12 వేల పైచిలుకు ఉన్నారు. వీరిలో మెజార్టీ విద్యావంతులు కాగా, వీరిని ప్రసన్నం చేసుకోవడం ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులకు కష్టమే. ప్రచారంలో ఈ మూడు పార్టీల అభ్యర్థులు 30–39 ఏళ్ల వయస్సు ఓటర్లను ఆకర్షించాలి. మొత్తం జూబ్లీహిల్స్‌ ఓటర్లు 3,98,982 కాగా ఇందులో అత్యధికంగా ఈ వయస్సు వారే ఉన్నారు. దీనికి తోడు 21.9 శాతం మంది ఓటర్లు 40–49 ఏళ్ల మధ్య ఉండడం, వీరు తప్పనిసరిగా ఓటింగ్‌కు వచ్చే అవకాశం ఉండడంతో వీరిని ఎలా ఆకట్టుకోవాలనే అంశంపై పార్టీలు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. ఏయే ప్రాంతాల్లో ఏ వయస్సు ఓటర్లు ఎక్కువగా ఉన్నారో ఇప్పటికే ఆయా పార్టీలు జాబితాను కూడా సిద్ధం చేసుకుని వారిని ప్రసన్నం చేసుకునేందుకు తగిన ప్రచారంతో ముందుకు వెళ్లాలని భావిస్తున్నారు. మొత్తానికి ఈ ఎన్నికల్లో మధ్య వయస్కు ఓటర్లే అభ్యర్థుల గెలుపోటములను శాసించనున్నారు. 40 శాతం మంది ఈ వయస్సు ఓటర్లే నియోజకవర్గాన్ని శాసిస్తున్నారు.

## కాంగ్రెస్‌ అంటే స్కాంగ్రెస్‌ అని తెలిసొచ్చింది



మాట్లాడుతున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి..

బంజారాహిల్స్‌: కాంగ్రెస్‌..స్కాంగ్రెస్‌ అని ప్రజలకు అర్థం కావడానికి రెండేళ్లు కూడా పట్టలేదని, ఎక్కడకు వెళ్లినా కాంగ్రెస్‌ పార్టీ అంటే ప్రజలు తరిమికొట్టే పరిస్థితి వచ్చిందని బీఆర్‌ఎస్‌ ఖైరతాబాద్‌ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని ఎమ్మెల్యే కాలనీలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బీసీలను మోసం చేసిన కాంగ్రెస్‌ పార్టీ రోజుకో కొత్త డ్రామాతో ప్రజలను వంచిస్తోందన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆరు నూరైనా ఇస్తామని చెప్పి, తప్పుడు పద్ధతుల్లో రాజ్యాంగానికి విరుద్ధంగా జీఓలు, బిల్లులు తెచ్చి సుప్రీంకోర్టు, హైకోర్టు రెండు చెంపలు వాయించిన తర్వాత ఇప్పుడు మళ్లీ కొత్త డ్రామాలు చేస్తున్నారన్నారు. బీసీల బంద్‌కు కాంగ్రెస్‌ మద్దతు ప్రకటించడం సిగ్గుచేటన్నారు. అబద్ధపు మాటలతో ప్రజలను మోసగించిన కాంగ్రెస్‌ పార్టీని బీసీలు తరిమికొట్టాలన్నారు. ఆరు గ్యారంటీలు బూటకమని, బీసీలకు 42 శాతం పేరు చెప్పి అంతకంటే మోసం చేశారన్నారు. రేవంత్‌రెడ్డి, ఆయన టీం, దొంగల ముఠా సంగతి ఆ మంత్రి కుటుంబ సభ్యులే చెబుతున్నారన్నారు. కేబినెట్‌ మీటింగ్‌ అంటేనే పెద్ద ఫైటింగ్‌ సీన్‌ కనిపిస్తోందన్నారు. చిన్న పిల్లల కంటే అధ్వాన్నంగా మంత్రులు కొట్టుకుంటున్నారన్నారు. కేసీఆర్‌ నాయకత్వంలో తెలంగాణ ఎంతో అద్భుతంగా పురోగమించిందన్నారు. కేటీఆర్‌ ఉన్నప్పుడు తెలంగాణ వైపు దేశం చూసేదని, అమెజాన్‌ డేటా సెంటర్‌ కేటీఆర్‌ తీసుకువచ్చారన్నారు. ఎన్నో ప్రతిష్టాత్మక సంస్థలు ఇండియాలో ఆఫీసు పెట్టాలంటే కేటీఆర్‌ చొరవ తీసుకుని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయించేవారన్నారు. ఇప్పుడు గూగుల్‌తో పాటు అనేక ప్రతిష్టాత్మక సంస్థలు వెళ్లిపోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ దొంగల ముఠాకు భయపడి ఎవరూ పెట్టుబడులు పెట్టేందుకు రావడం లేదన్నారు. తెలంగాణకు కేసీఆర్‌, కేటీఆర్‌ నాయకత్వమే శ్రీరామరక్ష అన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లలో ఎంబీసీల వాటా తేల్చాలి



అభివాదం చేస్తున్న ఎంబీసీ సంక్షేమ సంఘం నాయకులు ..

పంజగుట్ట: కాంగ్రెస్‌ పార్టీ బీసీలకు ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లలో మైనారిటీ, ఎంబీసీల వాటా ఎంతో తేల్చాలని మైనార్టీ వెనకబడిన కులాల (ఎంబీసీ) సంక్షేమ సంఘం డిమాండ్‌ చేసింది. దశాబ్దాలుగా రిజర్వేషన్‌ ఫలాలు అందక ఎంబీసీ కులాలు దుర్భర స్థితిలో ఉన్నాయన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎం.బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు సత్యం వంశరాజ్‌, రాష్ట్ర అధ్యక్షులు గోగికర్‌ సుధాకర్‌ మాట్లాడుతూ .. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లలో ఎంబీసీల వాటా తేల్చాలని అన్నారు. బీసీల్లో కేవలం నాలుగు, ఐదు కులాలు మాత్రమే రిజర్వేషన్ల ఫలాలు అందుకుంటూ మెరుగైన స్థితిలో ఉన్నాయని, అత్యధిక జనాభా ఉన్న అత్యల్ప కులాలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎంతో వెనకబడి ఉన్నామన్నారు. ఎంబీసీలను ఐక్యం చేసేందుకు త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా రథయాత్ర చేపడతామని, 42 శాతం రిజర్వేషన్లలో తమ వాటా సాధనకై చలో ఢిల్లీ తలపెట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 1న నిర్వహించనున్న రాష్ట్ర బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మోహన్‌ బైరాగి, రాచకొండ రమేష్‌, వెంకటాచారి, గురుచరణ్‌, సోమాచారి, పావని, చింత స్వామి, నాగరాజు, నిమ్మల వీరన్న, సురేష్‌, నగేష్‌ తదితరులు పాల్గొన్నారు.

## భారీగా నామినేషన్ల దాఖలుకు నిరుద్యోగుల సన్నాహాలు



నామినేషన్‌ పత్రాలు తీసుకుంటున్న తెలంగాణ నిరుద్యోగ కళాకారులు..

బంజారాహిల్స్‌: గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం, ఇప్పటి కాంగ్రెస్‌ ప్రభుత్వంలోనూ తమకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇందుకు నిరసనగా జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నికలో పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేస్తున్నట్లు తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం సభ్యులు అన్నారు. శుక్రవారం షేక్‌పేట మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి కార్యాలయంలో పెద్ద ఎత్తున నిరుద్యోగ కళాకారులు నామినేషన్‌ పత్రాలను తీసుకున్నారు. శనివారం 50 మంది వరకు నిరుద్యోగ కళాకారులు నామినేషన్‌ దాఖలు చేయనున్నట్లు చెట్ల కుమారస్వామిగౌడ్‌ తెలిపారు. సంఘం అధ్యక్షుడు వెంకటేశంతో పాటు నిరుద్యోగ కళాకారులు పెద్ద సంఖ్యలో నామినేషన్‌ పత్రాలు తీసుకున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమకు న్యాయం జరగడం లేదని, అందుకే ఈ ఎన్నికల్లో నామినేషన్లు వేస్తున్నట్లు వెల్లడించారు. సుమారుగా 200 మంది వరకు నామినేషన్లు వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

## ‘అట్లనే’ కవితా సంపుటి ఆవిష్కరణ..



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న ఘంటా చక్రపాణి..

బంజారాహిల్స్‌: అన్నవరం దేవేందర్‌ రాసిన ‘అట్లనే’ కవితా సంపుటిని డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ వైస్‌ చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చక్రపాణి ఆవిష్కరించారు. డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ, జీవగడ్డ మిత్రులు ఆధ్వర్యంలో చావడి వేదిక ద్వారా శుక్రవారం పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటా చక్రపాణి మాట్లాడుతూ తాము ఈ రోజు ఇక్కడ నిలబడడానికి కారణం జీవగడ్డ పత్రికనే అని తెలిపారు. సీనియర్‌ పాత్రికేయులు అల్లం నారాయణ మాట్లాడుతూ దేవేందర్‌ తెలంగాణ చరిత్రను తన కవిత్వంలో రాసినట్లు తెలిపారు. జీవగడ్డ లేకపోతే తాము లేమన్నారు. సీనియర్‌ పాత్రికేయులు కే శ్రీనివాస్‌ మాట్లాడుతూ దేవేందర్‌ తెలంగాణ భాషా నుడికారంలో సరళంగా కవిత్వం రాశారన్నారు. కార్యక్రమానికి తెలుగు శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్‌ ఎస్‌.రజని అధ్యక్షత వహించగా రిజిస్ట్రార్‌ ఎల్వీకేరెడ్డి, ప్రముఖ కవి అందెశ్రీ, సంగిశెట్టి శ్రీనివాస్‌, శ్యాంప్రసాద్‌, యూనివర్సిటీ డైరెక్టర్స్‌, డీన్స్‌ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా కాంగ్రెస్‌ అభ్యర్థి నామినేషన్‌ దాఖలు



ర్యాలీగా వెళుతున్న నవీన్‌యాదవ్‌.



విచిత్ర వేషధారణలతో ఆకట్టుకున్న బృందాలు..

వెంగళరావునగర్‌ : జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ శుక్రవారం అట్టహాసంగా నామినేషన్‌ దాఖలు చేశారు. ఉదయం తల్లిదండ్రుల ఆశీస్సులు తీసుకుని ఇంటినుంచి బయలు దేరిన నవీన్‌యాదవ్‌ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ర్యాలీ చేపట్టారు. యూసుఫ్‌గూడ చౌరస్తాలోని అంబేడ్కర్‌ విగ్రహానికి భారీ గజమాల వేశారు. తప్పెట్లతో చిందులు, గోండు వేషధారణలో నృత్యాలతో ర్యాలీ సాగింది. మంత్రులు పొన్నం ప్రభాకర్‌, వివేక్‌ వెంకటస్వామి, మేయర్‌ గద్వాల విజయలక్ష్మి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, సీనియర్‌ కాంగ్రెస్‌ నేతలు, సన్నిహితులు, సినీ కళాకారులు, 24 క్రాఫ్ట్స్‌లో విధులు నిర్వహించే కార్మికులు ర్యాలీలో పాల్గొన్నారు. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించడం జరిగింది. ఈ సందర్భంగా ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## జూబ్లీహిల్స్‌లో బీజేపీ జెండాను ఎగురవేయాలి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి...

రహమత్‌నగర్‌: జూబ్లీహిల్స్‌ నియోజక వర్గంలో బీజేపీ జెండాను ఎగురవేయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జరిగిన రహమత్‌నగర్‌ డివిజన్‌బీజేపీ బూత్‌ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లా డుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు పార్టీ అభ్యర్థి విజయానికి బాటలు వేస్తాయన్నారు. క్షేత్రస్థాయిలో బూత్‌ కమిటీ ప్రతినిధులు కీలకంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డాక్టర్‌ గౌతం రావు, శృతి, డివిజన్‌ అధ్యక్షుడు తంగలపల్లి లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్‌ 13న ఏపీఆర్జేసీ స్వర్ణోత్సవ వేడుకలు



కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: ఆంధ్రప్రదేశ్‌ రెసిడెన్షియల్‌ జూనియర్‌ కాలేజీ (ఏపీఆర్జేసీ) నాగార్జున సాగర్‌ స్వర్ణోత్సవ వేడుకలు డిసెంబర్‌ 13, 14 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు స్వర్ణోత్సవ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని స్వర్ణోత్సవ నిర్వాహక కమిటీ చైర్మన్‌ సైదా రెడ్డి, వైస్‌ చైర్మన్‌, సాగర్‌ పరివార్‌ అధ్యక్షుడు ఎం.మల్లికార్జున రావు, పూర్వ విద్యార్థులు, ఐఎఫ్‌ఎస్‌ అధికారి రాజశేఖర్‌, జాయింట్‌ కలెక్టర్‌ సి.రమేష్‌, సాగర్‌ పరివార్‌ కార్యదర్శి డాక్టర్‌ కె.వీరానంది, మీడియా, ప్రచార కమిటీ చైర్మన్‌ నాగాచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. గత ఐదు దశాబ్దాలుగా ఏపీఆర్జేసీ నుంచి ఎంతో మంది ప్రతిభావంతులను దేశానికి సేవలు అందించారన్నారు. స్వర్ణోత్సవాల ఆహ్వాన మాల అనే థీమ్‌తో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గురువులకు సత్కారం, నైట్‌ క్యాంప్‌ ఫైర్‌, క్యాంపస్‌ టూర్‌, పూర్వ విద్యార్థుల సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. పూర్వవిద్యార్థులందరూ వేడుకల్లో పాల్గొనాలని కోరారు.




## పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

హిమాయత్‌నగర్‌ : బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేపట్టాలని తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్‌ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ ఉద్యోగులకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. శనివారం చేపట్టనున్న బీసీ బంద్‌కు సంఘీభావంగా రాష్ట్రంలోని బీసీ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతామన్నారు. సమావేశంలో సంఘం నాయకులు రమాదేవి, జ్ఞానేశ్వర్‌, రామరాజు, శ్రీనివాస్‌, శంకర్‌, యాదయ్య, సాగర్‌, జగన్మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

**బంద్‌ను విజయవంతం చేద్దాం**

బీసీల రాష్ట్ర బంద్‌కు తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. జేఏసీ కార్యాలయంలో చైర్మన్‌ డా.మందల భాస్కర్‌ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీసీ సంఘాల జేఏసీ వైస్‌ చైర్మన్‌ విజిఆర్‌ నారగోని, గ్రేటర్‌ హైదరాబాద్‌ మాల సంఘాల జేఏసీ చైర్మన్‌ బేర బాల కిషన్‌, గౌరవాధ్యక్షులు చెరుకు రామ్‌చందర్‌ బంద్‌కు మద్దతు ప్రకటించారు.

**9వ షెడ్యూల్లో చేర్చేదాకా ఉద్యమం**

బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చేదాకా ఉద్యమం కొనసాగిస్తామని మహాజన సేన పార్టీ అధ్యక్షులు తీగల ప్రదీప్‌ గౌడ్‌ అన్నారు. బషీర్‌బాగ్‌ దేశోద్ధారక భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు మద్దతు తెలిపారు. పార్టీ నేతలు షణ్ముఖ రావు, నేదునూరి సంపత్‌ కుమార్‌, భాగ్యమ్మ, ప్రశాంత్‌, అరుణ్‌, తదితరులు పాల్గొన్నారు.

## చట్టబద్ధ బీసీ రిజర్వేషన్ల సాధనకు పోరాటం



మాట్లాడుతున్న శ్రీనివాసగౌడ్‌

రహమత్‌నగర్‌ : చట్టబద్ధంగా బీసీ రిజర్వేషన్లు అమలు చేసేవరకు బీఆర్‌ఎస్‌ పోరాటం కొనసాగిస్తుందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. చట్టసభల్లో ఆమోదం పొందకుండా కాంగ్రెస్‌ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీ వర్గాలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. శుక్రవారం రహమత్‌నగర్‌ డివిజన్‌ శ్రీ రాం నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్‌ మాట్లాడుతూ రిజర్వేషన్ల కేటాయింపులో కాంగ్రెస్‌, బీజేపీ నాటకాలు ఆడుతున్నాయన్నారు.ఇచ్చిన హామీ ప్రకారం రాహుల్‌ గాంధీ ప్రధానిని ఒప్పించి పార్లమెంటులో రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్‌ చేశారు. స్థానిక ఎన్నికల ప్రక్రియ మొదలై, రిజర్వేషన్‌ స్థానాలను సైతం కేటాయించిన తర్వాత చట్టబద్ధత లేక ఎన్నికలు నిలిచి పోవడం కాంగ్రెస్‌ ప్రభుత్వం వైఫల్యానికి నిదర్శమన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు శనివారం చేపట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ ఎంఏ షఫీ, నాయకులు ముజీబ్‌, సయ్యద్‌ మనీర్‌, మసూద్‌, సయ్యద్‌ బషీర్‌, ఏఎల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌ డ్‌, ధనూజ తదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం



మాట్లాడుతున్న రామకృష్ణ గౌడ్‌

పంజగుట్ట: బీసీ రిజర్వేషన్ల సాధనకు 18న చేపట్టిన బంద్‌ను విజయవంతం చేసి ఢిల్లీ పెద్దల్లో చలనం తేవాలని బీసీ సాధికారత సంఘం నేతలు అన్నారు. ఈ మేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రతాని రామకృష్ణ గౌడ్‌, గౌరవాధ్యక్షులు కొండా దేవయ్య పటేల్‌, మహిళా అధ్యక్షురాలు అంజలి యాదవ్‌తో కలిసి మాట్లాడుతూ .. బీసీ జేఏసీ చేపట్టిన బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ సవరణ చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు, బీసీ ముఖ్యమంత్రిని చేసే వరకు తమ ఉద్యమం ఆగదన్నారు. ఇది కేవలం రిజర్వేషన్ల సమస్య కాదని బీసీల ఆత్మగౌరవ సమస్యగా పేర్కొన్నారు. ఓసీల్లో ఎన్నో కులాలు ఉన్నా కేవలం కాంగ్రెస్‌ ప్రభుత్వంలో ఎక్కువ పోస్టులు అనుభవిస్తున్న రెడ్డి కులస్తులే కోర్టుకు వెళ్లడం, రిజర్వేషన్లు వ్యతిరేకించడం సరికాదని, వెంటనే కాంగ్రెస్‌ ప్రభుత్వం వారితో కేసు విత్‌డ్రా చేయించి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ మంత్రి కొండా సురేఖ ఇంటికి అర్ధరాత్రి పోలీసులు వెళ్లి వేధించడం సరికాదన్నారు. రెడ్డి జాగృతి నాయకుడు మున్నూరు కాపులను బీసీ జాబితా నుండి తొలగించాలని అనడం బీసీలను విభజించే కుట్ర చెయ్యడమే అన్నారు. సమావేశంలో మహేందర్‌, గురురాజ్‌, నిరంజన్‌, శ్రవణ్‌ తదితరులు పాల్గొన్నారు.

## నాటి..నేటి రాజకీయాలకు ఎంతో తేడా



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చిన్నారెడ్డి

హిమాయత్‌నగర్‌ : నాటి, నేటి రాజకీయాల మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని మాజీ మంత్రి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్‌ దేశోద్ధారక భవన్‌లో కనిగిరి సత్యనారాయణ ప్రసాద్‌ రచించిన ‘ఈ 21వ శతాబ్దపు కొత్త రాజకీయ నీతి’ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ నూతన తరానికి కొత్త కాన్సెప్ట్‌ను ఈ పుస్తకం ద్వారా అందించడం అభినందనీయమన్నారు. నేటి రాజకీయాల్లో తమలాంటి నాయకులు ఇమడలేక పోతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రొ.సుబ్బారాయుడు, ప్రొ.మహేందర్‌ మిలేని, సీనియర్‌ జర్నలిస్ట్‌ అరవింద్‌, న్యాయవాది శ్రీకాంత్‌, విజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

## చైల్డ్‌ రైట్స్‌ కమిషన్‌ పనితీరు అభినందనీయం



మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్‌....

వెంగళరావునగర్‌ : రాష్ట్రంలో చైల్డ్‌ రైట్స్‌ కమిషన్‌ అభినందనీయమని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌ కుమార్‌ గౌడ్‌ అన్నారు. శుక్రవారం ఆయన వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని స్టేట్‌హోం ఆవరణలో ఉన్న బాల హక్కుల కమిషన్‌ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు కమిషన్‌ ఎంతో కృషి చేస్తుందన్నారు. భవిష్యత్‌లోనూ ఇలాగే పని చేయాలని సూచించారు. కమిషన్‌కు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా ప్రభుత్వం నుంచి తప్పకుండా అందుతుందని హామీ ఇచ్చారు. తొలుత ఆయనను కమిషన్‌ చైర్మన్‌, సభ్యులు సాదరంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిషన్‌ చైర్‌పర్సన్‌ కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి, కమిషన్‌ సభ్యులు వచన్‌కుమార్‌, వందన గౌడ్‌, చందన, బండి అపర్ణ, ప్రేమలత అగర్వాల్‌ తదితరులు పాల్గొన్నారు.

## జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్‌: అనుమతి లేకుండా సీసీ రోడ్డును తవ్వడమే కాకుండా జలమండలికి చెందిన మంచినీటి పైప్‌లైన్లు ధ్వంసం చేసిన జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్‌పై బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని కౌశిక్‌ సొసైటీలో ఈ నెల 16న జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు సంయుక్తంగా పర్యటించారు. ఆ సమయంలో జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్‌ మహ్మద్‌ ఇమ్రాన్‌ అనుమతి లేకుండా సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకోకుండానే సీసీ రోడ్డు తవ్వక పనులు చేపట్టినట్లు పరిశీలించారు. సదరు పనుల కారణంగా జలమండలికి చెందిన 100 ఎంఎం డయా మంచినీటి పైప్‌లైన్లు రెండు చోట్ల దెబ్బతిన్నాయి. ఫలితంగా ఐదు ఇంటి కనెక్షన్లు తెగిపోయి సుమారు 20 ఇళ్లకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో జలమండలి ఆస్తిని దెబ్బతీసి ప్రజలకు ఇబ్బంది కలిగించినందుకు కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని జలమండలి తట్టిఖానా సెక్షన్‌ మేనేజర్‌ రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
12
హైదరాబాద్‌ । శనివారం । 18 । అక్టోబర్‌ । 2025

# వెకేషన్‌కి జై.. వర్కేషన్‌కి సై..

## కొత్త కల్చర్‌కు తెరతీస్తున్న కార్పొరేట్‌ ఉద్యోగులు

'అబ్బా.. రోజూ ఉద్యోగం, పని పని.. పిచ్చి లేస్తోందిరా భయ్‌.. ఓ నాల్గు రోజుల పాటు ఎటైనా వెకేషన్‌ పోవాలని ఉంది' గతంలో ఇలా భావించని బిజీ ఉద్యోగులు ఉండేవారు కాదంటే అతిశయోక్తి కాదు. అయితే ఇప్పుడు వారి ఆలోచనల్లో సరికొత్త మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పని భారాన్ని తప్పించుకోడానికి వెకేషన్‌కు వెళ్లే బదులు.. పని చేసుకుంటూనే వెకేషన్‌ని ఎంజాయ్‌ చేయడం అనే వర్కేషన్‌ కల్చర్‌కు వీరు ఇప్పుడు ఓటేస్తున్నారు. - సిటీబ్యూరో



- సిటిజనుల పనిపాటల్లో సరికొత్త మార్పులు
- టూర్లు, పిక్నిక్‌లతో పాటే పనైనా, ఉద్యోగమైనా
- వెకేషన్‌లో వర్క్‌ కల్చర్‌ను భాగం చేస్తున్న వైనం
- ట్రెండును 'వర్కేషన్‌'గా పిలుస్తున్న కార్పొరేట్‌

### ప్రత్యేక ప్యాకేజీలూ రెడీ..

టూర్‌ ఆపరేటర్లు, హోటళ్లు, రిసార్టులు కూడా మార్పును సాదరంగా స్వాగతిస్తున్నాయి. ఈ కొత్త ట్రెండ్‌ను దృష్టిలో ఉంచుకొని పర్యాటక అనుబంధ సంస్థలు ప్రత్యేక వర్కేషన్‌ ప్యాకేజీలు అందిస్తున్నాయి. హై–స్పీడ్‌ వైఫై, కంఫర్టబుల్‌ డెస్క్‌లు, సైలెంట్‌ జోన్‌లు, ఆఫీస్‌–స్టైల్‌ సదుపాయాలతో వర్కేషన్‌ ఫ్రెండ్లీ రూమ్స్‌ వంటి వాటితో ఉద్యోగులను ఆకర్షిస్తున్నాయి. అత్యుత్తమంగా పని జరగడమే తమకు ముఖ్యంగా భావించే కార్పొరేట్‌ ప్రపంచం కూడా దీన్ని ప్రోత్సహిస్తూ, హైబ్రిడ్‌ మోడల్‌లో ఉద్యోగులకు వర్కేషన్‌ను ఎంచుకునే స్వేచ్ఛ ఇస్తోంది. ఈ పరిస్థితి గమనిస్తే భవిష్యత్తులో 'వర్కేషన్‌ ఫ్రెండ్లీ ఇండియా' అనే కొత్త టూరిజం కాన్సెప్ట్‌ బలపడే అవకాశం కనిపిస్తోంది.



### వర్కేషన్‌ ట్రెండీ ప్లేసెస్‌ ఇవే..

గోవా, కేరళ, కూర్గ్‌, రిషికేష్‌, డార్జిలింగ్‌, లేదా హిమాచల్‌ వంటివి నగరం వెలుపల సిటిజనులు ఎంచుకుంటున్న ప్రధాన వర్కేషన్‌ హాట్‌స్పాట్స్‌గా అవతరించాయి. ఇవి కాక మనాలి, కూర్గ్‌, పుదుచ్చేరి, వయనాడ్‌, హంపి ప్రాంతాలు కూడా వీరిని ఆకర్షిస్తున్నాయని నగరానికి చెందిన టూర్‌ ఆపరేటర్‌ సునీల్‌ తెలిపారు. వర్క్‌–లైఫ్‌ బ్యాలెన్స్‌ సాధించాలనే కోరిక అంతకంతకూ పెరుగుతుండడమే ఈ వర్కేషన్‌ అనే ట్రెండ్‌ పుంజుకోడానికి కారణమని ఆయన విశ్లేషిస్తున్నారు. అంతేకాక రిమోట్‌ వర్క్‌ సదుపాయాల పెరుగుదల, కంపెనీల ఉద్యోగుల అనుకూల విధానాలు.. వంటివి దీనికి ఆజ్యం పోస్తున్నాయన్నారు.



ఇటీవలి కాలంలో భారతదేశంలోని కార్పొరేట్‌ ఉద్యోగుల్లో వేగంగా పాపులర్‌ అవుతున్న కొత్త ట్రెండ్‌ 'వర్కేషన్‌'. ఇది వర్క్‌ ప్లస్‌ వెకేషన్‌ అనే రెండు పదాల కలయిక. అంటే, విధులు నిర్వర్తిస్తూనే విహారాన్ని ఆస్వాదించడం అనే ఓ కొత్త భావన. దీని ద్వారా అటు ఒత్తిడిని జయించడంతో పాటు.. ఇటు విధులకు ఆటంకం కలుగకుండా పనిని పూర్తి చేయడం అన్నమాట.

### మహమ్మారితో మారింది..

కార్పొరేట్‌ ఉద్యోగుల పని పాటల కల్చర్‌ను కరోనా కాలం అమాంతం మార్చేసింది అనేది నిర్వివాదమైన అంశం. మహమ్మారి సమయంలో తొలిసారిగా పరిచయమైన వర్క్‌ ఫ్రమ్‌ హోమ్‌ అనే కాన్సెప్ట్‌తో.. ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేయడం ప్రారంభించారు. ఆ తర్వాత రిమోట్‌ వర్క్‌, హైబ్రిడ్‌ వర్క్‌ పేరిట ఇల్లు దాటి కేఫ్స్‌, రెస్టారెంట్స్‌లో నుంచి కూడా పనిచేసే అవకాశాలు పెరగడంతో ఈ ట్రెండ్‌కి మరింత ఊపు వచ్చింది. ఆ సమయంలో కొందరు ఉద్యోగులు మరింత ముందుకు వెళ్లి నగరాలు దాటేసి ఇష్టమైన ప్రాంతాలకు, హిల్‌ స్టేషన్లు లేదా బీచ్‌ ఏరియాల్లో సెటిలై పనులు చేయడం మొదలుపెట్టారు. అదే ఆ తర్వాత 'వర్కేషన్‌' అనే కొత్త కాన్సెప్ట్‌కి శ్రీకారం చుట్టింది. అది ఇప్పుడు కేవలం తాత్కాలిక మార్పులా కాకుండా, ఓ జీవనశైలి ధోరణిగా రూపాంతరం చెందింది.



### కార్పొరేట్‌ ఉద్యోగుల కొత్త అభిరుచి..

ఐటీ, మార్కెటింగ్‌, డిజైన్‌, కంటెంట్‌ రంగాల్లో పనిచేసే ఉద్యోగులు ఎక్కువగా ఈ ట్రెండ్‌ను అనుసరిస్తున్నారు. కొన్ని రోజుల పాటు ప్రశాంత ప్రదేశాల్లో ఉంటూ, ఆన్‌లైన్‌ మీటింగ్స్‌, ప్రాజెక్ట్‌ పనులు పూర్తి చేసుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల స్ట్రెస్‌ తగ్గి, క్రియేటివిటీ పెరుగుతుంది అని వీరు చెబుతున్నారు. నిజానికి సినిమా రచయితలు, కవులు.. సాధారణంగా ఇలా ప్రత్యేక ప్రదేశాలను ఎంచుకుని కొత్త కొత్త కథలు, కవితల సృష్టి సాగించేవారు.





### సెలవుల పరేషాన్‌ లేకుండా..

భార్య, భర్త, ఇద్దరికీ ఒకే సమయంలో సెలవు దొరకడం దగ్గర నుంచి మొదలు పెడితే వెకేషన్‌ వెళ్లడానికి అడ్డంకులుగా మారేవి ఒకటా రెండా. ఒకవేళ వెళ్లొచ్చినా, ఆ తర్వాత డబుల్‌ ట్రిబుల్‌ వర్క్‌ రెడీగా ఉంటుంది. అందుకే వర్క్‌ చేస్తూనే వెకేషన్‌ కూడా ఎంజాయ్‌ చేయడం అనేది బెస్ట్‌ ఆల్టర్నేటివ్‌గా మారింది. ఇటీవలే అందరం వర్కింగ్‌ పీపుల్‌ ఉన్న మా ఫ్యామిలీతో కలిసి నగరం నుంచి మైసూర్‌, కోయంబత్తూర్‌, కొడైకెనాల్‌, తిరుచ్చి, మధురై, రామేశ్వరం, తంజావూర్‌, పాండిచ్చేరి, దాకా ప్రయాణం చేశా. మా వర్క్స్‌ చేసుకోడానికి కొన్ని ప్రదేశాలను పూర్తిగా ఆస్వాదించడానికి కేటాయించుకుని ట్రిప్‌ను పూర్తి చేశాం. పనులు మానాల్సిన అవసరం లేకుండానే వెకేషన్‌ను ఆస్వాదించాం.

– సుమన్‌ కృష్ణ, కార్పొరేట్‌ ఉద్యోగిని

## సినిమా శైలిలో ఆల్బమ్‌ సాంగ్స్‌..



సాక్షి, సిటీబ్యూరో: ప్రేమ, విరహం వంటి ఈ తరం మెచ్చే సున్నితమైన అంశాలతో వెన్‌ ల్యాక్స్‌ ప్రొడక్షన్స్‌ రూపొందించిన మ్యూజికల్‌ ఆల్బమ్‌ తెలుగు వెర్షన్‌ 'నీవే నా తొలి ప్రేమ'ను ప్రముఖ డైరెక్టర్‌, తెలుగు సినిమా డైరెక్టర్స్‌ అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ వీరశంకర్‌, సంగీత దర్శకులు భోలే షావాలి ఆవిష్కరించారు. 'లవ్‌ అండ్‌ బ్రేకప్‌' అనే థీమ్‌తో హృదయాన్ని హత్తుకునేలా రూపొందించిన ఈ ఆల్బమ్‌ పాటలు కమర్షియల్‌ సినిమాల్లోని నాణ్యత, నైపుణ్యాలను తలపిస్తున్నాయని ముఖ్య అతిథి వీరశంకర్‌ అభినందించారు. యువతతో పాటు అన్ని వయసుల వారినీ ఈ పాటలు అలరిస్తాయని పేర్కొన్నారు. ఆల్బమ్‌కు తాజుద్దీన్‌ దర్శకత్వం వహించడంతో పాటు, అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. వెన్‌ ల్యాక్స్‌ ప్రొడక్షన్స్‌ అధినేత దాచేపల్లి హరీష్‌, ఆల్బమ్‌ బృందం పాల్గొన్నారు.

## అందుబాటులోకి.. పిక్‌ సీ..

సాక్షి, సిటీబ్యూరో: బిలియన్‌ హార్ట్స్‌ సాఫ్ట్‌వేర్‌ టెక్నాలజీస్‌ ఆధ్వర్యంలో ప్రపంచపు ప్రప్రథమ పరస్పర ఫొటో షేరింగ్‌ యాప్‌ ఏఐ–ఆధారిత పిక్‌ సీ (పీఐసీఎస్‌ఇఇ) విడుదల చేసింది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. పరస్పరం ఫొటోలు పంచుకోడానికి సంబంధించి, అత్యాధునిక ఫీచర్లు, ఏఐ ఆధారిత సేవలతో ఇది సరికొత్త ప్రమాణాలను ఏర్పరుస్తుందని వివరించారు.

## వయోధికులకు అభయా డ్రైవ్‌..

సాక్షి, సిటీబ్యూరో: వయోధికుల సంరక్షణ సేవలకు పేరొందిన బ్రాండ్‌ అన్వయా, నగరంలో అభయ్‌ డ్రైవ్‌ పేరిట ప్రత్యేక సేవల్ని ప్రారంభించింది. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అన్వయా కిన్‌–కేర్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ వ్యవస్థాపకుడు, మేనేజింగ్‌ డైరెక్టర్‌ ప్రశాంత్‌ రెడ్డి మాట్లాడుతూ దేశపు మొట్టమొదటి సీనియర్‌ సిటిజన్‌–స్నేహపూర్వక నగరంగా హైదరాబాద్‌ను మార్చే లక్ష్యంతో దీన్ని చేపట్టామని, తద్వారా వయోధికులకు సురక్షితమైన, సహాయక వాతావరణాన్ని పెంపొందించనున్నామని తెలిపారు. రక్తపోటు, పల్స్‌, శరీర ఉష్ణోగ్రత వంటి కీలక ఆరోగ్య అంశాలను నిరంతరం ట్రాక్‌ చేసే సీనియర్‌ స్మార్ట్‌వాచ్‌, ప్రత్యేక అత్యవసర కమాండ్‌ సెంటర్‌ 04068161897 ద్వారా 24/7 వయోధికుల పరిస్థితులను పర్యవేక్షిస్తామని చెప్పారు.

## విలాస సౌందర్యం..



సాక్షి, సిటీ బ్యూరో: బాలీవుడ్‌ నిర్మాత, ఫ్యాషన్‌ ఐకాన్‌ గౌరీ ఖాన్‌ దీపావళి పండుగ నేపథ్యంలో జోయా ఆధ్వర్యంలో ఐకానిక్‌ రూబీ రష్‌ నెక్లెస్‌ ఆవిష్కరించింది. 1950లో హాలీవుడ్‌ దిగ్గజాలు మార్లిన్‌ మన్రో, ఎలిజబెత్‌ టేలర్‌ ఇంద్రియాలకు ప్రసిద్ధి చెందిన ఎరుపు రంగు లిప్‌స్టిక్‌ ప్రేరణతో ఈ రూబీ రష్‌ డిజైనింగ్‌ రూపొందించామని జోయా యాజమాన్యం తెలిపింది. స్త్రీతత్వం, శాశ్వతమైన గ్లామర్‌ను ప్రతిబింబించే ఈ డిజైన్స్‌ హైదరాబాద్‌తో పాటు అన్ని నగరాల్లో అందుబాటులో ఉంటాయని అన్నారు. మహిళల సౌందర్యం, ఆత్మస్థైర్యానికే కాకుండా లగ్జరీకి నిదర్శనంగా నిలుస్తుందని గౌరీ ఖాన్‌ పేర్కొన్నారు.

## పచ్చగా.. ప్రకృతి మెచ్చగా..



- అందుబాటులో ఎకోఫ్రెండ్లీ క్రాకర్స్‌
- ప్రజల్లో ఇంకా పెరగాల్సిన అవగాహన
- మార్కెట్‌లో నకిలీ గ్రీన్‌ క్రాకర్స్‌

వెలుగుల పండుగ అయిన దీపావళికి నగరం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే నగరంలో బాణాసంచా హడావుడి మొదలైంది. పలువురు పిల్లలు, పెద్దలు ఇప్పటికే టపాసులు కాల్చుతూ సందడి చేస్తున్నారు. అయితే అక్టోబర్‌ 20న దేశవ్యాప్తంగా దీపావళిని జరుపుకునేందుకు ప్రజలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనికి అనుగుణంగా ఇప్పటికే నగరంలో పలు చోట్ల బాణాసంచా దుకాణాలు ఏర్పాటయ్యాయి. అయితే పర్యావరణంపై పెరుగుతున్న అవగాహన కారణంగా ఎకోఫ్రెండ్లీ క్రాకర్స్‌ అందుబాటులో ఉన్నాయి. అయితే మరోవైపు నకిలీ గ్రీన్‌ క్రాకర్స్‌ మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. వీటిపై ప్రజల్లో అవగాహన పెరగాల్సి ఉందని పలువురు పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. - సాక్షి,సిటీబ్యూరో

గ్రేటర్‌లో దీపావళి రోజున లక్ష్మి పూజ, దీపాలు వెలిగించడం శతాబ్దాలుగా వస్తున్న ఆచారం. ఇక పిల్లలు అయితే క్రాకర్స్‌తో రచ్చ రచ్చ చేస్తారు. అయితే పూజ విషయాలు పక్కనపెడితే.. యేటా క్రాకర్స్‌/బాణాసంచాకు సంబంధించి దేశ వ్యాప్తంగా తలెత్తే వివాదం పొల్యూషన్‌కు కారణమయ్యే క్రాకర్స్‌. ఈ నేపథ్యంలోనే.. పర్యావరణ హితం గ్రీన్‌ క్రాకర్స్‌ కాల్చాలంటూ ప్రభుత్వాలు పిలుపునిస్తున్నాయి. న్యాయస్థానాలూ ఇదే విషయాన్ని చెప్తున్నాయి. అనేక నగరాల్లో సాధారణ క్రాకర్స్‌ కాల్చడాన్ని నిషేధించారు. నగరంలో మాత్రం గ్రీన్‌ క్రాకర్స్‌పై అంతగా అవగాహన లేకుండా పోయింది. ప్రజల్లో గ్రీన్‌ క్రాకర్స్‌పై అవగాహన కల్పించడంతో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.



### గ్రీన్‌ క్రాకర్స్‌ పేరుతో మోసాలు..

పర్యావరణ వేత్తలు పిలుపు మేరకు కొంత మంది ప్రజలు గ్రీన్‌ క్రాకర్స్‌ కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొంత మంది వ్యాపారులు గ్రీన్‌ క్రాకర్స్‌ పేరుతో నకిలీ టపాలు విక్రయిస్తున్నారు. గ్రీన్‌ క్రాకర్స్‌ పేరుతో సాధారణ క్రాకర్స్‌ అమ్మేస్తున్నారు. తేడా తెలియనివారు అధిక ధరలకు కొనుగోలు చేసి మోసపోతున్నారు.

### ఎన్ని రకాలు?

గ్రీన్‌ క్రాకర్స్‌ మూడు రకాలు. స్వాస్‌, సఫల్‌, స్టార్‌. స్వాస్‌ క్రాకర్స్‌ దుమ్మును పీల్చుకుని సన్నని నీటి బిందువులను విడుదల చేస్తుంది. సఫల్‌ క్రాకర్స్‌లో సురక్షితమైన మోతాదులో అల్యూమినియం ఉంటుంది. ఇది శబ్దాన్ని తగ్గిస్తుంది. స్టార్‌ క్రాకర్స్‌లో పొటాషియం నైట్రేట్‌, సల్ఫర్‌ ఉండదు. తక్కువ పొగను విడుదల చేస్తుంది.

### ఎలా గుర్తించాలి?

అసలు గ్రీన్‌ క్రాకర్స్‌ని ఎలా గుర్తించాలి.. గ్రీన్‌ క్రాకర్స్‌, సాధారణ క్రాకర్స్‌ మధ్య తేడా ఏంటి? అనే సందేహం తలెత్తక మానదు. ఇవి సాధారణ క్రాకర్స్‌ కంటే తక్కువ పొగను, శబ్దాన్ని ఉత్పత్తి చేస్తాయి. వీటిని నేషనల్‌ ఎన్విరాన్‌మెంటల్‌ ఇంజినీరింగ్‌ రీసెర్చ్‌ ఇన్‌స్టిట్యూట్‌(సీఐఎస్‌ఆర్‌–ఎన్‌ఈఈఆర్‌ఐ) కనిపెట్టింది. గ్రీన్‌ క్రాకర్స్‌ 110–125 డెసిబల్స్‌ శబ్దాన్ని మాత్రమే ఉత్పత్తి చేస్తాయి. సాధారణ క్రాకర్స్‌ 160 డెసిబెల్స్‌ కంటే ఎక్కువ శబ్దాన్ని ఉత్పత్తి చేస్తాయి. ప్రతి బాణాసంచా బాక్స్‌పై క్యూఆర్‌ కోడ్‌ ఉంటుంది. దీని ఆధారంగా నకిలీనా.. నిజమైనదా గుర్తించవచ్చు. ఎన్‌ఈఈఆర్‌ఐ యాప్‌ని ఉపయోగించి.. ఈ కోడ్‌ను స్కాన్‌ చేయాలి. దీంతో ఆ క్రాకర్స్‌ ఒరిజినలా.. నకిలీవా అని తేలిపోతుంది.

## దోస్త్‌ మేరా దోస్త్‌!

30 ఏళ్లకు కలుసుకున్న పోలీసు ఫ్రెండ్స్‌



సాక్షి, సిటీబ్యూరో: వారిద్దరూ పోలీసులు ఉన్నతాధికారులు. 1990 బ్యాచ్‌కు చెందిన వీరిద్దరూ ఐపీఎస్‌ అధికారులు. ఎస్‌వీపీ ఎన్‌పీఏలోనే శిక్షణ పొందారు. అప్పటి నుంచి వీరి స్నేహం కొనసాగుతోంది. కాగా.. ఎన్‌పీఏ నుంచి బయటకు వచ్చిన ఐదేళ్లకు బ్యాచ్‌ రీయూనియన్‌లో ఈ ద్వయం కలుసుకున్నారు. ఆపై సమాచార మార్పిడి, ఫోన్‌ ద్వారా సంభాషణలు జరుగుతున్నా ప్రత్యక్షంగా కలుసుకునే అవకాశం వీరికి రాలేదు. అయితే అలాంటి అరుదైన కలయికకు వేదికైంది నగరంలోని శివరాంపల్లిలో ఉన్న సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ జాతీయ పోలీసు అకాడెమీ. (ఎస్‌వీపీ ఎన్‌పీఏ)లో శుక్రవారం ఆ అరుదైన దృశ్యం చోటు చేసుకుంది. అదే అకాడెమీలో 35 ఏళ్ల క్రితం శిక్షణ పొందిన ఈ ఇద్దరు అత్యున్నత అధికారులు 30 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. వీరిలో ఒకరు తెలంగాణ మాజీ డైరెక్టర్‌ జనరల్‌ ఆఫ్‌ పోలీసు (డీజీపీ), ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌ జైళ్ల శాఖ డైరెక్టర్‌ జనరల్‌ అంజనీ కుమార్‌ అయితే... రెండో వారు బోర్డర్‌ సెక్యూరిటీ ఫోర్స్‌ (బీఎస్‌ఎఫ్‌) డైరెక్టర్‌ జనరల్‌ దల్జిత్‌ సింగ్‌ చౌదరి.

### 30 ఏళ్ల తర్వాత..

శిక్షణ నుంచి బయటకు వచ్చిన తర్వాత అంజనీ కుమార్‌ ఆంధ్రప్రదేశ్‌, దల్జిత్‌ సింగ్‌ ఉత్తరప్రదేశ్‌ క్యాడర్లకు వెళ్లారు. అప్పటి నుంచి వీరి స్నేహం కొనసాగుతోంది. 30 ఏళ్ల తర్వాత శుక్రవారం మళ్లీ ఆ అవకాశం వచ్చింది. ఎస్‌వీపీ ఎన్‌పీఏలో జరిగిన 77వ బ్యాచ్‌ ఐపీఎస్‌ అధికారుల పాసింగ్‌ ఔట్‌ పరేడ్‌కు దల్జిత్‌ సింగ్‌ చౌదరిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ విషయం తెలుసుకున్న అంజనీకుమార్‌ సైతం ఎస్‌వీపీ ఎన్‌పీఏకు వెళ్లారు. అక్కడ వీరిద్దరూ ఇతర పోలీసు అధికారులకు సెంటర్‌ ఆఫ్‌ ఎట్రాక్షన్‌ అయ్యారు.

సాక్షి రియల్టీ
శనివారం
18-10-2025



# ఆరోగ్యానికి ప్రాధాన్యం

- జిమ్, యోగా వంటి వసతుల ఎంపిక
- పిల్లల కోసం ఆట స్థలాలు, డే కేర్ సెంటర్లు కూడా..

**సాక్షి, సిటీబ్యూరో:** గృహ కొనుగోలుదారుల అభిరుచులు మారుతున్నాయి. గతంలో ధర ప్రాధాన్యంగా గృహ కొనుగోలు నిర్ణయం తీసుకునే కస్టమర్లు.. ఆ తర్వాత వసతులను పరిగణలోకి తీసుకున్నారు. నేటి యువతరం ఇల్లు కొనేటప్పుడు చుట్టుపక్కల ఆరోగ్య సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది ప్రధానంగా చూస్తున్నారు. అత్యవసరంలో ఎంత సమయంలో ఆసుపత్రికి చేరుకోవచ్చు? ఎంత సమీపంలో వైద్య సదుపాయాలు ఉన్నాయనేది ఆరా తీస్తున్నారు. ఇంట్లో పిల్లలు, పెద్దల ఆరోగ్య అవసరాల రీత్యా వీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇల్లు విశాలంగా ఉండటమే కాదు కమ్యూనిటీలో సకల సౌకర్యాలు ఉండాలనేది నేటి గృహ కొనుగోలుదారుల మాట. పిల్లల కోసం క్రీడా సదుపాయాలు, పెద్దలకు క్లబ్ హౌస్, జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి సదుపాయాలు ఉండాలని భావిస్తున్నారు. ఎక్కువ ఖాళీ స్థలం వదిలి, పచ్చదనం అధికంగా ఉంటే ఇష్టపడుతున్నారు. చిన్న కుటుంబాల నేపథ్యంలో పిల్లల ఆలనాపాలనా చూసే డే కేర్ సౌకర్యాలు ఉండాలని గృహ కొనుగోలుదారులు చూస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ కార్యాలయాలకు వెళితే పిల్లలను చూసుకోవడం కష్టం అవుతుంది. వర్క్ ఫ్రం హోమ్ ఉన్నా పిల్లలపై శ్రద్ధ పెట్టలేని పరిస్థితి. కమ్యూనిటీలో డే కేర్ సదుపాయాలు ఉండాలని కోరుకుంటున్నారు.

### వీకెండ్ ఎంజాయ్..

వీకెండ్ వస్తే కుటుంబంతో కలిసి ఆహ్లాదంగా గడిపేందుకు షాపింగ్ మాల్స్, థియేటర్లు ఎంత దూరంలో ఉన్నాయనేవి కూడా కొనుగోలు ఎంపికలో భాగమైపోయాయి. పచ్చని ప్రకృతిని ఆస్వాదించాలని కోరుకునే నివాసితులు శివారు ప్రాంతాలలో ఫామ్‌హౌస్‌లు, విల్లాల కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇల్లు కొనేటప్పుడు ఆఫీసుకు ఎంత దూరంలో ఉందనేది కస్టమర్ల ప్రాధామ్యాలలో ఒకటి. నగరంలో ట్రాఫిక్‌లోనే అధిక సమయం వృథా అవుతుంది కాబట్టి దూరం, సమయం అనేది ప్రధానంగా మారాయి. ప్రజా రవాణా సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటున్నారు.



# అందుబాటు ధరల్లో.. లగ్జరీ గృహాలు

సాక్షి, సిటీబ్యూరో: విలాసవంతమైన గృహాలే కానీ, అందుబాటు ధరల్లో..! ఇదీ ఇప్పుడు నగర రియల్టీ మార్కెట్‌లో కొత్త ట్రెండ్. ఆడంబరాల కంటే గృహ కొనుగోలుదారుల అవసరాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రాజెక్ట్‌ను తీర్చిదిద్దడమే ఈ అఫర్డబుల్ లగ్జరీ యూనిట్ల ప్రత్యేకత. సాధ్యమైనంత వరకూ నిర్మాణ, నిర్వహణ వ్యయాలను అదుపులో పెట్టుకుంటూ.. ధరలు అందుబాటు ఉండేలా చేసే అధిక సాంద్రత ప్రాజెక్ట్‌లతో ఇది సాధ్యమేనంటున్నారు రియల్టీ పరిశ్రమ నిపుణులు.

- స్మార్ట్ లేఅవుట్లు, డిజైన్ల ఎంపికకే బిల్డర్ల మొగ్గు
- సాంకేతికతతో నిర్వహణ, నిర్మాణ వ్యయాల తగ్గింపు
- నగరంలో ఊపందుకున్న సరికొత్త ప్రాజెక్ట్‌లు
- యువ కస్టమర్ల నుంచి ఎక్కువ డిమాండ్

కస్టమర్ల అవసరాలకే అధిక ప్రాధాన్యం

అధిక సాంద్రత ప్రాజెక్ట్‌లతో ఇది సాధ్యమే..

దేశీయ రియల్ ఎస్టేట్ రంగాన్ని కరోనాకు ముందు, తర్వాత అని విభజించక తప్పదు. ఎందుకంటే కోవిడ్ మహమ్మారి కాలంలో ఇంటి అవసరం తెలిసొచ్చింది. వర్క్ ఫ్రం హోమ్, ఆన్‌లైన్ క్లాస్‌లు రకరకాల కారణాలతో ఇంట్లో గడిపే సమయం పెరిగింది. ఇది ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. దీంతో ఇంట్లో ప్రత్యేకంగా గది, వ్యాయామం, యోగా వంటి ఆరోగ్య అవసరాల కోసం ప్రత్యేక స్థలం అవసరమైంది. దీంతో క్రమంగా నాలుగు గోడల చౌక గృహాలకు బదులుగా విశాలమైన లగ్జరీ ఇళ్లకు డిమాండ్ ఏర్పడింది. ప్రాంతం, వసతులు, నాణ్యత, గడువు కంటే ఇప్పటికీ గృహ కొనుగోళ్లలో కస్టమర్ల తొలి ప్రాధాన్యత ధరకే.. అందుకే ధరను బ్యాలెన్స్ చేస్తూ కస్టమర్ల అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా ప్రాజెక్ట్‌లను చేపట్టేందుకు డెవలపర్లు ఆసక్తి చూపిస్తున్నారు. లగ్జరీ గృహాలు, స్థోమత మధ్య చక్కటి సమతుల్యతను పాటిస్తుండటంతో నగరంలో సరసమైన లగ్జరీ హౌసింగ్ భావన ఊపందుకుంది. అఫర్డబుల్ లగ్జరీ గృహ విభాగం ప్రధాన ప్రయోజనం ఏంటంటే.. డెవలపర్లు గృహ కొనుగోలుదారుల సంపూర్ణ అవసరాలను పరిగణలోకి తీసుకోవడమే. ప్రాజెక్ట్‌ను హైప్ చేయడానికి ఫ్యాన్సీ ఆడంబరాలు, అలంకరణలను జోడించడానికి బదులుగా ఖర్చులను ఆదా చేస్తూ కస్టమర్లకు అవసరమైన వసతులు, సౌకర్యాలను అందించడానికి ప్రయత్నిస్తారు.

### యువ కస్టమర్ల ఆసక్తి..

ఈ విలాసవంతమైన ఇళ్ల కొనుగోలుదారులు ఎక్కువగా యువ కస్టమర్ల నుంచే ఆదరణ ఎక్కువగా ఉంది. మిలీనియల్స్, అధిక సంపాదన ఆర్జించే జెన్-జెడ్, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వంటి కస్టమర్లు ఎక్కువగా ప్రీమియం ఇళ్ల కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ఐటీ హబ్ నగరాలలో విలాసవంతమైన ఇళ్లకు డిమాండ్ అధికంగా ఉంది. ఈ తరహా గృహ కొనుగోలుదారులు తమ ఆదాయ స్థాయిలకు సరిపోయే ధర, ఎక్కువ వసతులు ఉండే నివాస సముదాయాలను కోరుకుంటున్నారు.

### అధిక అద్దెలు కూడా కారణమే..

గృహాల అద్దెలు పెరగడం కూడా విలాసవంతమైన ఇళ్ల డిమాండ్‌కు కారణమే. ఐటీ హబ్ నగరాలలో ఏటా అద్దెలు 9-15 శాతం మేర పెరుగుతున్నాయి. దీంతో పెట్టుబడులపై అధిక రాబడి ఆర్జిస్తున్నారు. దీంతో పెట్టుబడిదారులు ఇప్పుడు సరసమైన లగ్జరీ ప్రాపర్టీలను ఆర్థికంగా చురుకైన ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్‌గా పరిగణిస్తున్నారు. అద్దె ఆదాయంతో నెలవారీ వాయిదా(ఈఎంఐ) చెల్లింపులతో భర్తీ చేయాలని భావిస్తుండటంతో విలాసవంతమైన ఇళ్లకు డిమాండ్ పెరుగుతుంది.



విశాలమైన, విలాసవంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు పెద్ద సైజు కిటికీలు, తలుపులను ఏర్పాటు చేస్తున్నారు. ఎత్తయిన సీలింగ్‌తో ప్రవేశ ద్వారాన్ని సెవెన్ స్టార్ హోటల్ మాదిరిగా లగ్జరీ ఆంబియెన్స్‌ను కల్పిస్తున్నారు. వేగవంతమైన డెలివరీ, నిర్మాణ వ్యయాన్ని తగ్గించేందుకు మాడ్యులర్ నిర్మాణ పద్ధతులను అమలు చేస్తున్నారు. స్మార్ట్ హోమ్ టెక్నాలజీ, వెల్‌నెస్ ఫీచర్లు, స్థిరమైన పద్ధతులతో నివాస సముదాయాల విలువలను పెంచుతున్నారు.

### అత్యాధునిక నిర్మాణ పద్ధతులు

భూముల ధరలు తక్కువగా ఉన్న ప్రాంతాలలో ముఖ్యంగా ద్వితీయ శ్రేణి పట్టణాలు, ప్రాంతాలలో అధిక సాంద్రత కలిగిన ప్రాజెక్ట్‌లను నిర్మించడం ఒక కీలకమైన వ్యూహం. అలాగే డెవలపర్లు ఖర్చులను తగ్గించడానికి అత్యాధునిక నిర్మాణ పద్ధతులు, స్మార్ట్ డిజైన్‌లను అవలంబిస్తున్నారు. సాంకేతికత వినియోగంతో దీర్ఘకాలిక నిర్వహణ వ్యయాలను నియంత్రిస్తున్నారు. దీంతో నివాస సముదాయాలు పర్యావరణహితంగానే కాకుండా బడ్జెట్ అనుకూలంగా మారుస్తుంది. వ్యవస్థీకృతమైన ఆప్టిమైజ్ లే-అవుట్‌లతో సమర్థవంతమైన యూనిట్ పరిణామాలను అందించడంతో తక్కువ ధరకే లగ్జరీ వసతులను యాక్సెస్ చేయడంలో సహాయపడుతుంది.

### లగ్జరీ ఫీలింగ్..

డెవలపర్లు కార్పెట్ ప్రాంతాన్ని పెంచడానికి స్మార్ట్ డిజైన్ లేఅవుట్లను ఎంపిక చేస్తారు. కాంక్రీట్‌ను సాధ్యమైనంత తక్కువ ఉపయోగించడంతో పాటు

### నిర్మాణ, నిర్వహణ వ్యయాలు..

డెవలపర్లు ఉపయోగిస్తున్న మరో విధానం స్థిరత్వం. ఈ తరహా నిర్మాణాలు ఖర్చు, సమర్థవంతమైన ముందస్తు వ్యయాలను తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే పర్యావరణంపై తక్కువ ప్రభావం ఉండేలా చేస్తుంది. ఈ నిర్మాణాలను తక్కువ ఆర్థిక భారం, పన్ను ప్రయోజనాలతో నిర్మించడంలో సహాయపడుతుంది. స్థిరమైన పద్ధతులను అవలంభించడం వల్ల దీర్ఘకాలిక కార్యాచరణ వ్యయాలు తగ్గుతాయి. అలాగే పర్యావరణ స్పృహ ఉన్న కస్టమర్లను ఆకర్షిస్తాయి. పర్యావరణ అనుకూలమైన నిర్మాణ సామగ్రి, శక్తి సమర్థవంతమైన సాంకేతిక పరిజ్ఞానం వాడకం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు కార్యాచరణ ఖర్చులను తగ్గిస్తుంది.



### వెల్‌నెస్, ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం

కరోనా తర్వాత నుంచి ప్రజల్లో ఆరోగ్యం, పర్యావరణ స్పృహపై అవగాహన పెరిగింది. దీంతో సస్టెనబులిటీ, గ్రీనరీకి ప్రాధాన్యత ఇచ్చే నివాసాల కొనుగోళ్లు, పెట్టుబడులకు కీలక అంశంగా మారింది. అఫర్డబుల్ లగ్జరీ ఇళ్లకు యువ కస్టమర్ల నుంచి ఎక్కువ ఆసక్తి ఉంటుంది. మిలీనియల్స్, జెన్-జెడ్ గృహ కొనుగోలుదారులు బహుళ ప్రయోజనాలు ఉండే ప్రాపర్టీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వెల్‌నెస్, ఫిట్‌నెస్ సౌకర్యాలు, సోషలైజింగ్ కోసం కమ్యూనిల్ ప్రాంతాలు, బహుళ ఈ-కామర్స్ డెలివరీలు, ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ స్టేషన్లు, పాయింట్లు వంటి అనుకూలమైన మౌలిక సదుపాయాలు కోరుకుంటున్నారు. ఆటోమేటిక్ లైటింగ్ ఏర్పాట్లు, అధునాతన భద్రత వ్యవస్థ, తక్కువ విద్యుత్‌ను వినియోగించే ఉపకరణాలు వంటి స్మార్ట్ హోమ్ టెక్నాలజీలు ప్రామాణికంగా మారుతున్నాయి.

### బయోఫిలిక్ డిజైన్లు..

బయోఫిలిక్ డిజైన్ అనేది నివాస, వాణిజ్య నిర్మాణ రంగంలో పెరుగుతున్న ధోరణి. సమృద్ధిగా సహజ కాంతి, ఇండోర్ మొక్కలు, కమ్యూనిటీ గార్డెన్‌లు వంటి వివిధ అంశాల ద్వారా పచ్చని, ప్రకృతిని సృష్టించడం. ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన జీవన పరిస్థితులు. స్థానిక జంతుజాలం, పచ్చని ప్రదేశాలు, స్థానిక మొక్కలతో మార్గాలను ఏకీకృతం చేస్తాయి. కలప, రాయి, టెర్రకోట వంటి సహజ పదార్థాలను ఫ్లోరింగ్, అలంకరణలో ఉపయోగిస్తారు. అలాగే ఆకుపచ్చ, నీలం, మట్టి రంగుల పాలెట్‌తో ప్రశాంతమైన వాతావరణాన్ని సృష్టిస్తారు. చిన్న ఇండోర్ ఫౌంటేన్‌లు, టేబుల్ టాప్ వాటర్ ఫౌంటేన్ల వంటివి ఏర్పాటు చేస్తారు. పెద్ద కిటికీలతో సహజ కాంతికి ప్రాధాన్యత ఇస్తారు. గాలి నాణ్యత, నివాసితుల మానసిక స్థితిని మెరుగుపర్చడానికి గాలి వీచేందుకు ప్రోత్సహిస్తారు. యాంత్రిక వ్యవస్థలపై ఆధారపడటాన్ని తగ్గించి తక్కువ విద్యుత్‌ను వినియోగించే ఉపకరణాలను వాడతారు. ఈ తరహా ప్రాజెక్ట్‌ల కొనుగోలుదారులు మృదువైన ఫినిషింగ్, ఆధునిక డిజైన్లకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. అయితే లగ్జరీ, సౌందర్యంపై ఏమాత్రం రాజీపడరు. కొనుగోలుదారుల కార్యచరణ ఖర్చులను తగ్గించే శక్తి సామర్థ్యం, స్థిరమైన లక్షణాలు ఉండే పర్యావరణ అనుకూల ఎంపికలను కోరుకుంటారు. ఈ తరహా ప్రాజెక్ట్‌లకు ప్రాంతం, కనెక్టివిటీకి కూడా ముఖ్యమే. హైవేలు, మెట్రో లైన్‌లతో మంచి కనెక్టివిటీలతో పాటు సామాజిక మౌలిక సదుపాయాలు ఉన్న ప్రాంతాల్లోని ప్రాపర్టీలకు నివాసితులకు కోరుకుంటున్నారు.




# ఓపెన్ ప్లాట్లకు సుముఖం

- వచ్చే మూడు నెలల్లో కొనేందుకు సిద్ధం
- రూ.75 లక్షల కేటగిరీకే మొగ్గు
- పేరున్న డెవలపర్లయితే ఓకే

**సాక్షి, సిటీబ్యూరో:** కరోనా మహమ్మారి కంటే ముందుతో పోలిస్తే ఇంట్లో గడిపే సమయం పెరిగింది. దీంతో ఇంటి కొనుగోలు ఎంపికలో రాజీ పడటం లేదు. రిస్క్ తీసుకునైనా సరే సొంతింటిని కొనుగోలు చేయాలని.. చిన్న సైజు ఇంటి నుంచి విస్తీర్ణమైన గృహానికి వెళ్లాలని.. ఐసోలేషన్ కోసం ప్రత్యేక గది లేదా కుటుంబ సభ్యులతో గడిపేందుకు హాలిడే హోమ్ ఉండాలని భావించే వాళ్ల సంఖ్య పెరిగింది. దీంతో రాబోయే రోజుల్లో గృహ విభాగానికి డిమాండ్ ఏర్పడటం ఖాయమని జేఎల్ఎల్-రూఫ్ అండ్ ఫ్లోర్ సంయుక్తంగా నిర్వహించిన సర్వే వెల్లడించింది.

- వర్క్ ఫ్రం హోమ్ ఇతరత్రా అవసరాల కోసం బాల్కనీ స్థలంలో అదనంగా ఒక గదిని, ఐసోలేషన్ గదిని ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ఆ తరహా ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్లకే కస్టమర్లు మక్కువ చూపిస్తున్నారు. గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న అపార్ట్‌మెంట్లు లేదా పేరున్న డెవలపర్లకు చెందిన నిర్మాణంలోని ప్రాజెక్ట్‌లలో మాత్రమే కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు. వచ్చే మూడు నెలల కాలంలో 80 శాతం కంటే ఎక్కువ కొనుగోలుదారులు గృహాలను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రూ.75 లక్షల కేటగిరీలోని ప్రాపర్టీలను కొనేందుకు సుముఖంగా ఉన్నారు. హైదరాబాద్‌తో సహా బెంగళూరు, చెన్నై, ఢిల్లీ-ఎన్‌సీఆర్ నగరాలలో 3 బీహెచ్‌కే ఫ్లాట్లకు డిమాండ్ పెరిగింది. ఆయా మార్కెట్లలో పెట్టుబడిదారులు తాము ఉండేందుకు గృహాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు.
- బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో విల్లాలు, అభివృద్ధి చేసిన ప్లాట్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ధరలు అందుబాటులో ఉండటం, మార్కెట్‌లో సానుకూల వాతావరణం నెలకొనడం, ప్రోత్సాహకర ప్రభుత్వ విధానాలతో రాబోయే రోజుల్లో హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌లో ధరలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి.



# పండుగ కాంతులిలా..

**సాక్షి, సిటీబ్యూరో:** దీపావళి అంటేనే వెలుగుల పండుగ. మట్టి ప్రమిదాలతో సంప్రదాయ వెలుగులతో పాటు నేటి యువతరానికి నప్పేట్టు రంగురంగుల లైట్లు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. అలాగనీ మార్కెట్లో దొరికే లైటు తెచ్చి ప్రతి గదిలో పెట్టే రోజులు పోయాయి. పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక ఇంటి యజమానుల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఆలోచనలకు తగ్గట్టు, పరిస్థితుల ప్రకారం వెలిగే లైట్లను ఏర్పాటు చేసుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇందుకు తగ్గట్టుగా వైర్‌లెస్ లైటింగ్ ఆటోమేషన్ మార్కెట్లో లభిస్తుంది.

- ఫ్లాట్‌లో అయినా విల్లాలో అయినా వైర్‌లెస్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవచ్చు. బంధుమిత్రులు, చూపరులకు నచ్చే విధంగా ఇంటిని అలంకరించుకోవచ్చు. అయితే ఇందుకు మనం చేయాల్సిందల్లా.. ఎక్కడెక్కడ ఏయే తరహా లైట్లు ఉండాలో చెబితే సరిపోతుంది. లేదా మన ఆలోచనల్ని చెబితే ఆయా సంస్థలే పనిని పూర్తి చేస్తాయి.
- ఏసీలు ప్రతి ఇంట్లోనూ సర్వసాధారణమయ్యాయి. రిమోట్ కంట్రోల్ బదులు మొబైల్‌తో వీటిని నియంత్రించుకోవచ్చు. వీటిని అమర్చిన తర్వాత మనం ఎక్కడున్నా సరే అరచేతిలో ఉండే మొబైల్‌తో మన ఇంట్లోని లైట్లను వెలిగించుకోవచ్చు.. ఆర్పేయవచ్చు.
- నిన్నటిదాకా ఇంటికి హోమ్ ఆటోమేషన్ చేయాలంటే ప్రత్యేకంగా వైరింగ్ చేయాల్సి ఉండేది. కానీ, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చాక వైర్ల అవసరం లేకుండానే ఇంటిని ఆధునిక లైట్లతో అలంకరించే వీలు కలిగింది. సన్నివేశాలకు తగ్గట్టుగా, పరిస్థితులకు అనుగుణంగా వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు.
- కొత్త, పాత అనే తేడా లేకుండా ఏ ఇంట్లో అయినా హోమ్ ఆటోమేషన్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. 2 బీహెచ్‌కే ఫ్లాట్‌లో దీని ఏర్పాటుకు రూ.90 వేల దాకా ఖర్చవుతుంది. వివిధ సంస్థలు, ఉత్పత్తులను బట్టి ధరలు మారుతుంటాయి.

# ఈవీ ఉంటే.. ధర పెంచుడే..



**సాక్షి, సిటీబ్యూరో:** ఇంధన వనరుల ధరలు రోజుకు ఒకలా ఉంటున్న నేపథ్యంలో ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలు(ఈవీ) వైపు మొగ్గుచూపుతున్నారు. మరోవైపు ప్రభుత్వం కూడా ఈవీ వాహనాలను ప్రోత్సహిస్తుండటంతో చార్జింగ్ స్టేషన్ల అవసరం పెరిగింది. ఒకవైపు పెట్రోల్ బంక్‌లు, మెట్రో స్టేషన్ల వద్ద ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటవుతుంటే.. మరోవైపు కొత్తగా నిర్మిస్తున్న నివాస, వాణిజ్య సముదాయాలలోనూ వీటిని ఏర్పాటు చేస్తున్నారు. జిమ్, స్విమ్మింగ్ పూల్ అంటూ ప్రకటించే వసతుల జాబితాలో ఈవీ చార్జింగ్ పాయింట్ అనే ప్రత్యేకంగా ప్రకటించే స్థాయికి చేరిందంటే ఆశ్చర్యమేమీ లేదు. ప్రస్తుతమున్న సాధారణ నివాస భవనాలలో ధరలు 1 శాతం మేర పెరిగితే.. ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసిన నివాస భవనాలలో ధరలు 2-5 శాతం వృద్ధి చెందుతాయని జేఎల్ఎల్ నివేదిక తెలిపింది.

- 2030 నాటికి ఎలక్ట్రిక్ వాహనాల వాటా 40 శాతం కంటే ఎక్కువకు చేరుతుంది. దీంతో ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఉన్న భవనాలకు డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. కొత్త ప్రాజెక్ట్‌లోనే కాకుండా ఇప్పటికే ఉన్న భవనాలలో కూడా ఈవీ పాయింట్ల ఏర్పాటు వ్యవస్థ 2026 నాటికి భారీగా పెరుగుతుంది. భవనాల రకం, సహజ వనరుల పునర్వినియోగం (రెట్రోఫిట్) ప్రాజెక్ట్‌ల నివాస తరగతులను బట్టి ధరల పెరుగుదల ఉంటుంది. ప్రస్తుతం నివాస ప్రాంతాలలో యజమానులు సర్వీస్ ప్రొవైడర్ల సహాయంతో ఈవీ స్టేషన్లను ఇన్‌స్టాల్ చేస్తున్నారు. పెద్ద స్థాయి ప్రాజెక్ట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలలో అసోసియేషన్లు వీటిని ఏర్పాటు చేస్తున్నాయి. ఇందుకోసం వినియోగదారులపై నిర్ణీత రుసుములను వసూలు చేస్తున్నారు. రానున్న కొత్త నివాస సముదాయాలలో 5 శాతం పార్కింగ్ స్థలాన్ని ఈవీ చార్జింగ్ స్టేషన్ల కోసం కేటాయిస్తాయని అంచనా. ఈవీ స్టేషన్ల ఏర్పాటు కోసం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) చార్జింగ్ ఉపకరణాలు, ఇంటర్నెట్ లభ్యత కూడా అందుబాటులో ఉండాలి కనుక.. ఇప్పటికే ఉన్న పెద్ద రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లు, బహుళ అంతస్తుల భవనాలలో చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు వ్యయం, పరిమిత విద్యుత్ సరఫరా సామర్థ్యాలను బట్టి 1 శాతం ప్రీమియం ఉంటుందని పేర్కొన్నారు. 60 శాతం కంటే ఎక్కువ నివాసితులు ఈవీ చార్జింగ్ పాయింట్ల అవసరాన్ని కోరుకుంటుంటే ఈ ప్రీమియం 2-5 శాతం వరకు ఉంటుందని తెలిపారు.

### ఆఫీస్ స్పేస్‌లలో కూడా..

ఈవీ స్టేషన్లు ఉన్న ఆఫీస్ స్పేస్‌లకు కూడా డిమాండ్ ఏర్పడింది. కొందరు స్థల యజమానులు వినియోగదారు రుసుముతో ఈవీ స్టేషన్ల సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మరికొందరు చార్జింగ్ సర్వీస్ ప్రొవైడర్లకు భూమిని లీజుకు లేదా రెవిన్యూ షేర్ మోడల్ ద్వారా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఆఫీస్ పార్కింగ్‌లలో ఖాళీ ప్లేస్‌లు లేకపోవడమే అసలైన సవాలు. ఇప్పటికే ఉన్న కొన్ని కార్యాలయాలలోని పార్కింగ్‌లలో ఇలాంటి అవసరాల కోసం కొంత స్థలాన్ని కేటాయించాయి. ప్రభుత్వ విభాగాలు చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసి వాటిని ప్రైవేట్ ఆపరేటర్లకు లీజుకు ఇవ్వొచ్చు లేదా దీర్ఘకాలానికి సంబంధిత భూమిని సర్వీస్ ప్రొవైడర్లకు లీజుకు ఇవ్వొచ్చని జేఎల్ఎల్ సూచించింది.

## క్లుప్తంగా...

### సర్దార్ @150 యూనిటీ మార్చ్‌లో అందరూ పాల్గొనాలి

- కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని స్మరించుకోవడానికి నిర్వహిస్తున్న సర్దార్ @150 యూనిటీ మార్చ్‌లో చురుకుగా పాలుపంచుకోవాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి కోరారు. ఈ మార్చ్‌లో పార్టీలకతీతంగా, యువకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. శుక్రవారం సీజీఓ టవర్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ జీవితం, నాయకత్వం అందించిన స్ఫూర్తితో జాతీయ సమగ్రత, ఏకత, యువజన భాగస్వామ్యం వంటి ఆదర్శభావనలను ఒక ఉత్సవంగా జరుపుకొనే కార్యక్రమమే సర్దార్ @150 యూనిటీ మార్చ్ అని కిషన్‌రెడ్డి అభివర్ణించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఈనెల 31 నుంచి నవంబర్ 25 వరకు జిల్లా స్థాయి పాదయాత్రలు ఉంటాయని చెప్పారు. ప్రతి పార్లమెంట్ వారీగా మూడ్రోజుల పాటు వీటిని నిర్వహిస్తారని, దేశంలో అన్ని జిల్లాల్లో ప్రతి రోజు 8 నుంచి 10 కిలోమీటర్ల పాదయాత్ర ఉంటుందని వెల్లడించారు. నేషనల్ మార్చ్ నవంబర్ 26 నుంచి డిసెంబర్ 6 వరకు ఉంటుందని తెలిపారు.

### పంతం నెగ్గించుకున్న ఎంపీ కొండా

- వికారాబాద్ బీజేపీ అధ్యక్షుని రాజీనామా ఆమోదం

సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లా అధ్యక్ష పదవికి కొప్పు రాజశేఖర్‌రెడ్డి సమర్పించిన రాజీనామాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఆమోదించారు. దీంతో పాటు ఈ జిల్లా పార్టీ కన్వీనర్‌గా కరణం ప్రహ్లాదరావును నియమిస్తూ.. అధ్యక్షుడు ఇచ్చిన ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.గౌతంరావు ఒక ప్రకటనలో తెలిపారు. చేవెళ్ల ఎంపీగా ఉన్న తనకు తెలియకుండానే జిల్లాలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని.. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులపై పార్టీ నాయకత్వానికి గతంలోనే కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. తన ఫిర్యాదుపై నాయకత్వం స్పందించకుండా తాత్సారం చేయడంతో ఆయన వివిధ వేదికలపై ఒత్తిడి పెంచారు. చివరకు వికారాబాద్ జిల్లా అధ్యక్షుడిని రాజీనామా చేయించేందుకు నాయకత్వం ఒప్పించినట్టు పార్టీ వర్గాల సమాచారం.

### నేర చరితులను ఒక చోట చేర్చారు: బీఆర్‌ఎస్

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమం అంతర్రాష్ట్ర రౌడీల ప్రదర్శనలా సాగిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మండిపడ్డారు. నామినేషన్ ర్యాలీలో రౌడీలు కత్తులు, కటార్లతో వీరంగం చేస్తే పోలీసులు చోద్యం చూశారని మండిపడ్డారు. నేర చరితులందరినీ ఒకే చోట చేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో పార్టీ ఎమ్మెల్యే కె.సంజయ్‌తో కలిసి సుధీర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. నగరంలో రౌడీ సంస్కృతికి బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపు ద్వారా చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. దొంగ ఓట్లతో జూబ్లీహిల్స్‌లో గెలిచేందుకు కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామన్నారు. బిహార్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఎంఐఎం జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయడం లేదని సుధీర్‌రెడ్డి ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని సంజయ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నామినేషన్ సందర్భంగా గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్.భాస్కర్‌రావు, పార్టీ నేతలు ప్రశాంత్ కుమార్‌రెడ్డి, తోట ఆగయ్య పాల్గొన్నారు.

### మరో రెండు సార్లు గెలిపిస్తే.. నేనూ సీఎం అభ్యర్థి అవుతా

- కాంగ్రెస్ పార్టీలోనే స్వేచ్ఛ ఎక్కువ
- పార్టీ సమావేశంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



జడ్చర్ల టౌన్: నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటే ఎవరితోనైనా కొట్లాడి, ఎన్ని నిధులైనా తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జడ్చర్లలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుగోడును ఏదో ఒకరోజు శాసిస్తా.. అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పినట్టు.. 'మరో రెండుసార్లు నన్ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నేనూ సీఎం అభ్యర్థినవుతా, ఆ స్వేచ్ఛ కేవలం కాంగ్రెస్ పార్టీలోనే ఉందని గుర్తించాలి'అని అన్నారు. ప్రాంతీయ పార్టీలో ఇది సాధ్యం కాదని, పనిచేసే వారికి కాంగ్రెస్ పార్టీలో తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజలు అండగా ఉంటే జడ్చర్ల నియోజకవర్గాన్ని ఎంతైనా అభివృద్ధి చేస్తానన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు నియోజకవర్గాలకు రెడ్డి ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నందున బీసీ, ఎస్సీ, ఎస్టీలలో ఒకరిని డీసీసీ అధ్యక్షుడిగా నియమిస్తే బాగుంటుందని, తాను ఇదివరకే అభిప్రాయం వ్యక్తం చేశానని చెప్పారు.

# పెళ్లికి ముందే కౌన్సెలింగ్!

- ప్రతి జిల్లాలో వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ప్రతి కేంద్రంలో ఒక లీగల్ కౌన్సిలర్, సైకాలజిస్టు, సోషల్ వర్కర్, హెల్పర్
- ఫైల్‌పై సంతకం చేసిన మంత్రి సీతక్క..ఆర్థికశాఖకు ఫైల్ బదిలీ
- అతి త్వరలో ఆమోదం.. ఆ తర్వాత కేంద్రాల ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన సఖి (వన్ స్టాప్ సెంటర్) కేంద్రాలకు వస్తున్న కేసుల్లో అత్యధికం కొత్తగా పెళ్లయిన వారికి సంబంధించిన అంశాలే ఉంటున్నాయి. వీటిని తగ్గించే దిశగా రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక చొరవ తీసుకుంటూ వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రాల (పీఎంసీసీ) ఏర్పాటుకు నిర్ణయించింది. పెళ్లికి ముందే కౌన్సెలింగ్ ఇవ్వడం ఈ కేంద్ర ముఖ్యఉద్దేశం. ఆధునిక జీవనశైలిలో చిన్న కుటుంబాల పెరుగుదల, పట్టణీకరణ, తరాల మధ్య అంతరం పెరుగుతుండడంతో వివాహం, కుటుంబ వ్యవస్థ పట్ల మార్గదర్శకత్వం చేసేవారు కరువవుతున్నారు. ఇప్పుడు తలెత్తుతున్న వివాదాల్లో కొన్ని కేసుల్లో తల్లిదండ్రులే వివాహ వివాదాల్లో పక్షాలుగా మారి సమస్యను మరింత క్లిష్టం చేస్తున్నారు. దీంతో వివాహ బంధంలో అడుగుపెట్టిన కొంతకాలంలోనే దూరమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ క్రమంలో వివాహ బంధ బాధ్యత, భావోద్వేగ గాఢత, పరస్పర గౌరవాన్ని అర్థం చేసుకునేందుకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ అవసరమని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ భావించి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. వైవాహిక బంధంలోకి అడుగుపెట్టే వారికి మెరుగైన సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు వారి సందేహాలను నివృత్తి చేసేందుకు ఈ కేంద్రాలు దోహదపడతాయి. ప్రతి జిల్లాలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రతిపాదనలు రూపొందించగా, దీనిపై మంత్రి సీతక్క సంతకం చేశారు. తాజాగా ఈ ఫైల్‌ను ఆర్థిక శాఖకు పంపారు. అక్కడ ఆమోదం లభించిన వెంటనే కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.

**ప్రతి జిల్లాకో కేంద్రం**

వివాహ పూర్వ కౌన్సెలింగ్ కేంద్రం ప్రతి జిల్లాలో ఏర్పాటు చేస్తారు. ప్రారంభ దశలో ఈ కేంద్రాలను సఖీ (వన్ స్టాప్ సెంటర్ల) పరిధిలో ఏర్పాటు చేసి, అవసరమైన చోట ప్రత్యేక భవనాల్లో నిర్వహిస్తారు. ఒక్కో కేంద్రంలో శిక్షణ పొందిన సైకాలజిస్టు, న్యాయ నిపుణుడు, సోషల్ వర్కర్, మ్యారేజ్ కౌన్సిలర్, హెల్పర్ ఉంటారు. వీరిని కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ నియమిస్తుంది. ఇందులో పనిచేసే నిపుణులకు ఒక్కొక్కరికి నెలకు రూ.30 వేల చొప్పున ఇస్తారు. ఈ కేంద్రాల నిర్వహణ, వేతనాల చెల్లింపుల కోసం ఏటా రూ.5 కోట్ల బడ్జెట్ అవసరమని ఆ శాఖ అంచనా వేసింది. ఈ కేంద్రాల ఏర్పాటుతో కుటుంబ విభేదాలు, గృహహింస, విడాకులు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని యంత్రాంగం భావిస్తోంది. యువ దంపతుల్లో భావోద్వేగాలు, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, సమాజంలో స్థిరమైన, సంతోషకరమైన కుటుంబ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా తీసుకున్న ఒక ముందడుగు అవుతుందని, మంత్రి సీతక్క అన్నారు. ప్రతి వివాహం కూడా అవగాహన, గౌరవం, బాధ్యతతో ప్రారంభమయ్యే సమాజాన్ని నిర్మించాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టిందన్నారు.

# ఇది పత్రికా స్వేచ్ఛపై దాడే

**ఏపీ, తెలంగాణవ్యాప్తంగా కదం తొక్కిన జర్నలిస్టులు | 'సాక్షి'పై కక్ష సాధింపు తగదని నినాదాలు**

సాక్షి నెట్‌వర్క్: ఏపీ ప్రభుత్వ వైఫల్యాలు, నకిలీ మద్యం రాకెట్‌పై వరుస కథనాలు రాస్తుండటాన్ని తట్టుకోలేక సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, ఇతర జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టి.. వేధించడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఏపీ, తెలంగాణవ్యాప్తంగా జర్నలిస్టులు కదం తొక్కారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఇది ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛపై దాడే అని నినదించారు. వాస్తవాలు రాస్తున్న 'సాక్షి'పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, పెట్టిన కేసులన్నింటినీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరి నశించాలంటూ ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలు నిర్వహించారు. భావ ప్రకటన హక్కుకు విఘాతం కల్పించవద్దని, ప్రజలంతా ఏపీలో ఏం జరుగుతోందో గమనిస్తున్నారని.. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. సాక్షి హైదరాబాద్ కార్యాలయంలో ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిని విచారణ పేరుతో రోజుల తరబడి వేధించడం ఎంత మాత్రం భావ్యం కాదని నిప్పులు చెరిగారు. ప్రజాస్వామ్యానికి సంకెళ్లా.. సాక్షి ఎడిటర్‌పై కేసు సిగ్గు సిగ్గు.. నియంత ప్రభుత్వం సిగ్గు సిగ్గు.. జర్నలిస్టుల గొంతునొక్కే దౌర్జన్య పాలన నశించాలి.. అంటూ నినాదాలు చేశారు.




విజయవాడ కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు

### రాజకీయ కక్షసాధింపు చర్యలు ఆపాలి



ఏపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే సాక్షి మీడియాపైన రాజకీయ కక్షసాధింపునకు పాల్పడుతోంది. ఇది పత్రికా స్వేచ్ఛపైన జరుగుతున్న దాడి. సమాజంలో జరుగుతున్న విషయాలను మీడియా నిర్భయంగా ప్రజలకు చేరవేస్తుంది. ప్రసారం చేసిన వాటిపై అభ్యంతరముంటే ప్రభుత్వం వివరణ ఇవ్వడమో, ఖండించడమో చేయాలి. అలాకాకుండా పోలీసులను ఉసిగొల్పి నోటీసులు జారీ చేస్తూ మానసికంగా ఇబ్బందిపెట్టే ప్రయత్నాలు సరికావు. ఇలాంటి రాజకీయ కక్షసాధింపు చర్యలను ఏపీ ప్రభుత్వం వెంటనే ఆపేయాలి. కొంతకాలంగా ప్రభుత్వాలు మీడియాను నియంత్రించాలనే ఆలోచనలతో వ్యవహరిస్తున్నాయి. ప్రతిపక్షాన్ని నిలువరింపలేక వారికి అండగా ఉన్న మీడియాను ఈ విధంగా ఇబ్బందిపెట్టే ప్రయత్నాలు సరికాదు. మీడియా ఎంత వ్యతిరేక వార్తలు రాస్తే ప్రభుత్వానికి అంత మంచిది. తప్పులు, పొరపాట్లను సరిచేసుకునే అవకాశం ఉంటుంది.

– ప్రొఫెసర్ హరగోపాల్, పౌరహక్కుల నేత

### 'సాక్షి'ని వేధించేందుకే తప్పుడు కేసులు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సాక్షిని లక్ష్యంగా చేసుకుని కక్షసాధింపు చర్యల్లో భాగంగానే తప్పుడు కేసులు నమోదు చేస్తోంది. 'సాక్షి'మీడియా గ్రూప్ మీద ఒత్తిడి పెంచేందుకు, వాస్తవాలు రాయకుండా, ప్రసారం చేయకుండా కట్టడి చేసేందుకు కేసులు బనాయించడం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు నకిలీ మద్యం అంశంపై ప్రచురితమైన కథనాలకు సంబంధించి సోర్స్ వెల్లడించాలని ఒత్తిడి చేయడం ఉన్నత న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులకు వ్యతిరేకమే తప్ప మరొకటి కాదు. ఇది ఒకరకంగా కోర్టు తీర్పులను ఉల్లంఘించడమే. ప్రచురితమైన వార్తలకు సంబంధించిన సోర్స్ వెల్లడించాలని ఒత్తిడి చేయడం పత్రికా స్వేచ్ఛను హరించడమే. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డికి స్వయంగా నోటీసులు అందిస్తామంటూ రోజుల తరబడి పత్రిక ప్రధాన కార్యాలయానికి రావడం సమర్థనీయం కాదు. సాక్షి మీడియాపై కేసులు నమోదుకు పోలీసులను ఉసిగొల్పడం తద్వారా కూటమి ప్రభుత్వం చేస్తోన్న ప్రజావ్యతిరేక నిర్ణయాలను ప్రచురించకుండా ఒత్తిడి తేవాలన్న ప్రయత్నమే ఇది. ఇలాంటి చర్యలు ద్వారా మీడియాను తమ అదుపు ఆజ్ఞల్లో పెట్టుకుంటామనుకోవడం కూటమి ప్రభుత్వం భ్రమే. ఇలాంటి చర్యలను తక్షణమే నిలిపివేయాలి.

– వర్దెల్లి మురళి, సీనియర్ సంపాదకులు

### పత్రికా స్వేచ్ఛపైన దాడి పరాకాష్టకు చేరింది



సాక్షి మీడియాపైన ఏపీ ప్రభుత్వం చేస్తోన్న దాడి పరాకాష్టకు చేరింది. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాక్షి మీడియాపైన పదేపదే ఉద్దేశపూర్వకంగా పోలీసులు ఏదో ఒక అంశాన్ని ఆసరా చేసుకుని దాడులు చేస్తున్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని ఏపీ ప్రభుత్వానికి చివాట్లు పెట్టినప్పటికీ.... వాటిని ఏమాత్రం ఖాతరు చేయకుండా ఈ విధంగా కక్షసాధింపు ధోరణికి పాల్పడడం ఆక్షేపనీయం. ఏపీ ప్రభుత్వం, పోలీసుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. ప్రజాస్వామ్యంలో మీడియా పాత్ర అత్యంత కీలకమైంది. అలాంటి మీడియా హక్కులకు విఘాతం కలిగించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు.

– అల్లం నారాయణ, సీనియర్ సంపాదకులు, తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్

## దళారులను నమ్మొద్దు.. | కొనుగోలు చేసే బాధ్యత సీసీఐది

- అవినీతి, అక్రమాలకు తావులేకుండా పత్తిని కొనుగోళ్లు చేస్తాం
- తేమను 12శాతానికి పెంచాం.. కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు నమోదు చేసుకోవాలి
- స్లాట్ బుక్ ప్రకారం పత్తిని కొనుగోలు చేస్తాం
- సీసీఐ అధికారులతో మీడియాతో మాట్లాడిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పత్తి అమ్మకాల సమయంలో రైతులు దళారులను నమ్మొద్దని, చివరి పత్తిగింజ వరకు కొనుగోలు చేసే బాధ్యత తీసుకుంటామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పత్తి కొనుగోళ్లు జరిగేలా చూస్తామని చెప్పారు. శుక్రవారం ఆయన సీసీఐ అధికారులతో కలిసి సీజీఓ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 24 లక్షలమంది రైతులు పత్తి సాగు చేశారని, దేశవ్యాప్తంగా పత్తి దిగుబడిలో తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. తేమ శాతాన్ని 12 వరకు పెంచామని, ఎక్కడైనా రైతులు మోసపోతున్నారన్నా, ఎలాంటి అనుమానాలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

**కపాస్ కిసాన్ యాప్**

'దీపావళి తర్వాత రైతులు 'కపాస్ కిసాన్ యాప్'లో రైతులు పంట వివరాలు నమోదు చేసుకోవాలి. తొమ్మిది భాషల్లో ఈ యాప్‌పై ఈ నెల 21 నుంచి 24 వరకు అగ్రికల్చర్, మార్కెటింగ్ అధికారులు రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తారు. స్లాట్ బుకింగ్ వంటి అంశాలపై గ్రామస్థాయిలో అగ్రికల్చర్ ఆఫీసర్లు, పంచాయతీ అధికారులు, ప్రోగ్రెసివ్ రైతులు కలిసి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. స్లాట్ ద్వారా రైతులు తమ పంటను అమ్ముకోవాలని, ఒకేసారి అందరూ కొనుగోలు కేంద్రాల వద్దకు రావొద్దు. రైతులు తమ పంటను రెడీగా ఉంచి, అమ్ముకోవాలనుకుంటే, ఆ యాప్‌లో డేట్ బుకింగ్ చేసుకొని తగిన సమయానికి విక్రయించుకోవాలి'అని కిషన్‌రెడ్డి చెప్పారు. 'మహారాష్ట్రలోని అకోలా ప్రాంతంలోని రైతులు హైడెన్సిటీ ప్లాంటేషన్ చేస్తున్నారు. దాని వల్ల పత్తి పంట దిగుబడి రెట్టింపు అయ్యే అవకాశం ఉంది. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ దిగుబడి వచ్చే విధంగా అధిక సాంద్రత విత్తన పద్ధతిని అనుసరిస్తున్నారు. మన రాష్ట్రంలో కూడా రైతులను ప్రోత్సహించాలనే దృక్పథంతో గతంలో కొంత ప్రయత్నం చేసినా, అది పూర్తిస్థాయిలో విజయం సాధించలేదు. అందువల్ల రైతులను స్వయంగా మహారాష్ట్రకు తీసుకెళ్లి చూపించేందుకు చర్యలు తీసుకుంటాం'అని కిషన్‌రెడ్డి తెలిపారు.

**ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోం**

నకిలీ విత్తనాలు సరఫరా చేసేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కిషన్‌రెడ్డి హెచ్చరించారు. రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. నకిలీ విత్తనాల పేరుతో ఎవరికైనా అన్యాయం జరిగితే, సంబంధిత కంపెనీలపై పీడీ యాక్ట్ నమోదు చేసి, డీలర్ షిప్ రద్దు చేసి, జైలుకు పంపిస్తున్నామన్నారు.

### బీసీ బంద్‌ను జయప్రదం చేయండి

- చామల పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించనున్న బీసీ బంద్‌ను జయప్రదం చేయాలని అన్ని రాజకీయ పార్టీలకు భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతిస్తుందని తెలిపారు. రాజకీయ పార్టీలన్నీ ఒకే వేదికపైకి వచ్చి బీసీలకు న్యాయం చేయాలని కోరారు. బీసీ సంఘాల నేతలు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆర్.కృష్ణయ్య అన్ని పార్టీలను కలిసి మద్దతు కోరారని గుర్తుచేశారు. శుక్రవారం చామల ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు.

### బంద్‌కు మద్దతు: కవిత

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం బీసీ జేఏసీ తలపెట్టిన బంద్‌కు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మద్దతు తెలిపారు. తెలంగాణ జాగృతి కార్యాలయానికి శుక్రవారం బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వైస్ చైర్మన్ వీజీఆర్ నారగోని, జాతీయ బీసీ సంఘం నేత గుజ్జ కృష్ణ, బీసీ జేఏసీ నేత వచ్చి కవితను కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిజర్వేషన్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను మభ్యపెడుతున్నాయని ధ్వజమెత్తారు.

# 'నిషేధిత' ఉత్తర్వులు ఎత్తివేయలేం

- నాగారం భూములపై ఏఐఎస్‌లకు తేల్చిచెప్పిన హైకోర్టు
- ఉన్నతస్థానాల్లో ఉన్న వారిపై తీవ్ర ఆరోపణలు
- ప్రతివాదుల్లో ఒకరు రంగారెడ్డి జిల్లా కలెక్టర్
- విచారణ సమయంలో వాటిని పరిశీలించాలి
- ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఎత్తివేయలేం
- అయితే ఏఐఎస్‌ల వాదనలూ పూర్తిస్థాయిలో వింటాం
- మధ్యంతర అప్లికేషన్లపై హైకోర్టు ధర్మాసనం ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని భూముల వ్యవహారంలో ఏప్రిల్ 24న ఇచ్చిన ఉత్తర్వులను ఎత్తివేయలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలన్న ఉత్తర్వుల ఎత్తివేతకు నిరాకరించింది. అనధికారిక ప్రతివాదులు, రెవెన్యూ అధికారులపై తీవ్ర ఆరోపణలున్నాయని అభిప్రాయపడింది. అనధికారిక ప్రతివాదులంతా ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లని.. వారంతా రాష్ట్రంలో కీలక పోస్టుల్లో పనిచేస్తున్నారని వ్యాఖ్యానించింది. అందులో ఓ ప్రతివాది రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారని.. ఆయనపైనా తీవ్ర ఆరోపణలున్నాయని గుర్తుచేసింది. పూర్తి పిటిషన్‌ను విచారించే సమయంలో ఈ అంశాలను పరిశీలించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. మధ్యంతర ఉత్తర్వులు ఎత్తివేయాలంటూ ఏఐఎస్‌లు దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)లను కొట్టివేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. నాగారం సర్వే నంబర్ 181, 194, 195లో భారీ భూకబ్జాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ దాఖలైన పిటిషన్‌లో పలు ఐఏఎస్‌లపై విచారణ పూర్తి చేసిన జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

**ప్రతివాదుల వాదనలు వింటాం..**

'భూదాన్ భూముల కబ్జా, అక్రమాలపై దర్యాప్తు చేసి నిజాలు నిగ్గు తేల్చడానికి సీబీఐ విచారణకు ఆదేశించాలని ఏప్రిల్‌లో నిర్ణయించాం. ఈ మేరకు సిద్ధంగా ఉన్నారా లేరా? అనేది తెలియజేయాలని సీబీఐకి నోటీసులు జారీ చేశాం. ఈ పిటిషన్‌లో తీర్పు ఇచ్చే వరకు నాగారం గ్రామంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూములను నిషేధిత జాబితాలో చేర్చాలని అధికారులను ఆదేశించాం. ఆ భూములను విక్రయించడం, బదిలీ చేయడం సహా ఎలాంటి మార్పులు చేయవద్దని ప్రతివాదులకు చెప్పాం. దీన్ని సవాల్ చేస్తూ ప్రతివాదుల్లో కొందరు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని హైకోర్టు నాటి ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం తేల్చిచెప్పింది. మధ్యంతర ఉత్తర్వుల రద్దుకు నిరాకరించింది. ఈ నేపథ్యంలో ఏప్రిల్‌లో ఇచ్చిన ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరుతూ అనధికారిక ప్రతివాదులు మా ముందున్న పిటిషన్‌లో ఐఏలు దాఖలు చేశారు. వాటిని కొట్టివేస్తున్నాం. అయితే వారి వాదనలు వినాలంటూ దాఖలు చేసిన ఐఏను మాత్రం అనుమతిస్తున్నాం. ఈ మేరకు అవసరమైన సవరణలు చేయాలని రిజిస్ట్రీని ఆదేశిస్తున్నాం' అని తీర్పు కాపీలో హైకోర్టు పేర్కొంది. 'ఇదే పిటిషన్‌లో తమను ఇంప్లీడ్ చేయాలని కోరుతూ ఎస్.చిరంజీవి రాజుతోపాటు 28 మంది ఇతరులు ఐఏ దాఖలు చేశారు. సర్వే నంబర్ 195/1 నుంచి 10 వరకు 3.85 ఎకరాల భూమిని కొనుగోలు చేశామన్నది వారి వాదన. పట్టాదార్ పాస్‌బుక్‌లు కూడా పొందినందున వారి వాదనలు వినడం సముచితం. వారు దాఖలు చేసిన ఐఏని అనుమతిస్తున్నాం' అని ధర్మాసనం తెలిపింది. కాగా, నాగారంలోని 181, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూదాన్ భూముల అన్యాక్రాంతం, అక్రమాల ఆరోపణలపై విచారణ కమిషన్ వేయాలంటూ దాఖలైన మరో పిటిషన్‌తోపాటు నాగారంలోని సర్వే నంబర్ 194 భూమికి సంబంధించి దాఖలైన ఇంకో పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

# అది నకిలీ మద్యమే!

- ల్యాబ్ పరీక్షల సాక్షిగా బట్టబయలు
- గుంటూరులోని ప్రయోగశాల నిర్ధారణ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: నకిలీ మద్యం తయారీ రాకెట్ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు నిర్వహిస్తున్న డంప్ వద్ద స్వాధీనం చేసుకున్నది ముమ్మాటికీ నకిలీ మద్యమేనని స్పష్టమైంది. నీళ్లు, స్పిరిట్, రంగు, రుచి రసాయనాలతో ఈ నకిలీ మద్యం తయారైందని వెల్లడైంది. ఈ మేరకు గుంటూరులోని ప్రాంతీయ ప్రయోగశాల నిర్ధారించిందని విశ్వసనీయంగా తెలిసింది. ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా హానికర రసాయనాలతో నకిలీ మద్యం తయారు చేశారని నివేదిక స్పష్టం చేసినట్లు సమాచారం. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీ గోదాము నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం సరుకు నమూనాలను ఎక్సైజ్ అధికారులు గుంటూరులోని ప్రాంతీయ ప్రయోగశాలకు పంపారు. నకిలీ మద్యం తయారీకి ఉపయోగించిన ముడి సరుకు, రసాయనాలు, స్పిరిట్‌తో పాటు తయారైన మద్యంను అధికారులు సీజ్ చేసి, ఈ మొత్తం సరుకుకు సంబంధించి 45 నమూనాలను ల్యాబ్‌కు పంపినట్లు తెలిసింది. 45 నమూనాలను పరీక్షించిన అనంతరం అదంతా నకిలీ మద్యమేనని తేల్చినట్లు సమాచారం. ఈ మేరకు నివేదిక ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే చేరింది. ఈ నివేదికలో పేర్కొన్న అంశాల తీవ్రతను తగ్గించేందుకు ప్రభుత్వ పెద్దలు, అధికారులతో కలిసి మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం. అండర్ ప్రూఫ్, ఓవర్ ప్రూఫ్‌లో భారీ వ్యత్యాసం ఉన్నట్లు తేలినప్పటికీ.. అదేమంత ప్రమాదం కాదని ప్రచారం చేయాలని ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఇప్పటికే ఎల్లో మీడియా ఆ ప్రచారాన్ని భుజానికెత్తుకుంది.

**కొంచెం నాణ్యత లేని మద్యమట!**

నకిలీ మద్యం పలు వైన్ షాపులతోపాటు, బెల్ట్ షాపులకు సరఫరా కావడం, కొన్ని బార్లలో కూడా విక్రయించారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మద్యం ప్రియులు బెంబేలెత్తిపోతున్నారు. ఏడాదిన్నరగా ఈ నకిలీ మద్యం తయారు చేస్తున్నామని నిందితులు చెప్పడంతో ఇన్నాళ్లూ తాము ఎలాంటి మద్యం తాగామనే ఆందోళన మొదలైంది. ఇది తప్పకుండా తమ ఆరోగ్యాలపై ప్రభావం చూపుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దాని తీవ్రతను తగ్గించి చూపేందుకు నానా తంటాలు పడుతోంది. ఇది నకిలీ మద్యం కాదని, కొంచెం నాణ్యత లేని మద్యం మాత్రమే అని చెప్పుకొస్తోంది. దీని వల్ల ప్రమాదం ఏమిలేదని చెప్పేందుకు అపసోపాలు పడుతోంది. అయితే నిబంధనల ప్రకారం ఉండాల్సిన నాణ్యత ప్రమాణాలు లేకుండా, కెమిస్ట్‌ల పర్యవేక్షణ లేకుండా తయారు చేసిన సరుకు వాడితే ప్రమాదం లేకుండా ఎలా ఉంటుందని వైద్య రంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. మందులో స్ట్రెంత్ లేకుండా నీళ్లు కలిపి.. అధిక ధరలకు అమ్మటం ప్రజలను మోసం చేయటం కాదా.. అని పలువురు మద్యం ప్రియులు నిలదీస్తున్నారు. ఒక సరుకు పేరు చెప్పి, ఇంకొక సరుకు అమ్మితే అది నేరం కాకుండా పోతోందా.. అని పలువురు ప్రశ్నిస్తున్నారు. నకిలీ మద్యం తయారు చేయటం అనేదే నేరం అనే విషయాన్ని పక్కన పెట్టి, అది అంత ప్రమాదకరం కాదని ప్రచారం చేయాలని చెప్పడంపై ఎక్సైజ్ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఉత్పన్నం కాలేదని వాపోతున్నారు.

**ప్రజల ప్రాణాలతో చెలగాటం**

మద్యంలో యూపీ (అండర్ ప్రూఫ్) 25గా ఉండాలి. ఓపీ (ఓవర్ ప్రూఫ్) 75గా ఉండాలి. అయితే ఇబ్రహీంపట్నంలో సీజ్ చేసిన మద్యంలో యూపీ సగానికి సగం ఎక్కువగా ఉందని, ఓపీ ఉండాల్సిన దానికంటే బాగా తక్కువగా ఉందని ల్యాబ్ రిపోర్టు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. దీన్నిబట్టి చూస్తుంటే రంగు నీళ్లలో స్పిరిట్ కలిపి నకిలీ మద్యం తయారు చేశారని తెలుస్తోంది. ప్రభుత్వ అనుమతి పొందిన డిస్టిలరీల్లో నిబంధనల మేరకు మద్యం తయారైన తర్వాత ఆ నమూనాలను ఎక్సైజ్ శాఖ ప్రయోగశాలకు పంపి, ఓకే చేసిన తర్వాతే సీసాల్లో నింపుతారు. అయితే ఇటీవల పట్టుబడిన మద్యం.. నాణ్యత, గాఢత ప్రమాణాలు పాటించకుండా తయారైనట్లు స్పష్టం అవుతోంది. ప్రభుత్వ పెద్దల భరోసాతో నిర్దేశించిన ప్రమాణాలు ఏమాత్రం పాటించకుండా నకిలీ మద్యం తయారు చేసి వైన్ షాపులకు, బెల్ట్ షాపులకు సరఫరా చేయడం ద్వారా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారు.

## కదల్లేని విధంగా కొడతారా?

**రాష్ట్రంలో పోలీసుల తీరుపై నిప్పులు చెరిగిన హైకోర్టు**

పౌరులను స్టేషన్‌కు పిలిపించడం.. నిర్బంధం.. చితకబాదడం పరిపాటైపోయింది

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం ఇటీవల అలవాటైపోయింది

ఇప్పటికీ పిటిషనర్ కదల్లేని స్థితిలో ఉన్నారు

పోలీసులపై ఫిర్యాదు చేస్తే కేసు పెట్టరా?.. మీకు మీరే.. తప్పుడు కేసు అని పక్కన పెట్టేస్తారా?

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

## ఏపీ ప్రభుత్వానిది అత్యుత్సాహం

- పత్రికా స్వేచ్ఛను అణగదొక్కడం తగదు
- తెలంగాణ ఉద్యమ నేత డాక్టర్ చెరుకు సుధాకర్
- సాక్షిపై అక్రమ కేసులు అప్రజాస్వామికం: మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్



చెరుకు సుధాకర్

నకిరేకల్: ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం 'సాక్షి'పై అక్రమ కేసులు పెట్టడం, నిర్బంధకాండ కొనసాగించడాన్ని తెలంగాణ ఉద్యమ నేత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ చెరుకు సుధాకర్ తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వ పెద్దలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అత్యుత్సాహంతో సాక్షి పత్రికపై దాడి చేస్తున్నారని.. అక్రమ కేసులు, విచారణ పేరుతో పత్రికా స్వేచ్ఛను అణగదొక్కుతున్నారని విమర్శించారు. సాక్షిపై అక్రమ కేసులకు నిరసనగా శుక్రవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెరుకు సుధాకర్ మద్దతు తెలిపి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం తగదన్నారు. ఇలాంటి చర్యలు మానుకోకుంటే కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాగా, పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించేలా ఏపీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డిపై ఏపీ సీఎం చంద్రబాబు అక్కసుతో అక్రమ కేసులు పెట్టడం అప్రజాస్వామికమని విమర్శించారు.

# యువ హవా

ఘనమైన కుటుంబ వ్యాపార నేపథ్యం ఉన్నంత మాత్రాన...
'విజయం అనివార్యం' అని చెప్పడానికి లేదు.
అంకితభావం, కష్టం ఉంటేనే విజయం సొంతం అవుతుంది.
ఘనమైన కుటుంబ వ్యాపారనేపథ్యం లేనంత మాత్రాన...
'విజయం దూరం' అని చెప్పడానికి లేదు.
ఆసక్తికి అంకితభావం, కష్టం తోడైతే విజయం సొంతం అవుతుంది.
దీనికి తాజా ఉదాహరణ... అవెండస్ వెల్త్-హురున్ ఇండియా-2025 జాబితా.
35 ఏళ్ల లోపు ప్రతిభావంతులైన 155 మంది యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌లు వెల్త్-హురున్ ఇండియా జాబితాలో చోటు సాధించారు.
వీరిలో...
వారసత్వ బాధ్యతకు తమ శక్తియుక్తులను జోడించి తమదైన గుర్తింపు తెచ్చుకున్నవారు ఉన్నారు. కొన్ని ఉత్పత్తులలో లోపాలు కనిపెట్టి లోపాలు లేని, సౌకర్యవంతమైన ప్రాడక్ట్స్ కోసం ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మారి విజయం సాధించిన వారూ ఉన్నారు... వారిలో కొందరు యంగ్ ఫిమేల్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల గురించి..


అవంతిక సరోగి

## దేశంలో తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్

చెరకు, బయోప్లాస్టిక్‌కు సంబంధించిన ఆపరేషన్‌లలో యువ మార్గదర్శకురాలిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది అవంతిక సరోగి. కాలిఫోర్నియాలో చదువుకున్న అవంతిక తమ బల్‌రామ్‌పూర్ చినీ మిల్స్ లిమిటెడ్ (బీసిఎంఎల్)ను పీఎల్‌ఏ (పాలీలాక్టిక్ యాసిడ్) తయారీ సౌకర్యాన్ని అందించే కంపెనీగా తీర్చిదిద్దే ప్రయత్నాలలో ఉంది. ఇది మన దేశంలోని మొట్ట మొదటి బయోప్లాస్టిక్ ప్లాంట్ కానుంది.

పీఎల్‌ఏ అనేది చెరకు పునరుత్పాదక వనరుల నుండి తయారైన బయో ఆధారిత, కంపోస్టబుల్, తక్కువ ఉద్గారాల ప్లాస్టిక్. దీనిని సాధారణంగా ప్యాకేజింగ్, త్రీడి ప్రింటింగ్‌లో ఉపయోగిస్తారు.

మన దేశంలోని ఈ తొలి బయోప్లాస్టిక్ ప్లాంట్ వల్ల బీసిఎంఎల్ లాభాల బాటలో పయనించనుంది. టర్నోవర్ పెరగనుంది. పర్యావరణ అనుకూలంగా కూడా మారనుంది.

## తరగతి గదిని మార్చేలా


పరిత పరేఖ్

వినూత్నమైన ఆలోచన విధానంతో విద్యా, సాంకేతిక రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగెస్ట్ ఎంటర్‌ప్రెన్యూర్ పరిత పరేఖ్. బ్రౌన్ యూనివర్శిటీలో చదువుకుంది. బ్రౌన్ తరువాత స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో 'ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్'పై మాస్టర్స్ చేసింది. స్టాన్‌ఫోర్డ్‌లో చదువుకునే రోజుల్లో పిల్లల విద్యావిధానం మీద దృష్టి పెట్టేది. స్టాన్‌ఫోర్డ్‌లో చేసిన పరిశోధనలు, నేర్చుకున్న ఆధునిక సాంకేతిక విషయాలు ఆమెను ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వైపు నడిపించాయి.

కట్టింగ్-ఎడ్జ్ ఎడ్యుకేషనల్ టెక్ ప్లాట్‌ఫామ్ 'టొడెల్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రస్థానాన్ని ప్రారంభించింది పరిత. మూస బోధన పద్ధతులకు అతీతంగా ఆధునిక బోధన పద్ధతులు, ఆలోచనలతో 'టొడెల్' ప్లాట్‌ఫామ్‌కు రూపకల్పన చేసింది. 'టొడెల్' ప్రభావంతో చాలా బడులలో ఉపాధ్యాయుల బోధన పద్ధతి మారింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే సంప్రదాయ, ఆధునిక విద్యాబోధనలో ఉన్న అంతరాన్ని తగ్గించడానికి 'టొడెల్' కృషి చేస్తోంది.

విద్యార్థులలో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలను పెంపొందించే ప్రణాళికలతో 'టొడెల్' విద్యాప్రపంచంలో ప్రత్యేక స్థానాన్ని సాధించింది.


మీనా మార్గరెట్

## సక్సెస్‌ఫుల్ యూఎస్పీతో...

ప్రారంభ కష్టాల మాట ఎలా ఉన్నా... ఉమెన్ యాక్టివేర్ 'బ్లిస్‌క్లబ్' మార్కెట్‌లో నిలదొక్కుకోవడానికి ఎంతోకాలం పట్టలేదు. ఈ ఆన్‌లైన్ బ్రాండ్ ఆ తరువాత రెండు ఆఫ్‌లైన్ స్టోర్‌లను కూడా లాంచ్ చేసి విజయం సాధించింది. 'మార్కెట్‌లో ఎన్నో బ్రాండ్‌లు ఉన్నాయి కదా. మీ ప్రత్యేకత ఏమిటి?' అనే ప్రశ్న 'బ్లిస్‌క్లబ్' ఫౌండర్, సీయీవో మినూ మార్గరెట్ ముందు వచ్చి నిల్చుంది. సిగ్నేచర్ ఫ్యాబ్రిక్స్, వినూత్నమైన ప్రాడక్ట్ డిజైన్‌ను తమ కంపెనీ యూఎస్పీగా చేసుకొని విజయం సాధించింది మార్గరెట్.

నేషనల్ లెవెల్ ఫ్రిస్బీ ప్లేయర్ అయిన మినూ మార్గరెట్ యాక్టివేర్‌కు సంబంధించిన డీసెంట్ ఆప్షన్స్ గురించి ఆలోచిస్తున్నప్పుడు 'బ్లిస్‌క్లబ్' స్టార్టప్ ఆలోచనవచ్చింది.

'యాక్టివేర్ రంగంలోని కంపెనీలు డిజైన్ ఫస్ట్ విధానాన్ని అనుసరిస్తాయి. మేము మాత్రం ఈ విధానానికి దూరంగా ఉన్నాం. బ్లిస్‌క్లబ్‌కు డిజైన్ క్లబ్ లేదు. ప్రాడక్ట్ ఇంజినీరింగ్ టీమ్ మాత్రమే ఉంది. ఈ టీమ్ ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం యాక్టివేర్ సౌలభ్యానికి సంబంధించి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలను కనుక్కోవడం. ఉదాహరణకు చెన్నైలోని ఒక మహిళ గురించి. వేడి వాతావరణంలో ఆమెకు లెగ్గింగ్స్ ధరించడం కష్టమయ్యేది. ఇలాంటి సమస్యను దృష్టిలో పెట్టుకొని వేడివాతావరణంలో కూడా సౌకర్యంగా ఉండే లెగ్గింగ్స్‌ను డిజైన్ చేశాం' అంటుంది మార్గరెట్.

## చిన్న గదిలో మొదలై... కోట్ల టర్నోవర్ వరకు


నీతూ యాదవ్ – కీర్తి జాంగ్రా

బెంగళూరులోని చిన్న గదిలో మొదలైన 'యానిమల్' రూ.550 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీ స్థాయికి చేరింది. ఐఐటీ-ఢిల్లీలో చదువుకున్న కీర్తి జాంగ్రా, నీతూ యాదవ్‌ల బ్రెయిన్ చైల్డ్ 'యానిమల్'. ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అవ్యవస్థీకృతంగా ఉన్న మన దేశంలోని పశువుల మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

పశువుల క్రయవిక్రయాలలో 'యానిమల్' యాప్ కీలక పాత్ర పోషిస్తోంది. తమ స్టార్టప్‌ను ప్రారంభించడానికి ముందు సర్వే నిర్వహించి రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు కీర్తి, నీతూ యాదవ్. డైరీ ఇండస్ట్రీలో కీలకమైన మార్పు తేవాలనుకున్న కీర్తి, నీతూ యాదవ్‌లు 'యానిమల్' యాప్‌తో తమ కలను నిజం చేసుకున్నారు. ఈ యాప్ ద్వారా మనం ఉన్న చోటు నుంచే వందల కిలోమీటర్‌ల దూరంలో పశువుల క్రయ విక్రయాలు జరుగుతున్న ప్రదేశం తదితర వివరాలు తెలుసుకోవచ్చు.

## దీపావళి వెనుక ఉన్న పురాణాలు



పిల్లలూ... మీకు ఇష్టమైన పండుగలలో దీపావళి ముందు వరుసలో ఉంటుంది కదూ.
దీపాలు వెలిగించడం, టపాసులు పేల్చడం, పిండివంటలను ఆరగించడం...
భలే సరదా. అయితే అసలు దీపావళి పండుగ ఎందుకు జరుపుకుంటాం, ఈ వేడుక వెనకున్న కథలేంటి తెలుసుకుందాం.

నేటి 'సాక్షి ఫ్లస్' కిడ్స్ ఈపేపర్‌లో

# వంటిల్లు

# తియ్యటి వేడుక

ముచ్చటగా అలంకరించిన లోగిళ్లు
అందంగా ముస్తాబైన చిన్నా పెద్దలు
ఓ వైపు దీప కాంతులు
మరోవైపు బాణాసంచా పేలుళ్లు
ఆనందాలు విప్పారుతుండగా
తియ్యని రుచులు నోరారా ఆస్వాదిస్తుంటే
వేడుకంతా నట్టింట్లో కొలువుదీరినట్టే ఉంటుంది.
రెట్టింపు ఆనందాలను పంచడానికి
వంటిల్లు తీపి వంటకాలను
సిద్ధం చేస్తూనే ఉంటుంది.
ఎక్కువ శ్రమ లేకుండా పండగవేళ
తియ్యని రుచులను సులువుగా చేసేద్దాం.
ఇంటిల్లిపాదికి ఆనందాన్ని పంచేద్దాం..



## సూజీ హల్వా

**కావలసినవి:** సూజీ (బొంబాయి రవ్వ) – కప్పు; నీళ్లు – 2 కప్పులు; పంచదార – కప్పు; నెయ్యి – 3 టేబుల్ స్పూన్లు; యాలకుల పొడి – పావు టీ స్పూన్; జీడిపప్పు, కిస్‌మిస్ – అవసరమైనంత.

**తయారీ:** • పాన్‌లో నెయ్యి వేడి చేసి, జీడిపప్పు, ద్రాక్ష వేయించాలి. • వాటిని తీసి, అదే నెయ్యిలో సూజీ వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. • మరో పాత్రలో నీరు మరిగించి, రవ్వ పోస్తూ, కలపాలి. • రవ్వ ఉడికిన తర్వాత పంచదార కలిపి తర్వాత యాలకుల పొడి వేసి కలపాలి. • చివరగా వేయించిన కాజూ, ద్రాక్ష వేసి మిక్స్ చేయాలి.



## గులాబ్ జామూన్

**కావలసినవి:** రెడీమేడ్ జామూన్ మిక్స్ – కప్పు; నీళ్లు/పాలు – అవసరమైనంత (జామూన్ మిక్స్ కలపడానికి); పంచదార – ఒకటింపావు కప్పులు; నీళ్లు – కప్పు; యాలకుల పొడి – చిటికెడు.

**తయారీ:** • పంచదార, నీళ్లు కలిపి, మరిగించి సిరప్ తయారు చేయాలి. దాంట్లో చిటికెడు యాలకుల పొడి కలపాలి • జామూన్ మిక్స్‌కి కొంచెం నీళ్లు లేదా పాలు జోడించి మృదువుగా కలపాలి • మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, ఉండలు చేయాలి • బాణలిలో నూనె పోసి వేడయ్యాక, సిద్ధంగా ఉంచుకున్న ఉండలు వేసి, వాటిని గోధుమ రంగు వచ్చే వరకు వేయించాలి • వేయించిన జామూన్లను వేడి సిరప్‌లో వేసి, రెండు గంటలు నాననివ్వాలి.



## రైస్ పుడ్డింగ్ / పాయసం

**కావలసినవి:** బియ్యం – పావు కప్పు; పాలు – 3 కప్పులు; పంచదార – పావు కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్; యాలకులు, కిస్‌మిస్ – అవసరమైనంత; నెయ్యి – టేబుల్ స్పూన్.

**తయారీ:** • బియ్యం కడిగి, కొద్దిగా ఉడికాక పాలు పోసి, మెల్లిగా మరిగించాలి. • బియ్యం పూర్తిగా ఉడికాక పంచదార కలపాలి. • యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ వేసి కలపాలి.



## బేసిన్ లడ్డూ

**కావలసినవి:** బేసన్ (సెనగపిండి) – కప్పు; నెయ్యి – పావు కప్పు; పంచదార పొడి – పావు కప్పు; యాలకుల పొడి – పావు టీ స్పూన్.

**తయారీ:** • పాన్‌లో నెయ్యి వేసి, వేడి చేయాలి. మంట బాగా తగ్గించి, దాంట్లో శనగపిండి వేసి, మెల్లగా బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. • చల్లారిన తర్వాత పంచదార పొడి, యాలకుల పొడి వేసి కలపాలి. • మిశ్రమాన్ని కొద్ది కొద్దిగా తీసుకుంటూ, చేతులతో లడ్డూలు చేయాలి.



# వామ్మో.. ఏ(ఐ)డడుగులు..!

మన పురాతన తాటాకు శాసనాల గ్రంథాల్లో అన్నీ ఉన్నాయో లేవోగానీ... మన సినిమాల్లో మాత్రం సకల విజ్ఞాన శాస్త్రాలూ ఉన్నాయి. అందుకు నిదర్శనమే మనదైన పానిండియన్ సూపర్‌హిట్ బ్లాక్‌బస్టర్ సినిమా 'రోబో'!

ఏ అద్భుత ముహూర్తాన మన డైరెక్టర్ శంకర్ 'రోబో' తీశాడోగానీ... లోకమంతటా అవే వింతలు అచ్చం అలాగే జరుగుతున్నాయి. ఉదాహరణకు...

ఇక్కడి మన సినిమాలో హ్యూమనాయిడ్ రోబో కాస్తా మానవ మానస వికాసాలూ, వికారాలూ ఒంటబట్టించుకుని 'రోబో సేపియన్' అవుతాడా! అలా అవ్వగానే ఆ 'టాయ్'ఫ్రెండు కాస్తా హీరోయిన్‌కి 'బాయ్'ఫ్రెండుగా మారి... అచ్చం మన మానవ కుర్రాళ్లలాగే... తనను ప్రేమించని అమ్మాయి మీద యాసిడ్లూ గట్రా విసిరేంత క్రూరమైన 'సెల్ఫ్‌స్టైల్డ్ లవర్‌బా(టా)య్'గా మారిపోతాడు కదా.

అక్కడ అమెరికాలోని ఒహాయో రాష్ట్ర చట్టనిపుణులు బహుశా 'రోబో' సినిమా చూసి హడలిపోయి ఉంటారేమో... మానవ మేధకూ, కృత్రిమ మేధస్సుకూ మధ్య వివాహాలు వద్దంటే వద్దంటూ గొడవ గొడవ చేస్తున్నారు. అంతేనా... ఆ మేరకు ఓ చట్టం తీసుకువచ్చేందుకు బిల్లు కూడా ప్రిపేర్ చేశారు.

అదే డైరెక్టర్ శంకర్‌గారి ఆయొక్క అదే 'రోబో' సినిమాలో... "ఇనుములో ఓ హృదయం మొలిచెనే" పాటనుంచి స్ఫూర్తి పొందినట్టుగా... ఇప్పటికే మన పొరుగు దుండగీడైన చైనావాడు 'దివిరి ఇసుకన తైలంబు' రీతిగా దివిరి ఇనుమున గర్భసంచి నుంచి చిన్నారి పాపలను రేపీపాటికి తీసిస్తానంటూ తొడలుగొడుతూ, హడలగొడుతున్నారన్న సంగతి తెలిసిందే. అంతే కాదు... రోబోలకు సీమంతాలవీ గట్రా చేసేసి కృత్రిమ 'ఊంబ్'ల లోంచి ఉంగా ఉంగా పాపాయిలను పుట్టిస్తానంటూ సవాళ్లు విసురుతున్నారు కూడా.

అమిత వింతలకు నెలవైన అమెరికాలో... ఈ చిత్ర విచిత్రాలన్నీ చూస్తున్న ఒహాయో రాష్ట్రపు మేధావులు భయపడిపోతున్నారేమో... ఆ ఆందోళనతో స్థిమితంగా ఉండలేక... బహ్మాండమైన ఓ వివాహ నిషేధ చట్టాన్ని తెచ్చేందుకు నిశ్చయించుకున్నారు. ఆ మేరకు బిక్కు బిక్కుమంటూ బిల్లొకదాన్ని అక్కడి చట్టసభల్లో ప్రవేశపెట్టబోతున్నారు కూడా! దీనికి కారణమేంటంటే... అక్కడి కుర్రకారు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పెళ్లిళ్లు చేసుకునేందుకు తెగ ఉత్సాహపడిపోతున్నారట!

హాయ్యో...! ఇప్పటికే అతి మేధావులైన మానవులూ, అమితమైన మేధస్సుల 'కృత్రిమ మేధ' మధ్య పెళ్లిళ్లు జరిగితే... రేపు సదరు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' కాస్తా పవరాఫ్ ఆటార్నీలంటూ పవర్‌పట్టా తీసుకోవడం, పార్ట్‌నర్‌తో చెట్టాపట్టాలే కాకుండా, లీగల్ వ్యవహారాల్లోకి దూరి, అసలు నిపుణులు తట్టాబుట్టా సర్దుకునేలా, చెట్టూపుట్టా పట్టుకుపోయేలా, బెదిరీ చెదిరీ పోయేలా చేస్తాయేమోనని హడలెత్తుతున్నారు 'ఓహాయో రాష్ట్ర'పు చట్ట నిపుణులు.

అందుకే... మనుషులకూ, యంత్రాలకు మధ్య పెళ్లి మంత్రాలు వద్దంటే వద్దంటూ పట్టుపడుతున్నారు. మానవులూ, యాంత్రాల మధ్య మనువులు వద్దంటూ వాదిస్తున్నారు. ఇది 'యంత్రమాత్రమూ' తగదంటూ బల్లగుద్ది మరీ శాసిస్తున్నారు మన ఒహాయో స్టేట్ రిప్రజెంటేటివ్, రిపబ్లికన్ మెంబరూ అయిన మిస్టర్ 'థాయిడస్ క్లాగెట్' గారు!

అలనాడెప్పుడో బ్రహ్మంగారు చెప్పిన వింతలన్నీ అక్కడా ఇక్కడా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పుడీ నేపథ్యంలో ఈ పుట్టు తెలివితేటలున్న మన మానవాళీ... పెట్టు తెలివితేటలున్న రోబోయంత్రాళీ... కలగలిసి సంకరమైతే... రేపు భవిష్యత్తులో సకల 'అతి'తెలివితేటలున్న బుజ్జిబుజ్జి రోబో-కంగాళీలకు ఆస్కారముంటుందేమోనని అనుమానిస్తున్నారు.

అచ్చం రోబో సినిమాలోలాగే... రేపెప్పుడైనా పొరబాటున ఆ 'చిట్టి' చిట్టి రోబోలకు విలనీయులైన ఏ అడ్డమైన సైంటిస్టులో 'రెడ్డు చిప్పు' పెడితే... అప్పుడది మన మానవాళి చేతికి 'డేంజరు చిప్పే'ననేమోనంటూ ఇన్నిరకాల ఆంక్షలూ, హాహాకారాలంటూ లోకంలోని ప్రజలంతా తెగ చెవులు కొరుక్కుంటున్నారన్నది అభిజ్ఞ వర్గాల అతి రహస్య భోగట్టా.

– యాసీన్

## ఏఐ మ్యారేజ్ ప్రపోజల్

ప్రేమలేఖల నుంచి ఎస్‌ఎంఎస్‌ల వరకు లవ్, మ్యారేజ్ ప్రపోజల్స్ పలు రకాలు. తాజా విషయానికి వస్తే...ఒక కుర్రాడు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ను ఉపయోగించి ఫేక్ డిస్నీ-స్టైల్ ట్రైలర్ ద్వారా తన స్నేహితురాలికి మ్యారేజ్ ప్రపోజ్ చేశాడు. ఈ వీడియోకు 11 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి.



ఈ వీడియోను ఎన్నో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రీషేర్ చేస్తున్నారు.

'ది ఈజీయెస్ట్ యస్. యస్, ప్రపోజ్‌డ్ టు జె... యూజింగ్ ఏఐ' అని వీడియోకు కాప్షన్ ఇచ్చారు. వీడియో చివరలో 'విల్ యూ మ్యారీ మీ' అనే కామెంట్ కనిపిస్తుంది.

ఇంతకీ ఆ అమ్మాయి 'యస్' చెప్పిందా?

యస్!

'ది మోస్ట్ బ్యూటీఫుల్ మ్యారేజ్ ప్రపోజల్' అంటూ స్పందించారు నెటిజనులు.

ధన త్రయోదశి

# ఆరోగ్యమస్తు ధనప్రాప్తిరస్తు



**నేడు ధనత్రయోదశి. సాధారణంగా ధన త్రయోదశి అనగానే బంగారం, వెండి, ఇతర గృహోపకరణాలు కొనడం అందరూ చేసేదే. అయితే ధనత్రయోదశి ప్రాశస్త్యాన్ని తెలుసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరం. ఆ కథ తెలుసుకుందాం.**

దేవతలు, దానవులు అమృతం కోసం పాలసముద్రాన్ని చిలుకుతున్న సమయంలో ఆ క్షీరసాగరం నుంచి శ్రీ మహాలక్ష్మి జన్మించింది. అంతే కాదు సంపదలను ప్రసాదించే కల్పవృక్షం, కామధేనువు, దేవవైద్యుడు ధన్వంతరి కూడా శ్రీ మహాలక్ష్మితో పాటే జన్మించారు. ఆ రోజు ఆశ్వయుజ బహుళ త్రయోదశి. శ్రీమహాలక్ష్మి ..., ధనానికి ప్రతిరూపం. అందుకే., ఆమె జన్మదినమైన ఈ ఆశ్వయుజ కృష్ణ త్రయోదశిని.. 'ధన త్రయోదశి' అన్నారు.

ఎంత చదువు చదివినా.,, ఎన్ని తెలివితేటలు ఉన్నా., శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం లేకపోతే జీవితం గడపడం కష్టం. అందుకే.. సర్వ సంపత్ప్రదాయిని అయిన శ్రీ మహాలక్ష్మి అనుగ్రహం కోసం సర్వ మానవాళి ఈ రోజున శ్రీమహాలక్ష్మిని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించి, ఆమె ఆశీస్సులు అందుకుంటారు.

ధనానికి అధిదేవత 'శ్రీమహాలక్ష్మి. ధనానికి అధినాయకుడు ఉత్తర దిక్పాలకుడైన 'కుబేరుడు'. అందుకే ఈ ధనత్రయోదశి నాడు శ్రీమహాలక్ష్మితోపాటు కుబేరుని కూడా ఆరాధిస్తారు. సాధారణంగా ఈ లక్ష్మీ పూజను సాయం సమయంలో ప్రదోష వేళలో చేసుకుంటే చాలా మంచిది.

### లక్ష్మీ కుబేర వ్రతం

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు, వ్యాపార అభివృద్ధి అదే విధంగా నూతన వ్యాపారం ప్రారంభించబోయే వారు, ఉద్యోగ అభివృద్ధి కోరుకుంటున్నవారు, అప్పుల బాధలు ఉన్నవారు లక్ష్మీ కుబేర వ్రతాన్ని చేసుకోవడం వల్ల ఆయా బాధల నుంచి విముక్తి పొంది, అన్నింటా అభివృద్ధి జరుగుతుందని పెద్దలు చెబుతారు కాబట్టి ఈ వ్రతాన్ని చేయాలనుకుంటున్న వారు అక్షయ తృతీయ రోజు, ధన త్రయోదశి రోజు, కార్తీక శుక్ల పంచమి రోజు లేదా తొమ్మిది గురువారాలు లేక శుక్రవారాలు చేసుకోవచ్చు.

### ధన్వంతరి జయంతి

దేవవైద్యుడు, సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు అంశావతారమైన ధన్వంతరి పాలసముద్రం నుంచి ఆవిర్భవించింది కూడా ధనత్రయోదశి నాడే. అందుకే ఈ పర్వదినాన చాలామంది ధన్వంతరిని కూడా పూజిస్తారు. ముఖ్యంగా ఆరోగ్యం బాగలేని వారు, ఆయుర్వేద వైద్య విధానం మీద నమ్మకం ఉన్న వారు శ్రీమహావిష్ణువు ప్రతిరూపమైన ధన్వంతరిని పూజించడం వల్ల ఆరోగ్యవంతులవుతారని చెబుతారు. ధన్వంతరి చేతిలో శంఖు చక్రాలతోపాటు ఔషధ భాండం లేదా అమృత కలశం, జలగ ఉంటాయి. జలగ శరీరంలో చేరిన చెడు రక్తాన్ని పీల్చివేసి ఆరోగ్యాన్నిస్తుందని ప్రతీతి. అందుకే ధన్వంతరి చేతిలో జలూకం అంటే జలగ ఉంటుంది.

నేడు శని త్రయోదశి కూడా. ధనత్రయోదశి నాడే శని త్రయోదశి కూడా రావడం చాలా విశేషం. అందువల్ల ఈ వేళ పాత వస్తువులు, పాత ఆలోచనలు, పాతదనాన్ని వదిలించుకుని, కొత్త వస్తువులు కొనుగోలు చేయటం, కొత్త ఆలోచనలు చేయటం, కొత్త పనులకు శ్రీకారం చుట్టడం చాలా మంచిది.

పితృదేవతాపూజకు కూడా ధనత్రయోదశి చాలా ప్రశస్తమైనది. ధనత్రయోదశి నాడు ఇంటిలో దీపాలు వెలిగించి, మన పెద్దవారిని తలచుకోవడం వల్ల వారి ఆశీర్వాదంతో శుభం చేకూరుతుందని పండితులు చెబుతారు. ఈ శుభవేళ అందరికీ కీడు తొలగి మేలు చేకూరాలని కాంక్షిద్దాం.

– డి.వి.ఆర్.

**బులియన్**
(బంగారం 10 గ్రా.; వెండి కిలో)
అక్టోబర్ 17న ముగింపు రూ.లలో

| | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|---|
| బంగారం (24 క్యారెట్లు) | 1,34,990 | 1,35,150 | 1,32,770 | 1,35,150 | 1,32,500 | 1,33,090 |
| బంగారం (22 క్యారెట్లు) | 1,24,590 | 1,21,700 | 1,21,700 | 1,25,350 | 1,21,900 | 1,22,000 |
| వెండి | 1,90,000 | 1,81,000 | 2,03,000 | 1,81,000 | 1,81,000 | 2,03,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి బిజినెస్
శనివారం
18-10-2025

**స్టాక్ మార్కెట్లు** (తొలి రెండు గంటల 11.30 గంటలకు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|
| 485 | 125 |
| 83,952 | 25,710 |

**విదేశీ సూచీలు**

| సూచీ | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 22,585 | ▲ | 26 |
| డోజోన్స్ | 46,064 | ▲ | 112 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 9,355 | ▽ | 81 |
| డాక్స్ | 23,843 | ▽ | 429 |
| షాంఘై | 3,840 | ▽ | 76 |
| నికాయ్ | 48,582 | ▽ | 696 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | 87.40 | 88.42 |
| £ | బ్రిటన్ పౌండ్ | 116.74 | 119.70 |
| € | యూరో | 101.54 | 104.32 |
| ¥ | జపాన్ యెన్ (100) | 57.56 | 59.01 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | 55.75 | 57.99 |
| S$ | సింగపూర్ డాలర్ | 65.74 | 69.15 |
| SAR | సౌదీ రియాల్ | 55.59 | 24.10 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | 23.10 | 24.30 |
| ¥ | చైనా యువాన్ | 11.48 | 13.30 |

# పసిడి.. రికార్డుల మోత

- ధన్‌తెరాస్ దన్నుతో మరో రూ. 3,200 జంప్
- లైఫ్‌టైమ్ గరిష్టం రూ. 1,34,800కి చేరిక


**న్యూఢిల్లీ:** పసిడి రికార్డుల పరుగు కొనసాగుతోంది. శుక్రవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో మరో రూ. 3,200 పెరిగింది. 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం (పది గ్రాముల) రేటు సరికొత్త జీవితకాల గరిష్టం రూ. 1,34,800కి ఎగిసింది. అటు వెండి మాత్రం కేజీకి రూ. 7,000 క్షీణించి రూ. 1,77,000 స్థాయికి తగ్గింది. పండుగ సీజన్‌లో ధన్‌తెరాస్ ముందు రోజున జ్యుయలర్లు, రిటైలర్ల నుంచి భారీ డిమాండ్ నెలకొనడం ఇందుకు కారణమని ఆలిండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. సీజనల్‌గానే కాకుండా ఇన్వెస్టర్లు.. సెంట్రల్ బ్యాంకుల నుంచి కూడా డిమాండ్ నెలకొనడంతో పసిడి ధర దౌడు తీస్తోందని పేర్కొంది.



అమెరికా ఎకానమీలో అనిశ్చితి, కీలక గణాంకాలను వెల్లడించడంలో ఆలస్యం జరుగుతుండటం వంటి అంశాల వల్ల ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడి వైపు మొగ్గు చూపుతున్నట్లు ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వీపీ జతిన్ త్రివేది తెలిపారు. రిస్క్ సెంటిమెంట్ బలహీనంగా ఉన్నన్ని రోజులు బంగారం ధరలు అధిక స్థాయిలోనే ఉండొచ్చని పేర్కొన్నారు. ఇక అంతర్జాతీయంగా నైమెక్స్ ఫ్యూచర్స్ మార్కెట్లో 4,391.69 డాలర్ల గరిష్ఠ స్థాయిని తాకిన బంగారం ఒక దశలో 4,228.74 డాలర్లకు కూడా నెమ్మదించింది. అటు వెండి సైతం 53.76 డాలర్ల గరిష్టం నుంచి 50.20 డాలర్ల స్థాయికి తగ్గింది. దేశీయంగా ఎంసీఎక్స్‌లో గోల్డ్ డిసెంబర్ కాంట్రాక్టు రూ. 1,27,402కి, వెండి ధర రూ. 1,58,888కి నెమ్మదించింది.

పసిడి ధరలు భారీగా పెరిగిన ప్రస్తుత తరుణంలో, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, క్రెడిట్ మార్కెట్‌పై ఆందోళనలు మొదలైన అంశాలను నిశితంగా పరిశీలించాల్సి ఉంటుందని యాస్పెక్ట్ బులియన్ అండ్ రిఫైనరీ సీఈవో దర్శన్ దేశాయ్ తెలిపారు. అయితే, స్వల్పంగా తగ్గినప్పటికీ పసిడి సెంటిమెంటు బలంగానే ఉందని వివరించారు.

# రిలయన్స్ క్యూ2.. గుడ్



- నికర లాభం రూ. 18,165 కోట్లు
- ఆదాయం రూ. 2.59 లక్షల కోట్లు

**టెలికం, డిజిటల్ ప్లాట్‌ఫామ్ రిలయన్స్ జియో సహా.. రిలయన్స్ రిటైల్, ఆయిల్ టు కెమికల్స్(ఓ2సీ) విభాగాల దన్నుతో డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్ఐఎల్) పటిష్ట పనితీరు చూపింది. వెరసి ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) క్యూ2లో నికర లాభం 10 శాతం ఎగసింది. వివరాలు చూద్దాం..**

**న్యూఢిల్లీ:** ప్రైవేట్ రంగ దిగ్గజం ఆర్ఐఎల్ తాజాగా జులై-సెప్టెంబర్(క్యూ2) ఆర్థిక ఫలితాలు విడుదల చేసింది. కన్సాలిడేటెడ్ నికర లాభం 10 శాతం వృద్ధితో రూ. 18,165 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 16,653 కోట్లు ఆర్జించింది. అయితే ఈ ఏడాది క్యూ1(ఏప్రిల్-జూన్)లో ఆర్జించిన రూ. 26,994 కోట్లతో పోలిస్తే 33 శాతం క్షీణించింది. మొత్తం ఆదాయం రూ. 2.35 లక్షల కోట్ల నుంచి రూ. 2.39 లక్షల కోట్లకు ఎగసింది. కొత్త కస్టమర్లను జత చేసుకోవడం, వినియోగదారునిపై ఆదాయం పుంజుకోవడం, వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్ బిజినెస్‌లతో జియో లాభం 13 శాతం పుంజుకోగా.. స్టోర్ల నిర్వహణ మెరుగుపడటంతో రిటైల్ విభాగం ఆర్జన 22 శాతం ఎగసింది. మరోవైపు కంపెనీ చరిత్రలోనే అత్యధికంగా చమురును ప్రాసెస్ చేయడంతో బలపడిన రిఫైనింగ్ మార్జిన్లు ఈ క్యూ2లో ఆర్ఐఎల్‌కు జోష్‌నిచ్చాయి. క్యూ1తో పోలిస్తే ఇన్వెంటరీ నష్టాలు రెట్టింపై రూ. 8,421 కోట్లకు చేరాయి. నిర్వహణ లాభం(ఇబిటా) 15% జంప్ చేసి రూ. 50,367 కోట్లను తాకింది. రుణ భారం రూ. 3.38 లక్షల కోట్ల(క్యూ1) నుంచి రూ. 3.48 లక్షల కోట్లకు పెరిగింది.

> ఓ2సీ, జియో, రిటైల్ విభాగాల దన్నుతో క్యూ2లో పటిష్ట పనితీరు ప్రదర్శించాం. అన్నివిధాలా డిజిటల్ సర్వీసుల బిజినెస్ వృద్ధి కొనసాగుతోంది. అధిక అమ్మకాల కారణంగా రిటైల్ విభాగం ఆదాయం, ఇబిటా పుంజుకున్నాయి. ఇంధన మార్కెట్ల అనిశ్చితుల్లోనూ ఓ2సీ ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కొత్త వృద్ధి ఇంజిన్లు న్యూఎనర్జీ, మీడియా, కన్జూమర్ బ్రాండ్స్‌లో నమోదవుతున్న పురోగతికి సంతోషిస్తున్నాం.
>
> – ముకేశ్ అంబానీ, చైర్మన్, ఎండీ, రిలయన్స్ ఇండస్ట్రీస్

**ఓ2సీ ఓకే:** చమురు, రసాయనాల విభాగం ఇబిటా 21% జంప్‌చేసి రూ. 15,008 కోట్లను తాకింది. జామ్‌నగర్ జంట రిఫైనరీల చమురు శుద్ధి మార్జిన్లు బలపడ్డాయి. కొత్త రికార్డ్‌తో 20.8 మిలియన్ టన్నుల చమురును ప్రాసెస్ చేసింది. ఇంధన రిటైల్ బిజినెస్ జియో-బీపీ డీజిల్, పెట్రోల్ విక్రయాలు 30 శాతం జంప్‌చేశాయి. రిటైల్ నెట్‌వర్క్ 2,000 ఔట్‌లెట్లకు చేరింది. ఇక కేజీ-డీ6 క్షేత్రాలలో గ్యాస్ ఉత్పత్తి 5 శాతంపైగా క్షీణించింది.

**ఫలితాల నేపథ్యంలో ఆర్ఐఎల్ షేరు 1.4 శాతం లాభంతో రూ. 1,417 వద్ద ముగిసింది.**

### రిటైల్ భళా



రిటైల్ అనుబంధ సంస్థ రిలయన్స్ రిటైల్ వెంచర్స్ నికర లాభం 22 శాతం ఎగసి రూ. 3,457 కోట్లను తాకింది. మొత్తం ఆదాయం 18 శాతం వృద్ధితో రూ. 90,018 కోట్లను తాకింది. ఇబిటా 17 శాతం అధికమై రూ. 6,816 కోట్లయ్యింది. ఈ కాలంలో కొత్తగా 412 స్టోర్లను జత చేసుకోవడంతో వీటి సంఖ్య 19,821కు చేరింది. నిర్వహణ మార్జిన్లను మెరుగుపరిచేందుకు కార్యకలాపాల క్రమబద్ధీకరణను చేపట్టింది. ఈకామర్స్ ప్లాట్‌ఫామ్ ఎజియో కేటలాగ్ 35 శాతం పెరిగి 2.7 మిలియన్ ఆప్షన్లకు చేరింది. ఆన్‌లైన్ ఫాస్ట్ ఫ్యాషన్ బ్రాండ్ షీన్ యాప్ డౌన్‌లోడ్స్ 60 లక్షలను దాటాయి.

### జియో జోరు

టెలికం, డిజిటల్ అనుబంధ సంస్థ జియో ప్లాట్‌ఫామ్స్ నికర లాభం క్యూ2లో 13 శాతం పుంజుకుని రూ. 7,379 కోట్లను తాకింది. డేటా మినిట్స్ వినియోగం, ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ), సబ్‌స్క్రయిబర్ల సంఖ్య మెరుగుపడటం ఇందుకు సహకరించింది. కస్టమర్ల సంఖ్య 49.81 కోట్ల నుంచి 50.64 కోట్లకు పెరిగింది. ఏఆర్‌పీయూ రూ. 208.8 నుంచి రూ. 211.4కు బలపడింది. వైర్‌లెస్ బ్రాడ్‌బ్యాండ్ సర్వీస్ జియో ఎయిర్‌ఫైబర్ వినియోగదారుల సంఖ్య 9.5 మిలియన్లకు చేరింది. ఇది ప్రపంచంలోనే అత్యధికంగా.. నెలకు మిలియన్ కొత్త కనెక్షన్లు జత కలుస్తున్నట్లు ఆర్ఐఎల్ వెల్లడించింది.

**జియోస్టార్ జూమ్**

మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ ప్లాట్‌ఫామ్ జియోస్టార్ నికర లాభం రూ. 1,322 కోట్లను తాకగా.. రూ. 7,232 కోట్ల ఆదాయం అందుకుంది. రూ. 1,738 కోట్ల ఇబిటాతోపాటు 28.1 శాతం మార్జిన్లు సాధించింది.

# మూడో రోజూ ముందుకే!

- సెన్సెక్స్ మరో 485 పాయింట్లు ప్లస్
- ఏడాది గరిష్టానికి నిఫ్టీ..

**ముంబై:** విదేశీ నిధుల ప్రవాహానికి తోడు బ్లూచిప్ బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల మద్దతుతో దేశీ మార్కెట్లు వరుసగా మూడో రోజూ లాభాల జోరును కొనసాగించాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ శుక్రవారం మరో 485 పాయింట్లు జంప్ చేసి 83,952 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ ఏడాది గరిష్ట స్థాయికి దూసుకెళ్లింది. 125 పాయింట్లు లాభపడి 25,710 వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో తీవ్ర ఒడిదుడుకులకు లోనైన సూచీలు ఇంట్రాడేలో నమోదైన భారీ లాభాల్లో కొంత మేరకు కోల్పోయాయి. సెన్సెక్స్ ఒకదశలో 705 పాయింట్లు ఎగసి 84,172కు చేరింది. ఈ వారం మొత్తంలో చూస్తే, సెన్సెక్స్ 1,451 పాయింట్లు (1.75%), నిఫ్టీ 425 పాయింట్ల (1.67%) చొప్పున లాభాలను మూటగట్టుకున్నాయి. ఆసియాలో దక్షిణ కొరియా సూచీ మాత్రమే లాభాల్లో నిలవగా, జపాన్, షాంఘై, హాంకాంగ్ ఇండెక్సులు నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు భారీ నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

**ముఖ్యాంశాలివీ...**

- బీఎస్‌ఈలో రంగాల వారీగా కన్జూమర్ డ్యూరబుల్స్ 1.48 శాతం, ఎఫ్‌ఎంసీజీ 1.19 శాతం ఆటో 0.59 శాతం, హెల్త్‌కేర్ 0.5 శాతం చొప్పున పుంజుకున్నాయి. స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు కూడా చెరో అర శాతం మేర పడ్డాయి.
- ఏషియన్ పెయింట్స్ అత్యధికంగా 4.18 శాతం లాభపడింది. మహీంద్రా (2.45%), భారతీ ఎయిర్‌టెల్ (2.28%), ఐటీసీ (1.74%), హెచ్‌యూఎల్ (1.70%), ఐసీఐసీఐ బ్యాంక్ (1.38%), రిలయన్స్ (1.35%) ప్లస్‌లో నిలిచాయి.
- క్యూ2 ఫలితాలు ఇన్వెస్టర్లను నిరాశపరచడంతో విప్రో షేరు 5% దిగజారి రూ.241 వద్ద ముగిసింది.






### కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ లిస్టింగ్ ఫ్లాట్..

ఇన్సూరెన్స్ కంపెనీ కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ లిస్టింగ్‌లో గట్టెక్కింది. ఇష్యూ ధర రూ.106 వద్దే ఫ్లాట్‌గా అరంగేట్రం చేసింది. ఆ తర్వాత 6.36 శాతం లాభపడి రూ.113ను తాకింది. చివరకు 5 శాతం లాభంతో రూ.111 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.10,592 కోట్లుగా నమోదైంది.

# హైదరాబాద్ కొంపల్లిలో రిలయన్స్ డిజిటల్ 41వ స్టోర్ ప్రారంభం

**హైదరాబాద్:** రిలయన్స్ డిజిటల్ హైదరాబాద్ నగరం కొంపల్లిలో 41వ స్టోర్ ప్రారంభించింది. పండుగ సీజన్, కొత్త స్టోర్‌ను ఏర్పాటు సందర్భంగా 'ఫెస్టివల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్' పేరుతో ఆఫర్లు ప్రకటించింది. కస్టమర్లు ప్రముఖ బ్యాంకుల కార్డును వినియోగించి ఎలక్ట్రానిక్స్ పరికరాలు, గృహోపకరణాల కొనుగోలుపై రూ. 20,000 వరకు తక్షణ రాయితీ పొందవచ్చు. 'జీఎస్‌టీ రేట్ల తగ్గింపు' వినియోగించుకుని భారీ స్క్రీన్ టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు చవక ధరలకే దక్కించుకోవచ్చు. రూ.2 కోట్ల విలువైన 'బంగారు నిధి' లక్కీ డ్రాలో పాల్గొని బంగారు నాణేలు గెలుచుకోవచ్చు. "అత్యాధునిక సాంకేతిక ఉపకరణాలు, ఉత్తమ షాపింగ్ అనుభవాన్ని ప్రతి ఒక్కరికీ అందించాలనే లక్ష్యానికి సంస్థ కట్టుబడి ఉంది. హైదరాబాద్‌లో 41వ, తెలుగు రాష్ట్రాల్లో 112వ స్టోర్లను ప్రారంభించడమనేది కస్టమర్ల నుంచి లభిస్తున్న ఆదరణకు నిదర్శనం" అని సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు. దగ్గర్లోని రిలయన్స్ డిజిటల్ స్టోర్‌ను సందర్శించి పండుగ ఆఫర్లు వినియోగించుకోవాలని కోరారు.



---

## సాక్షి స్పోర్ట్స్



### సెమీఫైనల్లో సహజ జోడీ

ఎబిర్టో టాంపికో డబ్ల్యూటీఏ-125 టోర్నమెంట్‌లో భారత మహిళల టెన్నిస్ నంబర్‌వన్, తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి డబుల్స్ విభాగంలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సహజ (భారత్)-జెస్సికా గోమెజ్ (మెక్సికో) ద్వయం 7-5, 6-1తో రెండో సీడ్ లియా కరాతంచేవా (బల్గేరియా)-వలేరియా స్ట్రాకోవా (ఉక్రెయిన్) జోడీని బోల్తా కొట్టించింది. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో-మెక్సికన్ జంట ఒక ఏస్ సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. నేడు జరిగే సెమీఫైనల్లో మూడో సీడ్ కేలా క్రాస్ (కెనడా)-అమెలియా రాజెస్కి (బ్రిటన్)లతో సహజ-జెస్సికా తలపడతారు. మరోవైపు ఈనెల 27 నుంచి నవంబర్ 2 వరకు భారత్‌లో జరిగే చెన్నై ఓపెన్ డబ్ల్యూటీఏ-250 టోర్నీలో సహజకు మెయిన్ 'డ్రా'లో నేరుగా చోటు కల్పించారు.

# తన్వీ తడాఖా...



- ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పతకం ఖాయం
- 17 ఏళ్ల తర్వాత మహిళల సింగిల్స్‌లో భారత్‌కు పతకం




**గువాహటి:** సుదీర్ఘ నిరీక్షణకు భారత యువ షట్లర్ తన్వీ శర్మ తెర దించింది. ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ విభాగంలో 17 ఏళ్ల తర్వాత భారత్‌కు పతకాన్ని ఖాయం చేసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ తన్వీ శర్మ 13-15, 15-9, 15-10తో సాకి మత్సుమోటో (జపాన్)పై విజయం సాధించి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. తద్వారా కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. నేడు జరిగే సెమీఫైనల్లో లియు సి యా (చైనా)తో తన్వీ తలపడుతుంది. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో మహిళల సింగిల్స్‌లో అపర్ణ పోపట్ (1996లో రజతం), సైనా నెహ్వాల్ (2006లో రజతం, 2008లో స్వర్ణం) మాత్రమే పతకాలు గెలిచారు. భారత్‌కే చెందిన మరో ప్లేయర్ ఉన్నతి హుడాకు నిరాశ ఎదురైంది. క్వార్టర్ ఫైనల్లో ఉన్నతి 12-15, 13-15తో అన్యాపత్ ఫిచిత్‌ఫోన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్‌లో హైదరాబాద్ ప్లేయర్ టంకర తలశిల జ్ఞానదత్తుకు కూడా ఓటమి ఎదురైంది. జ్ఞానదత్తు 11-15, 13-15తో మూడో సీడ్ లియు యాంగ్ మింగ్ యు (చైనా) చేతిలో ఓడిపోయాడు. క్వార్టర్ ఫైనల్లో ఉన్నతి, జ్ఞానదత్తు గెలిచి ఉంటే ఈ ఇద్దరికి కూడా పతకాలు ఖాయమయ్యేవి. పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అరిగెల భార్గవ్ రామ్-గొబ్బూరు విశ్వతేజ్ (భారత్) జంట 12-15, 10-15తో చెన్ జున్ టింగ్-లియు జున్ రోంగ్ (చైనా) జోడీ చేతిలో... మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో భవ్య ఛాబ్రా-విశాఖ టొప్పో (భారత్) ద్వయం 9-15, 7-15తో హుంగ్ బింగ్ ఫు-చౌ యున్ ఆన్ (చైనీస్ తైపీ) జోడీ చేతిలో పరాజయం పాలై పతకాలకు దూరమయ్యాయి.

# వెల్‌డన్ జొరావర్

- ప్రపంచ షాట్‌గన్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం
- 12వ ప్రయత్నంలో పతకం నెగ్గిన భారత షూటర్

**ఏథెన్స్:** ప్రపంచ షాట్‌గన్ చాంపియన్‌షిప్‌లో 19 ఏళ్ల తర్వాత భారత్‌కు మళ్లీ పతకం వచ్చింది. శుక్రవారం జరిగిన పురుషుల ట్రాప్ ఈవెంట్‌లో భారత షూటర్ జొరావర్ సింగ్ సంధూ కాంస్య పతకం సాధించాడు. ఆరుగురు షూటర్ల మధ్య జరిగిన ఫైనల్లో 48 ఏళ్ల జొరావర్ 31 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచాడు. జోసిప్ గ్లాస్నోవిచ్ (క్రొయేషియా; 44 పాయింట్లు) పసిడి పతకం... గార్సియా (స్పెయిన్; 39 పాయింట్లు) రజతం నెగ్గారు. 133 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో జొరావర్ 122 పాయింట్లు స్కోరు చేసి ఆరో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరాడు.

**ముగిసిన నిరీక్షణ**

తన 27 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో జొరావర్ ప్రపంచకప్‌లో, ఆసియా క్రీడల్లో, ఆసియా చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించాడు. కానీ ప్రపంచ చాంపియన్‌షిప్ పతకం మాత్రం ఊరిస్తోంది. ఒకటి కాదు... రెండు కాదు.. మూడు కాదు... ఇప్పటి వరకు 11సార్లు (1998, 1999, 2005, 2007, 2010, 2013, 2015, 2017, 2018, 2019, 2023) జొరావర్ ప్రపంచ సీనియర్ షాట్‌గన్ చాంపియన్‌షిప్‌లో పోటీపడ్డాడు. కానీ 11 ప్రయత్నాల్లోనూ ఏనాడూ ఫైనల్‌కు చేరలేదు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా లక్ష్యం కోసం పోరాడిన జొరావర్ ఎట్టకేలకు 12వ ప్రయత్నంలో తన 'ప్రపంచ పతకం' స్వప్నాన్ని సాకారం చేసుకున్నాడు.

**3** ప్రపంచ షాట్‌గన్ చాంపియన్‌షిప్ చరిత్రలో పతకం సాధించిన మూడో భారతీయ ట్రాప్ షూటర్‌గా జొరావర్ గుర్తింపు పొందాడు. గతంలో భారత్ తరఫున కర్ణీ సింగ్ (1962లో) రజతం, మానవ్‌జిత్ సింగ్ సంధూ (2006లో) స్వర్ణం గెలిచారు.

# తన్మయ్ సెంచరీ

## హైదరాబాద్ 400/7



**సాక్షి, హైదరాబాద్:** ఢిల్లీతో సొంతగడ్డపై జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో హైదరాబాద్ దీటైన జవాబు ఇచ్చింది. అయితే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం మాత్రం చేజారేలా కనిపిస్తోంది. మ్యాచ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 106.4 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 400 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (196 బంతుల్లో 132; 15 ఫోర్లు) ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో 18వ శతకంతో చెలరేగాడు. అనికేత్ రెడ్డి (100 బంతుల్లో 87; 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ అవకాశం చేజార్చుకోగా... వరుణ్ గౌడ్ (57; 5 ఫోర్లు), రాహుల్ రాదేశ్ (41 బ్యాటింగ్) రాణించారు. తన్మయ్, అనికేత్ రెండో వికెట్‌కు 140 పరుగులు జోడించారు. శుక్రవారం మొత్తం 89.4 ఓవర్లు ఆడిన హైదరాబాద్ 6 వికెట్లు చేజార్చుకొని 323 పరుగులు సాధించింది. హైదరాబాద్ కెప్టెన్ తిలక్ వర్మ 'డకౌట్' అయ్యాడు. ఢిల్లీ బౌలర్లలో ఆయుశ్ బదోని తొలిసారి 5 వికెట్ల (5/69) ప్రదర్శన నమోదు చేయడం విశేషం. ప్రత్యర్థి స్కోరుకంటే హైదరాబాద్ మరో 129 పరుగులు వెనుకబడి ఉంది.

# 34 బంతుల్లో సెంచరీ

## మహిళల టి20ల్లో కిరణ్ నవ్‌గిరే ప్రపంచ రికార్డు



**నాగ్‌పూర్:** మహారాష్ట్ర బ్యాటర్ కిరణ్ నవ్‌గిరే మహిళల టి20 క్రికెట్‌లో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. బీసీసీఐ సీనియర్ మహిళల టి20 ట్రోఫీ (ఎలైట్)లో భాగంగా పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో కిరణ్ 34 బంతుల్లోనే సెంచరీ నమోదు చేసింది. న్యూజిలాండ్ ప్లేయర్ సోఫీ డివైన్ 2021లో 36 బంతుల్లో నమోదు చేసిన సెంచరీ రికార్డును కిరణ్ బద్దలు కొట్టింది. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో కిరణ్ మొత్తం 35 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్లతో 106 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. అంతకుముందు పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 110 పరుగులు చేయగా... కిరణ్ విధ్వంసంతో మహారాష్ట్ర 8 ఓవర్లలోనే వికెట్ నష్టానికి 113 పరుగులు సాధించింది. కిరణ్ మినహా ఇతర బ్యాటర్లు ఈశ్వరి 1, ముక్త 6 పరుగులు మాత్రమే చేశారు! మహిళల టి20ల్లో 300కు పైగా స్ట్రయిక్ రేట్‌తో నమోదైన సెంచరీ (302.86) ఇదొక్కటే కావడం విశేషం. 31 ఏళ్ల కిరణ్ నవ్‌గిరే 2022లో భారత్ తరఫున 6 టి20లు ఆడి 17 పరుగులు మాత్రమే చేయడంతో జట్టులో స్థానం కోల్పోయింది.

# డబుల్స్ సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ

**ఒడెన్స్:** డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాత్విక్-చిరాగ్ ద్వయం 21-15, 18-21, 21-16తో మొహమ్మద్ రియాన్ అర్దియాంతో-రహ్మత్ హిదాయత్ (ఇండోనేసియా) జంటపై గెలిచింది. నేడు జరిగే సెమీఫైనల్లో టకురో హోకి-యుగో కొబయాషి (జపాన్) జోడీతో సాత్విక్-చిరాగ్ జంట తలపడుతుంది. మరోవైపు పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ లక్ష్య సేన్ పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో లక్ష్య సేన్ 9-21, 14-21తో అలెక్స్ లానియర్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయాడు.

# టైటిల్ పోరుకు భారత్

**జొహోర్ బారు (మలేసియా):** సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ అండర్-21 అంతర్జాతీయ పురుషుల హాకీ టోర్నీలో భారత జట్టు టైటిల్ పోరుకు అర్హత సాధించింది. శుక్రవారం ఆతిథ్య మలేసియా జట్టుతో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో రోహిత్ సారథ్యంలోని టీమిండియా 2-1 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున గుర్జోత్ సింగ్ (22వ నిమిషంలో), ఆనంద్ కుష్వాహ (48వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. మలేసియా జట్టుకు నావినేశ్ పానికెర్ (43వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. 12వసారి ఈ టోర్నీలో ఆడుతున్న భారత జట్టు రికార్డుస్థాయిలో ఎనిమిదోసారి ఫైనల్‌కు చేరడం విశేషం. శుక్రవారం జరిగిన మరో రెండు లీగ్ మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి. న్యూజిలాండ్-బ్రిటన్ మ్యాచ్ 2-2 గోల్స్ వద్ద... ఆస్ట్రేలియా-పాకిస్తాన్ మ్యాచ్ 3-3 గోల్స్ వద్ద 'డ్రా' అయ్యాయి. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో శుక్రవారంతో లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాయి. 11 పాయింట్లతో ఆస్ట్రేలియా, 10 పాయింట్లతో భారత్ తొలి రెండు స్థానాల్లో నిలిచి నేడు టైటిల్ పోరులో తలపడతాయి. బ్రిటన్-పాకిస్తాన్ జట్ల మధ్య మూడో స్థానం కోసం మ్యాచ్ జరుగుతుంది.





# దక్షిణాఫ్రికా ఘన విజయం

## 10 వికెట్లతో శ్రీలంక చిత్తు

**కొలంబో:** మహిళల వన్డే వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికా వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం వాన అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 10 వికెట్ల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. వర్షంతో కొలంబోలో మూడు మ్యాచ్‌లు రద్దయిన తర్వాత ఎట్టకేలకు 'టి20' ఫార్మాట్‌లో ఫలితం రావడం విశేషం. టాస్ గెలిచిన లంక 12 ఓవర్లలో లంక 2 వికెట్ల నష్టానికి 46 పరుగులు చేసింది. ఈ దశలో భారీ వర్షం కారణంగా సుదీర్ఘ సమయం పాటు ఆట నిలిచిపోయింది. చివరకు అంపైర్లు మ్యాచ్‌కు 20 ఓవర్లకు కుదించారు. 20 ఓవర్లలో శ్రీలంక 7 వికెట్లు కోల్పోయి 105 పరుగులు సాధించింది. విష్మి గుణరత్నే (34; 6 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలవగా... ఎంలాబా 3, క్లాస్ 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం దక్షిణాఫ్రికా లక్ష్యాన్ని డక్‌వర్త్-లూయిస్ పద్ధతి ప్రకారం 20 ఓవర్లలో 121 పరుగులుగా నిర్దేశించారు. దక్షిణాఫ్రికా జట్టు 14.5 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 125 పరుగులు సాధించి విజయాన్నందుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కెప్టెన్ లారా వోల్‌వార్ట్ (47 బంతుల్లో 60 నాటౌట్; 8 ఫోర్లు), తజ్మీన్ బ్రిట్స్ (42 బంతుల్లో 55 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయంగా మ్యాచ్‌ను ముగించారు. **నేడు కొలంబోలో జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో న్యూజిలాండ్ తలపడుతుంది.**

## క్లుప్తంగా...

### 19 నుంచి జనవరి శ్రీవారి దర్శన కోటా విడుదల

**తిరుమల:** కొత్త ఏడాది జనవరి నెలకు సంబంధించి వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలను టీటీడీ శుక్రవారం విడుదల చేసింది. శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు, అంగ ప్రదక్షిణ టోకెన్లకు సంబంధించిన జనవరి నెల కోటాను అక్టోబర్ 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం అక్టోబర్ 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు అక్టోబర్ 21 నుంచి 23 మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది.

**23న ఆర్జిత సేవా టికెట్ల విడుదల**

కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను 23న టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తుంది. 24న శ్రీవాణి దర్శన టికెట్ల కోటాను, అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వయో వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారికి ఉచిత ప్రత్యేక దర్శనం టికెట్ల కోటాను విడుదల చేస్తుంది. 25న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు గదుల కోటాను ఆన్‌లైన్‌లో టీటీడీ విడుదల చేయనున్నది. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టీటీడీ కోరుతోంది.

### డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలి

- ప్రజలకు మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపు



సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. పోలీసు, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. ఇరు శాఖల ఉన్నతాధికారులతో రాజనర్సింహ శుక్రవారం సచివాలయంలో సమీక్షించారు. విద్యా సంస్థల్లో యాంటీ నార్కోటిక్స్ వింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఎర్రగడ్డలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ ప్రాంగణంలో అత్యాధునిక వసతులతో డీ అడిక్షన్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని, భవిష్యత్‌లో మరిన్ని సెంటర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. సమావేశంలో ఉన్నతాధికారులు సందీప్ శాండిల్య, క్రిస్టినా జడ్ చొంగ్తూ, షానవాజ్ ఖాసీం, నరేంద్ర కుమార్, అజయ్‌కుమార్, రూపేశ్, అనిత, సునీత తదితరులు పాల్గొన్నారు.

# లేజర్.. డేంజర్!

**శంషాబాద్:** విందులు వినోదాలు చేసుకునేవారికి అవి మిరుమిట్లు గొలిపే కాంతులు.. కానీ, వందలాది మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే విమాన పైలట్లకు మాత్రం అవి కంగారు పుట్టించే వెలుగులు. విమానాల టేకాఫ్, ల్యాండింగ్‌లపై తీవ్ర ప్రభావం చూపే లేజర్ లైట్లను విమానాశ్రయాల సమీపంలో వినియోగించరాదని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నిషేధించినప్పటికీ.. కొందరు తరచూ వాటిని వాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిసరాల్లో కూడా వీటి వినియోగం పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. శంషాబాద్ విమానాశ్రయం పరిసరాల్లో ప్రారంభంలో చిన్నచిన్న గ్రామాలే ఉండేవి. గత దశాబ్దకాలంగా చుట్టూ జనావాసాలు, వాణిజ్య కార్యకలాపాలు భారీగా పెరిగాయి. అనేక కన్వెన్షన్లతోపాటు కొందరు సంపన్నులు ఎయిర్‌పోర్టుకు అత్యంత సమీపంలోనే విలాసవంతమైన ఇళ్లు కట్టుకున్నారు. ఎయిర్‌పోర్టు సమీపంలో లేజర్ లైట్ల వినియోగంపై ఆంక్షలు ఉన్నప్పటికీ కొందరు పట్టించుకోవటం లేదు. ఆరేళ్ల క్రితం కొందరు బాలురు బర్త్‌డే పార్టీ చేసుకుని లేజర్ లైట్లు వేయటంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో దిగేందుకు గల్ఫ్ ఎయిర్‌లైన్స్ విమాన పైలట్ కంగారు పడ్డాడు. అప్పట్లో ఇది పెద్ద కలకలమే రేపింది. తాజాగా మూడు రోజుల క్రితం కూడా ఓ విమానంపై గ్రీన్ కలర్ లేజర్ కాంతులు పడ్డాయనే సమాచారంపై అంతర్గత విచారణ చేపట్టారు.

> విమాన పైలట్లను కంగారు పెడుతున్న లేజర్ లైట్లు
>
> విమానాశ్రయాల సమీపంలో ప్రమాదాలకు హేతువు
>
> టేకాఫ్, ల్యాండింగ్‌లకు ఈ లైట్లతో ఇబ్బందులు
>
> ఎయిర్‌పోర్టుల పరిసరాల్లో నిషేధాజ్ఞలున్నా ఆగని వాడకం
>
> ఇటీవల శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వద్ద లేజర్ కలకలం



### ఏమిటి నిబంధనలు?

విమానాశ్రయం పరిసరాల్లో లేజర్ కాంతుల వాడకంపై డీజీసీఏ పలు నిబంధనలు పెట్టింది. విమానాశ్రయానికి పది కిలోమీటర్ల లోపు వివిధ జోన్లుగా విభజించి నిబంధనలు పెట్టారు. కాంతి ప్రసార వేగం ఆధారంగా నిబంధనలు రూపొందించారు. మొదటిది లేజర్ బీమ్ ఫ్రీ ఫ్లైట్ జోన్. ఈ జోన్ పరిధిలో లేజర్ కాంతులు పూర్తిగా నిషిద్ధం. రెండోది లేజర్ బీమ్ క్రిటికల్ ఫ్లైట్ జోన్. ఇందులో లేజర్ కాంతి ప్రసారం మేరకు నిబంధనలుంటాయి. మూడోది లేజర్ బీమ్ సెన్సిటివ్ ఫ్లైట్ జోన్.

### పైలట్ల కష్టాలు..

టేకాఫ్, ల్యాండింగ్ సమయాల్లో లేజర్ కాంతులతో పైలట్లు పడే కష్టాలు అన్నీఇన్నీ కావు. వేగవంతమైన కాంతి ద్వారా పైలట్లకు ఫ్లాష్ బ్లైండ్‌నెస్ ప్రమాదం ఉంటుంది. దీంతో తాత్కాలిక దృశ్యలోపంతో పైలట్లు కంగారు పడతారు. దీంతోపాటు ఆఫ్టర్ ఇమేజ్ ప్రభావం ఉంటుంది. లేజర్ కాంతి పడి తర్వాత పోయినా ఆ దృశ్యం కళ్లలో నిక్షిప్తమై మరోమారు కనిపిస్తుంటుంది. ఇది దృష్టిభ్రమ లాంటిది. ఇది కూడా పైలట్ల పనితీరుపై ప్రభావం చూపిస్తుంది.

**కఠిన నిబంధనలున్నాయి..**

శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిసరాల్లో లేజర్ లైట్లు, డ్రోన్ల వినియోగానికి అనుమతి లేదు. ఎవరైనా ఈవెంట్ల కోసం దరఖాస్తు చేసుకుంటే.. వారికి ముందుగానే నిబంధనలు వివరించి లేజర్ లైట్లు వాడకూడదని స్పష్టంగా చెబుతాం. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో నిబంధనలు అతిక్రమించి ఎవరైనా వినియోగిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తాం. **- బి. రాజేష్, శంషాబాద్ డీసీపీ**

**తీవ్ర ప్రభావం ఉంటుంది**

రన్‌వేపై వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాటుచేసే లైటింగ్, సహజ వెలుగుల ప్రభావంతో టేకాఫ్, ల్యాండింగ్‌లు ఆధారపడి ఉంటాయి. అకస్మాత్తుగా లేజర్ కాంతులు పడితే పైలట్లు తీవ్ర ప్రభావానికి లోనవుతారు. దృశ్యలోపం కూడా సంభవిస్తుంది. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో లేజర్ కాంతులపై కఠిన నిబంధనలు కొనసాగించాలి. **- నవీన్‌చందర్, విశ్రాంత పైలట్**



వరుస సెలవులు రావడంతో శుక్రవారం జూబ్లీ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

## పీఎం జన్‌మన్‌లో తెలంగాణకు మూడో ర్యాంకు

**రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న గౌరవ్ ఉప్పల్**



రాష్ట్రపతి ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న గౌరవ్ ఉప్పల్, పద్మ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్)లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు తెలంగాణ జాతీయ ర్యాంకింగ్‌లో 3వ స్థానంలో నిలిచింది. గిరిజన సమూహాలకు న్యాయం చేయడం, వారు నివసించే ప్రాంతాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేసి.. ఈ ర్యాంకు సాధించింది. శుక్రవారం విజ్ఞాన్ భవన్‌లో ఆది కర్మయోగి జాతీయ సదస్సులో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా తెలంగాణ ప్రభుత్వం తరఫున సెక్రటరీ కోఆర్డినేషన్ గౌరవ్ ఉప్పల్ అవార్డులను అందుకున్నారు. అలాగే.. సూపర్ కోచ్‌లు, రాష్ట్ర మాస్టర్ ట్రైనర్లలో ఒకరు.. తెలంగాణలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ పద్మ మీసిని రాష్ట్రపతి సత్కరించారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం, ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు జితేష్ వి.పాటిల్, వెంకటేశ్ ధోత్రే, ఆదిలాబాద్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మత్, ఐటీడీఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా, ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ సముజ్వల పాల్గొన్నారు.

**బెస్ట్ పెర్ఫార్మెన్స్ స్క్రీన్ డిస్‌ప్లే కేటగిరీలో దక్కిన అవార్డులు**

1. ఆదికర్మయోగి అభియాన్–ఆదిలాబాద్, నల్లగొండ, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం
2. ఉత్తమ ప్రదర్శన సూపర్ కోచ్, రాష్ట్ర మాస్టర్ ట్రైనర్–డాక్టర్ కీర్తి
3. ధర్తీ అబ్ జనభాగిదారి అభియాన్–ఆదిలాబాద్, ఆసిఫాబాద్

## డీపీవో యూనిట్లలో పదోన్నతులకు అనుమతి

సాక్షి, హైదరాబాద్: జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) యూనిట్‌లో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులను.. జూనియర్ అసిస్టెంట్/టైపిస్ట్ ఫీడర్ కేటగిరీ నుంచి భర్తీ చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అనుమతిచ్చింది. సంబంధిత డీపీవో యూనిట్లలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లను.. తాత్కాలిక పద్ధతుల్లోనే సంబంధిత జోన్ల డీపీవో యూనిట్ల కార్యాలయాల్లో పదోన్నతుల ద్వారా నియమించాలని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఏడుగురికి పదోన్నతి కల్పిస్తూ పీఆర్ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో ఇద్దరు టైపిస్ట్‌లు, అయిదుగురు జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. శుక్రవారం ఈ మేరకు జారీ చేసిన ప్రొసీడింగ్స్ ఉత్తర్వులను డీపీవోలు, జిల్లా కలెక్టర్లు, వాటి ప్రతులను జిల్లా ట్రెజరీ అధికారులు, పీఆర్ శాఖ ముఖ్యకార్యదర్శికి పంపించారు.

## 'పంచాయతీ సెక్రటరీల సమస్యలు పరిష్కరించండి'

సాక్షి, హైదరాబాద్: గత కొంతకాలంగా పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ పంచాయతీ సెక్రటరీ సెంట్రల్ ఫోరమ్(టీపీఎస్‌సీఎఫ్), తెలంగాణ పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ (టీపీఎస్‌ఏ) విజ్ఞప్తి చేశాయి. శుక్రవారం ఈ మేరకు పంచాయతీ రాజ్ కమిషనరేట్ కార్యాలయంలో ఈ సంఘాల ప్రతినిధులు డైరెక్టర్ సృజనకు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు.

## సీపీఆర్‌పై దేశవ్యాప్తంగా అవగాహన

**పీఐబీ హైదరాబాద్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్**

సాక్షి, హైదరాబాద్: గుండె కొట్టుకోవడం అకస్మాత్తుగా ఆగిపోయే స్థితిపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసస్సిటేషన్) అవగాహన ప్రచార కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తోందని పీఐబీ హైదరాబాద్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ కవాడిగూడ సీజీఓ టవర్స్‌లో సీపీఆర్ ప్రదర్శనను పీఐబీ ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా సెయింట్ జాన్ అంబులెన్స్ (ఇండియా) తెలంగాణ స్టేట్ సెంటర్ డైరెక్టర్ వీవీవీఎస్ మూర్తి మాట్లాడుతూ.. గుండె కొట్టుకోవడం అకస్మాత్తుగా ఆగిపోయే స్థితిలోనూ మనిషికి ప్రాణాపాయం సంభవించకుండా నివారించడం సాధ్యమేనన్నారు. సెయింట్ జాన్ అంబులెన్స్ (ఇండియా) తెలంగాణ స్టేట్ సెంటర్ సెక్రటరీ డాక్టర్ మహేంద్రకుమార్, సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్లు హరీశ్‌బాబు, సంధ్య, నీరజ లక్ష్మీతోపాటు మొహిసిన్, రాజ్‌కుమార్ సింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీజీఓ టవర్స్‌లో దాదాపు 20 విభాగాల అధికారులు, సిబ్బంది ఈ లైవ్ డెమాన్‌స్ట్రేషన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం











Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
**EDITOR: Dhananjaya Reddy Rakkasi,** (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# భారతీయులకు థాయ్ వెలుగుల ఆహ్వానం

భారత పర్యాటకులను భారీగా ఆకర్షించడం, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్దఎత్తున ఆదాయాన్ని సమకూర్చుకోవడం లక్ష్యంగా థాయిలాండ్ వ్యూహరచన చేసింది. ఇందుకు వెలుగుల పండుగ దీపావళిని వేదికగా చేసుకుంది. 'గ్రాండ్ దివాళీ-2025' వేడుకలను భారీగా నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నెల 16 నుంచి 31 వరకు ప్రతిష్ఠాత్మకంగా థాయ్-భారత్ సాంస్కృతిక మేళవింపులతో వెలుగుల పండుగకు ఏర్పాట్లు చేస్తోంది. అద్భుత లైటింగ్ ప్రదర్శనలకు తోడు సాంస్కృతిక కార్యక్రమాల్లో లీనమయ్యే ప్రత్యేక అనుభవాలను పర్యాటకులకు అందించేలా షెడ్యూల్‌ను ప్రకటించింది. భారతదేశం వెలుపల అతిపెద్ద దీపావళి వేడుకను 'ఫెస్టివల్ ఆఫ్ లైట్స్'గా పిలుస్తోంది. ఈ ఘట్టానికి 'ఐకానిక్ ఓంగ్ ఆంగ్ కెనాల్, ఫహురత్ ప్రాంతాలను కేంద్ర బిందువులుగా మారుస్తోంది. **సాక్షి, అమరావతి**





- ఈ నెల 16 నుంచి 31 వరకు థాయిలాండ్‌లో గ్రాండ్ దివాళి వేడుక
- భారత పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రణాళిక
- తద్వారా ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఆదాయం వచ్చేలా వ్యూహ రచన
- లైట్ షోలు, స్థానిక-భారతీయ మేళవింపుతో సాంస్కృతిక ప్రదర్శనలు
- విమానాశ్రయాల నుంచే పర్యాటక సేవలపై రాయితీల జల్లు
- కృత్రిమ మేధ కెమెరాలు, వాహనాలతో ప్రత్యేక భద్రత ఏర్పాట్లు

## లక్ష మంది హాజరు!

'అమేజింగ్ థాయిలాండ్ గ్రాండ్ దీపావళి ఫెస్టివల్'కు లక్ష మందికి పైగా హాజరవుతారని థాయ్ టూరిజం అథారిటీ ప్రకటించింది. ఈ ఒక్క వేడుక ద్వారానే ఆ దేశానికి 650 మిలియన్ బాట్ల (దాదాపు 20 మిలియన్ డాలర్లు) రెవెన్యూ వస్తుందని అంచనా వేసింది. దీనికి తోడు పర్యాటకులకు ప్రత్యేక రాయితీలు కల్పిస్తోంది. దాన్ ముయాంగ్, సువర్ణభూమి విమానాశ్రయాల నుంచి వేడుక నిర్వహించే వేదికల వరకూ కీలక ప్రదేశాల్లో పర్యాటక సేవల వ్యయాలపై రాయితీలు కురిపిస్తోంది. భద్రతను దృష్టిలో పెట్టుకుని కృత్రిమ మేధ కెమెరాలు, వాహనాలను వినియోగించనుంది. ఒక్క ఈ నెలలోనే భారతీయ సందర్శకుల సంఖ్య 30 శాతం పెరుగుతుందనే ధీమా వ్యక్తం చేస్తోంది. 60 రోజుల పాటు వీసా మినహాయింపు కల్పించింది.

## వ్యక్తికి రూ.90 వేల వరకు వ్యయం!

ప్రతి ఏటా థాయిలాండ్‌ను సందర్శిస్తున్న భారతీయుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్‌లో ఇప్పటి వరకు థాయిలాండ్‌లో దాదాపు 18 లక్షల మంది భారతీయులు పర్యటించారు. థాయ్‌కు అత్యధికంగా వచ్చే సందర్శకుల సంఖ్యలో మొదటి మూడు దేశాల్లో భారత్ ఒకటి. బ్యాంకాక్, ఫుకెట్, క్రాబీ, కో స్మామ్యుయ్ వంటి థాయ్ గమ్యస్థానాలు భారతీయ పర్యాటకుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. దీనిని మరింత విస్తృతం చేసుకోవడం ద్వారా ఈ ఏడాది నాటికి 25 లక్షల మంది భారతీయ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా థాయ్ ప్రణాళికలు రూపొందిస్తోంది. థాయ్‌కి వచ్చే భారతీయ సందర్శకులు సాధారణంగా సగటున ఒక వ్యక్తికి రూ.90 వేల వరకు ఖర్చు చేస్తారని, దాదాపు 6-7 రాత్రులు బస చేస్తారని తేలింది.



## దీపావళి వెలుగుల వేడుక ఇలా.. మధురానుభూతి మిగిలిపోయేలా..

- ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఫహురత్, ఓంగ్ ఆంగ్ కెనాల్ ప్రాంతాల్లో వేడుకలు
- రాత్రిళ్లు ఆకర్షణీయమైన సౌండ్ అండ్ లైటింగ్ షోలు. కమ్యూనిటీ ఈవెంట్‌లు
- రాత్రిళ్లు ఆకర్షణీయమైన సౌండ్ అండ్ లైటింగ్ షోలు. కమ్యూనిటీ ఈవెంట్‌లు
- ప్రధాన ఆకర్షణగా థాయ్-ఇండియన్‌రామాయణ ప్రదర్శన
- లాంతర్ నృత్యాలు, భరత నాట్యం, అసోం నుంచి బిహు జానపద నృత్యం, బాలీవుడ్ నృత్యం, భారత సమకాలీన నృత్య ప్రదర్శనలుసహా రెండు దేశాల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు
- గోరింట (మెహందీ), లాంతరు పెయింటింగ్, పూసలు-బుట్ట నేయడం వంటి ఆటవిడుపు వర్క్‌షాపుల నిర్వహణ
- ప్రాన్ బిర్యానీ, మసాలా దోస, పానీపూరిసహా నోరూరించే ఇతర భారతీయ వంటకాలు
- ఆధ్యాత్మిక అనుభూతిని కల్పించే లక్ష్మీదేవి, గణేశుడి ఆరాధన కార్యక్రమాలు
- ఓంగ్ ఆంగ్ కెనాల్ తీరంలో రంగోలి, నీటిపై తేలియాడేనూనె దీపాల ప్రదర్శనలు



## ఇంజినీరింగ్ విద్యార్థినిపై కాలేజీ బాత్‌రూమ్‌లో అత్యాచారం

### బెంగళూరులో దారుణం..నిందితుడి అరెస్ట్

**బనశంకరి:** కర్ణాటకలోని బెంగళూరులోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న విద్యార్థినిపై తోటి విద్యార్థి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఈ నెల 10న జరగ్గా 5 రోజుల అనంతరం వెలుగులోకి వచ్చింది. నిందితుడు ఇంజినీరింగ్ 6వ సెమిస్టర్ చదువుతుండగా, బాధితురాలు 7వ సెమిస్టర్ విద్యార్థిని. వీరిద్దరూ గతంలో ఒకే తరగతిలో చదువుకున్నారు. కానీ నిందితుడు ఓ సెమిస్టర్‌లో ఫెయిల్ అయ్యాడు. కాలేజీ భోజన విరామ సమయంలో ఆమెకు ఫోన్ చేసి 7వ అంతస్తులోని ఆర్కిటెక్చర్ బ్లాక్‌లో కలవాలని కోరాడు. విద్యార్థిని అక్కడికి వచ్చిన తరువాత అసభ్యంగా ప్రవర్తించాడు. అనంతరం విద్యార్థిని లిఫ్ట్‌లో వెళ్లడానికి ప్రయత్నించగా..ఆరో అంతస్తు వరకు వెంబడించి పురుషుల బాత్‌రూమ్‌లోకి ఆమెను లాక్కెళ్లి బాత్‌రూమ్ డోర్ లాక్ చేసి లైంగిక దాడి చేశాడు. ఆ సమయంలో విద్యార్థిని మొబైల్‌కు ఫోన్ రావడంతో దాన్ని లాక్కున్నాడు. అనంతరం విద్యార్థిని తన స్నేహితులకు ఈ విషయాన్ని చెప్పింది. ఈ సమయంలో నిందితుడు బాధితురాలికి ఫోన్ చేసి గర్భ నిరోధక మాత్ర కావాలా? అని అడగడంతో షాక్‌కు గురైన ఆమె మొదట ఫిర్యాదు చేయడానికి వెనుకంజ వేసింది. అనంతరం ధైర్యం చేసి తల్లిదండ్రులకు విషయాన్ని చెప్పి హనుమంతనగర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ టీవీ కెమెరాలు లేకపోవడంతో ఇతర ఆధారాలను సేకరించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## శునకంపై సామూహిక అత్యాచారం

**యశవంతపుర:** తాగిన మైకంలో వీధికుక్కపై నలుగురు అత్యాచారానికి పాల్పడిన పైశాచిక ఘటన బెంగళూరు సమీపంలోని కోడతి గ్రామంలో జరిగింది. ఈ నెల 13న రాత్రి నలుగురు వ్యక్తులు తాగిన మైకంలో వీధికుక్కపై అత్యాచారానికి పాల్పడ్డారు. మహిళ ఒకరు కుక్కను పట్టుకుని వాకింగ్ చేస్తుండగా..మరో కుక్క అరుపులు వినిపించాయి. అక్కడికి వెళ్లి చూడగా నలుగురు కుక్కపై పైశాచికంగా ప్రవర్తించటం కనిపించింది. ఈ ఘటనపై గ్రామస్తులు వర్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మోదీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

**సాక్షి, అమరావతి:** ప్రధాని మోదీ గత 11 ఏళ్లలో చేపట్టిన అన్ని ప్రజాహిత కార్యక్రమాలను ప్రజలోకి తీసుకెళ్లేందుకు పార్టీ అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులు సమర్థవంతంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పార్టీ నేతలకు సూచించారు. ఇటీవల అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులుగా నియమితులైన నేతలకు ప్రాథమిక అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం విజయవాడకు సమీపంలోని హాయ్‌లాండ్‌లో నిర్వహించారు. మంత్రి సత్యకుమార్, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి.విల్సన్, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలుకు తక్షణమే సీసీఐ కేంద్రాలు ప్రారంభించాలి

**సాక్షి, అమరావతి:** తేమశాతం సాకుతో వ్యాపారులు పత్తి రైతులను నిలువునా దోచుకుంటున్నా.. కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. పత్తి కోతలు ప్రారంభమై నెల రోజులైనా, నేటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో 11.40 లక్షల ఎకరాలలో పత్తి సాగవగా, ఓ వైపు పెట్టుబడులు పెరగడంతో పాటు అధిక వర్షాల వల్ల పత్తి దెబ్బతిని దిగుబడి గణనీయంగా తగ్గిపోయిందన్నారు. పెరిగిన పెట్టుబడి దృష్ట్యా క్వింటాకు రూ.10,500 మద్దతు ధరగా ప్రకటించాలని, తక్షణమే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## పీఎంఎఫ్‌ఎంఈ ద్వారా రూ.1.25 కోట్ల రుణం

**సాక్షి, అమరావతి:** గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన శ్రీ సాయి కృష్ణ స్వయం సహాయక సంఘం సభ్యురాలు వై.మాధురి నిర్వహిస్తున్న నెయ్యి ఉత్పత్తుల పరిశ్రమ అభివృద్ధికి ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఈ) పథకం కింద రూ.1.25 కోట్ల రుణం మంజూరైంది. ఈ విషయాన్ని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్. తేజ్ భరత్ శుక్రవారం తెలిపారు. మెప్మా ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు రుణం చెక్‌ను మాధురికి ఆయన అందజేశారు.

# ప్రమిదావనం

### ఆనంద జ్యోతులకు అందాల ప్రమిదలు
### నూతన ఆకృతులతో ఆకట్టుకునేలా రూపకల్పన
### దీపావళి పండగకు విక్రయాలు ● దుకాణాల వద్ద సందడి



ఆకాశదీపం ప్రమిదలు



ఆకట్టుకునేలా..

**సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)/బిక్కవోలు/నిడదవోలు:** దీపావళి అంటేనే వెలుగుల పండగ. కుటుంబ సభ్యుల ఆనందమంతా ఆ ఇళ్లల్లో దీపాలై వెలుగులు విరజిమ్ముతూ ఉంటాయి. అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసే దీపావళి పండగ మరో మూడు రోజుల్లో వచ్చేస్తోంది. దీపావళి అంటే బాణసంచా కాంతులు.. చెవుల తుప్పు వదిలించేలా.. గుండె గుభేల్మనేలా పేలే టపాసులే కాదు.. దీపావళి అంటే.. దీపాల వరుస. అందుకే, ఈ పండగ నాడు ప్రతి ఇంట్లోనూ మహిళలు నూనె దీపాలు వెలిగిస్తుంటారు. ఇలా దీపాలు వెలిగించి పూజిస్తే ధనాధి దేవత అయిన శ్రీమహాలక్ష్మి ఇంట్లోకి వస్తుందని భక్తులు విశ్వసిస్తారు.

దీపావళి పండగ నాడు మాత్రమే కాదు.. ఆ తరువాత వచ్చే కార్తిక మాసమంతటా కూడా ప్రతి రోజూ దీపాలు వెలిగిస్తారు. ఈ నేపథ్యంలో దీనికి అవసరమైన ప్రమిదలు ఇప్పుడు మార్కెట్లో కనువిందు చేస్తున్నాయి. బెంగళూరు, కోల్‌కతా, విజయవాడ ప్రాంతాల నుంచి వివిధ రకాల నూతన డిజైన్లతో ఉన్న ప్రమిదలను వ్యాపారులు ఆర్డర్‌పై తీసుకువచ్చి రాజమహేంద్రవరంలో విక్రయిస్తున్నారు. గతంలో మట్టి ప్రమిదలు మాత్రమే వాడేవారు. ఇప్పుడు వాటితో పాటు చూడగానే ఆకట్టుకునే ఆకృతుల్లో రకరకాల ప్రమిదలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. కొన్ని సంవత్సరాల పాటు మన్నేలా టెర్రాకోట, పింగాణీ వంటి వాటితో తయారు చేస్తున్న ప్రమిదలు లభిస్తున్నాయి. నెమలి, ఏనుగు, పల్లకి, అంబారీ, లక్ష్మీదేవి, శ్రీకృష్ణుడు, కొబ్బరి కాయ, తులసికోట, దీపపు కుందులు, మామిడి పిందెలు తదితర ఆకృతుల్లో రూపుదిద్దుకున్న ఈ ప్రమిదలను వ్యాపారులు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. తయారీకి వాడిన మెటీరియల్, ఆకృతి, సైజును బట్టి వీటిని డజను రూ.30 నుంచి రూ.350 వరకూ విక్రయిస్తున్నారు. సాధారణ ప్రమిదలైతే డజను రూ.40 వరకూ ధర పలుకుతోంది.



ముచ్చటైన మత్స్యాకృతిలో..



జైజై గణేశా..

### కొత్తగా కనిపిస్తున్నాయి



గత ఏడాదితో పోలిస్తే ఈసారి ప్రమిదలు కొత్త ఆకృతుల్లో కనిపిస్తున్నాయి. గత దీపావళికి మట్టి ప్రమిదలు తెచ్చుకున్నాం. మారుతున్న కాలానికి అనుగుణంగా ఈసారి పాత వాటితో పాటు కొత్త వెరైటీలు కూడా కొనుగోలు చేస్తున్నాం. – వైటీఎస్ ఆచార్యులు, అనపర్తి

### ఏటా వెరైటీ ప్రమిదలు వాడతాం



ప్రతి ఏడాదీ పాత వాటితో పాటు వెరైటీ ప్రమిదలను మా పిల్లలు తెస్తూ ఉంటారు. వాటిని ఇంటి ముందు వెలిగించడం ద్వారా లక్ష్మీదేవి మా ఇంటి వస్తుందని నమ్మకం. – సప్పా శాంతి, కొంకుదురు

## 1 నుండి తరగతి గదుల పరిశీలన

### విద్యాబోధన పరిశీలన కోసం టీచ్ టూల్ రిఫ్రెషర్ శిక్షణ

**సాక్షి, అమరావతి :** పాఠశాలల్లో బోధన-అభ్యాస పద్ధతుల నాణ్యతను పెంపొందించడానికి పాఠశాల విద్యాశాఖ, ప్రపంచ బ్యాంకు సహకారంతో సాల్ట్ (సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు రాష్ట్ర విద్యాశాఖ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. టీచ్ టూల్ ప్రధానాంశంగా ఈ నెల 22, 23 తేదీల్లో జిల్లా స్థాయిలో 1,391 మంది మాస్టర్ ట్రైనర్లకు, 28, 29 తేదీల్లో మండల స్థాయిలో 13,941 మంది అబ్జర్వర్లకు రిఫ్రెషర్ శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం బడ్జెట్ కూడా విడుదల చేశారు. తరగతి గది పరిశీలనలు నవంబరు 1 నుంచి ప్రారంభిస్తారు. పాఠశాలలో పరిశీలన బలోపేతం చేసేందుకు ఒక పరిశీలకుడికి గరిష్టంగా 20 మంది ఉపాధ్యాయులను మ్యాప్ చేస్తారు. పరిశీలన అనంతరం ఉపాధ్యాయుల ప్రావీణ్యత విధానాన్ని లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. తరగతి గదిలో ఆనందకరమైన సహాయక అభ్యాస వాతావరణాన్ని కల్పించడం, పాఠ్యాంశాలను సమర్థవంతంగా విద్యార్థుల మెదడులోకి చొప్పించడం, 21వ శతాబ్దపు నైపుణ్యాలను పాఠాల్లోకి చేర్చి బోధించడం తదితర అంశాలను టీచ్ టూల్ ద్వారా పరిశీలిస్తారు.

**ఆన్‌లైన్ వర్క్ తగ్గించాలి : ఏపీటీఎఫ్ అమరావతి**

ఇక విద్యా బోధన పటిష్టం కావాలంటే ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ పనుల నుండి విముక్తి కలిగించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షులు సీవీ ప్రసాద్ విద్యాశాఖను కోరారు. నిత్యం ఆన్‌లైన్ బాధలతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని.. దీంతో విద్యాబోధన కుంటుపడుతోందన్నారు.

## మార్పు కోరుకుంటే రాదు.. ప్రయత్నిస్తే వస్తుంది

### సేవా కార్యక్రమాలు చేసేందుకు జనసేన ప్రత్యేక ప్రోగ్రాం
### యువతకు పిలుపునిస్తూ పవన్ కళ్యాణ్ ట్వీట్

**సాక్షి, అమరావతి:** యువత సేవా కార్యక్రమాలలో పాల్గొనడం, పేదలకు ఆర్థిక సహాయం చేయడం వంటి కార్యక్రమాల నిర్వహణకు జనసేన పార్టీ 'సేనతో సేనాని-మన నేల కోసం కలిసి నడుద్దాం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'రాజకీయ వ్యవస్థలో నవతరం యువతను భాగస్వామ్యం చేసేందుకు, సమాజంలో మార్పు కాంక్షించే ప్రతీ ఒక్కరికీ వారి వంతు సేవలు మాతృభూమికి అందించే అవకాశం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని జనసేన పార్టీ నిర్వహించనుంది. 'మార్పు కోరుకుంటే రాదు-మార్పు కోసం ప్రయత్నిస్తే వస్తుంది. ఈ ప్రయత్నంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆకాంక్షిస్తున్నా' అని పవన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇందుకోసం క్యూఆర్ కోడ్ ఉన్న ఓ లింకును జత చేశారు. వెంటనే రిజిస్టర్ చేసుకోవాలంటూ యువతకు సూచించారు.

## రబీ సీజన్‌లో సబ్సిడీపై శనగ విత్తనాలు

### వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

**సాక్షి, అమరావతి:** రబీ సీజన్‌లో 25 శాతం సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. డిమాండ్ మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తామన్నారు.

## విజయనగరం ఉత్సవాలకు రూ.50లక్షలు

**సాక్షి, అమరావతి:** ఈనెల 5, 6 తేదీల్లో విజయనగరంలో నిర్వహించిన ఉత్సవాలకు రూ.50 లక్షలు మంజూరు చేస్తూ పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## పదోన్నతుల సమస్యకు పరిష్కారం

**సాక్షి, అమరావతి:** వివిధ సాంకేతిక కారణాలతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ అధికారుల పదోన్నతుల సమస్యకు పరిష్కారం లభించిందని ఏపీ వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షుడు కే బాలభాస్కర్, కార్యదర్శి డీ ప్రవీణ్ తెలిపారు. సచివాలయంలో శుక్రవారం సంయుక్త సంచాలకులుగా పదోన్నతులు పొందిన 20 మంది అధికారులు మంత్రి అచ్చెన్నను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## కుమారస్వామికి 'సుప్రీం'లో ఊరట

**శివాజీనగర :** లోకాయుక్త ప్రత్యేక తనిఖీ బృందం (ఎస్ఐటీ) ఏడీజీపీ చంద్రశేఖర్‌పై కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి బెదిరింపులకు పాల్పడ్డారంటూ పెట్టిన కేసును సుప్రీంకోర్టు రద్దుచేసింది. హైకోర్టు ఆదేశాలను ప్రశ్నిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన అప్పీల్‌ను సుప్రీంకోర్టు సస్పెండ్ చేయడంతో కుమారస్వామికి భారీ ఊరట లభించినట్లయింది. ప్రభుత్వ అప్పీల్‌ను సస్పెండ్ చేయాలని కుమారస్వామి సమర్పించిన పిటిషన్‌ను పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం బెదిరింపులకు పాల్పడినట్లు ఆధారాలు రుజువు కానందున పిటిషన్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు న్యాయమూర్తి తన ఆదేశాల్లో వెల్లడించారు.

## జలవనరుల శాఖలో ఏపీఎస్ఐడీసీ విలీనం

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఐడీసీ)ని జలవనరుల శాఖలో ప్రభుత్వం విలీనం చేసింది. ఎనిమిది సబ్ డివిజన్(కొవ్వూరు, రాజమహేంద్రవరం, మాచర్ల, చిలకలూరిపేట, నందిగామ, జగ్గయ్యపేట, అనంతపురం, నందికొట్కూరు)లను రద్దు చేసింది. ఆ సంస్థలో పనిచేస్తోన్న 22 మంది రెగ్యులర్, 155 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను జలవనరుల శాఖ పరిధిలోకి తెచ్చింది. వారికి వేతనాలను ఆ శాఖ పద్దు నుంచే చెల్లించనుంది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. నిధుల లభ్యత లేకపోవడంతో ఏపీఎస్ఐడీసీ ఉద్యోగులకు వేతనాల చెల్లింపు ఇబ్బందిగా మారింది. దీంతో ఏపీఎస్ఐడీసీని జలవనరుల శాఖలో విలీనం చేయాలని ఆగస్టు 20న సంస్థ ఎండీ ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదన మేరకు సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది.

## వైద్యులను బెదిరించడం భావ్యం కాదు

### ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్

**సాక్షి, అమరావతి :** ప్రభుత్వ వైద్యుల మీద చర్యలకు ఉపక్రమిస్తే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో రోగనిర్ధారణ సేవలు ఆపేస్తామని ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అమ్మాజీ, వీఎస్‌వీఆర్ కిషోర్ శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. నోటీసులిచ్చి బెదిరించడం సమంజసం కాదని, పీహెచ్‌సీ వైద్యుల పోరాటానికి తాము మద్దతుగా ఉన్నట్టు పేర్కొన్నారు. గ్రామీణ, గిరిజన వైద్యాన్ని బజారుకీడ్చి నట్టేట ముంచిందనే అపవాదు ప్రభుత్వానికి రాకుండా ఉండాలంటే తక్షణం డాక్టర్ల న్యాయబద్ధ డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

## గిరిజన శాఖకు నాలుగు అవార్డులు



అవార్డుతో ఏపీ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, డైరెక్టర్ సదా భార్గవి తదితరులు

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖకు నాలుగు జాతీయ అవార్డులు దక్కాయి. ఆది కర్మయోగి అభియాన్ నిర్వహణలో ప్రతిభ కనబరిచిన రాష్ట్రాలకు శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అవార్డులు అందించారు. ఆది కర్మయోగి అభియాన్ నిర్వహణలో ఏపీకి మొదటి స్థానం దక్కింది. ఉత్తమ జిల్లాగా అల్లూరి సీతారామరాజు జిల్లా, ఉత్తమ ఐటీడీఏగా కోట రామచంద్రపురం, ఉత్తమ స్టేట్ మాస్టర్ ట్రైనర్‌గా పార్వతీపురం ఏపీవో మురళీధర్‌కు అవార్డులు దక్కాయి. ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, డైరెక్టర్ సదా భార్గవి తదితరులు పాల్గొన్నారు.





• పండుగ వేళ

# దీపావళి వెనుక ఉన్న పురాణాలు

పిల్లలూ... మీకు ఇష్టమైన పండుగలలో దీపావళి ముందు వరుసలో ఉంటుంది కదూ. టపాసులు పేల్చడం, దీపాలు వెలిగించడం, పిండివంటలను ఆరగించడం.. ఓ భలే సరదా. అయితే అసలు దీపావళి పండుగ ఎందుకు జరుపుకుంటాం, ఈ వేడుక వెనుకున్న కథలేంటి ఇప్పుడు తెలుసుకుందాం...

**దీపావళికి సంబంధించి ఐదు ముఖ్యమైన పురాణగాథలు ఉన్నాయి.**



1

**మొదటిది:** శ్రీరాముడి అయోధ్య తిరిగి రాక. రామాయణం ప్రకారం 14 సంవత్సరాల వనవాసం అనంతరం రావణుడిని సంహరించి సీతతో కలిసి శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన రోజు ప్రజలు దీపాలు వెలిగించి ఆనందోత్సవం జరిపారు. ఈ సందర్భమే దీపావళిగా ప్రసిద్ధి చెందింది. దీని ద్వారా ధర్మం, సహనం, న్యాయం ఎప్పటికైనా విజయం సాధిస్తాయనే సత్యం మనకు అర్థం అవుతుంది.





2

**రెండవది:** పాండవుల తిరిగి రాక. మహాభారతంలో పాండవులు వనవాసం ముగించి తమ రాజ్యానికి తిరిగి వచ్చిన రోజు ప్రజలు దీపాలను వెలిగించి వారిని స్వాగతించారని పురాణాలు చెబుతున్నాయి. ఈ సంఘటన ధర్మం, నీతి, ధైర్యానికి ప్రతీకగా నిలుస్తుంది.

3

**మూడవది:** కాళీదేవి మరియు రక్తబీజుడి కథ. పశ్చిమ బెంగాల్‌లో దీపావళి సందర్భంగా కాళీపూజ జరుగుతుంది. పూర్వం రక్తబీజుడు అనే రాక్షసుడు ఉండేవాడు. అతని రక్తం నేలను తాకితే ఆ రక్తపు మడుగులోనుండి కొత్త రాక్షసులుగా పుడతారట. అతన్ని సంహరించేందుకు దుర్గాదేవి నుదుటి నుండి కాళీదేవి అవతరించి, అతని రక్తాన్ని తాగి అతన్ని నాశనం చేసింది. వినాశనకర శక్తులపై విజయాన్ని సాధించినందుకుగాను ప్రతియేటా దీపాలు వెలిగించి పండుగ చేసుకుంటారు.



4

**నాలుగవది:** లక్ష్మీదేవి అవతరణ. ఇంద్రుడి ప్రవర్తనతో విసిగిపోయిన లక్ష్మీదేవి సముద్రంలోకి వెళ్తుంది. దీంతో ప్రపంచమంతా చీకటి ఆవరిస్తుంది. దేవతలు సముద్రాన్ని మథించగా, చివరికి లక్ష్మీదేవి పద్మంపై అవతరిస్తుంది. ఆమె తిరిగి రావడం సంపద, శ్రేయస్సు, మరియు వెలుగుకు ప్రతీక. అందుకే ప్రజలు ఇప్పటికీ దీపావళినాడు తమ ఇళ్లలోకి లక్ష్మీదేవి ప్రతిమను పూజిస్తారు.





5

**ఐదవది:** శ్రీకృష్ణుడు నరకాసురుడిపై సాధించిన విజయం. దక్షిణ భారతదేశంలో ఈ కథ ప్రసిద్ధి. నరకాసురుడు ప్రజలను బాధిస్తున్నప్పుడు, కృష్ణుడు తన భార్య సత్యభామతో కలిసి యుద్ధం చేశాడు. సత్యభామ అతన్ని సంహరిస్తుంది. అయితే, నరకాసురుడు చనిపోయేముందు తన మరణాన్ని ప్రజలు ఆనందంతో జరుపుకోవాలని కోరుతాడు. అందుకే దీపావళి పండుగను రంగులతో, ఉత్సాహంతో జరుపుకుంటారు.







## ప్రపంచ దేశాల సైన్సు వార్తలు

అమెరికాలో భారీ స్థాయిలో భూకంపం వచ్చినప్పుడు ఎలా ఉంటుందో ప్రజలకు సిమ్యులేటర్ మీద కూచోబెట్టి అనుభవంలోకి తెస్తూ, జాగ్రత్తలు తెలియచేస్తూ, భూకంపాల రాకను ముందే కనిపెట్టే యాప్‌ను పరిచయం చేస్తున్నారు.

ఫ్రాన్స్‌లో సముద్రజలాల్లో ఆక్సిజన్, నైట్రేట్‌ల స్థాయిలో మార్పుపై అధ్యయనం చేసేందుకు 4000 మీటర్ల లోతుకు వెళ్లి పరిశోధన చేసే ఆర్గో ఫ్లోట్‌లను ప్రవేశింప చేస్తున్నారు.

తజకిస్తాన్‌లో సముద్ర మట్టానికి 5,800 ఎత్తున ఉన్న పామిర్ గ్లేసియర్‌కు వివిధ దేశాల శాస్త్రవేత్తలు వెళ్లి క్లయిమేట్ ఛేంజ్ వల్ల ఆ గ్లేసియర్ తుడిచి పెట్టుకోక ముందే దాని జ్ఞాపకాలను పదిలం చేసే పనిలో పడ్డారు. ఈ గ్లేసియర్ గనక కరిగిపోతే సెంట్రల్ ఆసియాకు నీటి కరువు వచ్చే ప్రమాదం ఉంది.

యు.కె.లో 'సర్ డేవిడ్ అటెన్‌బరో' పేరుతో ఉన్న పరిశోధక ఓడ అక్టోబర్ 17న అంటార్కిటికాకు బయలుదేరి ధ్రువ ప్రాంతంలో వాతావరణ మార్పులు, సముద్రపు అడుగున ఏర్పడే సునామీల అధ్యయనం, వేల్స్ సంతతిని అధ్యయనం చేయనుంది.

నైజీరియాలో మెర్సీ ఓజో అనే మహిళా వ్యవసాయ శాస్త్రవేత్త మనుషులకు, పశువులకు ఆహారంగా పనికి వచ్చే 'కసావా' (దుంప జాతి) మొక్కను అత్యంత కరువు నేల మీద కూడా సమృద్ధిగా పెంచడం గురించి దాదాపు విజయం సాధించారు. తన దేశవాసుల ఆహార భద్రత కోసం ఆమె తపిస్తున్నారు.

• మీకు తెలుసా?




## పింగాణి ఎప్పుడు తయారైంది?

పింగాణీ వస్తువులు ఎలా తయారు చేస్తారో తెలుసా? పింగాణీ అనేది ఒక సిరామిక్ పదార్థం. పింగాణీ తయారు చేయడానికి ప్రధాన పదార్థం కయోలిన్. అందులో కొంత బంకమట్టి కూడా కలుపుతారు. కయోలినైట్ ముడి పదార్థాలను బట్టీలో వేసి 1,200 నుంచి 1,400 డిగ్రీల దగ్గర వేడి చేయడం ద్వారా పింగాణీ తయారవుతుంది. పింగాణీతో చేసిన వస్తువులు బలంగా, నాణ్యంగా ఉన్న కారణంగా ప్రపంచంలో ఎక్కువమంది వీటిని వాడుతుంటారు. మట్టి పాత్రలు, రాతి పాత్రలకు ఎలా ఉపయోగించేవారో ఆ తర్వాతి కాలంలో పింగాణీ పాత్రలను అలా ఉపయోగించేవారు. బలం, తెల్లగా ఉండటం వల్ల పింగాణీని ఎక్కువమంది ఇష్టంగా వాడతారు. కేవలం ఆహార వస్తువులే కాకుండా బొమ్మలు, అలంకరణ వస్తువులు, ప్రయోగశాల సామాను వంటివాటిని సైతం పింగాణీతో తయారు చేస్తారు. పింగాణీ పుట్టింది చైనాలో. దాదాపు 2,000 నుండి 1,200 సంవత్సరాల మధ్య పింగాణీ రూపుదిద్దుకుందని చరిత్రకారులు అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత నెమ్మదిగా తూర్పు ఆసియా దేశాలకు, ఆ తరువాత యూరప్‌కు వ్యాపించింది. చైనా నుంచి వచ్చిన కారణంగా కొన్నిచోట్ల పింగాణీనికి 'చైనా' లేదా 'ఫైన్ చైనా' అని కూడా పిలుస్తారు. ప్రధానంగా ఆహార పదార్థాలను ఉంచేందుకు పింగాణీ వస్తువులు ఎక్కువగా వాడుతుంటారు. ప్రస్తుతం చైనా పింగాణీతోపాటు జపాన్, కొరియన్ దేశాల పింగాణీ సైతం ప్రాచుర్యం పొందాయి. ఇదొక పరిశ్రమగా మారి వేలాది మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి.




• కథ

## పిసినారి పాపయ్య

అనగనగా ఓ ఊళ్లో పాపయ్య అనే వ్యక్తి ఉండేవాడు. అతను పరమ పిసినారి. ఎంగిలి చేత్తో కాకిని కూడా విదిలించేవాడు కాదు. అతని భార్య ఓ కొడుకును కని మరణించింది. డబ్బు ఖర్చుపెట్టాల్సి వస్తుందని కొడుకును బడికి పంపేవాడు కాదు. అతనికి కూడా చెరిగిన బట్టలు వేసి, గంజి పోస్తూ పెంచేవాడు. దీంతో కొడుకు అమాయకుడిగా మారాడు. ఏ పనీ చేయకుండా ఊరికే ఇంట్లో పడుకునేవాడు. పాపయ్య తీరు చూసి ఊరిలో అందరూ అతణ్ని 'పిసినారి పాపయ్య' అని పిలిచేవారు.

తన దగ్గర డబ్బు ఉంటే దొంగలు ఎత్తుకువెళ్తారన్న భయంతో పాపయ్య ఓ ఉపాయం ఆలోచించాడు. తన ఇంట్లో ఓ గుంత తవ్వి, అందులో పెద్ద ఇత్తడి బిందె పాతాడు. తన దగ్గరున్న డబ్బును అందులో నింపాడు. ఆ తర్వాత గుంతను మూసేసి, పైన బండలు కప్పి, మధ్యలో ఓ చిన్న రంధ్రం చేశాడు. రోజూ తనకు వచ్చే డబ్బును రాత్రిపూట ఆ రంధ్రం ద్వారా బిందెలో పడేలా వేశాడు. అలా ఎందుకు చేస్తున్నావని కొడుకు పాపయ్యని అడిగాడు. 'ఇది మన పూర్వీకుల ఆచారం. రోజూ ఇందులో డబ్బులు వేయాలి. ఏదో ఒక రోజు వచ్చి వారు ఆ డబ్బు తీసుకెళ్తారు' అని అబద్ధం చెప్పాడు.

ఓ రోజు రాత్రి పని మీద పక్కూరు వెళ్లాడు పాపయ్య. అర్థరాత్రి ఎవరో తలుపు తట్టిన శబ్దం కావడంతో తండ్రి వచ్చాడనుకొని కొడుకు తలుపు తీశాడు. కొందరు మనుషులు ముసుగు వేసుకొని నిలబడి ఉన్నారు. వారంతా దొంగలన్న విషయం గ్రహించలేని అతను 'ఎవరు మీరు?' అని ప్రశ్నించాడు. 'ఊ.. మేము మీ తాతలం. తప్పుకో' అని వారు అతణ్ని పక్కకి తోసేశారు. వాళ్లు నిజంగానే తమ తాతముత్తాలని పాపయ్య కొడుకు అమాయకంగా అనుకున్నాడు.



'మీ డబ్బు అక్కడుంది. నేను చూపిస్తా రండి' అని వారిని తన వెంట తీసుకెళ్లి బిందె దాచిన చోటు చూపించాడు. వారు సంతోషంగా అక్కడ తవ్వి, డబ్బు నిండిన బిందె తీసుకొని వెళ్లిపోయారు. ఉదయం పాపయ్య వచ్చి కొడుకు చేసిన పని తెలుసుకొని లబోదిబోమన్నాడు. కొడుకును చితకబాది ఊరి పెద్దలకు ఫిర్యాదు చేశాడు. పిసినారి పాపయ్యకు తగిన శాస్తి జరిగిందని వారంతా అనుకున్నారు.

వాళ్లతో చెప్పి లాభం లేదని పాపయ్య ఆ దొంగల్ని వెతకడానికి బయలుదేరాడు. ఇటు ఇంట్లో అతను లేక, వంట చేసుకోవడం తెలియక అతని కొడుకు ఇబ్బంది పడ్డాడు. ఏం చేయాలో తెలియక ఊరి మీద పడి అడుక్కోవడం మొదలుపెట్టాడు. పాపయ్య పదిహేను రోజులు రకరకాల ఊళ్లు తిరిగినా దొంగల జాడ కనిపించలేదు. ఇక వాళ్లు దొరకరని అర్థమై ఇంటిబాట పట్టాడు.

పాపయ్య తన ఇంటికి చేరుకునేసరికి అర్ధరాత్రి అయ్యింది. ఎవరో తన ఇంటి అరుగు మీద పడుకొని ఉండటం గమనించాడు పాపయ్య. 'ఎవర్రా నువ్వు నా ఇంటి ముందు పడుకున్నావ్? బిచ్చగాడివా? దొంగవా?' అని గద్దించాడు. దగ్గరికి వెళ్లి చూస్తే అది తన కొడుకే అని తెలిసింది. తైలసంస్కారం లేక, అడుక్కునేవాడిలా ఉన్న తన కొడుకును చూసి పాపయ్య కడుపు తరుక్కుపోయింది. తన లోభం వల్లే కొడుక్కి అడుక్కునే గతి, తనకు ఊళ్ల మీద పడి తిరిగే గతి పట్టిందని బాధపడ్డాడు. ఇకపై పిసినారితనాన్ని వదిలేయాలని భావించాడు. ఆరోజు అతను పూర్తిగా మారిపోయాడు. ఉన్నదాంట్లో నలుగురికి సాయం చేస్తూ, కొడుక్కి విద్యాబుద్ధులు చెప్పించి, మంచి పిల్లను చూసి పెళ్లి చేసి శేషజీవితం హాయిగా గడిపాడు.

• మన పుస్తకాలు




### అక్బర్ చక్రవర్తికి నచ్చే బట్టలు కుట్టేదెలా?

రజా తండ్రి రహమత్ ఖాన్ మొఘల్ చక్రవర్తి అక్బర్‌కు రాజ దర్జీ. రజా, అతని తండ్రి కలిసి చక్రవర్తి బట్టలు అందించడానికి రాజభవనానికి వెళ్తారు. ఆ దుస్తులతో చక్రవర్తి సంతృప్తి చెందలేదని రజాకు అర్థమవుతుంది. దీంతో ఆయనకు నచ్చే దుస్తులు తయారు చేసేందుకు రజా ఏం చేశాడు? ఆ తర్వాత ఏమైంది? అది తెలియాలంటే ఈ నవల– 'రజా మీట్స్ ద కింగ్' చదవాలి. సుభద్రాసేన్ గుప్తా రాసిన ఈ పుస్తకం పిల్లల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది.

### పరిమళించే 'బాలకథాసౌరభం'




113 పేజీల ఈ పుస్తకంలో పురాణాలు, పంచతంత్రం, మహనీయుల జీవితం, తెలుగు జాతీయాలు మొదలైన అంశాలకు సంబంధించిన అనేక కథలున్నాయి. వాటికి చక్కటి బొమ్మలుండటం అదనపు ఆకర్షణ. ఇవన్నీ పిల్లల్లో మంచిని పెంచి, వారికి జీవితానికి సంబంధించిన అనేక పాఠాలు నేర్పుతాయి. తెలంగాణ సారస్వత పరిషత్తు ఈ పుస్తకాన్ని పిల్లల కోసం ప్రచురించింది.

• మహనీయులు

### ఆయన మాటా బాటా
## ఈలపాట



పిల్లలూ! ప్రస్తుతం మనందరికీ సినిమాలే అతి పెద్ద వినోదం. అయితే గతంలో నాటకాలను జనాలు విపరీతంగా చూసేవారు. నాటకంలోని నటీనటుల్ని ఎంతో అభిమానించేవారు. వారిలో కొందరు తిరుగులేని పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. వారిలో ఒకరు కళ్యాణం రఘురామయ్య. ఆయన ఈలపాట రఘురామయ్యగా ప్రసిద్ధి చెందారు. రఘురామయ్య 1901 మార్చి 5న గుంటూరు జిల్లాలోని సుద్దపల్లి గ్రామంలో జన్మించారు. ఆయన అసలు పేరు వెంకట సుబ్బయ్య. బాల్యం నుంచే ఆయన నాటకాల్లో నటించడం మొదలుపెట్టారు. చిన్నతనంలో రఘురాముడి పాత్రలో నటించినందువల్ల కాశీనాథుని నాగేశ్వరరావు ఆయన పేరును 'రఘురామయ్య' అని పెట్టారు. ఆయన స్టేజీపై నటిస్తుంటే అందరూ ముగ్ధులై చూసేవారు. ముఖ్యంగా శ్రీకృష్ణుడి పాత్రకు ఆయన ప్రసిద్ధి. నోటిలో వేలు పెట్టి ఈలతో పాట పాడటంలో రఘురామయ్య పేరు తెచ్చుకున్నారు. ఆయన ఈలపాటకు జనం ఉర్రూతలూగేవారు. దాంతో ఆయనకు 'ఈలపాట రఘురామయ్య' అనే పేరు వచ్చింది. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆయన్ను 'నైటింగేల్ ఆఫ్ ది స్టేజ్' అని ప్రశంసించారు.

1933లో 'పృథ్వీ పుత్ర' చిత్రం ద్వారా రఘురామయ్య సినిమాల్లోకి ప్రవేశించారు. తెలుగు సినిమా పరిశ్రమలో ఇది ఐదో టాకీ చిత్రం. ఆ తర్వాత అనేక చిత్రాల్లో ఆయన సుమారు 30కి పైగా సినిమాల్లో నటించారు. సుమారు 20 వేలకు పైగా నాటక ప్రదర్శనలు ఇచ్చారు. 1973లో ఆయన సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్నారు. 1975లో కేంద్రం ఆయనకు 'పద్మశ్రీ' పురస్కారం అందించింది. 1975 ఫిబ్రవరి 24న ఆయన మరణించారు.

# తోషిబా.. భారీ విస్తరణ..!

- 2027 నాటికి రూ. 3,232 కోట్ల పెట్టుబడులు
- భారత్, జపాన్‌లో రెట్టింపు ఉత్పత్తి సామర్థ్యంపై దృష్టి




న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా విద్యుత్‌కి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో భారత్, జపాన్‌లో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడంపై తోషిబా ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా 2027 ఆర్థిక సంవత్సరం నాటికి రూ. 3,232 కోట్లు (55 బిలియన్ యెన్‌లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలిపింది. దీనితో 2024 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2030 నాటికి ఉత్పత్తి సామర్థ్యం రెట్టింపవుతుందని సంస్థ వివరించింది. ప్రాథమిక అంచనాలకు మించి విద్యుత్‌కి డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్న నేపథ్యంలో జపాన్‌లోని హమాకవాసాకి కార్యకలాపాలపై, హైదరాబాద్‌లోని తోషిబా ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ (ఇండియా)పై గణనీయంగా ఇన్వెస్ట్ చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. 'గ్లోబల్‌గా విద్యుత్‌కి డిమాండ్ పెరుగుతుండటంతో సరఫరా పరికరాల (టీఅండ్‌డీ) లభ్యత మరింత కీలకంగా మారింది. ప్రస్తుత మౌలిక సదుపాయాలు పాతబడిపోతుండటం, పునరుత్పాదక విద్యుత్ పెరుగుతుండటం, కొత్త డేటా సెంటర్ల నిర్మాణం మొదలైన అంశాల దన్నుతో 2030 నాటికి జపాన్‌లో టీఅండ్‌డీ పరికరాలకు డిమాండ్ భారీగా పెరగనుంది. అలాగే, భారత్‌లో కూడా పట్టణ ప్రాంత జనాభా, పునరుత్పాదక విద్యుత్ వినియోగం వేగంగా పెరుగుతుండటంతో విద్యుత్‌కి డిమాండ్ గణనీయంగా పెరగనుంది' అని తోషిబా వైస్ ప్రెసిడెంట్ హిరోషి కనెటా తెలిపారు. ఈ నేపథ్యంలో హై–వోల్టేజ్ టీఅండ్‌డీ పరికరాల సరఫరాను పెంచే దిశగా, తాము ప్రస్తుత ప్లాంట్లను ఆధునీకరించుకుంటూ, కొత్త ప్లాంట్లను నిర్మిస్తూ, ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకుంటున్నట్లు వివరించారు.

## ఇరాక్ నజాఫ్‌కి స్పైస్‌జెట్ విమానాలు



గురుగ్రామ్: విమానయాన సంస్థ స్పైస్‌జెట్ తాజాగా ఇరాక్‌లోని నజాఫ్‌కి నాన్ స్టాప్ ఫ్లయిట్ సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది. ముంబై–నజాఫ్ రూట్‌లో అక్టోబర్ 18 నుంచి, అహ్మదాబాద్ రూట్‌లో 19 నుంచి సర్వీసులు మొదలవుతాయని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలకు కీలక ఆధ్యాత్మిక కేంద్రాల్లో నజాఫ్ కూడా ఒకటని తెలిపింది. కొత్త విమానాలను సమకూర్చుకోవడం సహా దేశ, విదేశ రూట్లలో మరిన్ని రూట్లకు విస్తరించే ప్రణాళికలు ఉన్నట్లు స్పైస్‌జెట్ వివరించింది.

## మహీంద్రా గ్రూప్, ఎంబ్రేయర్ జట్టు




న్యూఢిల్లీ: భారత్‌లో సీ–390 మిలీనియం మిలిటరీ ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ప్రవేశపెట్టే దిశగా ఎంబ్రేయర్ డిఫెన్స్ అండ్ సెక్యూరిటీతో వ్యూహాత్మక సహకార ఒప్పందం (ఎస్‌సీఏ) కుదుర్చుకున్నట్లు మహీంద్రా గ్రూప్ తెలిపింది. దేశీయంగా, ప్రాంతీయంగా వినియోగానికి సీ–390 మిలీనియంల తయారీ, అసెంబ్లింగ్ తదితర కార్యకలాపాలకు భారత్‌ను హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ఇది ఉపయోగపడనుందని పేర్కొంది. 2024లో కుదుర్చుకున్న భాగస్వామ్య ఒప్పందానికి ఇది కొనసాగింపని వివరించింది. భారత్, బ్రెజిల్ మధ్య భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కూడా ఈ డీల్ తోడ్పడుతుందని మహీంద్రా గ్రూప్ తెలిపింది.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-10-2025

| | |
|---|---|
| విశాఖ | 545-00 |
| చిత్తూరు | 573-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 550-00 |
| విజయవాడ | 560-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 530-00 |
| వరంగల్ | 532-00 |
| రిటైల్ ధర | 5.90 |

### నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| ASIANPAINT | 2,507.80 | 4.07 |
| M&M | 3,656.00 | 2.67 |
| BHARTIARTL | 2,012.90 | 2.31 |
| MAXHEALTH | 1,201.00 | 2.19 |
| HINDUNILVR | 2,603.40 | 1.64 |

### నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| WIPRO | 240.68 | -5.17 |
| INFY | 1,440.90 | -2.08 |
| ETERNAL | 342.75 | -1.47 |
| TATASTEEL | 171.5 | -1.44 |
| HCLTECH | 1,484.90 | -1.2 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 7,426 |
| ఎన్ఎస్ఈ | 1,11,763 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 2,31,680 |
| ఎఫ్ఐఐ | + 309 |
| డీఐఐ | + 1,527 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 57.37 | $ 57.46 |
| బ్రెంట్ | 61.06 | $ 61.06 |

# సోషల్ @ వి‌రీల్స్

- చాట్ నుంచి రీల్స్ వరకూ ఒకే చోట
- మ్యాప్స్, కాప్సూల్స్‌తో సరికొత్త యాప్
- ఈ–కామర్స్ సైతం దీన్లోనే అందుబాటులో...
- భారత్–అమెరికా టెక్‌ప్రెన్యూర్ల ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: సోషల్ మీడియాతో జీవితాలు ఎంతగా పెనవేసుకుపోయాయంటే... ప్రతి ఫోన్ వినియోగదారుడి స్క్రీన్ టైమ్‌లో 70–80 శాతం దీనికే సరిపోతోంది. రకరకాల యాప్‌లతో మొబైల్ ఫోన్ నిండిపోతోంది. మరి... సోషల్ లైఫ్ మొత్తం ఒకే యాప్‌తో అందుబాటులోకి వస్తే..? ఇదిగో... ఇదే ఆలోచనతో భారత్–అమెరికాలోని టెక్‌ప్రెన్యూర్లు కొందరు కలిసి 'వి–రీల్స్'ను ఆవిష్కరించారు.

రీల్స్‌ను రికార్డ్ చేయటమే కాదు. ఎడిటింగ్, పబ్లిషింగ్, షేరింగ్ చేయడానికి వీలుగా టెక్స్ట్, ఫిల్టర్లు, స్టిక్కర్లు, బ్యాగ్రవుండ్ మ్యూజిక్ అన్నీ ఉన్నాయిందులో. అంతేకాదు... స్నేహితులతో కలిసి ఫోటోలు, కాన్సెప్ట్‌లు, ఐడియాలను వ్యవస్థీకృత కలెక్షన్ల మాదిరి సేవ్ చేయటం, ప్రాజెక్టులు చేయటం కూడా చేసుకోవటం దీని ప్రత్యేకత. ఇక కమ్యూనికేషన్ కోసం ఆడియో, వీడియో కాల్స్, చాట్స్ ఎలానూ ఉన్నాయి. స్నేహితుల రియల్‌టైమ్ ఆచూకీని తెలిపే విమ్యాప్స్ దీనికి అదనపు ఆకర్షణ. బర్త్‌డేలు, యానివర్సరీలను గుర్తు చేస్తూ మనం దాచుకున్న మెమొరీలను ఆయా తేదీల్లో మన ముందుంచే విక్యాప్సూల్స్ మరో ప్రత్యేకత. యూజర్ల ప్రైవసీ, సెక్యూరిటీలకు పూర్తి హామీనిస్తూ ఈకామర్స్ యాప్స్ మాదిరి షాపింగ్ చేసుకోవటం, తమ ఉత్పత్తులను డిస్‌ప్లే చేయటం కూడా వి–రీల్స్‌లో అందుబాటులోకి వస్తోంది. ఇన్ని ప్రత్యేకతలున్న యాప్‌ను రూపొందించడానికి ఎన్నో వినూత్న ఆవిష్కరణలు చేశామని, అన్నింటికీ పేటెంట్లు ఫైల్ చేశామని ఫౌండర్లు తెలియజేశారు. ఈ యాప్‌ను గూ గుల్ ప్లే, యాపిల్ యాప్ స్టోర్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకోసం www.vreels.com వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని వారు వెల్లడించారు.

## భారీ వృద్ధిపై శ్యామ్ మెటాలిక్స్ కన్ను

- రూ.10,000 కోట్ల మూలధన వ్యయాలు
- రూ.40,000 కోట్ల ఆదాయ లక్ష్యం
- 2031 నాటికి ప్రణాళికలు




కోల్‌కతా: శ్యామ్ మెటాలిక్స్ అండ్ ఎనర్జీ లిమిటెడ్ వచ్చే ఐదేళ్ల కాలంలో కార్యకలాపాలను గణనీయంగా విస్తరించుకోవాలని చూస్తోంది. రూ.10,000 కోట్ల మూలధన వ్యయాలతో ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోనున్నట్లు, 2031 నాటికి రెండున్నర రెట్ల వృద్ధితో రూ.40,000 కోట్ల ఆదాయాన్ని సాధించే లక్ష్యంతో ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. ప్రస్తుతం 15 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉండగా, 2031 నాటికి 27 మిలియన్ టన్నులకు పెంచుకోనున్నట్లు తెలిపింది. స్పెషాలిటీ, స్టెయిన్‌లెస్ స్టీల్ ఫ్లాట్ ఉత్పత్తులు, అల్యూమినియం విభాగంలో సామర్థ్యం జోడించుకోనున్నట్లు పేర్కొంది. ప్రధానంగా రక్షణరంగం, రైల్వే, ఇంజనీరింగ్, రియల్ ఎస్టేట్ రంగాలకు సంబంధించి అధిక విలువ ఉత్పత్తుల తయారీపై దృష్టి పెట్టనున్నట్లు తెలిపింది. ప్రతిపాదిత రూ.10వేల కోట్ల మూలధన వ్యయాల్లో అధిక శాతం అంతర్గత వనరుల నుంచే సమకూర్చుకుంటామని.. మెరుగైన సాంకేతిక పరిజ్ఞానాలను అందిపుచ్చుకుని, తయారీలో ఆవిష్కరణలతో ఇంధన సామర్థ్యాలను పెంచుకుంటామని పేర్కొంది. కార్యకలాపాల విస్తరణతో నిర్వహణ సామర్థ్యాలు మెరుగుపడతాయని, మెరుగైన ఉత్పత్తుల మిశ్రమంతో ఎబిట్డా మార్జిన్లు 200–300 బేసిస్ పాయింట్లు (2–3%) మేర పెరుగుతాయని వివరించింది. వచ్చే ఐదేళ్లలో ఎగుమతుల ఆదాయాన్ని సైతం 150 మిలియన్ డాలర్ల నుంచి 300 మిలియన్ డాలర్లకు పెంచుకునే లక్ష్యంతో ఉన్నట్లు కోల్‌కతా కేంద్రంగా పనిచేసే శ్యామ్ మెటాలిక్స్ ప్రకటించింది.

## హిటాచీ ఏసీ డిజైన్‌లకు రెండు ప్రతిష్టాత్మక అవార్డులు



హైదరాబాద్: హిటాచీ గ్లోబల్ రూపొందించిన రెండు ఏసీ (ఎయిర్ కండిషనింగ్) డిజైన్ కాన్సెప్ట్‌లు అంతర్జాతీయ వేదికపై సత్తా చాటాయి. ప్రసిద్ధ 'రెడ్ డాట్ డిజైన్ కాన్సెప్ట్ అవార్డ్స్ 2025'లో రెండు ప్రతిష్టాత్మక అవార్డులు దక్కించుకున్నాయి. 'ఎయిర్ క్లోసెట్' డిజైన్‌కు అత్యున్నత 'బెస్ట్ ఆఫ్ ది బెస్ట్' అవార్డు దక్కింది. లియూ యాంగ్, రవి ఆనంద్, లూయిస్ రేయెస్ ఈ డిజైన్‌కు రూపకల్పన చేశారు. వర్టికల్ స్టోరేజ్ ఫర్నిచర్‌లో ఎయిర్ కండిషనింగ్ మాడ్యూల్‌ను అనుసంధానించడం ద్వారా గది మొత్తం సమానమైన గాలి ప్రసరిస్తుంది. 'ఎయిర్ హైవ్' కాన్సెప్ట్ 'డిజైన్ కాన్సెప్ట్' అవార్డు దక్కించుకుంది. ఆఫీసులు, వాణిజ్య భవనాల్లో గాలి నాణ్యతను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తూ లూయిస్ రేయెస్, ఇమాన్ యువాన్, రవి ఆనంద్, లియు యాంగ్‌లు ఈ డిజైన్‌కు రూపకల్పన చేశారు.

## మేఘా ఇంజినీరింగ్‌కు కువైట్ ఆయిల్ భారీ కాంట్రాక్టు

ప్రాజెక్టు విలువ 225.5 మిలియన్ డాలర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ దిగ్గజం మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాకి (ఎంఈఐఎల్) తాజాగా కువైట్ ఆయిల్ కంపెనీ (కేఓసీ) నుంచి భారీ ఆర్డరు లభించింది. ఈ ప్రాజెక్టు విలువ 225.5 మిలియన్ డాలర్లు. దీని ప్రకారం వెస్ట్ కువైట్ చమురు క్షేత్రాల్లో గ్యాస్ స్వీటెనింగ్ అండ్ సల్ఫర్ రికవరీ ఫెసిలిటీ (ఎస్‌జీఎస్ఎఫ్) డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ కార్యకలాపాలు చేపట్టాల్సి ఉంటుంది. బిల్డ్–ఓన్–ఆపరేట్ (బీఓఓ) ప్రాతిపదికన ఈ ప్రాజెక్టును రెండు దశల్లో అభివృద్ధి చేస్తారు. 790 రోజుల్లో పూర్తి చేసిన తర్వాత అయిదేళ్ల పాటు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టు సామర్థ్యం రోజుకు 120 మిలియన్ ప్రామాణిక ఘనపుటడుగులుగా (ఎంఎంఎస్‌సీఎఫ్‌డీ) ఉంటుంది. సహజ వాయువు నుంచి హైడ్రోజన్ సల్ఫైడ్, కార్బన్‌డైఆక్సైడ్‌ని తొలగించి, దాన్ని సురక్షితంగా చేసే ప్రక్రియను గ్యాస్ స్వీటెనింగ్‌గా వ్యవహరిస్తారు. శుద్ధి చేసిన గ్యాస్‌ను తదుపరి ప్రాసెసింగ్ కోసం కేఓసీ పైప్‌లైన్ ద్వారా మీనా అహ్మదీ రిఫైనరీలోని ఎల్‌పీజీ ప్లాంటుకు పంపిస్తారు. అనుబంధంగా నిర్మించే సల్ఫర్ రికవరీ యూనిట్ (ఎస్ఆర్‌యూ) సామర్థ్యం రోజుకు 10 టన్నులుగా ఉంటుంది. స్వచ్ఛ ఇంధన ఉత్పత్తి, పర్యావరణ పరిరక్షణ దిశగా కువైట్ చేస్తున్న ప్రయత్నాలకు ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. సురక్షితమైన, ప్రపంచ స్థాయి ఎనర్జీ మౌలిక సదుపాయాలను అందించడంపై తమ సంస్థకు గల నిబద్ధతకు ఈ ప్రాజెక్టు నిదర్శనమని ఎంఈఐఎల్ డైరెక్టర్ పి. దొరయ్య తెలిపారు. పశ్చిమాసియా ఆయిల్, గ్యాస్ రంగంలో ఎంఈఐఎల్ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకునేందుకు ఇది తోడ్పడనుంది. కంపెనీ ప్రస్తుతం రాజస్తాన్ రిఫైనరీ, మంగోల్ రిఫైనరీ కోసం దాదాపు ఇలాంటి ఎస్ఆర్‌యూనే రూపొందిస్తోంది. ఎంఈఐఎల్ గ్రూప్ మంగోలియా, టాంజానియా, ఇటలీ తదితర దేశాల్లో కూడా పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్మిస్తోంది.

# స్వల్పంగా పెరిగిన నిరుద్యోగిత

సెప్టెంబర్‌లో 5.2 శాతం

- ఆగస్టులో ఇది 5.1 శాతమే
- గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుదల ఎక్కువ



న్యూఢిల్లీ: సెప్టెంబర్‌లో నిరుద్యోగం (ఉపాధి లేమి) కాస్తంత ఎగిసింది. ఆగస్టులో 5.1 శాతంగా ఉంటే, సెప్టెంబర్‌లో 5.2 శాతానికి పెరిగింది. 15 ఏళ్లు, అంతకుమించి వయసులోని వారికి సంబంధించి ఉపాధి వివరాలను కేంద్ర గణాంకాలు, ప్రణాళిక అమలు శాఖ ప్రతి నెలా విడుదల చేస్తుంటుంది. ఈ ఏడాది జూలైలో నిరుద్యోగిత 5.2 శాతంగా ఉంటే, జూన్, మే నెలల్లో 5.6 శాతం, ఏప్రిల్‌లో 5.1 శాతం చొప్పున నమోదు కావడం గమనార్హం. వరుసగా రెండు నెలల పాటు తగ్గిన నిరుద్యోగ రేటు సెప్టెంబర్‌లో స్వల్పంగా పెరిగినట్టు గణాంకాలు, ప్రణాళిక అమలు శాఖ తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు ఆగస్టులో 4.3 శాతంగా ఉంటే, సెప్టెంబర్‌లో 4.6 శాతానికి ఎగిసింది. అదే పట్టణ ప్రాంతాల్లో మాత్రం 6.7 శాతం నుంచి 6.8 శాతానికి చేరింది.

**ఉపాధి గణాంకాలు..**

- పట్టణ మహిళల్లో నిరుద్యోగ రేటు ఆగస్టులో ఉన్న 8.9 శాతం నుంచి సెప్టెంబర్‌లో 9.3 శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా నిరుద్యోగిత 5.2 శాతం నుంచి 5.5 శాతానికి ఎగిసింది.
- పట్టణ పురుషుల్లో ఉపాధి లేమి 5.9 శాతం నుంచి 6 శాతానికి.. గ్రామీణ ప్రాంతాల్లో 4.5 శాతం నుంచి 4.7 శాతానికి పెరిగింది.
- పనిచేసే జనాభా నిష్పత్తి (డబ్ల్యూపీఆర్) సెప్టెంబర్ చివరికి 52.4 శాతానికి చేరింది. ఈ ఏడాది మే నెల తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా శ్రామికశక్తి పెరగడం ఇందుకు అనుకూలించింది.
- మహిళల్లో డబ్ల్యూపీఆర్ జూన్‌లో 30.2 శాతంగా ఉంటే, సెప్టెంబర్ నాటికి 32.3 శాతానికి మెరుగుపడింది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా కార్మిక శక్తి గత మూడు నెలలుగా పెరుగుతూ వస్తోంది. జూన్‌లో 33.6 శాతంగా ఉంటే, సెప్టెంబర్ చివరికి 36.3 శాతానికి చేరింది.
- 15 ఏళ్లు, అంతకుమించిన జనాభాలో కార్మికుల భాగస్వామ్య రేటు జూన్‌లో నమోదైన 54.2 శాతం నుంచి సెప్టెంబర్ చివరికి 55.3 శాతానికి చేరింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇది 56.1 శాతం నుంచి 57.4 శాతానికి మెరుగుపడగా, పట్టణాల్లో మాత్రం 50.9 శాతం వద్దే కొనసాగింది. మహిళా కార్మికుల భాగస్వామ్య రేటు (పనిచేసే వారు) జూన్‌లో ఉన్న 32 శాతం నుంచి సెప్టెంబర్ చివరికి 37.9 శాతానికి పుంజుకున్నది.

## క్యూ2 ఫలితాలు

## జేఎస్‌డబ్ల్యూ స్టీల్ దూకుడు
లాభం 1,646 కోట్లు



న్యూఢిల్లీ: మెటల్ రంగ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 4 రెట్లు దూసుకెళ్లి రూ. 1,646 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 404 కోట్లు ఆర్జించింది. ఈ కాలంలో పెట్టుబడి వ్యయాలు రూ. 3,135 కోట్లుకాగా.. పూర్తి ఏడాదికి రూ. 20,000 కోట్లు వెచ్చించనున్నట్లు అంచనా వేసింది. మొత్తం ఆదాయం రూ. 39,684 కోట్ల నుంచి రూ. 45,152 కోట్లకు ఎగసింది. అమ్మకాలు 20 శాతం ఎగసి 7.34 మిలియన్ టన్నుల(ఎంటీ)ను తాకాయి. ముడిస్టీల్ ఉత్పత్తి 17 శాతం పుంజుకుని 7.9 ఎంటీకి చేరింది. డోల్వి ప్లాంట్ గరిష్ఠ సామర్థ్యంతో పనిచేయడంతోపాటు.. జేఎస్‌డబ్ల్యూ విజయనగర్ మెటాలిక్స్, భూషణ్ పవర్ అండ్ స్టీల్ ఇందుకు సహకరించినట్లు కంపెనీ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో 2029 చివరికల్లా 1 ఎంటీపీఏ ఈఏఎఫ్ ప్రాజెక్టు ఏర్పాటుకు బోర్డు అనుమతించినట్లు పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేరు బీఎస్ఈలో 0.8% నష్టంతో రూ. 1,163 వద్ద ముగిసింది.

## జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ లాభం డౌన్
రూ. 705 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 17 శాతం క్షీణించి రూ. 705 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 853 కోట్లు ఆర్జించింది. అయితే మొత్తం ఆదాయం 59 శాతం జంప్‌చేసి రూ. 5,361 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 3,459 కోట్ల టర్నోవర్ అందుకుంది. మొత్తం వ్యయాలు సైతం 79 శాతం పెరిగి రూ. 4,408 కోట్లకు చేరాయి. ఈ కాలంలో 443 మెగావాట్ల ఆర్గానిక్ రెనెవబుల్ సామర్థ్యాన్ని జత కలుపుకుంది. దీంతో ఈ విభాగం సామర్థ్యం 13,211 మెగావాట్లకు చేరనుంది. థర్మల్ విద్యుదుత్పత్తి 62 శాతం వృద్ధితో 7.8 బిలియన్ యూనిట్లను తాకింది. ఇందుకు మహానంది ప్లాంట్, ఉత్కల్ యూనిట్–2 సహకరించాయి. రెనెవబుల్ విద్యుదుత్పత్తి 42 శాతం ఎగసి 7.1 బీయూకు చేరగా.. 3.3 గిగావాట్ల సామర్థ్యం జత కలవడం ఇందుకు దోహదపడింది.

ఫలితాల నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ షేరు బీఎస్ఈలో 1.5 % క్షీణించి రూ. 541 వద్ద ముగిసింది.

## బ్యాంక్ ఆఫ్ ఇండియా లాభం రూ.2,554 కోట్లు




ముంబై: బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ2లో (సెప్టెంబర్ క్వార్టర్) మిశ్రమ పనితీరు చూపించింది. రూ.2,554 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.2,374 కోట్లతో పోల్చి చూస్తే 7.6 శాతం వృద్ధి చెందింది. ఆదాయం రూ.19,872 కోట్ల నుంచి రూ.20,626 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం 1 శాతానికి పైగా తగ్గి రూ.5,914 కోట్లకు పరిమితమైంది. మొత్తం రుణాల్లో స్థూల మొండి బకాయిలు (జీఎన్‌పీఏ) గణనీయంగా తగ్గాయి. 4.41 శాతం నుంచి 2.54 శాతానికి దిగొచ్చాయి. జూన్ త్రైమాసికం చివరికి ఇవి 2.92 శాతంగా ఉన్నాయి. నికర ఎన్‌పీఏలు 0.65 శాతానికి తగ్గాయి. మొండి బకాయిల కోసం రూ.472 కోట్లను కేటాయించింది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో కేటాయింపులు రూ.1,427 కోట్లతో పోల్చి చూస్తే గణనీయంగా తగ్గాయి. రుణాలు 14 శాతం పెరిగి రూ.7.09 లక్షల కోట్లకు చేరాయి. బ్యాంక్ కాసా రేషియో (కరెంటు, సేవింగ్స్ డిపాజిట్లు) 41.18 శాతానికి పుంజుకుంది.

బీఎస్ఈలో బ్యాంక్ ఆఫ్ ఇండియా షేరు ధర 2% వరకు నష్టపోయి రూ.123 వద్ద క్లోజయింది.

## యూకో బ్యాంక్ పటిష్టం
10% పెరిగిన వడ్డీ ఆదాయం




న్యూఢిల్లీ: యూకో బ్యాంక్ సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికి రూ.620 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.603 కోట్లతో పోల్చి చూస్తే 3 శాతం పెరిగింది. నికర వడ్డీ ఆదాయం 10 శాతం వృద్ధితో రూ.2,533 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది రూ.2,301 కోట్లుగా ఉంది. నికర వడ్డీ మార్జిన్ దేశీ వ్యాపారంపై 3.08 శాతంగా, అంతర్జాతీయంగా 2.90 శాతంగా ఉన్నట్టు యూకో బ్యాంక్ ప్రకటించింది. ఆస్తుల నాణ్యత కాస్త మెరుగుపడింది. మొత్తం రుణాల్లో స్థూల మొండి బాకీలు (జీఎన్‌పీఏ) 3.18 శాతం నుంచి 2.56 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.73 శాతం నుంచి 0.43 శాతానికి దిగొచ్చాయి. ప్రొవిజన్ కవరేజీ రేషియో (మొత్తం ఎన్‌పీఏలకు చేసిన కేటాయింపులు) 96.99 శాతానికి చేరింది. బ్యాంక్ మొత్తం వ్యాపారం 13.23 శాతం పెరిగి రూ.5,36,398 కోట్లకు చేరింది.

బీఎస్ఈలో షేరు ధర 2 శాతం నష్టంతో రూ.31 వద్ద ముగిసింది.

## కరూర్ వైశ్యా బ్యాంక్ అదుర్స్
21 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: కరూర్ వైశ్యా బ్యాంక్ సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో పనితీరు పరంగా రాణించింది. లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 21 శాతం పెరిగి రూ.574 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ ఆదాయం19 శాతం పెరిగి రూ.1,261 కోట్లుగా ఉంది. మొత్తం వ్యాపారం రూ.2,00,000 కోట్ల మార్క్‌ను దాటింది. 15.4 శాతం వృద్ధి చెందింది. మొత్తం రుణాల విలువ 15 శాతం పెరిగి రూ.92,974 కోట్లకు చేరింది. రిటైల్, వ్యవసాయ, ఎంఎస్ఎంఈ (ఆర్ఏఎం) విభాగంలో రుణాలు 19 శాతం పెరిగాయి. డిపాజిట్లు సైతం 15 శాతం వృద్ధితో రూ.1,10,492 కోట్లకు చేరాయి. స్థూల మొండి రుణాలు 1.10 శాతం నుంచి 0.76 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.28 శాతం నుంచి 0.19 శాతానికి తగ్గుముఖం పట్టాయి.

బీఎస్ఈలో కరూర్ వైశ్యా బ్యాంక్ షేరు ధర అర శాతం పెరిగి రూ.227 వద్ద స్థిరపడింది.

## లాభాల్లోకి ఇండియా సిమెంట్స్
రూ.9 కోట్లు



న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ ఇండియా సిమెంట్స్ సెప్టెంబర్ త్రైమాసికంలో మెరుగైన పనితీరు సాధించింది. కన్సాలిడేటెడ్‌గా (అనుబంధ కంపెనీలు సహా) రూ.9 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో సంస్థ రూ.339 కోట్లు నష్టపోవడం గమనార్హం. ఆదాయం సైతం 9 శాతానికి పైగా పెరిగి రూ.1,117 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.1,022 కోట్లుగా ఉంది. వ్యయాలు సైతం 13 శాతానికి పైగా ఎగసి రూ.1,136 కోట్లకు చేరాయి. రూ.2,014 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. ఇందులో రూ.1,574 కోట్లను ఆధునికీకరణకు వినియోగించనుంది. రూ.440 కోట్లతో రూ.2.80 మిలియన్ టన్నుల సామర్థ్యంతో కూడిన ప్లాంట్‌ను ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం కంపెనీ సామర్థ్యం 14.75 మిలియన్ టన్నులుగా ఉంది. క్యూ2లో దేశీ విక్రయాలు 12 శాతం పెరిగి 2.44 మిలియన్ టన్నులకు చేరాయి. మొత్తం ఉత్పత్తి సామర్థ్యంలో వినియోగం 65 శాతంగా ఉంది. సిమెంట్ రంగంలో అగ్రగామి అయిన అల్ట్రాటెక్ గతేడాది డిసెంబర్‌లో ఇండియా సిమెంట్స్‌లో మెజారిటీ వాటాలను కొనుగోలు చేయడం తెలిసిందే.

బీఎస్ఈలో ఇండియా సిమెంట్స్ షేరు ధర అర శాతం నష్టపోయి రూ.392 వద్ద ముగిసింది.


## సియట్ లాభం హైజంప్
క్యూ2లో 186 కోట్లు



న్యూఢిల్లీ: టైర్ల తయారీ దిగ్గజం సియట్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 54 శాతం జంప్‌చేసి రూ. 186 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 121 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 3,304 కోట్ల నుంచి రూ. 3,773 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో సియట్ షేరు బీఎస్ఈలో 1 శాతం బలపడి రూ. 3,733 వద్ద ముగిసింది.

## హిందుస్తాన్ జింక్ లాభం ప్లస్
2,649 కోట్లు




న్యూఢిల్లీ: వేదాంతా గ్రూప్ దిగ్గజం హిందుస్తాన్ జింక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 14 శాతం ఎగసి రూ. 2,649 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 2,327 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 8,522 కోట్ల నుంచి రూ. 8,787 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో హింద్ జింక్ షేరు బీఎస్ఈలో 1.3% బలహీనపడి రూ. 500 వద్ద ముగిసింది.



## బీసీసీఐ ఎపెక్స్ కౌన్సిల్ సభ్యుడిగా చాముండేశ్వరనాథ్

సాక్షి, హైదరాబాద్: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఎపెక్స్ కౌన్సిల్ సభ్యుడిగా ఆంధ్ర మాజీ క్రికెటర్ వి.చాముండేశ్వరనాథ్ ఎన్నికయ్యారు. ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసీఏ) పురుషుల క్రికెటర్ల ప్రతినిధిగా ఆయన కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. బుధ, గురువారాల్లో జరిగిన ఐసీఏ ఎన్నికల్లో అపెక్స్ కౌన్సిల్ పదవి కోసం ఎన్నిక జరిగింది. ఇందులో చాముండి 755-83 ఓట్ల తేడాతో రాజేశ్ జడేజాపై గెలుపొందారు. ఇప్పటి వరకు చాముండి ఐసీఏ ప్రతినిధిగా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లో ఉన్నారు. దిలీప్ వెంగ్‌సర్కార్ స్థానంలో ఎపెక్స్ కౌన్సిల్‌లోకి వచ్చిన ఆయన మూడేళ్ల పాటు పదవిలో ఉంటారు. ఐసీఏ ఎన్నికల్లో భారత మాజీ కెప్టెన్ శాంత రంగస్వామి అధ్యక్షురాలిగా, వి.సుందరమ్ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఎపెక్స్ కౌన్సిల్ మహిళా క్రికెటర్ల ప్రతినిధిగా సుధా షా ఎంపిక కాగా...ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్‌లో శుభాంగి కులకర్ణికి అవకాశం దక్కింది.

సాక్షి ప్లస్
శనివారం। 18-10-2025

# విదర్భ విజయఢంకా

- నాగాలాండ్‌పై ఇన్నింగ్స్ 179 పరుగుల తేడాతో ఘనవిజయం
- రంజీ ట్రోఫీలో శుభారంభం చేసిన డిఫెండింగ్ చాంపియన్



హర్ష్ దూబే

బెంగళూరు: దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీలో... డిఫెండింగ్ చాంపియన్ విదర్భ శుభారంభం చేసింది. గత సీజన్‌లో చక్కటి ఆటతీరుతో ట్రోఫీ చేజిక్కించుకున్న విదర్భ... తాజా సీజన్ ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా ఆడిన తొలి పోరులో భారీ విజయం నమోదు చేసుకుంది. మూడు రోజుల్లోనే ముగిసిన పోరులో ఇరానీ కప్ విజేత విదర్భ జట్టు... ఇన్నింగ్స్ 179 పరుగుల తేడాతో నాగాలాండ్‌ను చిత్తు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 81/3తో శుక్రవారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన నాగాలాండ్ జట్టు 69.3 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌటైంది. డేగ నిశ్చల్ (146 బంతుల్లో 50; 3 ఫోర్లు), చేతన్ బిస్త్ (91 బంతుల్లో 52; 5 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీలు చేశారు. విదర్భ బౌలర్లలో నచికేత్ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఫాలోఆన్ ఆడిన నాగాలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 46.3 ఓవర్లలో 113 పరుగులకే ఆలౌటైంది. చేతన్ బిస్త్ (88 బంతుల్లో 55; 8 ఫోర్లు) మరో హాఫ్‌సెంచరీ చేయగా మిగతా వారు విఫలమయ్యారు. విదర్భ బౌలర్లలో ఎడం చేతి వాటం స్పిన్నర్ హర్ష్ దూబే 4 వికెట్లు పడగొట్టగా... పార్థ్ రేఖడే, దర్శన్ నల్కండే చెరో 2 వికెట్లు తీశారు. అంతకు ముందు విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 463 పరుగులు చేసింది. భారీ సెంచరీతో చెలరేగిన అమన్ మోఖడేకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు దక్కింది.

### ఫాలోఆన్‌లో తమిళనాడు

బ్యాటర్లు ముకుమ్మడిగా విఫలమవడంతో... జార్ఖండ్‌తో రంజీ మ్యాచ్‌లో తమిళనాడు జట్టు ఫాలోఆన్‌లో పడింది. ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా కోయంబత్తూర్ వేదికగా జరుగుతున్న పోరులో ఓవర్‌నైట్ స్కోరు 18/5తో శుక్రవారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన తమిళనాడు చివరకు 50.4 ఓవర్లలో 93 పరుగులకే ఆలౌటైంది. అంబరీష్ (28; 5 ఫోర్లు) టాప్‌స్కోరర్ కాగా... మరో ఇద్దరు ప్లేయర్లు మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. జార్ఖండ్ బౌలర్లలో జతిన్ పాండే 5 వికెట్లతో అదరగొట్టగా... సాహిల్ రాజ్ 4 వికెట్లు తీశాడు. అనంతరం ఫాలోఆన్ బరిలోకి దిగిన తమిళనాడు శుక్రవారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 27 ఓవర్లలో 3 వికెట్లకు 52 పరుగులు చేసింది. కెప్టెన్ జగదీశన్ (21), అంబరీష్ (15), ప్రదోశ్ (8) అవుటయ్యారు. చేతిలో 7 వికెట్లు ఉన్న తమిళనాడు జట్టు ఇన్నింగ్స్ పరాజయాన్ని తప్పించుకోవాలంటే ఇంకా 274 పరుగులు చేయాల్సి ఉంది. ఆండ్రె సిద్ధార్థ్ (3 బ్యాటింగ్), జగన్నాథన్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. జార్ఖండ్ బౌలర్లలో రిషవ్ రాజ్ 2 వికెట్లు తీశాడు.

### రైల్వేస్‌పై హరియాణా విజయం

ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న హరియాణా జట్టు రంజీ ట్రోఫీ తాజా సీజన్‌లో తొలి విజయం ఖాతాలో వేసుకుంది. ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా సూరత్ వేదికగా శుక్రవారం ముగిసిన పోరులో హరియాణా 96 పరుగుల తేడాతో రైల్వేస్ జట్టును మట్టికరిపించింది. 249 పరుగుల లక్ష్యఛేదనలో రైల్వేస్ జట్టు చివరకు 49.4 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు సూరజ్ అహుజా (61 బంతుల్లో 44; 7 ఫోర్లు), వివేక్ సింగ్ (64 బంతుల్లో 44; 6 ఫోర్లు) తొలి వికెట్‌కు 90 పరుగులు జోడించి శుభారంభం ఇచ్చినా... ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు నిలవలేకపోవడంతో రైల్వేస్‌కు పరాజయం తప్పలేదు. హర్యానా బౌలర్లలో నిఖిల్ కశ్యప్ 5, నిశాంత్ సింధు 4 వికెట్లు పడగొట్టారు. అంతకముందు హరియాణా తొలి ఇన్నింగ్స్‌లో 171 పరుగులు చేయగా... రైల్వేస్ 128 పరుగులకు పరిమితమైంది. అనంతరం హరియాణా రెండో ఇన్నింగ్స్‌లో 205 పరుగులు చేసి ప్రత్యర్థి ముందు ఉరించే లక్ష్యాన్నిం ఉచింది. హరియాణా బ్యాటర్ పార్థ్ వత్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'అవార్డు దక్కింది.

### ఓటమి అంచున త్రిపుర...

ఆంధ్ర ఆటగాడు హనుమ విహారితో పాటు తమిళనాడు ప్లేయర్ విజయ్ శంకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న త్రిపుర జట్టు ఇన్నింగ్స్ పరాజయం అంచున నిలిచింది. గ్రూప్ 'సి'లో భాగంగా సర్వీసెస్‌తో జరుగుతున్న మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 176 పరుగులకే ఆలౌటైన త్రిపుర శుక్రవారం ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 42 ఓవర్లలో 7 వికెట్లకు 114 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో విహారి (16) విఫలం కాగా... విజయ్ శంకర్ (132 బంతుల్లో 62; 7 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీ సాధించాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో హనుమ విహారి 7 పరుగులే చేయగా... విజయ్ శంకర్ 8 పరుగుల వద్ద అవుటయ్యాడు. చేతిలో 3 వికెట్లు ఉన్న త్రిపుర జట్టు ఇన్నింగ్స్ పరాజయం తప్పించుకోవాలంటే ఇంకా 69 పరుగులు చేయాల్సి ఉంది.

### రజత్ డబుల్ సెంచరీ

రజత్ పాటీదార్ (332 బంతుల్లో 205 బ్యాటింగ్; 26 ఫోర్లు) అజేయ ద్విశతకంతో చెలరేగడంతో... మధ్యప్రదేశ్ జట్టు భారీ స్కోరు సాధించింది. ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా ఇండోర్ వేదికగా పంజాబ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి మధ్యప్రదేశ్ జట్టు 146 ఓవర్లలో 8 వికెట్లకు 519 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 305/6తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్... వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో మరో మూడు వికెట్లు కోల్పోయి 200 పైచిలుకు పరుగులు జత చేసింది. క్రితం రోజే సెంచరీ పూర్తి చేసుకున్న పాటీదార్... డబుల్ సెంచరీ ఖాతాలో వేసుకోగా... అర్షద్ ఖాన్ (60 బంతుల్లో 60; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. సారాంశ్ జైన్ (30), సాగర్ సోలంకి (26) ఫర్వాలేదనిపించారు. పంజాబ్ బౌలర్లలో ప్రేరిత్ దత్తా 4 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు పంజాబ్ 232 పరుగులకే ఆలౌటైంది. చేతిలో మరో రెండు వికెట్లు ఉన్న మధ్యప్రదేశ్ జట్టు ప్రస్తుతం 287 పరుగుల ఆధిక్యంలో ఉంది. రజత్ పాటీదార్‌తో పాటు అర్షద్ ఖాన్ క్రీజులో ఉన్నారు. నేడు ఆటకు చివరి రోజు.



రజత్ పాటీదార్


### జమ్మూకశ్మీర్ లక్ష్యం 243

బ్యాటర్లు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోవడంతో... ముంబై జట్టు రెండో ఇన్నింగ్స్‌లో స్వల్ప స్కోరుకే పరిమితమైంది. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'డి'లో భాగంగా శ్రీనగర్ వేదికగా జమ్మూకశ్మీర్‌తో జరుగుతున్న పోరులో ముంబై రెండో ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు ఆలౌటైంది. టీమిండియా ప్లేయర్ అజింక్యా రహానే (0), ముషీర్ ఖాన్ (8), ఆయుశ్ మాత్రే (13), సిద్దేశ్ లాడ్ (10), శార్దుల్ ఠాకూర్ (9), తనుశ్ కొటియాన్ (10) విఫలం కాగా... సర్ఫరాజ్ ఖాన్ (32), షమ్స్ ములానీ (41), ఆకాశ్ ఆనంద్ (31) ఫర్వాలేదనిపించారు. జమ్మూకశ్మీర్ బౌలర్లలో అఖీబ్ నబీ 5 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ముంబై తొలి ఇన్నింగ్స్‌లో 386 పరుగులు చేయగా... జమ్మూకశ్మీర్ జట్టు 325 పరుగులు చేసింది. దీంతో కశ్మీర్ ముందు 243 పరుగుల లక్ష్యం నిలవగా... శుక్రవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 7 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 21 పరుగులు చేసింది. చేతిలో 9 వికెట్లు ఉన్న జమ్మూకశ్మీర్ జట్టు విజయానికి ఇంకా 222 పరుగులు చేయాల్సి ఉంది.

➡ కేరళతో జరుగుతున్న మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు స్వల్ప తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకుంది. మహారాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 239 పరుగులకు ఆలౌట్ కాగా... కేరళ జట్టు 219 పరుగులకే పరిమితమైంది. మూడో రోజు ఆట ముగిసే సరికి మహారాష్ట్ర 9 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 51 పరుగులు చేసింది.

➡ రంజీ ట్రోఫీ గ్రూప్ 'ఎ'లో బాగంగా ఒడిశాతో మ్యాచ్‌లో బరోడా జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కించుకుంది. ఒడిశా తొలి ఇన్నింగ్స్‌లో 271 పరుగులకు పరిమితం కాగా... మూడో రోజు ఆట ముగిసే సమయానికి బరోడా తొలి ఇన్నింగ్స్‌లో 146 ఓవర్లలో 7 వికెట్లకు 413 పరుగులు చేసింది. శివాలిక్ శర్మ (124; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), మితేశ్ పటేల్ (100 బ్యాటింగ్; 11 ఫోర్లు) సెంచరీలు బాదారు.

## యూపీ 294/6



కాన్పూర్: ఉత్తరప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంపై గురి పెట్టింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి యూపీ తమ తొలి ఇన్నింగ్స్‌లో 111 ఓవర్లలో 6 వికెట్లకు 294 పరుగులు చేసింది. భారత ఆటగాడు రింకూ సింగ్ (129 బంతుల్లో 82 బ్యాటింగ్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా...ఆర్యన్ జుయాల్ (162 బంతుల్లో 66; 7 ఫోర్లు, 1 సిక్స్), మాధవ్ కౌశిక్ (189 బంతుల్లో 54; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. ప్రస్తుతం యూపీ మరో 176 పరుగులు వెనుకబడి ఉంది. అయితే రింకూతో పాటు ఐపీఎల్‌తో గుర్తింపు తెచ్చుకున్న విప్‌రాజ్ నిగమ్ (28 బ్యాటింగ్) ఇంకా క్రీజ్‌లో ఉండటంతో యూపీ ఆశలు పెట్టుకుంది. ఆంధ్ర బౌలర్లలో పృథ్వీ రాజ్, రికీ భుయ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. శుక్రవారం ఆడిన 82 ఓవర్లలో యూపీ 221 పరుగులే చేయగలిగింది.

## కాలికట్ హీరోస్ గెలుపు బోణీ

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్ కాలికట్ హీరోస్ జట్టు తొలి విజయాన్ని అందుకుంది. వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో ఓడిన కాలికట్ హీరోస్... శుక్రవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన తమ ఆరో మ్యాచ్‌లో 15-10, 15-11, 15-12తో కోల్‌కతా థండర్‌బోల్ట్స్ జట్టును ఓడించింది. మరో మ్యాచ్‌లో చెన్నై బ్లిట్జ్ 15-10, 15-10, 15-10తో ఢిల్లీ తుఫాన్స్ జట్టుపై గెలిచింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో అహ్మదాబాద్ డిఫెండర్స్‌తో ముంబై మెటియోర్స్; బెంగళూరు టొర్పెడస్‌తో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ తలపడతాయి.

## గ్రీన్ స్థానంలో లబుషేన్

భారత్‌తో వన్డే సిరీస్‌కు ఆసీస్ జట్టులో మార్పు



పెర్త్: భారత్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌లో తలపడేందుకు సిద్ధమవుతున్న ఆస్ట్రేలియా మరో కీలక ఆటగాడిని కోల్పోయింది. పక్కటెముకల నొప్పితో ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ ఈ సిరీస్ నుంచి తప్పుకున్నాడు. అతని స్థానంలో టాపార్డర్ బ్యాటర్ మార్నస్ లబుషేన్‌ను ఆస్ట్రేలియా సెలక్టర్లు ఎంపిక చేశారు. ఆసీస్ రెగ్యులర్ వన్డే జట్టు సభ్యులైన కెప్టెన్ ప్యాట్ కమిన్స్, స్పిన్నర్ ఆడమ్ జంపా, వికెట్ కీపర్లు అలెక్స్ కేరీ, జోష్ ఇన్‌గ్లిస్ ఇప్పటికే వేర్వేరు కారణాలతో సిరీస్‌కు దూరమయ్యాడు. ఈ జాబితాలో ఇప్పుడు గ్రీన్ కూడా చేరాడు. ఆస్ట్రేలియా ఆడిన చివరి వన్డేలో (దక్షిణాఫ్రికాతో) 55 బంతుల్లో 118 పరుగులు చేసిన గ్రీన్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. మరోవైపు తాను ఆడిన గత 10 వన్డేల్లో ఒక్క అర్ధ సెంచరీ కూడా నమోదు చేయకపోవడంతో భారత్‌తో సిరీస్ కోసం ముందుగా ప్రకటించిన జట్టులో లబుషేన్‌పై వేటు పడింది. అయితే ఆసీస్ దేశవాళీ మ్యాచ్‌లలో పరుగుల వరద పారిస్తుండటంతో ఇప్పుడు మరోసారి అవకాశం దక్కింది.

## క్వార్టర్ ఫైనల్లో అనాహత్ సింగ్



న్యూఢిల్లీ: బోస్టన్ ఓపెన్ ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) చాలెంజర్ టోర్నీలో భారత నంబర్‌వన్ అనాహత్ సింగ్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. అమెరికాలో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రపంచ 45వ ర్యాంకర్, రెండో సీడ్ అనాహత్ 11-4, 11-6, 9-11, 11-8తో ప్రపంచ 146వ ర్యాంకర్ చార్లోటి సెజి (అమెరికా)పై గెలుపొందింది. తొలి రౌండ్‌లో 'బై' పొందిన అనాహత్ నేడు జరిగే క్వార్టర్ ఫైనల్లో ఎనిమిదో సీడ్ జానా స్వయిఫి (ఈజిప్ట్)తో తలపడుతుంది.

# 'ప్రతీ మ్యాచ్ పరీక్ష కాదు'

కోహ్లి, రోహిత్‌లపై అగార్కర్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: భారత్, ఆస్ట్రేలియా మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు సంబంధించి ఫలితంకంటే విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ భవిష్యత్తుపైనే ప్రధానంగా చర్చ జరుగుతోంది. ఒక్కో సిరీస్‌లో వీరి ప్రదర్శనను బట్టి 2027 వన్డే వరల్డ్ కప్ వరకు కొనసాగించడంపై సెలక్టర్లు నిర్ణయం తీసుకుంటారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ మరోసారి వివరణ ఇచ్చాడు. వారిద్దరు వన్డే వరల్డ్ కప్ ఆడతారా లేదా అని ఇప్పుడే చెప్పలేమని, అయితే ప్రతీ మ్యాచ్‌లో వారి ఆటను అదే కోణంలో చూడలేమని అతను స్పష్టం చేశాడు. 'కోహ్లి, రోహిత్‌లకు ప్రతీ మ్యాచ్ ఎంపిక పరీక్షలాంటిది కాదు. అలా ఆలోచించడం కూడా హాస్యాస్పదం. ఒకసారి ఆడటం మొదలు పెట్టాక దానిపై సహజంగానే చర్చిస్తాం. అంతే గానీ వారిద్దరు తమను తాము నిరూపించుకునేందుకు ఈ సిరీస్‌లో ఆడటం లేదు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో విఫలం కాగానే తప్పిస్తామని లేదా మూడు సెంచరీలు చేస్తే 2027 వరల్డ్ కప్‌కు ఎంపిక చేస్తామని దానర్థం కాదు' అని అగార్కర్ వ్యాఖ్యానించాడు. ఈ ఇద్దరు బ్యాటర్లు తమ ఇష్టప్రకారమే టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారని... తమకు ఇంగ్లండ్ లాంటి చోట అనుభవజ్ఞులైన ఆటగాళ్ల అవసరం ఉన్నా సరే, వారి నిర్ణయాన్ని గౌరవంచక తప్ప లేదని చీఫ్ సెలక్టర్ వెల్లడించాడు.



### షమీ... నా ముందు ఉండాల్సింది...

మరోవైపు తాను ఫిట్‌గా ఉన్నా ఆసీస్‌తో సిరీస్‌కు ఎంపిక చేయకపోవడం మొహమ్మద్ షమీ అసహనం వ్యక్తం చేయడంపై కూడా అగార్కర్ స్పందించాడు. 'షమీ నా ముందు ఉండి ఉంటే సమాధానం ఇచ్చేవాడిని. అతను నిజంగా ఫిట్‌గా ఉంటే అలాంటి బౌలర్‌ను ఎవరైనా కాదనుకుంటారా. గత ఆరు నుంచి ఎనిమిది నెలల వ్యవధిలో నేను అతనితో చాలాసార్లు మాట్లాడాను. ఫిట్‌గా లేకపోవడం వల్లే ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ఎంపిక చేయలేకపోయాం' అని భారత మాజీ పేసర్ స్పష్టం చేశాడు. తాము ఆడిన రోజుల్లో సెలక్టర్లకు ఏనాడూ ఫోన్ చేయలేదని, ఇప్పుడు కాలం మారిందన్న అగార్కర్... జట్టుకు ఎంపిక కాని యువ ఆటగాళ్లు తనకు వెంటనే ఫోన్ చేస్తారని, వారికి వంద శాతం నిజాయితీగా తాను సమాధానం ఇస్తానని చెప్పాడు.

# దక్షిణాఫ్రికా 'ఎ' జట్టులో బవుమా




జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా రెగ్యులర్ టెస్టు కెప్టెన్ తెంబా బవుమా... టీమిండియా పర్యటన కోసం కసరత్తులు చేస్తున్నాడు. గాయం కారణంగా పాకిస్తాన్‌తో సిరీస్‌కు దూరమైన బవుమా... ఈ నెలాఖరులో దక్షిణాఫ్రికా 'ఎ' జట్టుతో పాటు భారత్‌కు రానున్నాడు. వచ్చే నెలలో దక్షిణాఫ్రికా జట్టు భారత్‌లో పర్యటించనుంది. టూర్‌లో భాగంగా సఫారీ జట్టు టీమిండియాతో 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టి20లు ఆడనుంది. నవంబర్ 14న ప్రారంభం కానున్న ఈ పర్యటన... డిసెంబర్ 19తో ముగియనుంది. దానికి ముందు ఇక్కడి పరిస్థితులపై అంచనా కోసం దక్షిణాఫ్రికా 'ఎ' జట్టు... భారత 'ఎ' జట్టుతో రెండు అనధికారిక టెస్టులు ఆడనుంది. ఈ నెల 30న బెంగళూరు వేదికగా తొలి మ్యాచ్ ప్రారంభం కానుండగా... నవంబర్ 6 నుంచి రెండో మ్యాచ్ జరుగుతుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో బవుమా... దక్షిణాఫ్రికా 'ఎ' జట్టు తరఫున బరిలోకి దిగనున్నాడు. దీంతో ఇక్కడి పరిస్థితులపై అవగహనకు రావొచ్చని దక్షిణాఫ్రికా జట్టు యాజమాన్యం భావిస్తోంది. అకెర్‌మన్ సారథ్యంలోని దక్షిణాఫ్రికా 'ఎ' జట్టులో బవుమాతో పాటు జుబేర్ హంజా, ప్రెనెలన్ సుబ్రాయన్ కూడా ఉన్నారు.

# దబంగ్ ఢిల్లీ మరో విజయం



ఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో దబంగ్ ఢిల్లీ జట్టు ఖాతాలో మరో విజయం చేరింది. ఇప్పటికే ప్లే ఆఫ్స్‌కు చేరుకున్న ఢిల్లీ జట్టు శుక్రవారం జరిగిన పోరులో 37-31 పాయింట్ల తేడాతో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది. ఢిల్లీ తరఫున అక్షిత్ ధుల్ 12 పాయింట్లతో సత్తా చాటగా... నవీన్ 6, ఫజల్ 5 పాయింట్లు సాధించారు. తలైవాస్ తరఫున అర్జున్ దేశ్వాల్ 11 పాయింట్లతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. తాజా సీజన్‌లో ఢిల్లీ 16 మ్యాచ్‌లు ఆడి 13 విజయాలు, 3 పరాజయాలతో 26 పాయింట్లు ఖాతాలో వేసుకొని రెండో స్థానంలో ఉంది. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 42-29 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్‌ను చిత్తుచేసింది. జైపూర్ తరఫున అలీ సమది 13 పాయింట్లు, నితిన్ 11 పాయింట్లతో రాణించగా... యోధాస్ తరఫున సురేందర్ 12 పాయింట్లతో పోరాడాడు. గ్రూప్ అడుగున ఉన్న జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 51-49తో బెంగాల్ వారియర్స్‌పై నెగ్గింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో బెంగళూరు బుల్స్‌తో దబంగ్ ఢిల్లీ, తెలుగు టైటాన్స్‌తో పుణేరి పల్టన్, బెంగాల్ వారియర్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్ ఆడతాయి.

# 'గిల్ నాయకుడిగా ఎదుగుతాడు'

కెప్టెన్‌కు అక్షర్ పటేల్ మద్దతు




పెర్త్: స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ సమక్షంలో శుబ్‌మన్ గిల్ వన్డే కెప్టెన్‌గా రాటుదేలుతాడని భారత ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ అభిప్రాయపడ్డాడు. ఇద్దరు సీనియర్ బ్యాటర్లు తమ అనుభవంతో గిల్‌కు సరైన మార్గనిర్దేశనం చేయగలరని అతను అన్నాడు. 'గిల్‌కు కెప్టెన్‌గా ఇది సరైన సమయం. కెప్టెన్లుగా పని చేసిన రోహిత్, కోహ్లి జట్టుతో ఉన్నారు. వారు అతనికి తమ వైపునుంచి సహాయ పడగలరు. ఇది గిల్ నాయకుడిగా ఎదగడంలో ఉపయోగపడుతుంది. ఇప్పటి వరకు తాను కెప్టెన్‌గా వ్యవహరించిన మ్యాచ్‌లలో ఎప్పుడూ ఒత్తిడికి లోను కాకపోవడం గిల్‌కు సంబంధించి అతి పెద్ద సానుకూలత' అని అక్షర్ వ్యాఖ్యానించాడు. కోహ్లి, రోహిత్‌ల ఆట గురించి తాను ప్రత్యేకంగా చెప్పన వసరం లేదని అక్షర్ గుర్తు చేశాడు. 'కోహ్లి, రోహిత్ అత్యున్నత స్థాయి క్రికెటర్లు. వారి ఫామ్‌లో ఎలా ఉందో తొలి వన్డేలో తెలుస్తుంది. ప్రొఫెషనల్ ఆటగాళ్లుగా తాము ఏం చేయాలో వారిద్దరికి బాగా తెలుసు. సీఓఈలో ప్రాక్టీస్ చేసి ఈ సిరీస్‌కు సిద్ధమయ్యారు. నెట్స్‌లో, ఫిట్‌నెస్‌పరంగా కూడా చాలా చురుగ్గా కనిపిస్తున్నారు' అని అక్షర్ వెల్లడించాడు. ఆస్ట్రేలియాలో ఎలాంటి పిచ్‌లు ఎదురైనా తమకు ఇబ్బంది లేదని, తాము పిచ్‌ల గురించి మాట్లాడటం మానేసి వ్యూహాలపైనే చర్చిస్తున్నామని అతను స్పష్టం చేశాడు. 'ఒకప్పుడు మన జట్టు ఆస్ట్రేలియాకు వస్తే పిచ్‌లు, పరిస్థితులు, బౌన్స్‌ల గురించి చర్చ జరిగేది. మేం చాలా తక్కువగా కూడా అక్కడ ఆడేవాళ్లం. కానీ 2015 వరల్డ్ కప్ తర్వాత పరిస్థితి మారింది. మేం ఇక్కడ ఎక్కువగా ఆడటం మొదలు పెట్టడంతో బ్యాటింగ్ కూడా మెరుగైంది. ఇప్పుడైతే ఆస్ట్రేలియాలో ఆడుతున్నట్లు అనిపించడం లేదు. ప్రత్యేకంగా సన్నద్ధం కావాల్సిన అవసరమూ లేదు. పిచ్ గురించి కాకుండా పరుగులు ఎలా చేయాలి తదితర ప్రణాళికల గురించే మాట్లాడుకుంటున్నాం' అని అక్షర్ వివరించాడు. ఆసియా కప్‌లో తాను బాగా ఆడానని, ఆస్ట్రేలియా గడ్డపై సవాల్‌కు తాను సిద్ధంగా ఉన్నట్లు అతను పేర్కొన్నాడు.



గాజాలోని ఖాన్‌యూనిస్ నగరంలో ఇజ్రాయెల్ ఆర్మీ దాడుల్లో శిథిలమైన భవనంలో శుక్రవారం ప్రార్థనలు చేస్తున్న పాలస్తీనావాసులు



శుక్రవారం మహారాష్ట్రలోని నవీముంబైలో ఓ వ్యాపార సముదాయంలో సంభవించిన అగ్ని ప్రమాదంలో చెలరేగుతున్న మంటలు, దట్టమైన పొగ

# 'ప్రతిమ'డిలో రామాయణం

## ప్రపంచంలో తొలి రామాయణ మైనపు బొమ్మల మ్యూజియం

- అయోధ్యలో సిద్ధమవుతున్న రాముని కథా ప్రపంచం
- దీపోత్సవంలో ప్రారంభం

**అయోధ్య:** శ్రీరాముడి జన్మభూమి అయోధ్య.. మరో అద్భుత ఘట్టానికి సిద్ధమవుతోంది! ప్రపంచంలోనే మొట్టమొదటి రామాయణ ఇతివృత్తంతో కూడిన భారీ వ్యాక్స్ మ్యూజియం (మైనపు బొమ్మల ప్రదర్శన శాల) త్వరలో ఇక్కడ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్టును ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో.. దీపోత్సవం-2025 సందర్భంగా ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. శ్రీరామ జన్మభూమి మందిరం సమీపంలోని 'పరిక్రమ మార్గ్'లో 10,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ మ్యూజియం రూపుదిద్దుకుంటోంది. దాదాపు రూ.7.5 కోట్లతో నిర్మితమవుతున్న ఈ మ్యూజియం



.. అయోధ్యలో మత పర్యాటకాన్ని మరింత పెంచడానికి దోహదపడుతుంది.

**50 జీవం ఉట్టిపడే బొమ్మలు:** మ్యూజియంలో మొత్తం 50 మంది రామాయణ ప్రధాన పాత్రల మైనపు బొమ్మలను ప్రదర్శించనున్నారు. వీటిలో శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, హనుమంతుడు, రావణుడు, విభీషణుడు తదితర విగ్రహాలున్నాయి. ప్రతి బొమ్మా.. పాత్రల దుస్తులు, ముఖ కవళికలు, భంగిమల్లో జీవం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు.

**గ్రౌండ్ ఫ్లోర్:** రాముని బాల్యం, సీతాదేవి స్వయంవరం వంటి తొలి ఘట్టాలను ఇక్కడ ప్రదర్శిస్తారు.

**మొదటి అంతస్తు:** 14 ఏళ్ల వనవాసం, సీతాపహరణం, లంకా దహనం, రామ-రావణ యుద్ధం వంటి కీలక ఘట్టాలను అద్భుతంగా ఆవిష్కరించారు.

**సెల్ఫీ పాయింట్:** భక్తులు.. బాల రాముడి మైనపు విగ్రహం వద్ద సెల్ఫీలు తీసుకునేందుకు ప్రత్యేక పాయింట్‌ను ఏర్పాటు చేశారు.

**తాదాత్మ్యం చెందేలా..:** త్రీడీ లైటింగ్ ఎఫెక్ట్స్, వినసొంపైన సౌండ్‌స్కేప్స్ మ్యూజియాన్ని మరో స్థాయికి తీసుకువెళ్తాయి.

**దివ్య సుగంధం:** మ్యూజియం లోపల త్రేతాయుగాన్ని గుర్తుకు తెచ్చే దివ్య సుగంధంతో పాటు, నిరంతరం 'రామ తారక మంత్రం'పఠనం, రామ భజనలు వినిపిస్తాయి.

**నిర్మాణ శైలి:** కేరళకు చెందిన 'సునీల్ వ్యాక్స్ మ్యూజియం'సంస్థ ఈ ప్రాజెక్ట్‌ను సంప్రదాయ దక్షిణ భారత నిర్మాణ శైలిలో తీర్చిదిద్దుతోంది.

**ప్రవేశ రుసుము:** ఒక్కొక్కరికి రూ.100. ఒకేసారి 100 మంది సందర్శకులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తారు.

**సౌకర్యాలు:** పూర్తిగా ఎయిర్ కండిషన్ చేసిన ఈ మ్యూజియం వెలుపల పార్కింగ్, స్నాక్ జోన్లు, కాఫీ హౌస్, దక్షిణ, ఉత్తర భారతీయ వంటకాలతో ఫుడ్ కోర్టు వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి.

**భద్రత:** ఇరవై నాలుగ్గంటలూ సీసీటీవీ నిఘా, అగ్నిమాపక భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేశారు.

### దీపోత్సవానికల్లా పూర్తి

నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, దీపోత్సవం నాటికి సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు తెలిపారు. ఈ వ్యాక్స్ మ్యూజియం అయోధ్య సాంస్కృతిక వైభవానికి కొత్త మెరుగులు దిద్దనుంది.

# హిజాబ్ వివాదం.. వేరే పాఠశాలకు విద్యార్థిని

- తల్లిదండ్రుల నిర్ణయం
- నిబంధనలు పాటిస్తే చేర్చుకుంటాం: ప్రిన్సిపాల్

**కొచ్చి:** ఇక్కడి చర్చి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలలో హిజాబ్ ధారణకు యాజమాన్యం అభ్యంతరం తెలపడంతో, ఆ విద్యార్థినిని మరో పాఠశాలలో చేర్చాలని ఆమె తల్లిదండ్రులు నిర్ణయించారు. కాగా, పాఠశాల నిబంధనలకు కట్టుబడితే విద్యార్థిని తిరిగి చదువు కొనసాగించడానికి స్వాగతిస్తామని పాఠశాల యాజమాన్యం స్పష్టం చేసింది. పల్లూరుత్తిలోని సెయింట్ రీటాస్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆ విద్యార్థిని తండ్రి.. తన కుమార్తెను తిరిగి అదే పాఠశాలకు పంపబోమని స్పష్టం చేశారు. ఈ వివాదం తర్వాత తన కుమార్తె తీవ్ర ఒత్తిడికి లోనైందని, తిరిగి అదే పాఠశాలకు వెళ్లడం తన కిష్టం లేదని చెప్పిందన్నారు. వివాదం మొదలైనప్పటి నుండి పాఠశాల ఉపాధ్యాయులు లేదా యాజమాన్యం తమను సంప్రదించలేదని తెలిపారు. 'నా కూతురు గత రెండు రోజులుగా తరగతులకు హాజరు కావడం లేదు, మాకు స్కూల్ నుండి ఎలాంటి సమాచారం అందలేదు'అన్నారు. ఈ వివాదంపై విద్యార్థినికి మద్దతు పలికిన కేరళ విద్యాశాఖ మంత్రి వి.శివన్‌కుట్టి మాట్లాడుతూ.. హెడ్ స్కార్ఫ్ ధరించే ఉపాధ్యాయిని (నన్) ఒక విద్యార్థినిని హిజాబ్ ధరించనివ్వకపోవడం ఆశ్చర్యకరం, విడ్డూరమని వ్యాఖ్యానించారు. మరోవైపు, పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ హీలీనా ఆల్బీ మాట్లాడుతూ.. విద్యార్థిని పాఠశాల నియమాలను పాటిస్తే.. ఆమె యథాప్రకారం చదువుకోవచ్చని తెలిపారు. ఈ విషయం న్యాయస్థానం పరిధిలో ఉందన్నారు. తమ పాఠశాలలో భారతీయ సాంస్కృతిక, సంప్రదాయ విలువలను సమ్మిళితం చేస్తూ విద్యను అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. స్కూల్ డ్రెస్ కోడ్‌కు విరుద్ధంగా.. బాలిక హిజాబ్ ధరించడంపై యాజమాన్యం అభ్యంతరం చెప్పడంతో ఈ వివాదం మొదలవడం తెలిసిందే. దీనిపై అక్టోబర్ 10న, విద్యార్థిని తల్లిదండ్రులు ఇతరులతో కలిసి పాఠశాలను సందర్శించి యాజమాన్యాని నిలదీశారు. దీంతో పాఠశాల రెండు రోజుల సెలవు ప్రకటించింది. తర్వాత కేరళ హైకోర్టు పాఠశాలకు పోలీసు రక్షణ కల్పించాలని ఆదేశించింది.

# పూచీకత్తుగా రూ.96 కోట్లు

## అయితేనే గఢాఫీ కుమారుడికి బెయిలన్న కోర్టు

- అంత డబ్బు లేదన్న ఆయన లాయర్
- పదేళ్లుగా విచారణ లేకుండా జైల్లోనే

**బీరుట్:** లిబియా దివంగత నేత కల్నల్ గఢాఫీ కుమారుడు హానిబాల్ గఢాఫీని బెయిల్‌పై విడుదల చేసేందుకు అక్కడి కోర్టు అంగీకరించింది. అయితే, బెయిల్ పూచీకత్తును రూ.96.83 కోట్లుగా నిర్ణయించింది. ఈ మొత్తం ఎప్పుడు చెల్లిస్తే అప్పుడు విడుదల కావచ్చని పేర్కొంది. దశాబ్దాలపాటు అధికారంలో కొనసాగిన గఢాఫీ తిరుగుబాటుదార్ల చేతిలో 2011 అక్టోబర్‌లో చనిపోయారు. అయితే, ఆయన పాలనాకాలంలో 1978లో లిబియాకు వచ్చిన షియాల గురువు మౌసా అల్ సదర్ అనుమానాస్పద స్థితిలో అదృశ్యమయ్యారు. ఆయన ఏమయ్యారో ఎవరికీ తెలియదు. అయితే, గఢాఫీ కుమారుడు హానిబాల్‌కు ఆ విషయం తెలుసని అనుమానించిన మిలిటెంట్ల గ్రూపు 2015లో ఆయన్ను అపహరించి బాల్బెక్‌లో ఉంచింది. అనంతరం లెబనాన్ పోలీసులు అతడిని మిలిటెంట్ల చెరనుంచి విడిపించి బీరుట్ జైలులో ఉంచారు. అప్పటి



నుంచి దాదాపు దశాబ్దకాలంగా ఎలాంటి విచారణ లేకుండా జైలులోనే మగ్గుతున్నారు. శుక్రవారం అధికారులు ఆయన్ను జస్టిస్ ప్యాలెస్‌లో జడ్జి జహెర్ హమాదెహ్ ఎదుట హాజరుపరిచారు. హానిబాల్ బెయిల్ పూచీకత్తును రూ.96.83 కోట్లుగా ఆయన నిర్ణయించారు. ఈ మొత్తం ఎప్పుడు చెల్లిస్తే అప్పుడే జైలు నుంచి విడుదల కావచ్చని తెలిపారు. అయితే, రెండు నెలలపాటు దేశం విడిచి వెళ్లరాదనే షరతును విధించారు. హానిబాల్ తరఫు లాయర్ చర్బెల్ మిలాడ్ అల్-ఖౌరీ ఈ విషయం మీడియాకు వెల్లడించారు. హానిబాల్ వద్ద ప్రస్తుతం డబ్బు లేదని చెప్పారు. ఆయన బ్యాంకు అకౌంట్లపై నిషేధం ఉందని చెప్పారు. కాగా, షియా గురువు మౌసా అల్ సదర్ అదృశ్యం వ్యవహారం లెబనాన్‌లో ఇప్పటికీ వివాదాస్పదంగానే ఉంది. లెబనాన్‌లోని ఏదో ఒక జైలులో ఆయన సజీవంగా ఉండి ఉంటారని కుటుంబీకులు భావిస్తుండగా, ఆయన ఎప్పుడో చనిపోయి ఉంటారని చాలా మంది అనుకుంటున్నారు. జీవించి ఉంటే ఆయనకు ఇప్పుడు 96 ఏళ్లుంటాయని అంచనా.

# దళితుడిగా పుట్టడమే నేరమా?

- బీజేపీ పాలనలో దళితులపై అణచివేత పెరిగిపోతోంది
- కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ఆగ్రహం
- ఉత్తరప్రదేశ్‌లో హత్యకు గురైన దళితుడి కుటుంబానికి పరామర్శ

**కాన్పూర్:** అధికార బీజేపీపై కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ మరోసారి విరుచుకుపడ్డారు. బీజేపీ పాలనలో దళితులపై అణచివేత నానాటికీ పెరిగిపోతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. హరియాణాలో దళిత ఐపీఎస్ అధికారి వై.పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని, ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో దళితుడైన హరిఓం వాల్మీకిని దారుణంగా హత్య చేశారని, ఈ హత్యాకాండ మొత్తం దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని బెదిరించి గొంతు నొక్కేయడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. హరిఓం తండ్రి, సోదరుడు, సోదరితో మాట్లాడారు. సంతాపం ప్రకటించారు. అధైర్యపడొద్దని, అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తాను ఇక్కడికి రాకుండా ఉత్తరప్రదేశ్ అధికారులు అడ్డంకులు సృష్టించారని రాహుల్ ధ్వజమెత్తారు. దేశంలో దళితులపై విచ్చలవిడిగా దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఆయన తొలుత మీడియాతో మాట్లాడారు. అనంతరం 'ఎక్స్'లో పోస్టుచేశారు. ఆ దేశంలో దళితుడిగా జన్మించడమే నేరమా? అనే ప్రశ్న బాధితుల కళ్లల్లో కనిపిస్తోందని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో దళితులపై అకృత్యాలకు పాల్పడిన నేరగాళ్లను కాపాడడం, బాధితులనే శిక్షించడం బీజేపీ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని విమర్శించారు. న్యాయాన్ని గృహ నిర్బంధంలో ఉంచలేరని తేల్చిచెప్పారు. హరిఓం వాల్మీకి కుటుంబాన్ని వేధించడం ఇకనైనా మానుకోవాలని, హంతకులను కఠినంగా శిక్షించాలని రాహుల్ డిమాండ్ చేశారు. హరిఓం వాల్మీకి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. దేశంలో ప్రతి బాధితుడికి, అణగారిన వర్గాలకు తన అండదండలు ఉంటాయన్నారు. ఈ పోరాటం కేవలం హరిఓం కోసం కాదని.. అన్యాయానికి తలవంచని ప్రతి గొంతుక కోసం పోరాడుతూనే ఉంటామని తేల్చిచెప్పారు. 40 ఏళ్ల హరిఓం వాల్మీకిని ఈ నెల 2న రాత్రిపూట గ్రామస్థులు కొట్టిచంపారు. అతడిని దొంగగా భావించి దాడిచేశారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.



శుక్రవారం హరిఓం కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

### సూత్రధారి ఉన్నికృష్ణన్

**శబరిమల బంగారం కేసులో సిట్ నివేదిక**

**పథనంతిట్ట (కేరళ):** శబరిమల ఆలయంలో బంగారం మాయం కేసులో నిందితుడు ఉన్నికృష్ణన్ పోట్టి.. 2019లో ద్వారపాలకుల విగ్రహాలకు ఎలక్ట్రోప్లేటింగ్ సమయంలో సుమారు రెండు కిలోగ్రాముల బంగారాన్ని స్వాహా చేశాడని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. దర్యాప్తు అధికారి ఎస్.శశిధరన్ శుక్రవారం రాణీలోని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో రిమాండ్ రిపోర్టును దాఖలు చేశారు. అదే రోజు నిందితుడు పోట్టిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు.. పోట్టిని అక్టోబర్ 30 వరకు ప్రత్యేక దర్యాప్తు బృందం కస్టడీకి పంపింది.

# బంగ్లాదేశ్‌లో మళ్లీ జనాగ్రహం

- సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్ ముట్టడి
- బాష్పవాయువు, సౌండ్ గ్రనేడ్లు ప్రయోగించిన పోలీసులు

**ఢాకా:** బంగ్లాదేశ్‌లో జనం మళ్లీ ఆందోళన బాట పట్టారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం శుక్రవారం రాజధాని ఢాకాలోని జాతీయ పార్లమెంట్ భవనం ఎదుట భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం తీసుకొచ్చిన 'జూలై నేషనల్ చార్టర్'ను వారు వ్యతిరేకించారు. ఈ చార్టర్‌లో తమ సమస్యలను ప్రస్తావించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. గత ఏడాది జూలైలో షేక్ హసీనా ప్రభుత్వంపై జరిగిన పోరాటంలో చాలామంది మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. బాధితులను ఆదుకోవడంపై 'జూలై నేషనల్ చార్టర్'ఎలాంటి ప్రస్తావన లేకపోవడం పట్ల జనాగ్రహం వ్యక్తమైంది. శుక్రవారమే ఈ చార్టర్‌పై పార్లమెంట్ భవనంలో సంతకాలు జరగాల్సి ఉంది. షేక్ హసీనా ప్రభుత్వ పతనానికి కారణమైన నిరసనకారులు, వారి కుటుంబ సభ్యులు పార్లమెంట్ భవనాన్ని ముట్టడించారు. తమను అధికారికంగా గుర్తించి, చట్టపరంగా రక్షణ కల్పించాలనిచ ఆర్థిక సాయం అందించాలని, పునరావాస ప్యాకేజీ ప్రకటించాలని, ఈ అంశాన్ని చార్టర్‌లో చేర్చాలని నినదించారు. పోలీసుల వాహనాలను ధ్వంసం చేశారు. భద్రతా సిబ్బందితో ఘర్షణకు దిగారు. ఫర్నీచర్‌కు నిప్పుపెట్టారు. పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారడంతో నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు బాష్పవాయువు, సౌండ్ గ్రనేడ్లు ప్రయోగించారు. ఈ ఘటనలో పలువురు నిరసనకారులు గాయపడ్డారు. ప్రజల ఆందోళన నేపథ్యంలో కొన్ని



రాజకీయ పార్టీలు చార్టర్‌పై సంతకాల కార్యక్రమానికి హాజరు కాలేదు. కీలకమైన నేషనల్ సిటిజెన్ పార్టీ సైతం దూరంగా ఉంది.

**నూతన బంగ్లాదేశ్ జననం: యూనస్**

జూలై నేషనల్ చార్టర్(జాయింట్ డిక్లరేషన్)పై సంతకంతో నూతన బంగ్లాదేశ్ జన్మించిందని తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ పేర్కొన్నారు. చార్టర్‌పై వివిధ రాజకీయ పార్టీల నేతలు సంతకాలు చేశారు. మాజీ ప్రధాని ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ, జమాత్-ఇ-ఇస్లామ్ నేతలు సంతకాలు చేసినట్లు తెలిసింది. 'జూలై యోధులకు'దేశం రుణపడి ఉందని మహమ్మద్ యూనస్ వ్యాఖ్యానించారు.

**ఏమిటీ చార్టర్?**

మహమ్మద్ యూనస్ నియమించిన నేషనల్ కాన్సెన్సస్ కమిషన్ వివిధ రాజకీయ పార్టీలతో చర్చించి 'జూలై నేషనల్ చార్టర్'ను రూపొందించింది. షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీతో మాత్రం చర్చించలేదు. 2024 జూలైలో షేక్ హసీనా ప్రభుత్వంపై తిరుగుబాటు ప్రారంభమైన నేపథ్యంలో దీనికి జూలై నేషనల్ చార్టర్ అని పేరు పెట్టారు. రాజ్యాంగ సవరణలు, చట్టపరమైన మార్పులు, తీసుకురావాల్సిన కొత్త చట్టాలు వంటి వివరాలను ఇందులో పొందుపర్చారు. షేక్ హసీనాకు వ్యతిరేకంగా పోరాడి మరణించివారి కుటుంబాలకు, క్షతగాత్రులకు నష్టపరిహారం ఇచ్చేలా చార్టర్‌లో ఒక సవరణ చేసినట్లు నేషనల్ కాన్సెన్సస్ కమిషన్ వెల్లడించింది.

# అసోంలో ఉల్ఫా తీవ్రవాదుల దాడి

**ముగ్గురు జవాన్లకు స్వల్ప గాయాలు**

**గౌహతి:** అసోంలో నిషేధిత ఉల్ఫా(ఐ) జరిపిన కాల్పుల్లో ముగ్గురు సైనికులు గాయపడ్డారు. గురువారం అర్ధరాత్రి దాటాక తిన్‌సుకియా జిల్లా కకోపత్తర్ ప్రాంతంలో ఘటన చోటుచేసుకుంది. మయన్మార్ కేంద్రంగా పనిచేసే, ఉల్ఫా(ఐ) తదితర గ్రూపులు ఇలా దాడులకు పాల్పడుతున్నాయ సీఎం హిమంత బిశ్వ శర్మ ఆరోపించారు. నాగాలాండ్‌లో కూడా ఇటీవల ఇలాంటి ఘటనలే జరిగాయన్నారు. వీటిపై కేంద్రం దృష్టి సారించిందని వెల్లడించారు. 'వాహనంలో వెళ్తున్న జవాన్లపై గుర్తు తెలియని తీవ్రవాదులు కాల్పులకు దిగారు. వెంటనే బలగాలు దీటుగా స్పందించాయి. ఆ ప్రాంతంలో పౌర ఆవాసాలు ఉండటంతో ఎలాంటి నష్టం వాటిల్లకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నాయి. బలగాల ధాటికి తట్టుకోలేక ఆగంతకులు అక్కడి నుంచి పరారయ్యారు'అని సీఎం చెప్పారు. ఘటనలో ముగ్గురు జవాన్లకు స్వల్పంగా గాయాలయ్యాయన్నారు. చికిత్స అనంతరం వీరు తిరిగి విధుల్లో చేరారని చెప్పారు. సైన్యం కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించింది. ఘటన అనంతరం ఆ ప్రాంతంలో పోలీసులతో కలిసి కూంబింగ్ చేపట్టామంది. దుండగులు వాడినట్లుగా భావిస్తున్న ట్రక్కును అనంతరం అరుణాచల్ ప్రదేశ్‌లోని థాపాబరి వద్ద స్వాధీనం చేసుకున్నామని సైన్యం తెలిపింది.

# ఆ తీర్పు వెలువడేదాకా వేచి చూడండి

**తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచన**

**న్యూఢిల్లీ:** తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ(సవరణ) బిల్లు-2025పై గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదముద్ర వేయకుండా రాష్ట్రపతి పరిశీలనకు పంపడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. రాష్ట్రపతి కోరిన అభిప్రాయంపై తీర్పు వెలువడే వరకు కనీసం నాలుగు వారాలపాటు వేచి ఉండాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం తమిళనాడు ప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలపడంపై గవర్నర్లు, రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు నిర్దేశించవచ్చా అంటూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభిప్రాయం కోరడం తెల్సిందే. ఈ అంశంపై వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని రాజ్యాంగ ధర్మాసనం సెప్టెంబర్ 11వ తేదీన తీర్పును రిజర్వులో ఉంచింది. గవాయ్ నవంబర్ 21వ తేదీన రిటైరవనున్నారు. ఆలోగానే ఆ అంశంపై తీర్పు వెలువడనుంది. అప్పటి వరకు ఎదురు చూడాలని తమిళనాడు ప్రభుత్వాన్ని శుక్రవారం ధర్మాసనం కోరింది. ఆ తర్వాత తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (సవరణ) బిల్లు-2025 వివాదంపై విచారణ చేపడతామని తెలిపింది.

# కోర్టు ప్రాంగణాల్లో టాయిలెట్లు తప్పనిసరి: సుప్రీం

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఉన్న న్యాయస్థానాల ప్రాంగణాలతోపాటు ట్రిబ్యునళ్లలో టాయిలెట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలంటూ జారీ చేసిన మార్గదర్శకాలను తుచ తప్పక పాటించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి ఈ ఏడాది జనవరి 15వ తేదీన అత్యున్నత న్యాయస్థానం పలు మార్గదర్శకాలను జారీ చేసింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని హైకోర్టు సముదాయాల్లో స్త్రీ, పురుషులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లను అందుబాటులోకి తేవాలని అందులో కోరింది. వీటిని న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బందితోపాటు కక్షిదారులు సులువుగా ఉపయోగించుకునేలా ఉండాలంది. వీటి నిర్వహణ కోసం ప్రతి కోర్టు ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని కోరింది. ఈ ఆదేశాల అమలుపై శుక్రవారం జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం సమీక్ష చేపట్టింది. అప్పటి ఆదేశాలను సమర్థవంతంగా, అర్థవంతంగా అమలు చేయాలని తాము కోరామని తెలిపింది. మరో ఆరు నెలల తర్వాత అన్ని హైకోర్టుల నుంచి ఇదే అంశంపై అందే నివేదికలను పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది.

# దుండగుల దాడి.. 8 మంది జవాన్లు మృతి

**అబుజా:** నైజీరియాలోని వాయవ్య జంఫారా ప్రావిన్స్‌లో సాయుధ ముఠా దొంగచాటుగా జరిపిన దాడిలో 8 మంది భద్రతా సిబ్బంది చనిపోయారు. గురువారం గుసా- ఫంటువా మార్గంలోని టిసాఫె వద్ద ఘటన చోటుచేసుకుంది. ఘటనలో ఐదుగురు పోలీసులు, ముగ్గురు స్థానిక పారా మిలటరీ సభ్యులు చనిపోయారని గవర్నర్ దౌడా లవాల్ తెలిపారు. గస్తీకి వెళ్లిన సమయంలో పొదలమాటున ఉన్న దుండగులు దాడికి దిగారని స్థానికులు తెలిపారు. కాగా, ఘటనకు బాధ్యతంటూ ఎవరూ ప్రకటించుకోలేదు. వాయవ్య ప్రాంతంలో నీరు, భూమిపై హక్కుల కోసం పశువుల కాపర్లు, రైతుల మధ్య ఘర్షణలు సర్వసాధారణంగా మారాయి. ఇటీవలి కాలంలో జంఫారా రాష్ట్రంలో డబ్బు కోసం సాయుధ ముఠాలు స్థానికులను కిడ్నాప్ చేస్తున్న ఘటనలు పెరిగిపోయాయి. వీటికి ఇస్లామిక్ ఉగ్ర సంస్థ బొకొహరామ్ తోడైంది. ఈ గ్రూపు ఇప్పటి వరకు కనీసం 35 వేల మంది పౌరులను పొట్టనబెట్టుకున్నట్లు అంచనా. భయభ్రాంతులకు గురై కనీసం 20 లక్షల మంది సొంతూళ్లను వీడి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు ఐరాస అంచనా వేసింది.

# న్యూయార్క్‌లో దీపావళి సంబరాలు

**న్యూయార్క్:** అమెరికాలో దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. న్యూయార్క్ నగర మేయర్ ఎరిక్ ఆడమ్స్ తన అధికారిక నివాసంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడమ్స్ మాట్లాడుతూ..., న్యూయార్క్ నగర సాంస్కృతిక, ఆర్థిక ప్రగతిలో భారతీయ సమాజం పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని కొనియాడారు. భారత కాన్సులేట్ జనరల్ తరఫున ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ కాన్సుల్ జనరల్ విశాల్ జే హర్ష్.. వెలుగు, ఆశ, ఆనందానికి ప్రతీకలైన దీపావళి సందేశాన్ని తెలియజేశారు. మరోవైపు న్యూయార్క్ గవర్నర్ క్యాథీ హోచ్ల్ ఫ్లషింగ్‌లోని శ్రీ స్వామినారాయణ మందిరంలో జరిగిన దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. ప్రవాస భారతీయులకు నిరంతరం మద్దతు ఇస్తున్నందుకు గవర్నర్‌కు కాన్సులేట్ అధికారులు ధన్యవాదాలు తెలిపారు. పెన్సిల్వేనియా, కాలిఫోర్నియా, కనెక్టికట్‌లో రాష్ట్రాల్లో దీపావళి రోజున అధికారిక సెలవు ప్రకటించారు. న్యూయార్క్ సిటీలోనూ ప్రభుత్వ బడులకు సెలవు ఇచ్చారు.

# ఉక్రెయిన్ సైనికులకు జైలు శిక్ష

**రష్యా చర్యలపై తీవ్ర విమర్శలు**

**కీవ్:** యుద్ధంలో పట్టుబడిన ఉక్రెయిన్ సైనికులకు రష్యాలోని మరో కోర్టు ఉగ్రవాద అభియోగాలతో శిక్షలు విధించింది. మార్చిలో అజోవ్ బ్రిగేడ్‌కు చెందిన 23 మంది సైనికులకు రష్యాలోని ఓ కోర్టు తీవ్రమైన జైలు శిక్షలు విధించింది. తాజాగా, మరో 15 మంది ఉక్రెయిన్ సైనికులకు రష్యాలోని రోస్టోవ్ ఆన్ డాన్‌లోని కోర్టు 15 ఏళ్ల నుంచి 21 ఏళ్ల వరకు శిక్షలను ప్రకటించింది. రష్యా చర్యలు అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకమని ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. మాతృభూమి కోసం పోరాడే వారిపై సైతం నేరగాళ్లుగా ముద్ర వేస్తోందంటూ మండిపడింది. ఎలాంటి యుద్ధ నేరారోపణలు లేని సైనికులకు శిక్షలు విధించడం జెనీవా ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని రష్యాకే చెందిన హక్కుల సంస్థ మెమోరియల్ సైతం వ్యాఖ్యానించింది. ఉక్రెయిన్ సైన్యంలోని అజోవ్, ఐదర్ బెటాలియన్‌లను రష్యా ఉగ్ర గ్రూపులుగా ప్రకటించింది. ఈ రెండు విభాగాలు ఉక్రెయిన్‌లోని రష్యా అనుకూలురపై జరిగే పోరాటంలో ముందున్నాయని రష్యా ఆరోపిస్తోంది.

# లేహ్‌లో హింసాత్మక ఘటనలపై సుప్రీం రిటైర్డు జడ్జి సారథ్యంలో దర్యాప్తు

**న్యూఢిల్లీ:** లేహ్‌లో సెప్టెంబర్ 24వ తేదీన చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై జ్యుడీషియల్ దర్యాప్తు చేయించాలని కేంద్రం నిర్ణయించింది. అప్పటి ఘటనల్లో కార్గిల్ యుద్ధ వీరుడు సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇందుకు దారితీసిన పరిణామాలపై విచారణ చేయించాలని లద్దాఖ్‌లోని వివిధ వర్గాలు కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నాయి. సానుకూలంగా స్పందించిన కేంద్ర హోం శాఖ ఇందుకు సంబంధించి శుక్రవారం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. శాంతిభద్రతలు అదుపు తప్పేందుకు దారితీసిన పరిస్థితులు, పోలీసుల స్పందన, నలుగురి మరణాలపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ చౌహాన్ నేతృత్వంలో ఏర్పాటయ్యే బృందం దర్యాప్తు చేపడుతుందని అందులో పేర్కొంది. ఇందులో మాజీ జిల్లా జడ్జి మోహన్ సింగ్ పరిహార్, ఐఏఎస్ అధికారి తుషార్ ఆనంద్ ఉంటారు. లేహ్‌కు రాష్ట్ర హోదా ప్రకటించాలంటూ సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష చేపట్టడం, అనంతరం హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం తెల్సిందే. సోనమ్ వాంగ్‌చుక్‌ను అధికారులు నిర్బంధించడాన్ని లేహ్‌లోని వివిధ వర్గాలు సీరియస్‌గా తీసుకున్నాయి.

# సకలోత్తర పథేశ్వర అనే బిరుదు కలిగిన రాజు?

## గుప్తానంతర యుగం

**(క్రీ.శ. 6వ శతాబ్దం - 8వ శతాబ్దం)**

గుప్తుల అనంతరం భారతదేశం మరోసారి అనేక చిన్న చిన్న రాజ్యాలుగా చీలిపోయింది. ఈ రాజకీయ అనైక్యత ఉత్తర భారతంలో తీవ్రంగా ఉంది. ఈ కాలంలో ఉత్తరాదిలో... వల్లభి కేంద్రంగా- మైత్రకులు, గౌహతి కేంద్రం గా (కామరూప రాజ్యం)-వర్మన్ వంశం, పాటలీపుత్రం కేంద్రంగా-కడపటి గుప్తులు పాలిం చారు. అలాగే బెంగాల్ కేంద్రంగా - గౌడ వంశం, కనౌజ్ కేంద్రంగా - మౌఖరీలు, ఒడిశా కేంద్రంగా-మాతరులు, మాన వంశం, స్థానేశ్వర్ కేంద్రంగా- పుష్యభూతులు పాలన కొన సాగించారు. అయితే పుష్యభూతులు క్రమంగా ఈ రాజ్యాలన్నింటినీ జయించి మొత్తం ఉత్తర భారతదేశాన్ని రాజకీయంగా ఏకంచేసి పరిపాలించారు. ఈ కాలంలో దక్షిణ భారతదేశాన్ని పశ్చిమ గాంగులు, బాదామి చాళుక్యులు, పల్లవులు, పాండ్యులు మొదలైన రాజవంశాలు పాలిస్తు న్నాయి. ఈ వంశాలు దక్షిణ భారతదేశంలో వాస్తుశిల్ప కళలకు అమూల్యమైన సేవలనందించాయి. గుప్తుల అనంతర యుగంలో ఉత్తరాదిని పాలించిన రాజవంశాలన్నింటిలో అతి గొప్ప రాజ వంశం పుష్యభూతి వంశం.

### పుష్యభూతి వంశపాలన - హర్షవర్ధనుడు



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

**జనరల్ స్టడీస్**

**ఇండియన్ హిస్టరీ**

#### పుష్యభూతి

ఇతడు తనపేరుతో పుష్యభూతి వంశాన్ని స్థాపించాడు. స్థానేశ్వర్ రాజధానిగా, గుప్తుల సామంతుడిగా ఉంటూ పరిపాలించాడు.

#### ప్రభాకర వర్ధనుడు

పుష్యభూతి వంశంలో తొలి స్వతంత్ర రాజు. తన స్వతంత్ర పాలనకు గుర్తు గా ఇతడు రాజాధిరాజ అనే బిరుదును ధరించాడు. ప్రభాకరుడి భార్య పేరు యశోమతి. ప్రభాకర వర్ధనుడు క్రీ.శ. 605లో మరణించగా అతడి భార్య సతీ సహగమనాన్ని ఆచరించిందని బాణుడి గ్రంథాల వల్ల తెలుస్తోంది.

#### రాజ్య వర్ధనుడు

ప్రభాకర వర్ధనుడు తన జ్యేష్ఠ పుత్రుడు రాజ్య వర్ధనుడికి బదులు రెండో కుమారుడు హర్షుడిని రాజుగా చేయాలని సంకల్పించాడు. ఇందుకు హర్షుడు సమ్మతించలేదు. దీంతో రాజ్యవర్ధనుడు రాజయ్యాడు. ఇతడి కాలంలో కనౌజ్‌ను గ్రహవర్మ అనే మౌకరీరాజు పాలించేవాడు. ఇతడు రాజ్యవర్ధనుడి సోదరి రాజ్యశ్రీ భర్త. మగధను, మాళ్వాను పాలించే దేవగుప్తుడు, గౌడ దేశాన్ని పాలించే శశాంకుడితో కలిసి.. గ్రహవర్మను చంపి కనౌజ్‌ను ఆక్రమించాడు. దీంతో రాజ్యవర్ధనుడు దేవగుప్తుడిని చంపి కనౌజ్‌ను ఆక్రమించాడు. కానీ శశాంకుడు ఇతడిని మోసపూరితంగా చంపాడు. దీంతో హర్షుడు రాజ్యానికి వచ్చాడు.

#### హర్షవర్ధనుడు

ఇతడు గౌడ శశాంకుడి నుంచి కనౌజ్‌ను విడిపించడమే కాకుండా.. రాజధానిని స్థానేశ్వరం నుంచి కనౌజ్‌కు మార్చాడు. శశాంకుడి అనంతరం గౌడ దేశాన్ని కూడా ఆక్రమించాడు. ఆ తర్వాత తన దిగ్విజయ యాత్రలు ప్రారంభించి..సింధు, వల్లభి, గుజరాత్, సౌ రాష్ట్ర మొదలైన ప్రాంతాల్ని జయించాడు. అయితే లత, మాళ్వా ప్రాంతాలపై ఆధిపత్యం విషయంలో హర్షుడికి.. బాదామి చాళుక్య రాజు రెండో పులకేశితో ఘర్షణ అనివార్యమైంది. హర్షుడు.. పులకేశితో జరిపే యుద్ధానికి చేసిన సన్నాహాల గురించి బాణభట్టుడు తన రచనల్లో వివరంగా తెలిపాడు. వీరి మధ్య జరిగిన యుద్ధం గురించిన ప్రస్తావన రెండో పులకేశికి చెందిన ఐహోల్ ప్రశస్తిలో కనిపిస్తుంది.

అయితే ఈ యుద్ధంలో హర్షుడి విజయం సందిగ్ధకరం అని భావించాలి. కానీ పులకేశి వారసులు ఈ యుద్ధంలో పులకేశి విజయం సాధించినట్లు పేర్కొన్నారు. అయితే చరిత్రకారులు వీరి మధ్య స్నేహపూర్వక ఒప్పందం జరిగినట్లు భావిస్తున్నారు. హర్షుడు సాధించిన సైనిక విజయాల సమాచారం అతడు జారీ చేసిన పలు శాసనాల ద్వారా లభిస్తోంది.

హర్షుడు బన్స్‌ఖేర, మధుబన్, సోనేపట్ మొదలైన శాసనాలను జారీ చేశాడు. హర్షుడు మరణించే నాటికి ఇతడి రాజ్యంలో కాశ్మీర్ తప్ప మిగిలిన ఉత్తర భారతదేశమంతా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అంతర్భాగంగా ఉండేది. అందుకే హర్షుడిని ఉత్తర భారతదేశాన్ని పాలించిన చివరి గొప్ప హిందూ రాజుగా పరిగణిస్తారు.

#### హర్షుడి పాలనా విధానం

ప్రాచీన భారతదేశ చరిత్రలో చివరిసారిగా ఒక పటిష్ఠమైన పాలనాపద్ధతిని ఏర్పాటు చేసిన రాజు హర్షుడు. ఇతడి పాలనా సమర్థత వల్ల గుప్తుల అనంతరం ఉత్తర భారతంలో దాదాపు 40 ఏళ్ల పాటు శాంతియుత వాతావరణం ఏర్పడింది. కనౌజ్‌కు దగ్గరగా ఉన్న ప్రాంతాలను ఇతడు ప్రత్యక్షంగా పాలించినప్పటికీ.. పరోక్ష పాలనలో మాత్రం చాలా ప్రాంతాలుండేవి. హర్షుడి కాలంలో వచ్చిన ప్రధాన మార్పు భూస్వామ్య వ్యవస్థ ఏర్పడడం. దీంతోపాటు సామంత వ్యవస్థ కూడా పెరిగిపోయింది. ఒక రాజుకున్న సామంతుల సంఖ్యను బట్టి అతడి గొప్పదనాన్ని అంచనా వేయడం ప్రారంభమైంది.

హర్షుడు తన సామ్రాజ్యాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం అనేక రాష్ట్రాలుగా విభజించాడు. వీటిని భుక్తి అని పిలిచేవారు. రాష్ట్రాలను విషయ అనే పేరుతో జిల్లాలుగా విభజించారు. జిల్లాలను పాథక అనే మరో విభాగంగా విభజించారు. పాలనలో చిట్టచివరి విభాగం గ్రామం. పరిపాలనలో రాజుకు సహాయంగా మంత్రి పరిషత్ ఉండేది. హర్షుడి అధికారుల్లో ముఖ్యమైనవారు మంత్రి, సేనాపతి, మహాసామంత, కుమారామాత్య, ఉపారిక, విషయపతి, రాజస్థానీయ తదితరులు. ఉన్నతాధికారులందరికీ వేతనాలను భూముల రూపంలోనే చెల్లించే వారు. కేవలం కిందిస్థాయి సైనికులకే జీతాలను నగదు రూపంలో చెల్లించేవారు. అందుకే ఈ కాలంలో అతి తక్కువ సంఖ్యలో నాణేలు కనిపిస్తాయి. నాణేల కొరతకు మరో కారణం ఈ కాలంలో వ్యాపార వాణిజ్యాలు మరింతగా క్షీణించడమే. ప్రజలపై పన్నుల భారం తక్కువగానే ఉండేది. రాజ్యానికి ప్రధాన ఆదాయ వనరు భూమిశిస్తు. ఇది పంటలో 1/6వ వంతుగా ఉండేది. ఇంకా 'తుల్యమేయ' అనే అమ్మకం పన్ను కూడా విధించారు.

#### హర్షుడి సాంస్కృతిక సేవ

హర్షుడు స్వయంగా మూడు నాటకాలను రచించినట్లు ప్రతీతి. అవి నాగానందం, రత్నావళి, ప్రియదర్శిక. హర్షుడి ఆస్థాన కవి బాణుడు మూడు కావ్యాలను రచించాడు. అవి హర్షచరిత్ర, కాదంబరి, పార్వతీ పరిణయం. హర్షుడి ఆస్థానంలోని మరో కవి మయూరుడు.. సూర్యశతకం అనే గ్రంథాన్ని రచించాడు. హర్షుడు ప్రతి ఐదేళ్లకోసారి ప్రయాగ వద్ద మహామోక్ష పరిషత్‌ను నిర్వహించేవాడు. ఈ సమావేశంలో తన సంపదనంతా దాన, ధర్మాలకు వెచ్చించేవాడని హ్యుయాన్‌త్సాంగ్ తెలిపాడు. క్రీ.శ. 643లో కనౌజ్‌లో హర్షుడు ఒక సర్వమత సమ్మేళనాన్ని హ్యుయాన్‌త్సాంగ్ అధ్యక్షతన నిర్వహించాడు. హర్షుడు మొదట శైవ మతాన్ని ఆదరించినప్పటికీ తర్వాతి కాలంలో బౌద్ధాన్ని స్వీకరించాడు. ప్రతీ సంవత్సరం రాజధానిలో బౌద్ధమత సమావేశాలు నిర్వహించేవాడు. నలంద విశ్వవిద్యాలయానికి 100 గ్రామాలను దానంగా ఇచ్చాడు. అందుకే ఇతని కాలంలో నలంద బౌద్ధ విశ్వవిద్యాలయం చాలా ఉన్నత దశలో ఉందని హ్యుయాన్‌త్సాంగ్ పేర్కొన్నాడు. 10వేల మంది విద్యార్థులు, 1,500 మంది గురువులతో ఈ విశ్వవిద్యాలయం గొప్పగా విలసిల్లిందని అతడు తెలిపాడు. హర్షుడు తాను కాశ్మీర్‌ను సందర్శించినప్పుడు అక్కడినుంచి బుద్ధుడి దంతపు అవశేషాన్ని కనౌజ్‌కు తెచ్చి దానిపై బౌద్ధస్థూపాన్ని నిర్మించాడు. ప్రాచీన భారతదేశ చరిత్రలో మహాయాన బౌద్ధాన్ని ఆదరించిన చివరి చక్రవర్తిగా హర్షుడిని పేర్కొనవచ్చు..

### మాదిరి ప్రశ్నలు

1. హ్యుయాన్‌త్సాంగ్ ప్రకారం హర్షుడు చాతుర్వర్ణాల్లోని ఏ వర్ణానికి చెందినవాడు?
   ఎ) బ్రాహ్మణ  బి) క్షత్రియ
   సి) వైశ్య  డి) శూద్ర
2. స్థానేశ్వర్ నుంచి కనౌజ్‌కు రాజధానిని మార్చిన ఉత్తర భారతదేశ రాజు?
   ఎ) నరవర్ధన  బి) ఆదిత్య వర్ధన
   సి) ప్రభాకర వర్ధన  డి) హర్ష వర్ధన
3. హర్షుడి చేతిలో ఓడిన వల్లభి పాలకుడు?
   ఎ) రెండో ధ్రువసేనుడు
   బి) రెండో ప్రవరసేనుడు
   సి) మూడో ధ్రువసేనుడు
   డి) మూడో ప్రవరసేనుడు
4. హర్షుడి దిగ్విజయ యాత్రలకు నాయకత్వం వహించిన సేనాపతి ఎవరు?
   ఎ) దండి  బి) భండి
   సి) వ్యాఘ్రకేతు  డి) నిఘాత
5. సకలోత్తర పథేశ్వర అనే బిరుదు కలిగిన రాజు?
   ఎ) గ్రహవర్మ  బి) శశాంక
   సి) హర్ష  డి) భాస్కరవర్మ
6. భారతదేశ చరిత్రలో తొలిసారిగా అధికా రులకు భూదానాలు చేసిన రాజవంశం?
   ఎ) శాతవాహనులు  బి) గుప్తులు
   సి) ఇక్ష్వాకులు  డి) పుష్యభూతులు
7. ఏ వర్ణాన్ని హ్యుయాన్‌త్సాంగ్ వ్యవసాయదారులుగా పేర్కొన్నాడు?
   ఎ) బ్రాహ్మణులు  బి) క్షత్రియులు
   సి) వైశ్యులు  డి) శూద్రులు
8. బాణుడి ప్రకారం హర్షుడి సమాజంలో సర్వసాధారణమైపోయిన దురాచారం?
   ఎ) సతీ సహగమనం
   బి) వరకట్నం
   సి) కన్యాశుల్కం
   డి) వితంతు వివాహాల నిషేధం
9. హర్షుడు ఆదరించిన మతం?
   ఎ) హిందూ మతం  బి) బౌద్ధ మతం
   సి) జైన మతం  డి) వైష్ణవ మతం
10. హర్షుడి కాలంలో అధికంగా వ్యాప్తిలో ఉన్న మతం?
   ఎ) వైష్ణవం  బి) బౌద్ధం
   సి) శైవం  డి) జైనం
11. ఉత్తర భారతదేశాన్ని పాలించిన చివరి గొప్ప హిందూ చక్రవర్తిగా ఎవరిని పేర్కొంటారు?
   ఎ) సముద్రగుప్తుడు  బి) హర్షవర్ధనుడు
   సి) రెండో చంద్రగుప్తుడు డి) యశోధర్ముడు
12. రాజపుత్ర, శీలాదిత్య అనే బిరుదులు ధరిం చిన రాజు?
   ఎ) రెండో పులకేశి
   బి) మొదటి మహేంద్రవర్మ
   సి) హర్షుడు
   డి) రెండో నరసింహవర్మ
13. హర్షుడి కాలంలోని పాలనా విభాగాల్లో సరైన క్రమం?
   ఎ) భుక్తి - విషయ - పాథక - గ్రామ
   బి) విషయ - గ్రామ - భుక్తి - పాథక
   సి) పాథక - భుక్తి - విషయ - గ్రామ
   డి) గ్రామ - భుక్తి - విషయ - పాథక
14. హర్షుడి కాలంలో చాత-భాత అంటే?
   ఎ) పన్నులు
   బి) సైనికులు
   సి) కులాలు  డి) భూదానాలు
15. హర్షుడు ఏ ప్రాంతంలో సర్వమత సమ్మే ళనం నిర్వహించాడు?
   ఎ) ప్రయాగ  బి) పాటలీపుత్రం
   సి) కనౌజ్  డి) వల్లభి

**సమాధానాలు**

1) సి 2) డి 3) ఎ 4) బి 5) సి
6) డి 7) డి 8) బి 9) బి 10) సి
11) బి 12)సి 13)ఎ 14)బి 15) సి

# 'రామాయణం' ఏ రకానికి చెందిన ఆధారం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

**సోషల్ మెథడ్స్**

### బోధనా పద్ధతులు

1. కుదించిన బోధనా ఉద్యమం అని దేనికి పేరు?
   1) పరిహార బోధన 2) సూక్ష్మబోధన
   3) స్థూల బోధన 4) జట్టు బోధన
2. డేవిడ్ వార్విక్ ప్రకారం జట్టు బోధనకు అవసరమైన నాలుగు ఉపగమాల్లో రెండోది?
   1) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం
   2) సంచయన క్రమానుగతం
   3) ఏకకేంద్ర ఉపగమం
   4) సమవర్తిత విషయాలు
3. విద్యార్థి ఒక దినపత్రిక నుంచి జూన్‌లో కురిసిన వర్షపాతానికి సంబంధించిన వివరాలను సేకరించాడు. వాటిని సుదీర్ఘంగా పరిశీలించి యథార్థాలను చెప్పగల్గడం అనేది ఏ రకమైన దృక్పథం?
   1) నిగమనాత్మక 2) సంశ్లేషణాత్మక
   3) విశ్లేషణాత్మక 4) ఆగమనాత్మక
4. 'గోల్కొండ కోట' అనే మూలాధారం ఏ రకానికి సంబంధించింది?
   1) వాఙ్మయ 2) సాంప్రదాయ
   3) పురావస్తు 4) శాసన
5. 'బిల్లు చట్టంగా మారడం' అనే పాఠ్యాంశాన్ని బోధించడానికి ఉత్తమ పద్ధతి?
   1) పానెల్ చర్చ 2) సింపోజియం
   3) స్వయం అధ్యయనం
   4) అనుకరణ పార్లమెంట్
6. సామూహిక ఆలోచన, సమష్టి నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ ఏది?
   1) చర్చ 2) సంశ్లేషణ
   3) విశ్లేషణ 4) వాగ్వాదం
7. ప్రత్యక్ష, పరోక్ష సమాచారాన్ని పొందడానికి అవకాశమిచ్చే దృక్పథాలు వరుసగా?
   1) ఆగమన, నిగమన దృక్పథాలు
   2) ఆగమన, విశ్లేషణ దృక్పథాలు
   3) నిగమన, సంశ్లేషణ దృక్పథాలు
   4) నిగమన, ఆగమన దృక్పథాలు
8. సమస్యా పరిష్కారంలో సమస్యను నిర్వ చించిన తర్వాత చేయాల్సిన పని?
   1) సమస్యను విశ్లేషించి పరిష్కారం కనుగొనడం
   2) సమాచారాన్ని సేకరించి, సమస్యను విశ్లేషించడం
   3) సమాచారాన్ని సేకరించి, అన్వయించడం
   4) సమస్యను విశ్లేషించి, సమాచారాన్ని సేకరించడం
9. 'బ్రౌడి' ప్రకారం బోధనా పద్ధతి అంటే?
   1) కృత్యాలను తరగతి గదిలో నిర్వహించే విధానం
   2) సామాన్యంగా పిలిచే వరస క్రమ చర్యల లాంఛన స్వరూపం
   3) అభ్యసన ప్రక్రియను నిర్దేశించడానికి ఉపాధ్యాయుడు అనుసరించే విధానం
   4) విద్యార్థులకు విజ్ఞానాన్ని అందజేయడానికి ఉపాధ్యాయుడు అనుసరించే మార్గం
10. విషయ సామగ్రి సేకరణలో ద్వితీయ ఆకారానికి చెందినవి?
   1) దస్తావేజులు 2) పాఠ్యపుస్తకాలు
   3) పత్రికలు 4) నాణేలు
11. విద్యార్థులతో పంచదార ఫ్యాక్టరీని సంద ర్శింపజేయడం అనే ప్రక్రియ ఏ బోధనా పద్ధతిలో ఒక భాగం?
   1) సమస్యా పరిష్కార పద్ధతి
   2) సాంఘిక ఉద్గార పద్ధతి
   3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
12. కిందివాటిలో 'నాటకీకరణ' ద్వారా బోధించడానికి అత్యంత అనువైన పాఠ్యాంశం ఏది?
   1) వేములవాడ 2) ఆకాశవాణి
   3) మన దేశం 4) ఉత్తరాల బట్వాడ
13. 'ప్రాజెక్టు పద్ధతి' సోపానాల్లో మూడోది?
   1) ప్రాజెక్టు నిర్వహణ
   2) ప్రాజెక్టు ప్రణాళికా రచన
   3) నమోదు చేయడం
   4) ప్రాజెక్టు ఎంపిక, ఉద్దేశ వివరణ
14. ఏ పాఠాన్ని బోధించడానికి పరిసరాన్ని ఒక ఉపగమంగా ఉపయోగించవచ్చు?
   1) సేవాసంస్థలు 2) శీతోష్ణస్థితి
   3) ఆర్యుల నాగరికత
   4) హక్కులు బాధ్యతలు
15. 'రామాయణం' ఏ రకానికి చెందిన ఆధారం?
   1) ద్వితీయ 2) ప్రధాన
   3) తృతీయ 4) చతుర్థ
16. జట్టు బోధన రూపకల్పనకు డేవిడ్ వార్విక్ సూచించిన ఉపగమాలేవి?
   1) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం, పరిసర ఉపగమం, క్రమానుగత ఉపగమం, సమవర్తిత విషయాలు
   2) యూనిట్ ఉపగమం, వర్తులాకార ఉపగమం, క్రమానుగత ఉపగమం, ఏకకేంద్ర ఉపగమం
   3) వర్తులాకార ఉపగమం, ఏకకేంద్ర ఉపగమం, సమవర్తిత విషయాలు, క్రమానుగత ఉపగమం
   4) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం, సమవర్తిత విషయాలు, సంచయన క్రమానుగతం, ఏకకేంద్ర ఉపగమం
17. సూక్ష్మ బోధనా ప్రక్రియలోని సోపానాల క్రమం?
   1) పరిపుష్టి, నియోజనం, బోధించడం, పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి
   2) నియోజనం, పరిపుష్టి, బోధించడం, పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి
   3) పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి, నియోజనం, బోధించడం, పరి పుష్టి
   4) నియోజనం, బోధించడం, పరిపుష్టి, పునఃయోజన, పునఃబోధన, పునః పరిపుష్టి
18. 'బెల్లార్డ్' అభిప్రాయంలో ప్రాజెక్టు పద్ధతి అంటే?
   1) పాఠశాల వాతావరణంలోకి తీసుకు వచ్చిన జీవితాశయమే ప్రాజెక్టు
   2) సహజ పరిస్థితిలో ఒక సమస్యాత్మక క్రియను జయప్రదంగా పూర్తిచేయడమే ప్రాజెక్టు
   3) నిజజీవిత సన్నివేశంలో పథకం ప్రకా రం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు
   4) సాంఘిక పరిసరాల్లో, హృదయ పూర్వకంగా, ఉద్దేశపూర్వకంగా కొనసాగే కార్యకలాపమే ప్రాజెక్టు
19. చర్చలో ఉండాల్సిన ప్రధానాంశాలేవి?
   1) సమస్య, విషయం, గ్రూపు
   2) సమస్య, విషయం
   3) నాయకుడు, గ్రూపు, విషయం
   4) సమస్య, విషయం, నాయకుడు, గ్రూపు
20. రాష్ట్ర మంత్రిమండలి బాధ్యతలను బోధించడానికి స్థానిక గ్రామ పంచాయతీ పనిచేసే విధానం గురించి చర్చించడం అనేది ఏ బోధనా సూత్రానికి సంబంధించింది?
   1) తెలిసినదాని నుంచి తెలియనిదానికి
   2) సంక్లిష్టత నుంచి సరళతకు
   3) అమూర్తం నుంచి మూర్తానికి
   4) భాగాల నుంచి మొత్తానికి
21. ట్రాఫిక్ ఐలాండ్ అనే పాఠాన్ని బోధించడానికి ఉత్తమ యుక్తి?
   1) చర్చ 2) క్షేత్ర పర్యటన
   3) పాత్రాభినయం 4) నాటకీకరణ
22. సమస్యా పరిష్కార పద్ధతిలో ఉన్న సోపానాల్లో రెండోది?
   1) సమస్య అధ్యయనం
   2) సమాచార సేకరణ
   3) సమస్యను గుర్తించడం
   4) సమస్య పరిష్కారం
23. 'నిజజీవిత సన్నివేశంలో పథకం ప్రకారం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు' అని నిర్వచించిన వ్యక్తి?
   1) స్టీవెన్‌సన్ 2) కిల్ పాట్రిక్
   3) అండర్‌సన్ 4) బైనింగ్ & బైనింగ్
24. 'అయిదో తరగతి పరిసరాల విజ్ఞానం' అనే పాఠ్యపుస్తకం ఏ ఆకారానికి ఉదాహరణ?
   1) ద్వితీయ 2) ప్రధాన
   3) తృతీయ 4) చతుర్థ
25. శివాజీ జీవిత చరిత్రను బోధించడానికి అనువైన పద్ధతి?
   1) అంశ పద్ధతి 2) కథనా పద్ధతి
   3) వివరణ 4) సంభాషణ
26. స్వయంగా విద్యార్థులు పాల్గొనడానికి అవకాశం లేని పద్ధతి?
   1) ఉపన్యాస 2) చర్చా
   3) అంశాల పద్ధతి 4) జీవిత చరిత్ర
27. సాంఘికశాస్త్ర బోధనా పద్ధతుల్లో విద్యావేత్తలు దేన్ని ఉత్తమమైందిగా భావిస్తారు?
   1) ప్రణాళికా పద్ధతి 2) సమస్యా పద్ధతి
   3) ప్రశ్నోత్తర పద్ధతి 4) చర్చా పద్ధతి
28. బోధనా పద్ధతుల్లో అతి ప్రాచీనమైంది?
   1) లెక్చరు పద్ధతి 2) చర్చా పద్ధతి
   3) సంఘీకృత ఉద్గార
   4) సమస్యా పద్ధతి
29. తక్కువ కాలంలో ఎక్కువ విషయాలను బోధించడానికి అనువైన పద్ధతి?
   1) చర్చా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
   3) సంఘీకృత ఉద్గార
   4) వనరుల పద్ధతి
30. విద్యార్థులకు స్వానుభవం ద్వారా విషయ జ్ఞాన సంపాదనకు తోడ్పడేది?
   1) సమస్యా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
   3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
31. బోధించిన విషయాలను తక్కువ సమ యంలో సమీక్షించడానికి ఉపయోగపడే బోధనా పద్ధతి?
   1) ఉపన్యాస పద్ధతి2) వివరణ పద్ధతి
   3) కథనా పద్ధతి 4) ప్రాకల్పనా పద్ధతి
32. బోధనలో ఉపన్యాస పద్ధతికి దేన్ని మేళవిస్తే బోధన మరింత మెరుగ్గా ఉంటుంది?
   1) వివరణ పద్ధతి 2) ప్రదర్శనా పద్ధతి
   3) సమస్యా పద్ధతి 4) వనరుల పద్ధతి
33. విద్యార్థికి ప్రాముఖ్యంలేని బోధనా పద్ధతి?
   1) చర్చా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
   3) సమస్యా పద్ధతి 4) ప్రాకల్పనా పద్ధతి
34. సాంఘికశాస్త్ర బోధనలో విద్యార్థులకు కలి గే సంశయాలను తీరుస్తూ పాఠ్యాంశాన్ని బోధించడానికి ఉపయోగించే పద్ధతి?
   1) ఉపన్యాస 2) పర్యవేక్షణ
   3) చర్చాపద్ధతి 4) సమస్యా పద్ధతి
35. ఉపాధ్యాయుని పర్యవేక్షణలో విద్యార్థులందరూ శ్రమించి నేర్చుకోవడాన్ని ఏ బోధనా పద్ధతి అనవచ్చు?
   1) ప్రాజెక్టు 2) వనరుల పద్ధతి
   3) సంఘీకృత 4) పర్యవేక్షణాధ్యయన
36. రాజ్‌ఘాట్ అనేది ఏ రకమైన ఆధారం?
   1) తృతీయ 2) చతుర్థ
   3) ప్రాథమిక 4) ద్వితీయ
37. రెండు వరుస పీరియడ్ల పథకంలో బిల్ ఐ.సింప్సన్ ప్రకారం 'నియోజిత అధ్యయనం' అనే కార్యకలాపానికి కేటాయించిన వ్యవధి?
   1) 35 నిమిషాలు 2) 25 నిమిషాలు
   3) 20 నిమిషాలు 4) 30 నిమిషాలు
38. సామూహిక ఆలోచన, సమష్టి నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ ఏది?
   1) వాగ్వాదం 2) చర్చ
   3) సంశ్లేషణ 4) విశ్లేషణ
39. ఏ బోధనా పద్ధతితో 'మోడరేటర్' ఆవశ్యకత ఉంది?
   1) జట్టుబోధన 2) సమస్యా పద్ధతి
   3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
40. 'జీవిస్తూ నేర్చుకోవాలి' అనే సూత్రం ఆధారంగా రూపొందించిన పద్ధతి?
   1) జట్టు బోధన 2) చర్చ
   3) సమస్యా పరిష్కారం 4) ప్రాజెక్టు
41. జట్టు బోధన రూపకల్పనలో నాలుగు ఉపగమాలను సూచించినవారు?
   1) కిల్ పాట్రిక్ 2) మాక్స్‌వెల్
   3) కిల్లర్ 4) డెవిడ్ వార్విక్
42. ప్రాజెక్టుల రకాలను సూచించిన వారెవరు?
   1) జాన్ డ్యూయి 2) కిల్ పాట్రిక్
   3) బైనింగ్ 4) బెల్లార్డ్
43. ఒక అంశానికి ఉన్న పూర్వచరిత్ర చెప్పడానికి ఏ పద్ధతి ప్రయోజనకరంగా ఉంటుంది?
   1) ప్రాజెక్టు
   2) సమస్యా పరిష్కార
   3) ఉపన్యాస 4) ప్రాకల్పనా
44. ఉపన్యాస పద్ధతిని ఎప్పుడు ఉపయో గించాలి?
   1) సింహావలోకనం చేయడానికి
   2) సారాంశాన్ని తయారుచేసి పాఠ్యాంశాన్ని సమీక్షించడానికి
   3) అభిమానులను ఉద్దేపించడానికి
   4) పైవన్నీ
45. విద్యార్థులు 'జీవించడానికి నేర్చుకోకుండా జీవిస్తూ నేర్చుకోవాలి' అనే సూత్రంపై ఆధారపడే పద్ధతి ఏది?
   1) ప్రక్షేపణ పద్ధతి 2) సమస్యా పద్ధతి
   3) అన్వేషణా పద్ధతి
   4) మూలాధార పద్ధతి
46. ప్రాకల్పనా పద్ధతిలోని ప్రధాన సూత్రాల్లో చివరిది?
   1) స్వేచ్ఛా సూత్రం
   2) వాస్తవికతా సూత్రం
   3) ఉద్దేశ సూత్రం
   4) ఉపయుక్తతా సూత్రం

**సమాధానాలు**

| | | | |
|---|---|---|---|
| 1) 2 | 2) 4 | 3) 4 | 4) 3 |
| 5) 4 | 6) 1 | 7) 1 | 8) 2 |
| 9) 2 | 10) 3 | 11) 3 | 12) 4 |
| 13) 2 | 14) 2 | 15) 1 | 16) 4 |
| 17) 4 | 18) 1 | 19) 4 | 20) 1 |
| 21) 2 | 22) 2 | 23) 4 | 24) 2 |
| 25) 2 | 26) 1 | 27) 4 | 28) 1 |
| 29) 2 | 30) 3 | 31) 1 | 32) 2 |
| 33) 2 | 34) 2 | 35) 1 | 36) 3 |
| 37) 1 | 38) 2 | 39) 4 | 40) 4 |
| 41) 4 | 42) 2 | 43) 3 | 44) 4 |
| 45) 1 | 46) 4. | | |

## విద్య, ఉద్యోగ సమాచారం

#### మేనేజ్ హైదరాబాద్‌లో మేనేజ్ ఫెలోలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్)లో మేనేజ్ ఫెలోల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.56,000.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరి తేది:** 20.10.2025.
- **వెబ్‌సైట్:** https://www.manage.gov.in/

#### ఎన్‌టీపీసీ లిమిటెడ్‌లో 10 పోస్టులు

ఎన్‌టీపీసీ లిమిటెడ్‌లో వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
- **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మేనేజర్(ఎలక్ట్రికల్)-02, డిప్యూటీ మేనేజర్(మెకానికల్)-03, డిప్యూటీ మేనేజర్(సివిల్)-05.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి 60% మార్కులతో బీఈ/బీటెక్ (ఎలక్ట్రికల్, మెకానికల్, సివి ల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 33 ఏళ్లు ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, ఈఎస్ఎం, మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేది:** 21.10.2025.
- **వెబ్‌సైట్:** https://careers.ntpc.co.in/

# భారత రాజ్యాంగ ప్రవేశికను ఎన్నిసార్లు సవరించారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

**జనరల్ స్టడీస్**

**ఇండియన్ పాలిటీ**

## భారత రాజ్యాంగ పరిణామ క్రమం

1. భారత ప్రభుత్వ చట్టం- 1935 ప్రకారం కార్య నిర్వహణ అధికారం ఎవరికి ఉంది?
   1) కౌన్సిల్‌లోని గవర్నర్ జనరల్
   2) సమాఖ్య శాసనసభ
   3) ఇంగ్లండ్ పార్లమెంట్
   4) బ్రిటిష్ రాణి/ రాజు
2. లార్డ్ లిన్‌లిత్‌గో ప్రతిపాదనలకు మరో పేరు ఏమిటి?
   1) సెప్టెంబర్ ప్రతిపాదనలు - 1940
   2) ఆగస్టు ప్రతిపాదనలు - 1940
   3) జూలై ప్రతిపాదనలు - 1940
   4) ఏదీకాదు
3. సర్ స్టాఫర్డ్ క్రిప్స్ భారతదేశానికి ఏ సంవత్సరంలో వచ్చాడు?
   1) 1942 ఆగస్టు 2) 1942 మార్చి
   3) 1942 అక్టోబర్ 4) 1942 డిసెంబర్
4. సి.ఆర్. ఫార్ములా- 1944 కిందివాటిలో ఏ అంశానికి సంబంధించింది?
   1) మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించడం
   2) భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు
   3) ప్రజాభిప్రాయం ద్వారా దేశ విభజన చేయడం
   4) మహిళలకు ప్రత్యేక నియోజక వర్గాలు
5. వైస్రాయ్ లార్డ్ వేవెల్.. సిమ్లాలో ఏ సంవత్సరంలో సమావేశాన్ని నిర్వహించాడు?
   1) 1946 జూలై 2) 1945 జూలై
   3) 1944 జూలై 4) 1947 జూలై
6. 1935 భారత ప్రభుత్వ చట్టానికి సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
   ఎ) కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రవేశ పెట్టారు
   బి) రాష్ట్ర స్థాయిలో ద్విసభా పద్ధతిని ప్రవేశ పెట్టారు
   సి) కేంద్ర, రాష్ట్రాల మధ్య సమాఖ్య వివాదాలను పరిష్కరించడానికి ఫెడరల్ కోర్టును ఏర్పాటు చేశారు
   డి) ఒరిస్సా, సింధూ అనే రెండు కొత్త ప్రావిన్సులను ఏర్పాటు చేశారు
   1) ఎ, బి, సి 2) ఎ, డి
   3) ఎ, సి 4) ఎ, బి, సి, డి
7. కింది వాటిలో 1935 భారత ప్రభుత్వ చట్టంలో లేని అంశం?
   1) ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేశారు
   2) రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేశారు
   3) ఈ చట్టం ద్వారా మొదటి సారిగా మహిళలకు ఓటు హక్కు కల్పించారు
   4) భారత రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేశారు
8. 'భారతదేశం గోచరించే భూస్వామ్య వ్యవస్థను దృఢం చేయడానికి బ్రిటిష్ పాలకులు ఆడిన నాటకం' అని సుభాష్ చంద్రబోస్ ఏ చట్టాన్ని అభివర్ణించాడు?
   1) 1947 చట్టం 2) 1919 చట్టం
   3) 1935 చట్టం 4) ఏదీకాదు




9. భారత ప్రభుత్వ చట్టం -1935కు సంబంధించి సరికాని అంశం ఏది?
   1) సమాఖ్య వ్యవస్థ ప్రతిపాదన
   2) ఆర్‌బీఐ ఏర్పాటు
   3) ఫెడరల్ న్యాయస్థానం ఏర్పాటు
   4) సార్వజనీన ఓటు హక్కు
10. జతపరచండి.
    జాబితా-I
    i) పోర్ట్ ఫోలియో పద్ధతి
    ii) సివిల్ సర్వీస్ సులభ్
    iii) మత నియోజక వర్గాలు
    iv) భారత న్యాయ సంస్కరణలు
    జాబితా-II
    a) లార్డ్ కానింగ్ b) కార్న్ వాలీస్
    c) లార్డ్ మింటో d) లార్డ్ మెకాలే
    1) i-a, ii-b, iii-c, iv-d
    2) i-b, ii-c, iii-d, iv-a
    3) i-c, ii-d, iii-b, iv-a
    4) i-d, ii-a, iii-b, iv-c
11. బ్రిటిష్ ప్రధానమంత్రి లార్డ్ క్లెమెంట్ అట్లీ ఏ సంవత్సరంలో భారతదేశానికి కేబినెట్ మిషన్ రాయబారం పంపాడు?
    1) 1946 మార్చి 2) 1945 మార్చి
    3) 1947 మార్చి 4) ఏదీకాదు
12. కేబినెట్ మిషన్ లేదా కేబినెట్ రాయబారంలో సభ్యుడు కాని వ్యక్తి ఎవరు?
    1) ఫెథరిక్ లారెన్స్
    2) సర్ స్టాఫర్డ్ క్రిప్స్
    3) ఎ.వి. అలెగ్జాండర్
    4) లార్డ్ మౌంట్ బాటెన్
13. కింది కేబినెట్ మిషన్ సిఫారసుల్లో సరైనవి ఏవి?
    ఎ) బ్రిటిష్ పాలిత ప్రాంతాలు, స్వదేశీ సంస్థానాలు కలిసి ఇండియన్ యూనియన్ అనే రాజకీయ వ్యవస్థ ఏర్పడుతుంది
    బి) పాకిస్తాన్ అనే మరో దేశం ఏర్పడే భావన ఆచరణ సాధ్యం కాదు
    సి) రాజ్యాంగాన్ని రూపొందించడానికి ప్రత్యేక రాజ్యాంగ పరిషత్ ఏర్పడుతుంది
    డి) పరిపాలన నిర్వహణకు 14 మంది సభ్యులతో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడుతుంది
    1) ఎ, బి, సి 2) ఎ, డి
    3) ఎ, బి 4) ఎ, బి, సి, డి
14. తాత్కాలిక ప్రభుత్వాన్ని ఎప్పుడు ఏర్పాటు చేశారు?
    1) 1946 నవంబర్ 1
    2) 1947 నవంబర్ 2
    3) 1946 సెప్టెంబర్ 2
    4) 1946 అక్టోబర్ 2
15. ఏ ప్రతిపాదనల మేరకు రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటు చేశారు?
    1) క్రిప్స్ ప్రతిపాదనలు
    2) లార్డ్ వేవెల్ ప్రతిపాదనలు
    3) కేబినెట్ ప్రతిపాదనలు
    4) మౌంట్ బాటెన్ ప్రతిపాదనలు
16. కింది ఏ ప్రకటనను బ్రిటిషర్లు జారీ చేసిన వాటిలో అత్యున్నతమైందిగా మహాత్మా గాంధీ పేర్కొన్నారు?
    1) క్రిప్స్ ప్రతిపాదన 2) అట్లీ ప్రతిపాదన
    3) వేవెల్ ప్రతిపాదన 4) ఇర్విన్ ప్రతిపాదన
17. 1947 ఫిబ్రవరి 20న ఇంగ్లాండ్ పార్లమెంట్‌లోని కామన్స్ సభలో మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశం నుంచి ఏ సంవత్సరం నాటికి వైదొలుగుతుందని ప్రకటించాడు?
    1) 1947 జూన్ నాటికి
    2) 1948 జూన్ నాటికి
    3) 1949 జూన్ నాటికి
    4) 1950 జూన్ నాటికి
18. మౌంట్ బాటెన్ ప్రణాళికలోని అంశాలను పరిశీలించండి.
    ఎ) ఇండియన్ యూనియన్ భారత్, పాకిస్తాన్ అనే రెండు రాజ్యాలుగా విభజితమవుతుంది.
    బి) 1948 జూన్‌కు బదులు 1947 ఆగస్టు 15న రెండు దేశాలుగా విభజితమవుతుంది.
    1) ఎ మాత్రమే సరైంది
    2) బి మాత్రమే సరైంది
    3) ఎ, బి రెండూ సరైనవి కాదు
    4) ఎ, బి రెండూ సరైనవే
19. భారత స్వాతంత్ర్య చట్టం 1947 ప్రకారం కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) ఈ చట్టం రూపొందించడానికి మూలాధారం మౌంట్ బాటెన్ పథకం
    బి) బ్రిటిష్ పార్లమెంట్‌లో ఈ చట్టాన్ని 1947 జూలై 4న ప్రవేశపెట్టారు
    సి) ఈ చట్టంపై బ్రిటిష్ రాణి 1947 జూలై 18న సంతకం చేసింది
    డి) వైస్రాయ్ పదవి రద్దవుతుంది
    1) ఎ, బి, సి, డి సరైనవి
    2) సి, డి మాత్రమే సరైనవి
    3) ఎ, సి మాత్రమే సరైనవి
    4) పైవేవీ సరైనవి కాదు
20. కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) లార్డ్ మౌంట్ బాటెన్‌ను మొదటి గవర్నర్ జనరల్‌గా నియమించారు
    బి) స్వతంత్ర భారతదేశానికి తొలి, తుది భారత గవర్నర్ జనరల్ సి. రాజగోపాలాచారి
    1) ఎ, బి సరైనవి కాదు
    2) ఎ మాత్రమే సరైంది
    3) ఎ, బి సరైనవి 4) బి సరైంది
21. కింది వాటిలో రాజ్యాంగ మౌలిక లక్షణం కానిది ఏది?
    1) సమాఖ్య
    2) లౌకిక వాదం
    3) న్యాయ సమీక్షాధికారం
    4) న్యాయస్థాన క్రియాశీలత
22. స్వరాజ్ అనే పదాన్ని మొదటిసారిగా ఉపయోగించింది ఎవరు?
    1) ఎం.ఎన్. రాయ్ 2) బి.ఆర్. అంబేడ్కర్
    3) దాదాబాయి నౌరోజీ 4) నెహ్రూ
23. దేశ విభజన తర్వాత రాజ్యాంగ పరిషత్ సభ్యుల సంఖ్య ఎంత?
    1) 229 2) 299
    3) 389 4) 208
24. కింది వారిలో భారత రాజ్యాంగ పరిషత్‌లో సభ్యుడు కాని వారు ఎవరు?
    1) నీలం సంజీవరెడ్డి 2) కళా వెంకట్రావు
    3) ఎన్.జి. రంగా 4) సుబ్బారావు
25. భారత రాజ్యాంగ పరిషత్ మొదటి సమావేశానికి తాత్కాలిక అధ్యక్షుడిగా సచ్చిదానంద సిన్హాను ప్రతిపాదించిన వ్యక్తి?
    1) బి.ఎన్. రావు 2) ఎస్.ఎన్. ముఖర్జీ
    3) జె.బి. కృపలానీ 4) ఫ్రాంక్ ఆంటోని
26. రాజ్యాంగ పరిషత్‌లో సభ్యురాలిగా పని చేసిన ఏకైక ముస్లిం మహిళ ఎవరు?
    1) బేగం కలీదాజీయా
    2) బేగం ఎయిజాజ్ రసూల్
    3) నజ్మా హెప్తుల్లా 4) బేగం రెజీనా
27. బారత రాజ్యాంగానికి ప్రవేశిక కీనోట్ అని అన్నది ఎవరు?
    1) ఎర్నెస్ట్ బర్కర్
    2) కె.ఎం. మున్షి
    3) అంబేడ్కర్
    4) రాధాకృష్ణన్
28. జతపరచండి.
    జాబితా-I
    i) పార్లమెంట్ నియమ నిబంధనల కమిటీ
    ii) ప్రాథమిక హక్కుల సలహా కమిటీ
    iii) కేంద్ర రాజ్యాంగ విధాన కమిటీ
    iv) చీఫ్ కమిషనర్ ప్రాంతాలపై కమిటీ
    జాబితా-II
    a) పట్టాభి సీతారామయ్య
    b) జవహర్‌లాల్ నెహ్రూ
    c) సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్
    d) జి.వి. మావలాంకర్
    1) i-a, ii-b, iii-c, iv-d
    2) i-b, ii-c, iii-d, iv-a
    3) i-d, ii-c, iii-b, iv-a
    4) i-c, ii-d, iii-b, iv-b
29. రాజ్యాంగ పరిషత్‌లో జాతీయ జెండాను ప్రతిపాదించింది ఎవరు?
    1) హెచ్.వి. కామత్ 2) హంసా మెహతా
    3) సరోజినీ నాయుడు 4) బి.ఎన్. రావు
30. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను రాజ్యాంగ రూప శిల్పి, అభినవ మనువుగా అభివర్ణించిందెవరు?
    1) ఒ.పి. గోయల్ 2) ఎం.వి. పైలీ
    3) గ్రాన్ విల్లే ఆస్టిన్ 4) జెన్నింగ్స్
31. కింది వాటిలో సరైనవి ఏవి?
    ఎ) ప్రాథమిక హక్కులు - అమెరికా
    బి) గవర్నర్ నియామకం - కెనడా
    సి) ఉభయ సభల సంయుక్త సమావేశం - ఆస్ట్రేలియా
    డి) రాజ్యసభ సభ్యుల ఎన్నిక విధానం - సౌతాఫ్రికా
    1) ఎ, బి 2) సి, డి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి
32. రాజ్యాంగ పరిషత్‌లో సభ్యులను బ్రిటిష్ ఇండియా ప్రావిన్సుల నుంచి ఏ విధంగా ఎన్నుకుంటారు?
    1) ప్రజలతో ప్రత్యక్షంగా
    2) వివిధ రాజకీయ పార్టీల నుంచి నామినేట్ చేస్తారు
    3) వైస్రాయ్ నామినేట్ చేస్తాడు
    4) ప్రావెన్సియల్ అసెంబ్లీల నుంచి ఎన్నుకుంటారు
33. జతపరచండి.
    జాబితా-I
    i) రాజ్యాంగ 4వ షెడ్యూల్
    ii) రాజ్యాంగ 7వ షెడ్యూల్
    iii) రాజ్యాంగ 8వ షెడ్యూల్
    iv) రాజ్యాంగ 9వ షెడ్యూల్
    జాబితా-II
    a) రాజ్యసభ నిర్మాణం
    b) కేంద్ర, రాష్ట్ర సంబంధాలు
    c) రాజ్యాంగం గుర్తించిన భాషలను తెలియజేస్తుంది
    d) భూ సంస్కరణల చట్టాలు
    1) i-b, ii-d, iii-c, iv-a
    2) i-a, ii-b, iii-c, iv-d
    3) i-d, ii-b, iii-c, iv-a
    4) i-a, ii-b, iii-b, iv-c
34. భారతదేశం కామన్‌వెల్త్‌లో సభ్యత్వాన్ని పొందడమనేది దేశ విశాల ప్రయోజనాలను సాధించడం కోసమే అని పేర్కొంది ఎవరు?
    1) ఎస్.కె. థార్
    2) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
    3) ఎ.వి. దక్కర్ 4) బి.ఎన్. రావ్
35. భారత రాజ్యాంగ ప్రవేశికలో సౌభ్రాతృత్వం అనే పదం చేర్చాలని సూచించిన వ్యక్తి ఎవరు?
    1) డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్
    2) డాక్టర్ రాజేంద్రప్రసాద్
    3) బి.ఎన్. రావు
    4) కె.ఎం. మున్షి

**సమాధానాలు**

| | | | | |
|---|---|---|---|---|
| 1) 1 | 2) 2 | 3) 2 | 4) 3 | 5) 2 |
| 6) 4 | 7) 4 | 8) 3 | 9) 4 | 10) 1 |
| 11) 1 | 12) 4 | 13) 4 | 14) 3 | 15) 3 |
| 16) 2 | 17) 2 | 18) 4 | 19) 1 | 20) 3 |
| 21) 4 | 22) 3 | 23) 2 | 24) 4 | 25) 3 |
| 26) 2 | 27) 1 | 28) 3 | 29) 2 | 30) 2 |
| 31) 4 | 32) 4 | 33) 2 | 34) 4 | 35) 1 |

# What is difference in time taken by flights..

## Model Questions

***Directions (Q.No.1-5): Study the following information carefully and answer the questions given below.***

Eight persons in the family namely A, B, C, D, E, F, G and H are sitting around a circular table and are discussing about the coming festival for which they wish to bringing sweets to home. Each person wants to bring different-different sweets. Sweets are i.e. Kaju katti, Kalakand, Kheer, Double ka meetha, Rasmalai, Rava laddu, Mysor pak and Obbattu, but not necessarily in the same order. Also some of them facing outside and the remaining facing inside. Not more than two people facing same direction sits adjacent to each other. In family there are three generations. The one who want to bring Kaju katti sits second right of D's husband. D and her husband sit opposite to each other but facing opposite directions. Only one person sits between the one who wants to bring Double ka meetha and the one who wants to bring Kaju katti. A wants to bring Kaju katti and she is the mother of E. F sits immediate left of D's husband and facing outside whereas D's husband facing inside. G wants to bring Mysor pak and sits immediate left of A, who is the wife of B's father and she is also facing outside. G's mother is the wife of E, who sits immediate right of D's husband. C has three children, out of two sons and one daughter. C is grandfather of E's son. E is adjacent to the person, who wants to bring Kaju katti. B, who is the son of D's father, sits second right of F and faces inside. C's son-in-law wants to bring Kalakand. Three persons sit between the one who wants to bring Kaju katti and C, who wants to bring Kheer. D sits fifth right of the one, who wants to bring Rava laddu. C is not facing inside. E's wife wants to bring Obbattu.

1. Which of the following person wants to bring Rava laddu?
   a) A b) D's brother
   c) H d) G's father
   e) Both options (b) and (d)
2. Who is the brother-in-law of B?
   a) The one who wants to bring Rasmalai
   b) The one who wants to bring Kaju katti
   c) The one who sits third right of B
   d) F e) Both (b) and (c)
3. Who sits fourth left of the one, who wants to bring Obbattu?
   a) E b) A c) G
   d) H e) None of these
4. Four of the following five are alike in a certain way and hence they form a group. Which one of the following does not belong to that group?
   a) Obbattu b) Kheer
   c) Kaju katti d) Rasmalai
   e) Double ka meetha
5. Which of the following person sits opposite the one, who wants to bring Kaju katti?
   a) H b) G c) A
   d) E e) None of these

***Directions (Q.No. 6-10): Study the following diagram and convert it into other diagrams by implementing the instructions which is given in each step to get next step.***

***INPUT:***

| | | |
|---|---|---|
| I4 | RS2 | EK3 |
| AC9 | | MT7 |
| F8 | O5 | UL |

***STEP: 1***

Interchange the Alphabets to get step 1 as arrow mention in the above figure.

| | | |
|---|---|---|
| UL4 | O2 | F3 |
| MT9 | | AC7 |
| EK8 | RS5 | I |

***STEP: 2***

i) If the alphabets contain one consonant and one vowel and the number with them is greater than 3, then subtract 3 from the given number.

ii) If the alphabets are two consonant and the number with them is greater than 5, then change the letters with the previous letter in English alphabetical series.

| | | |
|---|---|---|
| UL1 | O2 | F3 |
| NS9 | | AC4 |
| EK5 | RS5 | I |

## BANK EXAMS REASONING

***STEP: 3*** This is coded in some special pattern

| | | |
|---|---|---|
| EK5 | N2 | I |
| UL1 | | F3 |
| NS9 | QR5 | AC4 |

As per the rules followed in the above step, find out the appropriate steps for the given input and answer the following questions.

***INPUT:***

| | | |
|---|---|---|
| A5 | LM3 | FT2 |
| ZU8 | | BC6 |
| G5 | S7 | MO |

6. Which element comes in step-2 in the second column of third row?
   a) LM7 b) KL7 c) ZU3
   d) AB8 e) None of these
7. Which element replaces AB8 in step-3?
   a) PQ7 b) ZU3 c) FT5
   d) MO2 e) None of these
8. Which element replaces FT5 in step-3?
   a) PQ7 b) ZU3 c) AB8
   d) MO2 e) None of these
9. Which element replaces KL7 in step-3?
   a) JK7 b) ZU3 c) FT5
   d) MO2 e) None of these
10. Which element replaces S3 in step-3?
    a) Q3 b) U3 c) T5
    d) R3 e) None of these

***Directions (Q.No.11-15): Study the following information carefully and answer the questions given below:***

Six flights of different companies Emirates, Jet - Airways, Indigo, Spicejet, Air - India and Vistara are to be scheduled to fly from Khajuraho to Bangalore starting from 2nd August and ending on 8th August with Sunday being an off day. Each of the flight take different time to reach Bangalore: 40 minutes, 50 minutes, 60 minutes, 75 minutes, 90 minutes and 100 minutes, again not necessarily in the same order. 8th August is not Sunday and a flight which take 40 minutes is scheduled on that day. Emirates take less than 60 minutes and is scheduled immediately before Air -India flight. Indigo flight is scheduled before Spicejet flight. There are two flights scheduled between Vistara which take 100 minutes and Indigo which is for 60 minutes. Air - India is before Sunday and there are two days between Sunday and Emirates flight to fly. Spicejet flight which take 75 minutes is not scheduled on 2nd August. Emirates is not scheduled on even numbered date. The flight scheduled on Saturday takes 100 minutes.

11. Which flight is scheduled on 7th August?
    a) Spice jet b) Indigo
    c) Jet - Airways d) No Flight
12. How much time a flight take which is scheduled on 4th of August to reach Bangalore?
    a) 60 Minutes b) 90 Minutes
    c) 50 Minutes d) 40 Minutes
    e) 75 Minutes
13. What is difference in time taken by flights which scheduled on Saturday and Monday?
    a) 40 Minutes b) 60 Minutes
    c) 50 Minutes d) 10 Minutes
    e) 25 Minutes
14. Which of the following combination is false?
    I. Friday - Air India - 90 minutes - 4th August
    II. Sunday - Off day - 6th august
    III. Tuesday - Indigo - 60 minutes - 7th August
    a) Only I b) Only II
    c) Only III d) Both II and III
    e) Both I and II
15. Tej's flight is scheduled from Bangalore to Delhi on 3rd August which take 50 minutes to reach Delhi from Bangalore and there are 10 minute to change flight in Bangalore except that there are no delay, then what is minimum time that Tej will take to reach Delhi from Khajuraho?
    a) 120 Minutes
    b) 150 Minutes
    c) 110 Minutes
    d) 135 Minutes
    e) None of these

***Directions (Q.No.16-20): Study the following information carefully and answer the questions given below:***

In a certain code

'SMART LOGIC' is written as '2025 0325',

'BASE MATERIAL IS AVAILABLE' is written as '0516 1904 0581 1264',


'ALMOST ALL QUESTIONS' is written as '1209 2036 1981' and

'PEOPLE ARE EATING MONEY' is written as '0536 0509 0736 2525'.

16. Which of the following is the code for 'MATERIAL'?
    a) 1264 b) 0516
    c) 1204 d) 1281
    e) None of these
17. Which of the following can be coded as '2525'?
    a) PEOPLE b) ARE
    c) EATING d) MONEY
    e) None of these
18. Which of the following is the code for 'basic good enough'?
    a) 0325 0416 0836
    b) 0316 0425 0836
    c) 0352 0466 0864
    d) 0425 0516 0836
    e) None of these
19. What can be the code of 'HARI'?
    a) 0916 b) 0816 c) 1816
    d) 1016 e) None of these
20. What can be the code of 'VISHNU'?
    a) 1916 b) 2036
    c) 2136 d) 1036
    e) None of these

### Key with Solutions

***(1-5)***




**1) e; 2) c; 3) c; 4) d; 5) e;**

***(6-10)***

***INPUT:***

| | | |
|---|---|---|
| A5 | LM3 | FT2 |
| ZU8 | | BC6 |
| G5 | S7 | MO |

***STEP: 1***

| | | |
|---|---|---|
| MO5 | S3 | G2 |
| BC8 | | ZU6 |
| FT5 | LM7 | A |

***STEP: 2***

| | | |
|---|---|---|
| MO2 | S3 | G2 |
| AB8 | | ZU3 |
| FT5 | KL7 | A |

For obtaining step 3, we need to rotate Columns 1 and 3 by 1 position, which means that row I in columns 1 and 3 would be new row 2 and row 2 in columns 1 and 3 would be new row 3 and row 3 in columns 1 and 3 would be new row1.

The alphabet of first row second column and third row second column is replaced with the previous alphabet in alphabetical series.

***STEP: 3***

| | | |
|---|---|---|
| FT5 | R3 | A |
| MO2 | | G2 |
| AB8 | JK7 | ZU3 |

**6) b; 7) d; 8) c;**
**9) a; 10) d;**

***(11-15)***

| Date | Days | Flight | Time |
|---|---|---|---|
| 2 | Wed | Indigo | 60 |
| 3 | Thu | Emirates | 50 |
| 4 | Fri | Air India | 90 |
| 5 | Sat | Vistara | 100 |
| 6 | Sun | Off Day | Off day |
| 7 | Mon | Spicejet | 75 |
| 8 | Tue | Jet-Airways | 40 |

**11) a; 12) b; 13) e;**
**14) c; 15) c;**

***(16-20)***

In the code there are four digits in which the first two indicates the numerical value of the last letter of the given word and last two digits indicate the square of the number of letters in the given word.

Ex: SMART

Last letter T=20

Number of letters 5 ⇒ $5^2 = 25$, so the code is 2025.

**16) a; 17) d; 18) a;**
**19) a; 20) c**